

'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే
వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50



రక్షణ ఛత్రమంటున్నా..
రెక్‌లెస్

- శిరస్త్రాణాన్ని శిరోభారంగా భావిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు
- ప్రాణాలు పోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనం
- పోలీసుల ఉదాసీనత
- హైదరాబాద్‌లో అధిక సంఖ్యలో టూ వీలర్ ప్రమాదాలు
- మృతుల సంఖ్యా ఎక్కువే
- 2012 నుంచే నగరంలో హెల్మెట్ తప్పనిసరి
- ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాని నిబంధన

2024 ఫిబ్రవరి 6

షేక్‌పేట గుల్షన్ కాలనీకి చెందిన వ్యాపారి మొహమ్మద్ అర్షద్ (22) ఈ ఏడాది ఫిబ్రవరి 6న యాక్టివా వాహనంపై ప్రయాణిస్తున్నాడు. టోలీచౌకీలోని షేక్‌పేట్ నాలా నుంచి సెవెన్ టూంబ్స్ మెయిన్ రోడ్డు వరకు ఉన్న శ్మశానానికి సరిహద్దు గోడ ఉంది. అక్కడ అర్షద్ వాహనం అదుపుతప్పి ఆ గోడను బలంగా ఢీ కొంది. ఆ సమయంలో అతడి తలకు హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే మెహిదీపట్నంలోని ఓ ఆస్పత్రికి తరలించినా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

2024 మే 26

మాసబ్‌ట్యాంక్‌లోని ఎంజీ నగర్‌కు చెందిన మహ్మద్ మహబూబ్ అలీ (45) ప్రైవేట్ ఉద్యోగి. మే 26 తెల్లవారుజామున తన కుమారుడితో (15) కలిసి ద్విచక్ర వాహనంపై మెహిదీపట్నం వైపు బయలుదేరారు. మైనర్ వాహనాన్ని డ్రైవ్ చేస్తుండగా అలీ వెనుక కూర్చున్నారు. కాగా హుమయూన్‌నగర్ ఠాణా సమీపంలో ఆ బాలుడు వాహనాన్ని సడన్ బ్రేక్ వేసి ఆపాడు. దీంతో వెనుక కూర్చున్న అలీ కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మూడు రోజులకు కన్ను మూశారు. హెల్మెట్ పెట్టుకుని ఉంటే గాయాల తీవ్రత తగ్గేదని, ప్రాణం దక్కేదనే అభిప్రాయం వ్యక్తమైంది.

సాక్షి, హైదరాబాద్



హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు పోయేవి కాదని స్పష్టం చేస్తున్న ప్రమాదాలు, హెల్మెట్ ధారణ విషయంలో ఏపీ సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యలతో కూడిన ధర్మాసనం ఇటీవల జారీ చేసిన కీలక ఉత్తర్వులు.. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించడం ఎంత తప్పనిసరో తేల్చి చెబుతున్నాయి. హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యం వహించడం వల్ల ఎన్నో ప్రాణాలు పోతున్నాయి. ముఖ్యంగా రోడ్లపై రద్దీ ఎక్కువగా ఉండే హైదరాబాద్ మహానగరంలో ఎక్కడో ఒకచోట నిత్యం ఇలాంటి ప్రమాదాలు నమోదవుతున్నాయి. 2023లో మొత్తం 2,548 రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ఇందులో ద్విచక్ర వాహనాలకు సంబంధించినవే దాదాపు సగం (1,263) ఉన్నాయి. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 335 మంది మరణిస్తే, ఇందులో టూ వీలర్లకు సంబంధించిన మరణాలు దాదాపు 40 శాతం వరకు ఉండటం గమనార్హం. అయినప్పటికీ టూ వీలర్ వాహనాలు నడిపేవారిలో ఇంకా అనేకమంది నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ఒకవేళ హెల్మెట్ ధరించినా ఎక్కువమంది స్ట్రాప్ పెట్టుకోవడం లేదు. కొందరు అలంకారంగా బండి మీద పెట్టుకునో, తగిలించుకునో వెళ్తున్నారు. కొందరు పోలీసుల్ని చూసి హెల్మెట్ పెట్టుకునేందుకు ప్రయత్నించే క్రమంలో కిందపడి ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలూ ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. వాస్తవానికి పిలియన్ రైడర్ (ద్విచక్ర వాహనం వెనుక కూర్చునేవారు) సైతం విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని మోటారు వాహనాల చట్టం స్పష్టం చేస్తున్నా దాన్ని పట్టించుకునేవారే లేరు.

> ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఈ విషయంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించరాదు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల సంభవిస్తున్న మరణాలను దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో చట్ట నిబంధనలను తు.చ. తప్పకుండా అమలు చేయాల్సిందే
>
> - ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యలతో కూడిన ధర్మాసనం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు ఇవి.

అడపాదడపా పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లు

హెల్మెట్ ధారణను హైదరాబాద్‌లో 2012 లోనే తప్పనిసరి చేశారు. అయితే ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. వాహనచోదకుల అవగాహన రాహిత్యం/నిర్లక్ష్యం, పోలీసుల ఉదాసీన వైఖరితో పాటు రాజకీయ జోక్యం కూడా ఈ పరిస్థితికి కారణంగా కన్పిస్తోంది. నగర వ్యాప్తంగా దాదాపు 70 శాతం, పాతబస్తీ సహా మరికొన్ని ప్రాంతాల్లో 30 శాతం మాత్రమే హెల్మెట్ వినియోగంలో ఉంది. వాస్తవానికి మోటారు వాహనాల చట్టం పుట్టిన నాటి నుంచే ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్ కచ్చితంగా ధరించాలనే నిబంధన ఉంది. అయితే సుదీర్ఘకాలం పాటు ఈ విషయాన్ని నగర పోలీసులు పట్టించుకోలేదు. తేజ్ దీప్ కౌర్ మీనన్ హైదరాబాద్ ట్రాఫిక్ విభాగానికి చీఫ్‌గా వ్యవహరిస్తుండగా 2005లో తొలిసారిగా ఈ అంశం తెరపైకి వచ్చింది. అప్పట్లో పెద్ద ఎత్తున హడావుడి చేసిన ట్రాఫిక్ పోలీసులు ఈ నిబంధనను పక్కాగా అమలు చేయడానికి కృషి చేశారు. అయితే దీని చుట్టూ అనేక వివాదాలు చుట్టుముట్టడంతో ఆశించిన స్థాయిలో ఫలితాన్నివ్వలేదు. ఆ తర్వాత ట్రాఫిక్ చీఫ్‌గా వచ్చిన అబ్దుల్ ఖయ్యూం ఖాన్ (ఏకే ఖాన్) సైతం హెల్మెట్ అంశాన్ని సీరియస్‌గానే తీసుకున్నారు. ఈ నిబంధనను అమలు చేయడానికి ముందు వాహనచోదకులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని నిర్ణయించారు. అప్పట్లో

మిగతా IIవ పేజీలో ▶



నగరంలో మొత్తం వాహనాలు:	80,43,650
వీటిలో ద్విచక్ర వాహనాలు:	59,25,468 (73.66 శాతం)
గత ఏడాది రోడ్డు ప్రమాదాలు:	2,548
ద్విచక్ర వాహనాలకు సంబంధించినవి:	1,263 (49.56 %)
రోడ్డు ప్రమాదాలలో మరణాలు:	335
ద్విచక్ర వాహనాలకు సంబంధించినవి:	129 (38 %)

సోలోగా.. జాలీగా

- ఒంటరిగా విదేశాల్లో టూర్లకు వెళ్లడంపై సిటీ జనుల ఆసక్తి
- తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ ప్రాంతాలు చుట్టివచ్చేలా పర్యటనలు
- వీసా అవసరం లేకుండా టూర్ వేయగల దేశాలకు క్యూ..

- వివరాలు IIలో



ఫ్యాషన్.. With కాషన్

స్టైల్‌గా కనపడడం కోసం సిటిజన్లు దేనికైనా సై అంటున్నారు. కేశాలకు దట్టించే కలర్స్ నుంచి కాళ్లకు వేసుకునే ఫుట్‌వేర్ వరకూ తమదైన స్టైల్‌ని ప్రదర్శించాలని, అందుకోసం దేనికైనా రెడీ అంటున్నారు.. ఈ ట్రెండ్ అనేక ఆరోగ్య సమస్యల్ని కొనితెస్తోంది.

- వివరాలు 11లో



చేతిలో పాస్‌పోర్టు.. బ్యాగులో మూడు, నాలుగు డ్రెస్సులు, అవసరమైన డబ్బులు.. అంతే.. విమానం ఎక్కేయడం, విదేశాలకు చెక్కేయడమే. ముందుగా వీసా అవసరం లేకుండా వెళ్లగలిగే దేశాలను చుట్టేసి వచ్చేయడమే. ఇది సోలో టూరిస్టుల నయా ట్రెండ్. అదీ గ్రేటర్ హైదరాబాద్ నగరవాసుల్లో మరింత ఎక్కువగా కనిపిస్తోంది. నిమిషం తీరికలేని హడావుడి జీవితంలో కాస్త ఉపశమనం పొందేందుకు విదేశాల బాటపడుతున్నారు. వివిధ దేశాలకు చెందిన పర్యాటక సంస్థలు, ట్రావెల్ ఏజెన్సీలు రకరకాల టూరిస్టు ప్యాకేజీలు, రాయితీలతో హైదరాబాదీలను ఆకట్టుకుంటున్నాయి.

..: సాక్షి, హైదరాబాద్ :..

సోలోగా.. జాలీగా

వీసాలు సులువుగా వస్తుండటంతో..

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు సుమారు 15 వేల మంది వివిధ దేశాలకు వెళుతుండగా.. అందులో 60శాతం వరకు 'సోలో టూరిస్టులే' ఉంటున్నట్లు టూర్ ఆపరేటర్లు చెప్తున్నారు. గోవా, జైపూర్, కశ్మీర్ వంటి పర్యాటక, వినోద ప్రాంతాలకు వెళ్లినట్టుగానే.. ఇప్పుడు సిటీ టూరిస్టులు విదేశీ టూర్లకు వెళ్తున్నారని అంటున్నారు. కోవిడ్ అనంతరం పరిస్థితుల్లో మార్పు వచ్చిందని.. చాలా దేశాలు పర్యాటకులను ఆకట్టుకునేందుకు 'వీసా ఆన్ అరైవల్, ఫ్రీ వీసా' వంటివి అందిస్తున్నాయని చెప్తున్నారు.

- ఒంటరిగా విదేశాల్లో టూర్లకు వెళ్లడంపై సిటీ జనుల ఆసక్తి
- తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ ప్రాంతాలు చుట్టివచ్చేలా పర్యటనలు
- వీసా అవసరం లేకుండా టూర్ వేయగల దేశాలకు క్యూ..
- థాయ్‌లాండ్, మలేసియా, మాల్దీవులు, నేపాల్‌లకు వెళ్తున్న హైదరాబాదీలు
- 'వీసా ఆన్ అరైవల్' సదుపాయమున్న దేశాలకు సైతం డిమాండ్
- ఇలాంటి వారి కోసం ప్రత్యేక ప్యాకేజీలు అందిస్తున్న టూర్ ఆపరేటర్లు

సోలో టూర్‌లో ఇలా..

సోలో టూరిస్టులు చాలా వరకు డమ్మీ హోటల్ బుకింగ్‌లతో ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటారు. వెళ్లిన దేశాల్లో డార్మిటరీలు, హాస్టల్ సదుపాయం ఉన్నచోట రాత్రి బస చేస్తారు. చిన్న హోటళ్లలో భోజనం చేస్తారు. వీటన్నింటి వల్ల ఖర్చు చాలా వరకు తగ్గుతుంది.

ఒక నగరం నుంచి మరో నగరానికి వెళ్లాల్సివచ్చినప్పుడు.. రాత్రి పూట రైళ్లలో ప్రయాణం చేయడం వల్ల ఎక్కడో ఒకచోట బసచేయాల్సిన అవసరం కూడా ఉండదు. విమాన చార్జీలు, స్థానిక రవాణా చార్జీలు మాత్రమే సోలో టూరిస్టుల బడ్జెట్‌లో ఎక్కువ ఖర్చు కింద లెక్క.

లగేజీ తక్కువే. దీంతో ప్రత్యేకంగా హోటల్లోనే ఉండాలనే ఇబ్బంది కూడా ఉండదు.

సర్క్యూట్ టూర్‌లు

సాధారణంగా నగర పర్యాటకులు దుబాయ్, సింగపూర్ పర్యటనలకు ఎక్కువగా వెళ్తారు. ఇంటిల్లిపాది కలిసి ఏదో ఒక దేశంలో పర్యటిస్తారు. ఈ మేరకు టూరిస్టు సంస్థలు వీసాతో కలిపి టూర్ ప్యాకేజీలు అందజేస్తాయి. ఇలా నలుగురు కుటుంబ సభ్యులు కలిసి వెళ్లినప్పుడు ఒకటి కంటే ఎక్కువ దేశాల్లో పర్యటించడం కష్టమే. ఫ్యామిలీగా వెళ్లే టూర్లు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తదితర యూరప్ దేశాలకు ఎక్కువ. కానీ సోలో టూర్‌లు వీటికి పూర్తి భిన్నంగా ఉంటున్నాయి. సోలో టూరిస్టులు ఒకసారి ఇంటి నుంచి బయలుదేరితే మూడు, నాలుగు దేశాల్లో పర్యటించేలా ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. ప్రస్తుతం మలేసియా, థాయ్‌లాండ్, శ్రీలంక, మాల్దీవులు, నేపాల్ ఉచిత వీసా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది ఈ దేశాల్లో పర్యటించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సింగపూర్‌కు ఈ-వీసా సదుపాయం ఉంది. దీంతో చాలా మంది సింగపూర్‌కు ఈ-వీసాపై వెళ్లి అక్కడి నుంచి మలేసియా, థాయ్‌లాండ్‌లనూ చుట్టి వచ్చేస్తున్నారు. ఇక ఇండోనేషియా, కంబోడియా, వియత్నాం తదితర దేశాలు వీసా ఆన్ అరైవల్ సదుపాయం అందిస్తున్నాయి. సోలో టూరిస్టులు ఈ దేశాలకు కూడా ఎక్కువగా వెళ్తున్నట్లు పర్యాటక సంస్థలు చెప్తున్నాయి. కంబోడియాలోని పల్లవుల నాటి అంగ్‌కోర్‌వాట్ దేవాలయం, ఇండోనేషియాలోని బాలి, జావా, సుమత్రా తదితర ద్వీపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయని అంటున్నాయి.

వియత్నాంలో బైక్ రైడింగ్

సిటీ టూరిస్టులను కొంత కాలం నుంచి విశేషంగా ఆకట్టుకుంటున్న మరో పర్యాటక దేశం వియత్నాం. తక్కువ విమానచార్జీలతో ఈ చిన్న దీవుల దేశంలో పర్యటించవచ్చు. ఇండోనేషియాలోని బాలి బీచ్ కల్చర్ పర్యాటకులను ఆకట్టుకుంటుండగా.. వియత్నాంలో బైక్ రైడింగ్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. హైదరాబాద్ నుంచి అక్కడికి వెళ్లిన పర్యాటకులు అద్దె బైక్‌లపై ఉత్తరం నుంచి దక్షిణం వరకు రైడ్ చేసేందుకు ఇష్టపడుతున్నారు. 'వియత్నాం చిన్న దేశం. ఉత్తరం నుంచి దక్షిణం వరకు 2,000 కిలోమీటర్లలోపే ఉంటుంది. బైక్‌పై ప్రయాణం ఎంతో అద్భుతంగా ఉంటుంది'' అని నగరానికి చెందిన టూరిస్టు సుబ్బారెడ్డి తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన టూరిస్టులు బైక్ రైడింగ్ కోసం వియత్నాంకు వస్తారని చెప్పారు. ఇక తక్కువ బడ్జెట్‌లో సందర్శించే సదుపాయమున్న మరో దేశం ఫిలిప్పీన్స్. దీవుల సముదాయమైన ఈ దేశంలో పర్యటించడం హైదరాబాద్ నుంచి గోవా ట్రిప్పు కోసం వెళ్లినట్లుగానే సింపుల్‌గా ఉంటుంది. వీసా ఆన్ అరైవల్, ఈ-వీసా సదుపాయాలున్న తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాలకు కూడా సిటీ పర్యాటకులు వెళ్తున్నారు.

వేర్వేరు దేశాలకు వెళ్తూ ఉంటా..



2013 నుంచీ విదేశాల్లో పర్యటిస్తున్నాను. ఇప్పటివరకు 65 దేశాలు తిరిగాను. విదేశాల్లో విభిన్నమైన, వైవిధ్యమైన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానం, ఆహార అలవాట్లు వంటివి తెలుసుకోవడం, పరిశీలించడం నాకెంతో ఇష్టం. ఎక్కడికెళ్లినా అక్కడి ప్రజలతో మమేకమవుతాను. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం కంటే అక్కడి ప్రజలను కలిసేందుకే ఇష్టపడతాను. **- సుబ్బారెడ్డి, రెగ్యులర్ టూరిస్ట్**



2 నెలలకోసారి మలేసియా వెళ్తా..



కనీసం రెండు, మూడు నెలలకు ఒకసారి మలేసియాకు వెళ్తాను. ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తాను. అక్కడి తెలుగు సంఘాల ఆధ్వర్యంలో నడిచే స్కూళ్లలో పిల్లలకు తెలుగు బోధిస్తాను. దాంతో మలేసియాతో ఒక అనుబంధం ఏర్పడింది. **- రాఘవాచార్య, టీచర్**

ఇదీ రాకపోకల లెక్క (సుమారుగా)..

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు రాకపోకలు సాగించే ప్రయాణికులు	అందులో దేశీయ ప్రయాణికులు	అంతర్జాతీయ ప్రయాణికులు దాదాపు	సోలో టూరిస్టులు
65,000 నుంచి 70,000	55,000	15,000	7,000 నుంచి 9,000



రక్షణ ఛత్రమంటున్నా.. రెక్‌లెస్!

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉన్న వివిధ మాధ్యమాల ద్వారా దాదాపు ఆరు నెలల పాటు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆపై స్పెషల్ డ్రైవ్స్‌కు శ్రీకారం చుట్టారు.

వాహనచోదకుల్లో నిర్లక్ష్యం

నగరంలోని ద్విచక్ర వాహనచోదకులందరితో హెల్మెట్ పెట్టించాలని ట్రాఫిక్ పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. ఇప్పటికీ పాతబస్తీతో పాటు అనేక ప్రాంతాలకు చెందినవారు దీనికి దూరంగానే ఉంటున్నారు. హాఫ్ హెల్మెట్లు, హెల్మెట్ ధరించినా స్ట్రాప్ బిగించుకోకపోవడం, హెల్మెట్ వెంటే ఉన్నప్పటికీ కేవలం జంక్షన్లు, పోలీసులు సమీపిస్తున్నప్పుడే తలకు పెట్టుకోవడం పరిపాటిగా మారింది. నగరానికి చెందిన అనేకమంది వాహనచోదకులు తాము నివసిస్తున్న ప్రాంతం దాటి బయటకు వస్తేనే హెల్మెట్ ధరిస్తున్నారు. ఏ ప్రాంతంలో ప్రమాదం చోటు చేసుకున్నా ఇబ్బందులు తప్పవనే భావన వీరికి ఉండకపోవడమే దీనికి కారణం. పోలీసులు కూడా ఎప్పటికప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం , ఆపై మిన్నకుండి పోవడంతో 100 శాతం హెల్మెట్ ధారణ సాకారం కావట్లేదు.

నగరంపై డబ్ల్యూహెచ్‌ఓ దృష్టి

హైదరాబాద్‌లో వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి చేయడమెట్లా అనే విషయంపై 2012లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) దృష్టి పెట్టింది. ఏటా నగరంలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాలకు సంబంధించినవే ఎక్కువగా ఉండటం, వీటిలో తలకు దెబ్బతగలడం కారణంగా మరణిస్తున్న యువకుల సంఖ్య ఎక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ డబ్ల్యూహెచ్‌ఓ ఈ నిర్ణయం తీసుకుంది. ఆ ఏడాది హరియాణాలో ఉన్న ఫరీదాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో రోడ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్స్ అండ్ స్టేక్‌హోల్డర్స్‌కు సంబంధించిన కీలక సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న డబ్ల్యూహెచ్‌ఓలోని రోడ్ సేఫ్టీ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్ విభాగం టెక్నికల్ ఆఫీసర్ స్వేర్కర్ అల్మ్‌క్విస్ట్.. హైదరాబాద్‌లో హెల్మెట్ నిబంధన అమల్లో తమ సహకారంపై నిర్ణయాన్ని ప్రకటించారు. హైదరాబాద్‌లో హెల్మెట్ వాడకం 30 శాతమే ఉందని అప్పట్లో అభిప్రాయపడ్డారు.

హెల్మెట్ వల్ల ఎన్నో ప్రయోజనాలు

తలకు రక్షణ: శిరస్త్రాణాలు ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురైతే దాని ప్రభావం గణనీయంగా తగ్గుతుంది. తల అంతర్గత, బహిర్గత గాయాల తీవ్రత, పుర్రె పగుళ్ల ప్రమాదం తగ్గుతుంది.

మెదడు రక్షణ: హెల్మెట్ అనేది ప్రమాద సమయంలో తలకు కుషన్‌లా పనిచేస్తుంది. తద్వారా మెదడుకు గాయాలు (ట్రుమాటిక్ బ్రెయిన్ ఇన్‌జ్యూరీస్) కాకుండా రక్షించడంలో సహాయపడుతుంది.


ఫేస్ ప్రొటెక్షన్: చాలా హెల్మెట్‌లు ఫేస్ షీల్డ్ లేదా విజర్‌ను కలిగి ఉంటాయి. ఇవి ప్రమాదాల సమయంలో, అలాగే ప్రతికూల వాతావరణంలో ముఖాన్ని రక్షిస్తాయి.

కంటి రక్షణ: విజర్ లేదా గాగుల్స్‌తో కూడిన హెల్మెట్‌లు గాలి, దుమ్ము, సూక్ష్మస్థాయి చెత్త, క్రిమి కీటకాల నుంచి కళ్లను రక్షిస్తాయి.


ధ్వని తీవ్రత తగ్గింపు: కొన్ని హెల్మెట్‌లు చెవి రక్షణ బాధ్యత కూడా నిర్వర్తిస్తాయి. హెల్మెట్ పెట్టుకుంటే శబ్ద కాలుష్యం తక్కువగా ఉంటుంది. ప్రమాద సమయంలో వినికిడి దెబ్బతినే ప్రమాదం కూడా తగ్గుతుంది.

మార్పు కోసం కృషి చేస్తున్నాం

గతంతో పోల్చుకుంటే ఇటీవలి కాలంలో పరిస్థితి బాగా మెరుగైందనే చెప్పాలి. జంక్షన్లలోని పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్‌తో పాటు వివిధ రకాలుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇప్పటికీ కొందరు.. ట్రాఫిక్ పోలీసులు కనిపిస్తేనే హెల్మెట్ పెట్టడం, హెల్మెట్ పెట్టుకున్నా దాని స్ట్రాప్ బిగించుకోకపోవడం వంటివి చేస్తున్నారు. వీరి విషయంలోనూ మార్పు కోసం కృషి చేస్తున్నాం.



పి.విశ్వప్రసాద్, అదనపు పోలీసు కమిషనర్ (ట్రాఫిక్)


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 102

బుధవారం 3-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జెస్సికా బౌజస్ సంచలనం

వింబుల్డన్ తొలి రౌండ్‌లో డిఫెండింగ్ చాంప్ వొండ్రుసోవాపై విజయం - 14లో



రికార్డులు.. చివరికి నష్టాలు

బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ.. ఆరంభ లాభాలు ఆవిరి - 15లో



నా వ్యాఖ్యలను రికార్డుల్లో చేర్చండి

లోక్‌సభలో తాను చేసిన ప్రసంగంలో కొన్ని వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించడం పట్ల రాహుల్ అభ్యంతరం చెప్పారు. - వివరాలు 6లో



ఈవీఎంలను అనుమానిస్తాం

యూపీలోని మొత్తం 80 పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ గెలిచినాసరే ఈవీఎంలను నమ్మబోనని అఖిలేశ్ అన్నారు. - వివరాలు 6లో



కొన్ని గంటల ముందే పేపరు ఖరారు

నీట్–పీజీ పరీక్ష పత్రాన్ని ఇకపై భద్రతా కారణాల రీత్యా పరీక్షకు కొద్ది గంటల ముందు ఖరారు చేయనున్నారు. - వివరాలు 6లో



'రైతు భరోసా' చైర్మన్‌గా భట్టి

రైతు భరోసా విధివిధానాల రూపకల్పనకు ఉపముఖ్యమంత్రి భట్టి చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. - వివరాలు 12లో

సత్సంగ్‌లో మృత్యుకేళి

ఆధ్యాత్మిక సభలో తొక్కిసలాట.. 116 మంది భక్తుల దుర్మరణం



యూపీలోని హత్రాస్ జిల్లాలో ఆస్పత్రి ఆవరణలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు



తొక్కిసలాటలో మరణించిన కొడుకుని ఒళ్లో పెట్టుకుని రోదిస్తున్న తల్లి

- మృతుల్లో 108 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు
- యూపీలోని హత్రాస్ జిల్లా ఫుల్‌రాయ్ గ్రామంలో దుర్ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ
- బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటించిన పీఎంఓ, యూపీ ప్రభుత్వం

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్ జిల్లా ఫుల్‌రాయ్ గ్రామంలో మాటలకు అందని తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆధ్యాత్మిక కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి 116 మంది భక్తులు మృత్యువాత పడ్డారు. వీరిలో 108 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. సత్సంగ్ ముగిశాక బయటకు వచ్చే క్రమంలో ఒకరిపై ఒకరు పడిపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. దేశంలో ఇటీవలి కాలంలో జరిగిన ఘోరమైన సంఘటన ఇదే కావడం గమనార్హం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తొక్కిసలాటలో ఏకంగా 116 మంది మరణించడం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రధానమంత్రి కార్యాలయం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పరిహారం ప్రకటించాయి. - 6లో

పిల్ల చేష్టలు!



- సానుభూతి కోసం సభలో వెక్కిళ్లు
- లోక్‌సభలో రాహుల్‌పై ప్రధాని వాగ్బాణాలు
- ఆయన అబద్ధాలు చెప్పారని ఆరోపణ
- కఠిన చర్యల కోసం స్పీకర్‌కు విజ్ఞప్తి
- కాంగ్రెస్ ఫక్తు 'పరాన్నజీవి పార్టీ'
- భాగస్వాముల పుణ్యాన 99 సీట్లు
- అయినా గెలిచినట్టు అహంకారం

న్యూఢిల్లీ: విపక్ష నేత రాహుల్‌గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం లోక్‌సభలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం సభలో చేసిన ప్రసంగంలో ఆయన ఆద్యంతం సానుభూతి కోసమే పాకులాడారంటూ ఆక్షేపించారు. ''నిండు సభలో రాహుల్ పిల్ల చేష్టలకు పాల్పడ్డారు. పచ్చి అబద్ధాలతో సభను తప్పుదోవ పట్టించారు'' అని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో రెండు రోజుల పాటు జరిగిన చర్చకు మోదీ మంగళవారం సాయంత్రం బదులిచ్చారు. రెండు గంటలకు పైగా చేసిన మిగతా 2వ పేజీలో ▶

హిందువులపై భారీ కుట్రలు..

రాహుల్ వ్యాఖ్యలపై మోదీ ధ్వజం

అంబేడ్కర్‌పై నెహ్రూ కుట్రలు

రిజర్వేషన్లకు కాంగ్రెస్ బద్ధ విరోధి

2లో

మీరు గడప దాటండి..

ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

- ఉన్నతాధికారులు జిల్లాల పర్యటనలకు వెళ్లాలి
- కలెక్టర్లు ఆస్పత్రులు, పాఠశాలలు సందర్శించాలి
- ఉన్నతాధికారులు ఒక్కొక్కరు ఒక్కో ఫ్లాగ్‌షిప్ ఐడియా ఇవ్వాలి
- క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటించాలి
- సీఎంఓ సూచనలు పాటించాలి.. సొంత నిర్ణయాలతో సర్కారుకు చెడ్డపేరు తేవొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, సీఎస్

సాక్షి, హైదరాబాద్: 'ఎన్నికల కోడ్ కారణంగా వంద రోజులు ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయి. ఇకపై ఉన్నతాధికారులు విధిగా పరిపాలనపైనే దృష్టి సారించాలి. ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు క్రమశిక్షణ పాటించాలి. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సమయపాలనను తప్పనిసరిగా పాటించాలి. ప్రతిరోజూ పనివేళల్లో సచివాలయంలో అందుబాటులో ఉండాలి. కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా తమ విభాగం పనితీరును పర్యవేక్షించేందుకు వారానికో రోజు విధిగా జిల్లాల పర్యటనలకు వెళ్లాలి. నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలి. కార్యక్రమాల అమలు, పనుల పురోగతిని తెలుసుకోవాలి. చాలా జిల్లాల్లో కలెక్టర్లు కార్యాలయాలు దాటడం లేదు. కలెక్టర్లు విధిగా క్షేత్ర పర్యటనకు వెళ్లేలా సీఎస్ చూడాలి. ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలందించే అన్ని విభాగాలను కలెక్టర్లు సందర్శించాలి..'అని సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 2వ పేజీలో ▶

డ్రగ్స్ వ్యతిరేక వీడియోలు చేస్తేనే

టికెట్ రేట్ల పెంపు

- టాలీవుడ్‌కు సీఎం స్పష్టీకరణ
- అవగాహన వీడియోలు రూపొందిస్తేనే ఇకపై షూటింగ్‌లు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతులు
- డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడికి రెండు నిమిషాల్లోపు వీడియోలు పంపాలన్న నిబంధన పెడుతున్నాం
- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరో వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద సమస్యగా మారిన సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడిపై సామాజిక చైతన్యం కల్పించేందుకు సినీ పరిశ్రమ, క్రీడాకారులు, మీడియా ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సినిమా విడుదల సమయంలో టికెట్ల ధరల పెంపు కోసం, షూటింగ్‌ల అనుమతుల కోసం వచ్చే సినీ పరిశ్రమ వారు.. ఆ సినిమాలో నటించిన నటీనటులతో డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి అంశంపై ఒకటిన్నర నుంచి రెండు నిమిషాల నిడివి ఉన్న అవగాహన వీడియోలు రూపొందించాలన్న నిబంధన పెడుతున్నట్లు తెలిపారు. అలా వీడియోలు తెస్తేనే ప్రభుత్వం నుంచి వెసులుబాట్లు కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు 27 కార్లు, 40 బైక్‌లు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు 14 కార్లు, 30 బైక్‌లను ప్రభుత్వం మిగతా 3వ పేజీలో ▶

కసరత్తు కొలిక్కి

- టీపీసీసీ చీఫ్ రేసులో మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ, అంజన్
- అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బలరాం నాయక్ కూడా..
- మహేశ్ వైపే అధిష్టానం మొగ్గు చూపే చాన్స్.. 6లోగా ప్రకటన?
- నేడు ఢిల్లీకి సీఎం, డిప్యూటీ సీఎం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నూతన అధ్యక్షుడి నియామక కసరత్తు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. గత 20 రోజులుగా అధిష్టానం పరిశీలనలో ఉన్న కొత్త అధ్యక్షుడి ఎంపిక వ్యవహారం పలుమార్లు చర్చల అనంతరం తుది దశకు చేరుకుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలంటున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్ పేర్లు అధిష్టానం తుది పరిశీలనలో ఉన్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బలరాం నాయక్‌ల పేర్లను కూడా అధిష్టానం పరిశీలిస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎస్సీ కోటాలో తమ జిల్లాకు చెందిన మిగతా 12వ పేజీలో ▶

చంద్రబాబును సీబీఐ, ఈడీ ఎందుకు అరెస్టు చేయలేదు?



- ఎన్డీఏలో చేరగానే శుద్ధపురుషుడు అయ్యాడా?
- ఎన్నికల ఫలితాల రోజు స్టాక్‌మార్కెట్‌లో మదుపరులు 31 లక్షల కోట్లు నష్టపోయారు
- కానీ టీడీపీ అగ్రనేత భార్య కంపెనీ మాత్రం రూ. 521 కోట్లు లాభపడింది
- ఇదెలా సాధ్యమైందో విచారించే దమ్ము కేంద్రానికి ఉందా: టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

సాక్షి, న్యూఢిల్లీ: విశ్వసనీయత లేని, అవినీతిపరులైన నేతల అండతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. అవినీతిపరులైన నేతలు ఎన్డీఏలో చేరగానే శుద్ధపురుషులు అయ్యారా అంటూ నిలదీశారు. కేంద్రంలో ప్రస్తుతం అస్థిరమైన ప్రభుత్వం పాలన చేస్తుంటే ఇంకోవైపు అత్యంత పటిష్టమైన ప్రతిపక్షం ఉందని అన్నారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో కల్యాణ్ బెనర్జీ మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ, జేడీయూల ప్రస్తావన తెచ్చారు. గతంలో స్థిరమైన ప్రభుత్వంతో నిబ్బరంగా కనిపించిన ప్రధాని మోదీ ప్రస్తుతం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ అనే ఊతకర్రల సాయంతో సభలోకి వస్తున్నారు అని ఎద్దేవా చేశారు. ఆ రెండు కర్రలు పట్టుకునే దేశవిదేశాల్లో మోదీ తిరుగుతున్నారని చెప్పారు. గతంలోలాగా ప్రధాని మోదీలో ఆత్మస్థైర్యం కనిపించడం లేదు అని అన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్ష రాజకీయ నేతలపై సీబీఐ, ఈడీ దాడులను ప్రస్తావించిన బెనర్జీ, ఎన్డీఏ పక్షాల నేతలపై కేసుల అంశాన్ని తూర్పారపట్టారు. అవినీతిపరులంతా కూటమి కట్టారని ఇండియా కూటమిపై గతంలో మోదీ పదేపదే మిగతా 12వ పేజీలో ▶

రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాలపై నిఘా పెట్టండి

పోలీసు అధికారులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి 3లో

6న కలుద్దాం చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి లేఖ 2లో

అధికారంలోకి వస్తే 15 ఏళ్లు మనమే!



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ధీమా

- పునర్వ్యవస్థీకరణతో అసెంబ్లీ నియోజకవర్గాలు 160 వరకు పెరిగే చాన్స్
- ఎవరికి బీఆర్‌ఎస్ బీ ఫామ్ దక్కినా విజయం ఖాయం
- త్వరలో అన్ని స్థాయిల్లో పార్టీ కమిటీలు
- పార్టీ జెడ్పీ చైర్మన్లతో ఆత్మీయ సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే మరో 15 ఏళ్లు కొనసాగుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మరో రెండేళ్లలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య 160 వరకు పెరిగే అవకాశముందని, మహిళలకు కూడా ఎక్కువ అవకాశాలు వస్తాయని చెప్పారు. బీఆర్‌ఎస్ తరపున ఎవరికి బీ ఫామ్ దక్కినా గెలుపు ఖాయమన్నారు. కేసీఆర్ మంగళవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన జెడ్పీ చైర్మన్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు.

వారిని ప్రజలు అసహ్యించుకుంటున్నారు

'తెలంగాణ పునర్నిర్మాణం ఇంకా జరగాల్సి ఉంది. తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుంది. పార్టీ నేతలకు సమన్వయంతో పాటు ఓపిక అవసరం. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొంచెం కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి. త్వరలో అన్ని స్థాయిల్లో పార్టీ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు మిగతా 2వ పేజీలో ▶



ఆయనన్నది మరీ అంత పాత బాబుని కాదయ్యా!

7 మండలాలు వెనక్కి రప్పించాలి

- లోయర్ సీలేరు కూడా: హరీశ్‌రావు
- ఆ తర్వాతే విభజన సమస్యలపై ముందుకెళ్లాలి
- చంద్రబాబుతో భేటీలో రేవంత్ చొరవ చూపాలి



సాక్షి, హైదరాబాద్: దిగువ సీలేరు విద్యుత్ కేంద్రంతోపాటు ఏపీలో విలీనం చేసిన 7 మండలాలను వెనక్కి రప్పించిన తర్వాతే, ఇతర విభజన సమస్యలపై ముందుకెళ్లాలని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విభజన సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం లేఖ రాయడం సంతోషకరమన్నారు. అయితే మిగతా 2వ పేజీలో ▶

ఆర్టీసీలో 3,035 పోస్టులు

భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్

- 12 ఏళ్ల విరామం తర్వాత జరగనున్న రిక్రూట్‌మెంట్
- మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో పెరిగిన రద్దీ
- దశలవారీగా 1,500 కొత్త బస్సులు సమకూరే అవకాశం
- దీంతో భారీ సంఖ్యలో డ్రైవర్లు, సిబ్బంది ఆవశ్యకత



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో 12 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఉద్యోగ ఖాళీల భర్తీ జరగనుంది. వివిధ స్థాయిల్లో 3,035 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెసలుబాటు అందుబాటులోకి వచ్చాక బస్సుల్లో రద్దీ దాదాపు రెట్టింపైంది. దీంతో కొత్త బస్సుల అవసరం ఏర్పడింది. ప్రస్తుత రద్దీకి 4 వేల కొత్త బస్సులు అవసరమని ఆర్టీసీ తేల్చింది. అయితే అన్ని బస్సులు కాకున్నా, దశలవారీగా 1,500 బస్సులు సమకూరనున్నాయి. దీంతో భారీ సంఖ్యలో డ్రైవర్లు, కండక్టర్ల అవసరం ఏర్పడింది. ప్రస్తుతం కండక్టర్ల కొరత లేకున్నా, డ్రైవర్లకు కొరత ఉంది. కొత్త బస్సులు వచ్చే లోపే ఆ పోస్టుల భర్తీ అవసరమని ఆర్టీసీ నిర్ణయించి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. దీనికి ముఖ్యమంత్రి ఓకే అనటంతో భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2012లో ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టారు. నిజానికి భవిష్యత్తులో వచ్చే కొత్త బస్సుల దృష్ట్యా ఆర్టీసీలో 10 వేల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ ప్రస్తుతానికి 3,035 పోస్టుల భర్తీతోనే సరిపెట్టనున్నారు.

సాలీనా రూ.15 కోట్ల వ్యయం

కొత్త నియామకాల వల్ల జీతాల రూపంలో సాలీనా రూ.15 కోట్ల వ్యయం కానుంది. అయితే అదే సమయంలో ఉద్యోగుల పదవీ విరమణలతో సంవత్సరానికి అంతకు మూడు రెట్ల మేర జీతాల భారం తగ్గుతుంది. ప్రస్తుతం ఆర్టీసీలో సగటున నెలకు 200 మంది వరకు పదవీ విరమణ పొందుతున్నారు. సంవత్సరానికి దాదాపు 2,500 మంది రిటైర్ మిగతా 12వ పేజీలో ▶

పిల్ల చేష్టలు!

▶ మొదటి పేజీ తరువాయి
ప్రసంగంలో విపక్ష నేతను అంశాలవారీగా ఏకిపారేశారు. కేంద్రం ఉసిగొల్పినందుకే తనపై క్రిమినల్ కేసులు పెట్టారన్న రాహుల్ అభియోగాలను ప్రస్తావిస్తూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ''తనను అలా కొట్టారు, ఇలా కొట్టారంటూ రాహుల్ నిండు సభలో ఏడుపు లంకించుకున్నారు. సానుభూతి కోసం కొత్త డ్రామాకు తెర తీశారు. వెక్కిళ్లు పెట్టి రోదించారు'' అంటూ ఎద్దేవా చేశారు. ''రాహుల్‌ది చిన్న పిల్లాడి బుద్ధి. పలుమార్లు ఎంపీగా ఎన్నికైనా పిల్ల చేష్టలు పోలేదు. ఏ విషయాన్నీ సరిగా విడమర్చి చెప్పే సామర్థ్యం లేదు. వ్యవహార జ్ఞానమూ శూన్యం. దీనికి తోడు ఆయనలో తరచూ పిల్ల చేష్టలు శ్రుతి మించుతుంటాయి. అలాంటప్పుడు నిండు సభలో ఎవరిని పడితే వారిని కౌగిలించుకుంటారు. సభలో కూర్చుని కన్ను కొడతారు'' అంటూ తూర్పారబట్టారు. ''ఓబీసీలను దొంగలన్నందుకు దోషిగా తేలి శిక్షకు గురైన వ్యక్తి రాహుల్. స్వాతంత్య్ర యోధుడు వీర్ సావర్కర్‌ను అవమానించినందుకు, దేశంలోనే అతి పెద్ద పార్టీ అధ్యక్షున్ని హంతకుడన్నందుకు, మరెందరో నేతలు, అధికారులు, సంస్థలపై అబద్ధాలు చెప్పినందుకు పరువు నష్టం దావాలు ఎదుర్కొంటున్న వ్యక్తి. ఏకంగా సర్వోన్నత న్యాయస్థానానికే బాధ్యతారహితమైన వాంగ్మూలమిచ్చి, అందుకు క్షమాపణలు చెప్పిన చరిత్ర రాహుల్‌ది. వేలాది కోట్ల అవినీతి కేసులో బెయిల్‌పై ఉన్నారు'' అంటూ దుమ్మెత్తిపోశారు. పిల్ల చేష్టలను పోగొట్టి రాహుల్‌కు సద్బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ని కోరుతున్నట్టు చెప్పారు. అయితే, ''రాహుల్ తీరును బాల్య చేష్టలుగా భావించి ఎట్టి పరిస్థితుల్లోనూ తేలిగ్గా తీసుకోరాదు. సభలో ఆయన ప్రవర్తన వెనక తీవ్ర దురుద్దేశాలున్నాయి. సాటిలేని మన దేశ పరంపరకు అవి చెరగని మచ్చ'' అంటూ విమర్శలు గుప్పించారు. వీటిపై దేశ ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ''మీరు సహృదయులు. అవమానాలను కూడా నవ్వుతూ సహిస్తారు. కానీ సభలో నిన్నటి దారుణాలను సీరియస్‌గా తీసుకుని వాటికి అడ్డుకట్ట వేయాల్సిందే. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడగలం. సభ గొప్పదనాన్ని కాపాడాల్సిన బాధ్యత మీపై ఉంది. సభలో రాహుల్, కాంగ్రెస్ నేతల అబద్ధాల పరంపరపై కఠిన చర్యలు తీసుకోవాలని దేశమంతా కోరుతోంది'' అన్నారు. మోదీ ప్రసంగం పొడవునా విపక్ష నేతలు నిరసనలతో హోరెత్తించారు. ఆయన మాట్లాడేందుకు నిలబడుతూనే 'మణిపూర్', 'మణిపూర్' అంటూ నినాదాలు చేశారు. స్పీకర్ పదేపదే నిలువరించినా వారు వెనక్కు తగ్గలేదు.

కాంగ్రెస్ బతుకంతా అబద్ధాలే

దేశంలో ఆర్థిక అరాచకం సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మోదీ ఆరోపించారు. ''ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు మరోసారి సుస్థిరతకు పట్టం కట్టారు. మా పదేళ్ల పాలన చూసిన మరోసారి ఆశీర్వదించారు. కాంగ్రెస్‌కు వరుసగా మూడో లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 100 సీట్లు కూడా దాటలేదు. ఇంత దారుణమైన ఓటమి మూటగట్టుకున్నా ఇంకా అహంకారమే ప్రదర్శిస్తోంది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏను ఓడించామన్న భావనను వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తోంది'' అన్నారు. అబద్ధాలనే కాంగ్రెస్ తన రాజకీయ ఆయుధంగా మార్చుకుందంటూ ఆక్షేపించారు. రాజ్యాంగంపై, రిజర్వేషన్లపై కూడా కాంగ్రెస్ నిత్యం అబద్ధాలు చెబుతూ వస్తోందన్నారు. ''నిజాలను దేశ ప్రజల ముందు ఉంచుతున్నా. ఎమర్జెన్సీ సందర్భంగా దేశంపై కాంగ్రెస్ రాచరికాన్ని రుద్దింది. వ్యవస్థలన్నింటినీ క్రూరంగా అపహాస్యం చేసింది. ప్రభుత్వాలను కూలదోసింది. మీడియాను అణిచేసింది. రాజ్యాంగానికీ తూట్లు పొడిచింది. మనిషి రక్తం రుచి చూసిన పులి మాదిరిగా కాంగ్రెస్ నోటికి అబద్ధాల రక్తం నిండుగా అంటింది. ఈవీఎంలపై అబద్ధాలు. రాజ్యాంగంపై అబద్ధాలు. రిజర్వేషన్లపైనా అబద్ధాలు. గతంలో రాఫెల్ ఒప్పందంపైనా అబద్ధాలు. ఎల్‌ఐసీపైనా అబద్ధాలు. బ్యాంకులపైనా అబద్ధాలు. ఉద్యోగులను కూడా ప్రభుత్వంపై రెచ్చగొట్టే ప్రయత్నాలు. చివరికి అగ్నివీర్ పథకంపైనా నిన్న నిండుసభలో రాహుల్ పచ్చి అబద్ధాలు చెప్పారు. రైతులకు కేంద్రం కనీస మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. ఇలాంటి బాధ్యతారహిత చేష్టలతో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగంతో చెలగాటమాడుతున్నారు. ఇది దారుణం. 60 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగిన పార్టీ, అనుభవజ్ఞులైన నేతలెందరో ఉన్న పార్టీ ఇలా అబద్ధాలకు తెగబడుతుండటం, ఇంతటి తప్పుదారిలో వెళ్తుండటం దేశానికి చాలా ప్రమాదకరం'' మోదీ అన్నారు.

సైన్యాన్ని బలహీనపరిచే కుట్రలు

యువత సైన్యంలో చేరకుండా చూసేందుకు, సైనిక దళాలను బలహీనపరిచేందుకు రాహుల్ కుట్ర పన్నుతున్నారని మోదీ ఆరోపించారు. అందుకే అగ్నిపథ్ పథకంపై పచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఆయన ఇదంతా చేస్తున్నారని ప్రశ్నించారు. ''మన సైన్యం బలోపేతం కావడాన్ని కాంగ్రెస్ ఎన్నడూ భరించలేదు. ఆ పార్టీ హయాంలో కాలానుగుణంగా సంస్కరణలకు నోచుకోలేక సైన్యం ఇక్కట్లు పడింది'' అని ఆరోపించారు. ''భద్రతాపరంగా సున్నితమైన ఈ విషయంపై బహిరంగంగా ఇంతకంటే చెప్పలేం. అందుకే నా నోటికి తాళం పడింది'' అని మోదీ అన్నారు.


సభలో ప్రధాని ప్రసంగాన్ని వింటున్న రాహుల్‌గాంధీ

మోదీ మాటల తూటాలు

రాహుల్‌పై...

- ➤ అనగనగా ఒక బాలుడు. తనకు 99 మార్కులు వచ్చాయంటూ అందరికీ మిఠాయిలు పంచుతున్నాడు. టీచర్ వచ్చి నీకు 99 వచ్చింది 100కు కాదు, 543కు అని చెప్పినా ఆగడం లేదు! ఫెయిలవడంలో కూడా ప్రపంచ రికార్డు సృష్టించాడని ఆ పిల్లాడికి అర్థమయ్యేలా ఎవరు చెప్పాలి!?
- ➤ ''తుమ్ సే నా హో పాయెగా (కాంగ్రెస్‌ను గెలిపించడం ఇక నీ తరం కాదు)'' అని ఎన్నికల తీర్పు ద్వారా దేశమంతా రాహుల్‌కు స్పష్టంగా చెప్పింది.

కాంగ్రెస్‌పై...

- ➤ కాంగ్రెస్ ఓ పరాన్నజీవి! ఈ ఎన్నికల్లో అది గెలిచిన 99 లోక్‌సభ సీట్లలో అత్యధికం భాగస్వామ్య పార్టీల ఓట్ల పుణ్యమే! గణాంకాల ఆధారంగా ఈ మాట చెబుతున్నా. ఒంటరిగా పోటీ చేసిన 16 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటు శాతం దారుణంగా తగ్గిపోయింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 66 సీట్లలో పోటీ చేస్తే నెగ్గింది కేవలం రెండు! బీజేపీతో నేరుగా తలపడ్డ చోట్ల కాంగ్రెస్ విజయ శాతం కేవలం 26! కానీ బలమైన ప్రాంతీయ పార్టీలతో జట్టు కట్టిన రాష్ట్రాల్లో మాత్రం పోటీ చేసిన సీట్లలో ఏకంగా సగం గెలిచింది! కనుక ఇకపై కాంగ్రెస్‌కు 'పరాన్నజీవి పార్టీ' అనే పేరు స్థిరపడటం ఖాయం. దీనిపై కాంగ్రెస్ భాగస్వాములు ఇప్పటికైనా విశ్లేషణ చేసుకున్నారో లేదో! ఈ ఎన్నికల ఫలితాలు వాటికి కూడా ఓ సందేశం.
- ➤ వాస్తవాలిలా ఉన్నా కాంగ్రెస్ నేతల స్టేట్‌మెంట్లు మాత్రం షోలే సినిమాలో కామెడీ సీన్‌ను మించిపోతున్నాయి. వరుసగా మూడుసార్లు ఓడినా నైతిక విజయం తమదేనంటూ ఆత్మవంచన చేసుకుంటున్నారు. 13 రాష్ట్రాల్లో జీరో సీట్లొచ్చినా హీరోలమని చెప్పుకు తిరుగుతున్నారు. మొత్తంగా పార్టీని నిండా ముంచి కూడా, ఇంకా ఊపిరితోనే ఉంది లెమ్మంటూ సంబరపడుతున్నారు!
- ➤ మహిళలకు ప్రతి నెలా రూ.8,500 ఇస్తామంటూ కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు చెప్పింది. ఆ డబ్బులొచ్చాయా అని వాళ్లు జూలై 1న తమ బ్యాంకు ఖాతాలు చెక్ చేసుకున్నారు. ఆ మహిళల శాపనార్థాలు కాంగ్రెస్‌ను సర్వనాశనం చేయనున్నాయి. జూలై 1ని దేశమంతా ఖటాఖట్ దినంగా జరుపుకుంది.

హిందువులపై భారీ కుట్రలు

రాహుల్ వ్యాఖ్యలపై మోదీ ధ్వజం
- వాటిని దేశం ఎప్పటికీ మరవబోదు
- హిందూ మతాన్నే కించపరిచే ప్రయత్నం... హిందువులంటే కాంగ్రెస్‌కు నిలువెల్లా విద్వేషం
- హిందువులను హేళన చేయడం ఫ్యాషనైంది: ప్రధాని

రాహుల్ 'హిందూ' వ్యాఖ్యలపై మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హిందువులంటే కాంగ్రెస్‌కు చెప్పలేనంత విద్వేషమని ఆరోపించారు. అందుకే వారిపై ఆ పార్టీ భారీ కుట్రలకు పాల్పడుతోందన్నారు. ఈ విషయాన్ని దేశ ప్రజలందరికీ స్పష్టంగా చెప్పదలచానన్నారు. ''హిందువులు సహనానికి మారుపేరు. అలాంటి వారిని హింసావాదులంటారా? ఇదా మీ సంస్కారం? ఇదేనా మీ చరిత్ర? ఇదేనా మీ భావజాలం? హిందువుల పట్ల మీకింతటి విద్వేషమా?! హిందువులపై రాహుల్ విద్వేషపు వ్యాఖ్యలను దేశం వందల ఏళ్లు గడిచానా మర్చిపోదు. వారిని ఎన్నటికీ క్షమించబోదు'' అంటూ మండిపడ్డారు. ''విపక్షాలు కొత్తగా హిందూ ఉగ్రవాదం అనే మాటలను తెరపైకి తెచ్చాయి. హిందూ ధర్మాన్ని డెంగీ, మలేరియాతో పోల్చాయి. పైగా అందుకు చప్పట్లు చరుచుకున్నాయి'' అంటూ దుయ్యబట్టారు. హిందూ పరంపరను, హిందూ సమాజాన్ని, హిందూ వారసత్వాన్ని, సంస్కృతిని కించపరిచేందుకు, తక్కువ చేసి చూపించేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయని మోదీ ఆరోపించారు. ''ఆ క్రమంలోనే హిందువులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసమే ఇదంతా చేస్తున్నారు. హిందువులను కించపరచడం, హేళన చేయడం వీళ్లకు ఫ్యాషన్‌గా మారింది'' అంటూ మండిపడ్డారు. ''హిందువులపై విపక్ష నేత చేసిన అవమానకర వ్యాఖ్యలు యాదృచ్ఛికమేనా, లేక ఏదైనా భారీ కుట్రలో భాగమా? దీనిపై హిందూ సమాజం కూడా ఆలోచించాల్సిన సమయం వచ్చేసింది'' అని అభిప్రాయపడ్డారు. రాహుల్ సోమవారం సభలో శివుని చిత్రపటాన్ని ప్రదర్శించడాన్ని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. ''హిందూ సంస్కృతిలో ఈశ్వరారాధన కేవలం దర్శనం కోసం మాత్రమే తప్ప స్వార్థం కోసమో, ఇలా ప్రదర్శన కోసమో కాదు. కానీ కాంగ్రెస్ వాళ్లేమో మన దేవీ దేవతలను ఇలా అవమానిస్తున్నారు. స్త్రీ శక్తిని దేశంలో అనాది నుంచి పూజిస్తూ వస్తున్నాం. అలాంటి శక్తిని వినాశనం చేస్తామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో మొత్తం దేశ ప్రజల మనసులనే గాయపరిచారు. వీరిని దేశం ఎన్నటికీ క్షమించబోదు!'' అన్నారు.

అంబేడ్కర్‌పై నెహ్రూ కుట్రలు...

రిజర్వేషన్లకు కాంగ్రెస్ బద్ధ విరోధి

దేశంలోని దళిత, వెనకబడ్డ వర్గాలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని మోదీ విమర్శించారు. దీన్ని సహించలేకే రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అప్పట్లో నెహ్రూ కేబినెట్‌కు రాజీనామా చేశారన్నారు. ''దళితులకు నెహ్రూ చేసిన అన్యాయాలను అంబేడ్కర్ ఏకిపారేశారు. వెనకబడ్డ వర్గాలపై నెహ్రూ ప్రభుత్వ ఉపేక్షను భరించలేకే రాజీనామా చేస్తున్నట్టు స్పష్టంగా ప్రకటించారు. దాంతో అంబేడ్కర్‌పై నెహ్రూ కక్షగట్టారు. ఆయన రాజకీయ జీవితాన్నే సర్వనాశనం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. కుట్రపూరితంగా అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించారు. ఆయన ఓటమికి నెహ్రూ పండుగ చేసుకున్నారు. ఆ ఆనందాన్ని ఒక లేఖలో స్పష్టంగా రాసుకొచ్చారు. మరో దళిత నేత బాబూ జగ్జీవన్‌రామ్‌కు కూడా కాంగ్రెస్ తీరని అన్యాయమే చేసింది. ఎమర్జెన్సీ తర్వాత జగ్జీవన్‌రామ్‌కు ప్రధాని అయ్యే అవకాశం వస్తే ఇందిరాగాంధీ మోకాలడ్డారు. ''ఏదేమైనా ఆయన ప్రధాని కావడానికి వీల్లేదు. లేదంటే ప్రధాని పదవిని జీవితాంతం వదలబో'రన్నారు. ఇది ఒక పుస్తకంలో స్పష్టంగా ఉంది. చౌదరీ చరణ్‌సింగ్‌తోనూ ఇందిర ఇలాగే వ్యవహరించారు. వెనకబడ్డ వర్గాలకు చెందిన సీతారాం కేసరిని తీవ్రంగా అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ది'' అంటూ సోదాహరణంగా చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఆది నుంచీ బద్ధ విరోధేనని మోదీ ఆరోపించారు. ''రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ నెహ్రూ అప్పట్లో సీఎంలకు లేఖలు రాశారు. మండల్ కమిషన్ నివేదికను ఇందిర ఏళ్లపాటు తొక్కిపెట్టారు. రాజీవ్‌గాంధీ కూడా విపక్ష నేతగా రిజర్వేషన్లను నిండు సభలోనే బాహాటంగా వ్యతిరేకించారు'' అన్నారు.

నీట్ లీకేజీపై...

నీట్ తరహా లీకేజీలు పునరావృతం కాకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోందని మోదీ చెప్పారు.'' లీకేజీ బాధ్యులను వదిలేది లేదు. విద్యార్థుల భవితతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోం. దేశమంతటా అరెస్టులు కొనసాగుతున్నాయి. దోషులపై ఇప్పటికే కఠినమైన కొత్త చట్టం కింద అభియోగాలు మోపాం. అవినీతిని ఉపేక్షించేది లేదని 2014లో తొలిసారి గెలిచినప్పుడే స్పష్టంగా చెప్పాం. అందుకు కట్టుబడి ఉన్నాం'' అన్నారు.

ఏపీ ఆధీనంలోని భవనాల స్వాధీనం

మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన అనంతరం ఉమ్మడి రాజధానిగా పదేళ్లపాటు కొనసాగిన హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రోడ్లు, భవనాల శాఖకు చెందిన భవనాలను తిరిగి స్వాధీనం చేసుకోవటానికి ఏర్పాట్లు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి అంశాలపై చర్చించేందుకు ఈనెల 6న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ అవుతున్న నేపథ్యంలో, మంత్రి ఆదేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈమేరకు కోమటిరెడ్డి మంగళవారం అధికారులతో సమీక్షించారు. లేక్‌వ్యూ అతిథి గృహం, మినిస్టర్ క్వార్టర్స్‌లోని కొన్ని గృహాలు, ఆదర్శనగర్, బషీర్‌బాగ్, కుందన్‌బాగ్‌లోపాటు వివిధ ప్రాంతాల్లోని ఎమ్మెల్యేల సముదాయాలు (ఏపీ ఆధీనంలోనివి), గ్రీన్‌లాండ్స్, మంజీరా అతిథి గృహం తదితరాలు ఏపీ వినియోగంలో ఉంటూ వచ్చాయి. ఇప్పుడు ఉమ్మడి రాజధాని గడువు పూర్తయిన నేపథ్యంలో, ఏపీ ఆధీనంలో ఉన్న ఆయా భవనాలను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీశ్, ఈఎన్సీ గణపతి రెడ్డి, మోహన్‌నాయక్, సీఈ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విలీన గ్రామాలపై చొరవ చూపండి

సీఎం రేవంత్‌కు మంత్రి తుమ్మల లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఐదు గ్రామాలను మళ్లీ తెలంగాణలో కలిపేలా చూడాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. 'ఈనెల 6న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కలిపే అంశంపై చర్చించాలి. భద్రాచలం పట్టణ శివారు నుంచి ఏపీలో విలీనం చేయడంతో అక్కడ డంపింగ్‌యార్డుకు కూడా స్థలం లేకుండా పోయింది. ఈ గ్రామాల విలీనం కారణంగా భద్రాచలం నుంచి చర్ల వెళ్లే వారు సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పురుషోత్తమపట్నంలో భద్రాచలం ఆయన భూములున్నాయి. తమను తెలంగాణలో కలపాలని ఆ 5 గ్రామ పంచాయతీలు తీర్మానం చేశాయి. ప్రజల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఆ గ్రామాలను భద్రాచలంలో కలిపేలా నిర్ణయం తీసుకోవాలి'అని ఆ లేఖలో తుమ్మల కోరారు.

మీరు గడప దాటండి..

▶ మొదటి పేజీ తరువాయి
ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో 29 ప్రభుత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

శాఖల పనితీరుపై పట్టు సాధించాలి

'ఐఏఎస్ అధికారులందరూ సచివాలయం నుంచి క్షేత్ర స్థాయి వరకు విధిగా తమ పరిధిలోని శాఖలు, విభాగాల పనితీరుపై పట్టు సాధించాలి. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలను ఎప్పటికప్పుడు నేరుగా సీఎంవోతో పంచుకోవాలి. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలి..'అని ముఖ్యమంత్రి కోరారు.

అవసరమైతే ప్రక్షాళన చేయండి

'మీ శాఖల పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైతే అధికారులు, సిబ్బంది ప్రక్షాళన చేపట్టాలి. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు పలువురు ముఖ్యమంత్రులతో పని చేసిన అనుభవమున్న అధికారులు ఇప్పటికీ కీలక విభాగాల్లో ఉన్నారు. వీరు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి తమ పనితీరును చాటుకోవాలి. ప్రజలకు మేలు జరిగే పనులు చేయాలనే సంకల్పంతో విధులు నిర్వహించాలి. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజా పాలనను అందించేందుకు బాధ్యతగా పని చేయాలి. అధికారులందరూ ఏకతాటిపై పని చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో ప్రభుత్వానికి సంబంధం లేదు. అధికారులపై రాగద్వేషాలేమీ లేవు. కేవలం పని తీరు ఆధారంగానే అధికారులకు తదుపరి ఉన్నత అవకాశాలుంటాయి. బాగా పని చేసే వారికి ప్రోత్సాహకాలుంటాయి. లేనిపోని సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు. ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలి..'అని సీఎం స్పష్టం చేశారు.

త్వరలో జిల్లాల పర్యటన

త్వరలోనే వారానికో జిల్లా పర్యటనకు వెళతానని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలిస్తానని అన్నారు. ప్రజలను స్వయంగా కలుసుకునేలా తన పర్యటన ఉంటుందని చెప్పారు. ఈ మేరకు షెడ్యూలు త్వరలో విడుదల చేస్తామన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి పాల్గొన్నారు.

కాగా జూలై 8న జరిగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలకు హాజరు కావాలని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆహ్వానించారు.

6న కలుద్దాం

- మీ ప్రతిపాదనతో ఏకీభవిస్తున్నా
- ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ లేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం పక్షాన ఈనెల ఆరో తేదీన ముఖాముఖి కలుద్దామంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం ఏపీ సీఎం చంద్రబాబునాయుడును ఆహ్వానించారు. 6వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో కలిసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ మేరకు చంద్రబాబుకు రేవంత్ లేఖ రాశారు. 'మీరు ఈనెల ఒకటో తేదీన లేఖ రాసినందుకు కృతజ్ఞతలు. ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు మీకు అభినందనలు. నాలుగోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించడం ద్వారా మీరు దేశంలోనే అరుదైన నాయకుల్లో ఒకరిగా నిలిచారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించేందుకు నన్ను కలవాలన్న మీ ప్రతిపాదనతో నేను ఏకీభవిస్తున్నాను. పునర్విభజన చట్టంలోని అంశాల పరిష్కారానికి మన భేటీ ఉపయోగపడుతుంది. అవసరం కూడా. వ్యక్తిగతంగా కలవడం పరస్పర సహకారానికి బలమైన పునాది వేస్తుంది. అభిప్రాయాలను పంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించగలం..'అని ఆ లేఖలో రేవంత్ పేర్కొన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయహోదా కల్పించాలి

- తెలంగాణలోని బొగ్గు గనులను రాష్ట్రానికే కేటాయించాలి
- రాజ్యసభలో వద్దిరాజు రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా కల్పించి నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపించాలని, విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పి ఛత్తీస్‌గఢ్‌లోని ఐరన్ ఓర్ గనులను కేటాయించాలన్నారు. వీటితోపాటు తెలంగాణలో ఉన్న అన్ని కోల్ బ్లాక్స్ సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా వరంగల్‌లోని మామునూర్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్‌లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ తరఫున వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా తెలంగాణలో ఐఐఎం నెలకొల్పాల్సిందిగా ప్రధాని మోదీని కోరారు. కేంద్ర బడ్జెట్ సకల జనులకు మేలు చేకూర్చే విధంగా ఉంటుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. దశాబ్దకాలంలో తెలంగాణ అద్భుతమైన అభివృద్ధిని సాధించిందని, కరెంట్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియనిస్థితి నుంచి రెప్పపాటు కూడా కరెంటు సరఫరా నిలిచిపోని నిరంతర వెలుగు దివ్వెగా రాష్ట్రం మారిందన్నారు. పారిశ్రామికీకరణ, ఉద్యోగాల కల్పనలో తెలంగాణలో గణనీయమైన ప్రగతి సాధించిందని రాజ్యసభ దృష్టికి తీసుకొచ్చారు.

7 మండలాలు వెనక్కి రప్పించాలి

▶ మొదటి పేజీ తరువాయి
చంద్రబాబుపైనే ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వ మనుగడ ఆధారపడి ఉన్నందున ఏపీ సీఎంపై ఒత్తిడి చేసి గతంలో విలీనం చేసిన ఏడు మండలాలతో పాటు దిగువ సీలేరు ప్రాజెక్టు తెలంగాణకు దక్కేలా చూడాలని చెప్పారు. తెలంగాణభవన్‌లో మంగళవారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే ఏడు మండలాలు, దిగువ సీలేరును తెలంగాణ నుంచి వేరు చేయడంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్పట్లోనే తీవ్రంగా స్పందించి బంద్‌కు పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీలో ఏడు మండలాల విలీనం బిల్లును బీజేపీ ప్రవేశపెట్టగా, కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై తమకు అభ్యంతరం లేదని, ఏడు మండలాలు, దిగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ చొరవ చూపాలన్నారు.

మురికి కూపంగా పల్లెలు, పట్టణాలు...

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే పల్లెలు, పట్టణాలు మురికి కూపాలుగా మారాయని, పల్లెలు కన్నీరు పెడుతున్నాయని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలకు ప్రతీ నెలా రూ. 275 కోట్లు చొప్పు ఏటా రూ.3,330 కోట్లు, పట్టణాలకు ఏటా రూ.1,700 కోట్లు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గడిచిన ఏడు నెలలుగా నయాపైసా ఇవ్వకపోవడంతో గ్రామ కార్యదర్శులు సొంతజేబు నుంచి వేలాది రూపాయలు ఖర్చు చేసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీజిల్ పోసే పరిస్థితి లేక ట్రాక్టర్లు మూలన పడగా, రోడ్ ట్యాక్స్ కట్టలేదని ట్రాక్టర్లు సీజ్ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఏడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు లేవని, కరెంటు బిల్లులు, ట్రాక్టరు కిస్తీల చెల్లింపు, వీధి లైట్లు వేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సర్పంచ్‌లతోపాటు జిల్లా, మండల పరిషత్ పదవీకాలం ముగుస్తున్నా, ఎన్నికలు నిర్వహించడం లేదని విమర్శించారు.

ఓటేసిన పాపానికి రైతు ఆత్మహత్య

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన పాపానికి ఖమ్మం జిల్లాలో రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభాకర్ తండ్రి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా తయారైందని, రైతుల తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ప్రభాకర్ కుటుంబానికి రూ.25 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రోల్ల శ్రీనివాస్, దేవీప్రసాద్, పల్లె రవికుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, బమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే 15 ఏళ్లు మనమే!

▶ మొదటి పేజీ తరువాయి
సోషల్ మీడియా విభాగాన్ని కూడా పటిష్టంగా తయారు చేస్తాం. పార్టీ నాయకులను సృష్టిస్తుంది.. నాయకులు పార్టీని సృష్టించరు. భవిష్యత్తులో సమర్థవంతమైన యువ నాయకత్వాన్ని తయారు చేస్తాం. అత్యున్నత పదవులు అనుభవించి పార్టీని వీడుతున్న వారిని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. నాలుగు రోజులు పదవులు లేకపోతే ఉండలేరా? అని ప్రజలే ప్రశ్నిస్తున్నారు. ప్రజా జీవితంలో అడుగు పెట్టిన తర్వాత అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేసే వారే నిజమైన రాజకీయ నాయకులు..'అని స్పష్టం చేశారు.

పిచ్చి పనులు కాంగ్రెస్‌కు అలవాటే

'ప్రజలతో ఛీత్కారాలు పొందే లక్షణం కాంగ్రెస్ పార్టీకి ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చి పనులు చేయడం కూడా వారికి అలవాటే. గతంలో ఎన్టీఆర్ పాలన తర్వాత 1989లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇదే రీతిన వ్యవహరించింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాలు సవ్యంగా పని చేయగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు, తాగునీరు, శాంతిభద్రతల సమస్యలు రావడం బాధ కలిగిస్తోంది. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని చెప్తున్నవారు తెచ్చిన తెలంగాణను కూడా చెరిపివేస్తారా? వైఎస్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాలను పేర్లు మార్చకుండా నేను కొనసాగించా. వ్యవసాయ స్థిరీకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధుకు ఎగనామం పెట్టే ప్రయత్నం జరుగుతోంది. సాగు లెక్కలు, ఇతరత్రా కారణాలు పరిగణనలోకి తీసుకుంటే రైతుబంధు అమల్లో అవినీతి మొదలవుతుంది..'అని మాజీ సీఎం పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కేటీఆర్

రాష్ట్రాభివృద్ధిలో జెడ్పీ చైర్మన్ల కీలక పాత్ర

జెడ్పీ చైర్మన్లు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కేసీఆర్ ప్రశంసించారు. పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్మన్లు కుటుంబ సభ్యులతో సహా ఈ భేటీకి హాజరు కాగా, కేసీఆర్ వారిని పేరు పేరునా పలుకరించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్లకు జ్ఞాపికలతో పాటు యాదాద్రి ప్రసాదాన్ని కేటీఆర్ అందజేశారు. ఈ భేటీలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, జి.జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, గండ్ర వెంకట రమణారెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నాయకులు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్లు జనార్దన్ రాథోడ్ (ఆదిలాబాద్), కోరిపెల్లి విజయలక్ష్మి (నిర్మల్), దాదన్నగారి విఠల్ రావు (నిజామాబాద్), దఫేదార్ శోభ (కామారెడ్డి), దావా వసంత సురేష్ (జగిత్యాల), పుట్టా మధుకర్ (పెద్దపల్లి), కనుమళ్ల విజయ (కరీంనగర్), న్యాలకొండ అరుణ (రాజన్న సిరిసిల్ల), పటోళ్ల మంజుశ్రీ (సంగారెడ్డి), ర్యాకల హేమలత (మెదక్), వేలేటి రోజారాణి (సిద్దిపేట), శాంతకుమారి (నాగర్ కర్నూల్), బండా నరేందర్ రెడ్డి (నల్లగొండ), గుజ్జ దీపిక (సూర్యాపేట), ఎలిమినేటి సందీప్ రెడ్డి (యాదాద్రి భువనగిరి), ఆంగోత్ బిందు (మహబూబాబాద్), గండ్ర జ్యోతి (వరంగల్ రూరల్), మారపల్లి సుధీర్ కుమార్ (వరంగల్ అర్బన్), జక్కు శ్రీహర్షిణి (జయశంకర్ భూపాలపల్లి), బడే నాగజ్యోతి (ములుగు), లింగాల కమల్ రాజ్ (ఖమ్మం) హాజరయ్యారు.

జగిత్యాల ప్రగతికే కాంగ్రెస్‌లో చేరా

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జగిత్యాల: సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని, జగిత్యాల ప్రాంతాభివృద్ధికి ఆయనతో కలిసి పనిచేసేందుకే కాంగ్రెస్‌లో చేరానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆయన జగిత్యాలలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశారు. తనను విమర్శించిన ప్రతి ఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో హుందాతనంతో రాజకీయాలు చేయాలని, తనపై తప్పుడు ఆరోపణలను ఖండించారు. తన ఆర్థిక పరిస్థితి ప్రజలందరికీ తెలుసన్నారు. గతంలో బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకున్నారని సంజయ్ కుమార్ గుర్తు చేశారు.

క్లుప్తంగా...

7 నుంచి అంధ అభ్యర్థులకు నిర్ధారణ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌–4 ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో భాగంగా అంధ అభ్యర్థులు వైద్య పరీక్షల నిమిత్తం హాజరు కావలసి ఉంటుందని తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంధ అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మెడికల్‌ బోర్డు ఎదుట ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. సూచించిన తేదీల్లో అభ్యర్థులు ఉదయం 8 గంటల కల్లా ఆస్పత్రిలో ఉండాలని పేర్కొన్నారు. మెడికల్‌ బోర్డు పరీక్షలకు హాజరయ్యేటప్పుడు అభ్యర్థులు హాల్‌టికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలు, అంధత్వ నిర్ధారణ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. తేదీల వారీగా మెడికల్‌ బోర్డు షెడ్యూల్‌ను కమిషన్‌ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

నేటి నుంచి పీజీ ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లు

ఈనెల 6 నుంచి 15 వరకు పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 6న ప్రారంభం కానున్న వివిధ పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు బుధవారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్‌ చేసుకోవాలని టీఎస్‌ సీపీజీఈటీ–2024 కన్వీనర్‌ పాండురంగా రెడ్డి మంగళవారం తెలిపారు. రాష్ట్రంలోని 8 వర్సిటీల్లోని 45 సబ్జెక్టులకు పీజీ, పీజీ డిప్లొమా, ఐదేళ్ల పీజీ కోర్సులకు 73,566 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. అందులో 50 వేల మంది బాలికలు, 23,566 మంది బాలురు ఉన్నట్లు కన్వీనర్‌ వెల్లడించారు. గత నెల 26 నుంచి 30 వరకు రూ.2,000 అపరాధ రుసుముతో సుమారు 100 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. సీట్ల కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన ఎంఏ కన్నడ, మరాఠీ, అరబిక్, పర్షియన్, థియేటర్‌ ఆర్ట్స్‌ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 37 కేంద్రాల్లో జరిగే పీజీ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. కాగా, ఈనెల 7న జాతీయ స్థాయిలో ఇతర పరీక్షలు ఉన్నందున ఎంఈడీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ స్టూడెంట్స్‌ పొలిటికల్‌ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ నరసింహ సమర్పించిన వినతిపత్రానికి పాండురంగారెడ్డి స్పందించారు. ఇతర పరీక్షల కారణంగా ఈనెల 7న జరిగే ఎంఈడీ ప్రవేశ పరీక్ష 16కు వాయిదా వేసినట్లు తెలిపారు. ఎంఈడీ ప్రవేశ పరీక్షను 16న ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎన్‌ఎండీసీ సీఎండీగా శ్రీధర్‌ పేరు తిరస్కరణ

పీఈఎస్‌బీ సిఫారసులను తోసిపుచ్చిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: నేషనల్‌ మినరల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఎన్‌ఎండీసీ) సీఎండీగా రాష్ట్ర కేడర్‌ ఐఏఎస్‌ అధికారి ఎన్‌.శ్రీధర్‌ పేరును పబ్లిక్‌ ఎంటర్‌ప్రైజెస్‌ సెలక్షన్‌ బోర్డ్‌ (పీఈఎస్‌బీ) 2023, మార్చి 18న ప్రతిపాదించగా, తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. అప్పట్లో ఎన్‌ఎండీసీ సీఎండీ పోస్టుకి 7 మంది అభ్యర్థులను పీఈఎస్‌బీ బోర్డు ఇంటర్వ్యూ చేసి ఎన్‌.శ్రీధర్‌ పేరును ఎంపిక చేసింది. అప్పుడు ఆయన సింగరేణి సంస్థ సీఎండీగా కొనసాగుతున్నారు. ఆ పదవిలో ఉంటూ శ్రీధర్‌ పలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ఆయన్ను ఎన్‌ఎండీసీ సంస్థ సీఎండీగా నియమించరాదని అప్పట్లో కొందరు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. దీంతో దీనిపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, ఉక్కు మంత్రిత్వ శాఖ విచారణ నిర్వహించినట్లు తెలిసింది. గత జూన్‌ 30న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర కేబినెట్‌ నియామక కమిటీ సమావేశంలో ఎన్‌ఎండీసీ సీఎండీగా ఎన్‌.శ్రీధర్‌ పేరును సిఫారసు చేస్తూ పీఈఎస్‌బీ చేసిన సిఫారసులను తోసిపుచ్చినట్లు కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి.

వీఆర్వోలకు న్యాయం చేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఏ ఇతర ఉద్యోగులకు జరగని అన్యాయం గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో)కు జరిగిందని తెలంగాణ వీఆర్వోల జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. రాజ్యాంగం కల్పించిన హక్కులకు విరుద్ధంగా లాటరీలు తీసి, రాత్రికి రాత్రే ఉత్తర్వులు ఇచ్చి, పోలీసులతో బెదిరించి కార్లలో తీసుకెళ్లి తమను ఇతర శాఖల్లో చేర్పించారని ఆరోపించింది. తద్వారా గత ప్రభుత్వం వీఆర్వోలను మానసిక ఇబ్బందులకు గురిచేసిందని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ వీఆర్వో జేఏసీ నేతలు మంగళవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌ చైర్మన్‌ జి.చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. వీఆర్వోల వేతనాలు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. చిన్నారెడ్డిని కలిసిన వారిలో జేఏసీ చైర్మన్‌ గోల్కొండ సతీశ్, సెక్రటరీ జనరల్‌ హరాలే సుధాకర్‌రావు, అదనపు సెక్రటరీ జనరల్‌ పల్లెపాటి నరేశ్, వైస్‌ చైర్మన్లు ప్రతిభ, మురళి ఉన్నారు.

రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాలపై నిఘా పెట్టండి

అత్యుత్సాహం తగ్గించుకోండి.. హైదరాబాద్‌ బ్రాండ్‌ ఇమేజ్‌ను కాపాడండి

- సరిహద్దులో సైన్యంలా రాష్ట్రంలోకి డ్రగ్స్‌ రాకుండా పహారా కాయండి
- సైనిక స్కూళ్ల మాదిరే పోలీసు పిల్లలకు ప్రత్యేక స్కూల్‌ ఏర్పాటు చేస్తాం
- పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి


టీజీ యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో, సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ రవిగుప్తా తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాలపై నిఘా పెట్టి నేరస్తులను పట్టుకోవాలి. ప్రజలు ఎన్నుకుంటే ప్రజాప్రతినిధులుగా వచ్చాము. మాకు మితిమీరిన సెక్యూరిటీ అవసరం లేదు. ఎవరికి ఎంత అవసరమో అంతే భద్రత ఇవ్వాలి. భద్రత విషయంలో నాతో సహా ఎవరికీ అధిక ప్రాధాన్యం ఇవ్వా ల్సిన అవసరం లేదు. భద్రత, ఇతర విషయాల్లో కొన్నిసార్లు పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారు. ఆ ఉత్సాహాన్ని నేరాల నియంత్రణపై చూపాలి' అని ముఖ్యమంత్రి డీజీపీ సహా పోలీసు ఉన్నతాధికారులకు హితవు పలికారు. మంగళవారం కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌లో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్‌ కమిషనరేట్ల అధికారులు, సిబ్బందితో నగరంలో శాంతిభద్రతలపై సీఎం సమీక్షించారు. వారికి కీలక సూచనలు చేశారు.

డ్రగ్స్, సైబర్‌ నేరాల కట్టడికి సామర్థ్యాలు పెంచుకోవాలి

తెలంగాణకు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు (ఏవోబీ) నుంచి గంజాయి వస్తోందనే సమాచారం ఉందని సీఎం రేవంత్‌ చెప్పారు. దేశ సరిహద్దుల్లో సైన్యం ఎలా అప్రమత్తంగా ఉంటూ ఉగ్రమూకలు చొరబడకుండా పహారా కాస్తోందో.. రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు అలా పహారా కాసి తెలంగాణలోకి గంజాయి, డ్రగ్స్‌ రాకుండా చూడాలని సూచించారు. డ్రగ్స్, సైబర్‌ నేరాలను అరికట్టేందుకు అవసరమైన సామర్థ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. సింగరేణి కాలనీలో ఒక బాధితుని కుటుంబాన్ని, ఔటర్‌ రింగ్‌రోడ్డులో ఒక బాధితుడైన డాక్టర్‌ను పరామర్శించడానికి వెళ్తే వారంతా గంజాయికి అలవాటుపడిన వ్యక్తుల వల్లే బాధితులుగా మారామని చెప్పారన్నారు. తమ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారని.. తాము రూ. వందల కోట్లు సంపాదించినా ఉపయోగం లేకుండాపోయిందంటూ పలువురు తల్లిదండ్రులు కూడా ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇందుకు ప్రధాన కారణం పోలీసు వ్యవస్థ రాజకీయ నిఘాపై శ్రద్ధపెట్టి నేరస్తులను వదిలేయడమేనని సీఎం అభిప్రాయపడ్డారు.

పోలీసు కుటుంబం నుంచే వచ్చా

పోలీసుల పిల్లలు తాము పోలీసుల కుటుంబాల నుంచి వచ్చామని చెప్పుకొనేందుకు ఇబ్బంది పడతారని, అందుకు కారణం పోలీసు శాఖపై సమాజంలో ఉన్న దురభిప్రాయమేనని సీఎం రేవంత్‌ అన్నారు. ఆ అభిప్రాయం మారాలని, తన తండ్రి, తన అన్న పోలీసు అని గర్వంగా చెప్పుకునేలా పోలీసుల ప్రవర్తన ఉండాలని ఆయన సూచించారు. తన సోదరుడు భూపాల్‌రెడ్డి వనపర్తిలో కానిస్టేబుల్‌గా పనిచేసి తనను చదివించారని, తన అన్న పెంపకం వల్లే తాను సీఎం స్థాయికి ఎదిగానని రేవంత్‌ వెల్లడించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు పోలీసు శాఖ సమస్యలు పరిష్కరించుకోకుంటే ఇక జీవితకాలంలో ఎప్పటికీ పరిష్కారం కావన్నారు.

పోలీసుల పిల్లలకు ఉచిత విద్య

సైనిక స్కూళ్ల మాదిరే పోలీసు పిల్లల కోసం పోలీసు స్కూళ్లు ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల స్థలంలో పోలీసు స్కూల్‌ ఏర్పాటు చేస్తామని, ఆరో తరగతి నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందులో ఉంటుందని, హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు చదువుకోవచ్చని చెప్పారు. సామర్థ్యం, పనితీరుతోనే బదిలీలు కోరుకోవాలని సీఎం సూచించారు. సామర్థ్యం ఉన్నవారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందని, అందుకు రిటైర్డ్‌ ఐపీఎస్‌ సందీప్‌ శాండిల్య ఉదాహరణ అని పేర్కొన్నారు. రిటైరైనప్పటికీ సందీప్‌ శాండిల్యకు మాత్రమే ప్రభుత్వం పదవీకాలం పొడిగించిన విషయం గుర్తించాలన్నారు.

పైసలతో పోస్టింగ్‌లు కుదరదు!

'పైసలతో పోస్టింగ్‌లు తెచ్చుకుందామంటే కుదరదు. పనితీరు ఆధారంగానే బదిలీలు ఉంటాయి. డబ్బు పెట్టి పోస్టింగ్‌లు తెచ్చుకొని మళ్లీ డబ్బు దండుకోవాలంటే ఏసీబీ వెంటపడుతుంది' అని సీఎం రేవంత్‌ పోలీసు అధికారులను హెచ్చరించినట్లు సమాచారం.

తెలంగాణ బ్రాండ్‌ హైదరాబాద్‌..

తెలంగాణ బ్రాండే హైదరాబాద్‌ అని, హైదరాబాద్‌ పోలీసులంటే తెలంగాణకు గుండె లాంటి వారని సీఎం రేవంత్‌ అన్నారు. హైదరాబాద్‌లో నేరాలను, అరాచకాలను అరికట్టకపోతే రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. అందుకే హైదరాబాద్‌ ఇమేజ్‌ను కాపాడాలన్నారు.

డ్రగ్స్‌ వ్యతిరేక వీడియోలు చేస్తేనే టికెట్‌ రేట్ల పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

కేటాయించింది. మంగళవారం తెలంగాణ కమాండ్, కంట్రోల్‌ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తా, టీజీ సైబర్‌ సెక్యూరిటీ డైరెక్టర్‌ శిఖాగోయల్, టీజీ నార్కోటిక్స్‌ బ్యూరో డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్య, ఇతర అధికారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

సినీ పరిశ్రమకు సామాజిక బాధ్యత ఏదీ?

వ్యాపారాలు పెంచుకొనేందుకు తప్ప సామాజిక సమస్యలైన డ్రగ్స్, సైబర్‌ నేరాల నియంత్రణలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యత నిర్వర్తించడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. సమాజం నుంచి ఎంతో తీసుకుంటున్న సినీ పరిశ్రమకు సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. సినిమా షూటింగ్‌ల అనుమతులకు సైతం ఈ నిబంధన వర్తించేలా సైబరాబాద్, రాచకొండ పోలీస్‌ కమిషనరేట్ల సీపీలు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సినిమా థియేటర్ల యాజమాన్యాలు సైతం డ్రగ్స్‌ నియంత్రణ, సైబర్‌ నేరాల కట్టడికి సంబంధించి సినీ పరిశ్రమ రూపొందించి ఇచ్చే వీడియోలను సినిమాల ప్రారంభానికి ముందు విధిగా ప్రదర్శించాలని సూచించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖను సీఎం రేవంత్‌ ఆదేశించారు. దీని అమలుపై చర్చించేందుకు థియేటర్ల యజమానులు, సినీ పరిశ్రమ ప్రముఖులతో పోలీసు, ఐ అండ్‌ పీఆర్‌ శాఖలు తొలుత సమావేశం కావాలని సూచించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆలోచనలపై వారితో తాను భేటీ అవుతానని సీఎం చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా మీడియా సైతం సామాజిక అవగాహన వీడియోలు, సందేశాలను ప్రచురించాలని/ప్రదర్శించాలని కోరారు.

మెగాస్టార్‌కు సీఎం అభినందనలు

డ్రగ్స్‌ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచేలా సొంతంగా ఓ వీడియో రూపొందించి తెలంగాణ పోలీసులకు అందించిన మెగాస్టార్‌ చిరంజీవికి సీఎం రేవంత్‌ అభినందనలు తెలియజేశారు. చిరంజీవి మాదిరిగా సినీ హీరోలు, క్రీడాకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గల్లీగల్లీకి గంజాయి..

గత పదేళ్ల బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని గల్లీగల్లీలో గంజాయి దొరికే పరిస్థితి వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. శ్రీమంతుల కుటుంబాల పిల్లలే కాకుండా మధ్యతరగతి, పేద వర్గాలకు చెందిన పిల్లలు సైతం గంజాయికి అలవాటు పడుతున్నారన్నారు. గంజాయి మత్తులో అనేక నేరాలు జరుగుతున్నాయని.. చిన్నారులపై ఇటీవలి నేరాల వెనుక గంజాయి వాడకమే ప్రధాన కారణమన్నారు. ఈ నేరాలను నియంత్రించాలన్నారు. తెలంగాణ యువత సమస్యలపై ఉద్యమించే సమర్థులనేలా మారుస్తామని చెప్పారు. తెలంగాణలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు వాడాలన్నా, సైబర్‌ నేరాలకు పాల్పడాలన్నా రాష్ట్రంలో వణికే పరిస్థితి రావాలన్నారు.

సమర్థులకు ప్రమోషన్లు

సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో, యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో బలోపేతం కోసమే అధికారులు, సిబ్బంది కేటాయింపుతో పాటు అవసరమైన వాహనాలు సమకూర్చినట్లు సీఎం రేవంత్‌ తెలిపారు. సైబర్‌ నేరాల దర్యాప్తు, డ్రగ్స్‌ కట్టడిలో ప్రతిభ చాటే పోలీసులకు నగదు బహుమతులు, పదోన్నతులు కల్పిస్తామని సీఎం ప్రకటించారు. ఈ మేరకు విధివిధానాలు రూపొందించాలని డీజీపీ రవిగుప్తాను ఆదేశించారు. శాసనసభలో దీనిపై చర్చించి చట్టం చేస్తామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు ఇకపై ఆన్‌లైన్‌లోనే

- ఈ నెల 15వ తేదీ నుంచి అమలు
- వెబ్‌సైట్‌ ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- https//cmrf.telangana.gov.in/లో అందుబాటులో దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్‌) దరఖాస్తులను ఇక నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. సీఎంఆర్‌ఎఫ్‌ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో వ్యవహరించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం సెంటర్‌ ఫర్‌ గుడ్‌ గవర్నెన్స్‌ ఆధ్వర్యంలో రూపొందించిన వెబ్‌సైట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం సచివాలయంలో ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్‌ఎఫ్‌ నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. సీఎంఆర్‌ఎఫ్‌ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫారసు లేఖ జత చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్‌ లో సంబంధిత దరఖాస్తుదారుల బ్యాంక్‌ ఖాతా నంబర్‌ తప్పనిసరిగా ఇవ్వాలి. అప్‌లోడ్‌ చేసిన తర్వాత సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన ఒక కోడ్‌ ఇస్తారు. ఆ కోడ్‌ ఆధారంగా ఒరిజినల్‌ మెడికల్‌ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. సంబంధిత ఆస్పత్రులకు ఆన్‌లైన్‌లోనే పంపించి నిర్ధారించుకున్న తర్వాత అన్ని వివరాలు సరిగ్గా ఉంటే దరఖాస్తును ఆమోదించి చెక్‌ను సిద్ధం చేస్తారు. చెక్‌పై తప్పనిసరిగా దరఖాస్తుదారుడి బ్యాంకు ఖాతా నంబర్‌ ముద్రిస్తారు. (దీనివల్ల చెక్‌ పక్కదారి పట్టే అవకాశం ఉండదు) ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్‌లను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు. ఈ నెల 15వ తేదీ తర్వాత సీఎంఆర్‌ఎఫ్‌ దరఖాస్తులను ఆన్‌లైన్‌ ద్వారా మాత్రమే స్వీకరిస్తారు. https//cmrf.telangana.gov.in/ సైట్‌లో దరఖాస్తు అందుబాటులో ఉంటుంది.

నాలుగు పథకాలకు రూ.60 వేల కోట్లు

- రుణమాఫీ, రైతు భరోసా, బీమాలకు ఖర్చు
- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల వెల్లడి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: రానున్న 3 నెలల్లో రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, రైతు బీమా పథకాలకు రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ఖర్చు చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన అన్ని జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇది ప్రభుత్వానికి భారమైనా.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి సాహసోపేతమైన నిర్ణయాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రానున్న కాలంలో ఆర్థిక వెసులుబాటును బట్టి ఒక్కొక్కటిగా అన్ని పథకాలను పునరుద్ధరిస్తామని, ఇప్పటికే మట్టి నమూనా పరీక్ష కేంద్రాలను తిరిగి వాడుకలోకి తెచ్చి భూసార పరీక్షలు ప్రారంభించిన విషయాన్ని తుమ్మల గుర్తుచేశారు. రైతుబీమాలో 1,222 క్లెయిమ్స్‌ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పెండింగ్‌ ఉంటే చనిపోయిన రైతు కుటుంబాలకు మనం అందించే ఆసరా సకాలంలో అందుతుందా? లేదా? అన్నది పరిశీలించాలని పేర్కొన్నారు. పంటల నమోదులో కచ్చితత్వం ఉండాలని, ఇది అన్నింటికీ ప్రాతిపదిక అన్నారు. ఆయిల్‌ పామ్‌ ప్రాజెక్ట్‌ చేపట్టి మూడేళ్లయినా ఇంకా రెండు శాఖల మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం లేదని తుమ్మల అసంతృప్తి వ్యక్తంచేశారు. 2023–24 సంవత్సరంలో 2.30 లక్షల ఎకరాల లక్ష్యానికి గాను కేవలం 59,200 ఎకరాలు మాత్రమే పురోగతి ఉందన్నారు. హెచ్‌ఈవోలు లేనిచోట ఏఈవోలు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. రైతును ఎంపిక చేయడం నుంచి డ్రిప్‌ ఇన్‌స్టాల్‌ చేయించడం, మొక్కలు నాటించడం వరకు అన్నింటిపై ఏఈవో, ఏవో బాధ్యత తీసుకోవాలన్నారు. డ్రిప్‌ ఇరిగేషన్‌ పరికరాలు సబ్సిడీపై ఇతర పంటలు సాగుచేసే రైతులకు కూడా ఈ సంవత్సరం నుంచి ఇస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్, డైరెక్టర్‌ గోపి, ఉద్యాన డైరెక్టర్‌ యాస్మిన్‌ బాషా పాల్గొన్నారు.

నేడు 213 మంది ఖైదీల విడుదల

ఉత్తర్వులు జారీ చేసిన హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్‌

సాక్షి, హైదరాబాద్: శిక్షాసమయంలో జైలులో సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలు బుధవారం విడుదల కానున్నారు. దీనికి సంబంధించి హోం శాఖ జీఓ నం. 37 జారీ చేసింది. విడుదలయ్యే వారిలో జీవిత ఖైదీలతోపాటు ఇతర శిక్షలు పడిన ఖైదీలు ఉన్నట్టు హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్‌ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జైళ్లశాఖ అత్యున్నతస్థాయి కమిటీ మొత్తం 231 మంది ఖైదీల ముందస్తు విడుదలకు ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో 213 మంది ఖైదీల విడుదలకు గవర్నర్‌ సీపీ రాధాకృష్ణన్‌ ఆమోదముద్ర వేశారు. ముందస్తుగా విడుదలకానున్న ఈ ఖైదీలకు కొన్ని షరతులు విధిస్తున్నట్టు ఆ జీఓలో పేర్కొన్నారు. ప్రతి ఖైదీ బయటకు వెళ్లిన తర్వాత తాను శాంతియుతంగా, సత్ప్రవర్తన కలిగి ఉంటానని, లేదంటే తిరిగి శిక్ష అనుభవిస్తానని రూ.50 వేలకు వ్యక్తిగత పూచీకత్తు బాండ్‌ ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో విధించిన శిక్షాకాలం పూర్తయ్యే వరకు వారి గ్రామ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రతి మూడు నెలలకు ఒకసారి హాజరుకావాలని, మళ్లీ ఏదైనా నేరం చేస్తే రద్దు చేసిన జైలుశిక్షను తిరిగి అమలు చేస్తారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి జిల్లా ప్రొబేషన్‌ అధికారి సదరు ఖైదీని గమనిస్తూ ఉండడంతోపాటు ఆ ఖైదీ విడుదలైన జైలుకు ఆరునెలలకు ఒకసారి రిపోర్టు సమర్పించనున్నట్టు జీఓలో పేర్కొన్నారు.

జైళ్లశాఖ ఏర్పాట్లు

ప్రభుత్వ ఉత్తర్వులతో జైళ్లశాఖ అధికారులు 213 మంది ఖైదీల విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జైళ్లశాఖ డీజీ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. విడుదల కాబోతున్న 213 మంది ఖైదీలను బుధవారం చర్లపల్లి సెంట్రల్‌ జైలుకు తీసుకురానున్నారు. అక్కడ వారికి కౌన్సెలింగ్‌తోపాటు ఆసక్తి ఉన్న అంశాల్లో వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాత విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.


మంగళవారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డితో కలిసి సీఎం రేవంత్‌ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హెటిరో కంపెనీ ప్రతినిధుల బృందం

'దోస్త్‌' కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్‌ గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్‌ : డిగ్రీల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న మూడోదశ దోస్త్‌ కౌన్సెలింగ్‌కు నామమాత్రపు స్పందన కనిపిస్తోంది. దీంతో ఈ విడత కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్‌ గడువు ఈ నెల 4వ తేదీ వరకూ పొడిగించారు. వాస్తవానికి ఇది మంగళవారంతో ముగిసింది. ఈ తేదీ వరకూ 56,910 మంది మాత్రమే రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారు. వీరిలో అప్లికేషన్లు నింపనివారు 50 వేల మంది వరకూ ఉన్నారు. అప్లికేషన్లు నింపి కూడా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించనివారు 15 వేల మంది ఉన్నారు. ఫీజు చెల్లించి కూడా వెబ్‌ఆప్షన్లు ఇవ్వనివారు 10 వేల మంది ఉన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్, వెబ్‌ ఆప్షన్లకు ఈ నెల 4వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ ఆర్‌.లింబాద్రి తెలిపారు. మూడోదశ సీట్ల కేటాయింపు మాత్రం ముందుగా ప్రకటించినట్టు ఈ నెల 6వ తేదీన చేపట్టబోతున్నట్టు తెలిపారు.


ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డితో సమావేశమైన నోకియా ప్రతినిధి బృందం

బడి పిల్లలకు 20 వేల ల్యాప్‌టాప్‌లు

- అన్ని బడులకు ఐడబ్ల్యూబీ బోర్డులు
- ప్రాజెక్టుపై నోకియా ప్రతినిధులతో సీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందించేందుకు క్వాడ్‌జెన్‌ సంస్థతో కలిసి రాష్ట్రంలోని ప్రతి పాఠశాలకు ఇంటరాక్టివ్‌ వైట్‌ బోర్డులు (ఐడబ్ల్యూబీ), విద్యార్థులకు 20 వేల లోపు ల్యాప్‌టాప్‌లను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రంలో 5జీ మొబైల్‌ నెట్‌వర్క్‌ను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో నోకియా జర్మనీ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సమావేశమై ఈ ప్రాజెక్టుపై చర్చించింది. సమావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, నోకియా గ్లోబల్‌ హెడ్‌ మార్టిన్, సేల్స్‌ హెడ్‌ మ్యాక్స్, గ్లోబల్‌ డైరెక్టర్‌ వెంకట్, పద్మజ, రాజేష్, సీఎస్‌ రావ్‌ పాల్గొన్నారు.

ఆరోగ్యం సహకరించడం లేదు.. దీక్ష విరమిస్తున్నా

- త్వరలోనే ఐక్యకార్యాచరణ ప్రకటన .. రేపటి నుంచి ప్రజాక్షేత్రంలో
- 10 లక్షల నిరుద్యోగ యువతతో నిరుద్యోగ మార్చ్‌
- నిరుద్యోగుల సత్తా చూపిస్తా.. ప్రలోభాలకు లొంగలేదు..
- గాంధీ ప్రాంగణంలో కొబ్బరినీళ్లు తాగి దీక్ష విరమించిన మోతీలాల్‌నాయక్‌


కొబ్బరినీళ్లు తాగి ఆమరణదీక్ష విరమిస్తున్న మోతీలాల్‌నాయక్‌

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్‌) : 'ఆరోగ్యం సహకరించడం లేదు.. శరీరంలోని అన్నీ అవయవాలు కొంతమేర శక్తిని కోల్పోయాయి. అందుకే నిరాహార దీక్ష విరమిస్తున్నా. ప్రలోభాలకు లొంగలేదు..తొమ్మిది రోజులు ఆహారం తీసుకోకుండా నిరుద్యోగుల కోసం పోరాటం చేశాను. ఇకపై ఆహారం తీసుకుంటూ ఉద్యమిస్తా.. త్వరలోనే ఐక్య కార్యాచరణ ప్రకటిస్తా' అని నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్‌ స్పష్టం చేశారు. తొమ్మిది రోజులుగా ఆమరణదీక్ష చేస్తున్న ఆయన మంగళవారం ఉదయం గాంధీ ప్రాంగణంలో కొబ్బరినీళ్లు తాగి దీక్షను విరమిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పలుపార్టీల నేతలు, సంఘ నాయకులు కలిసి ఉద్యమం చేద్దామనే పిలుపు మేరకు దీక్ష విరమించానని, రేపటి నుంచి ప్రజాక్షేత్రంలో ఉంటానని చెప్పారు. తన దీక్షకు సంఘీభావం ప్రకటించిన అందరినీ కలిసి మద్దతు కూడగట్టి, నిరుద్యోగుల సత్తా చూపిస్తామని, ప్రభుత్వ మెడలు వంచి న్యాయమైన డిమాండ్లు సాధించుకుంటామన్నారు. తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని, ఇకపై పాముకాటు ఎలా ఉంటుందో చూపిస్తానని సవాల్‌ విసిరారు. మరణిస్తే ఉద్యమం చేయలేనని, బతికి డిమాండ్లు సాధించుకుంటామని, రోజుకో తీరుతో విభిన్న తరహాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించనని శపథం చేశారు. తెలంగాణలోని పలు రాజకీయపార్టీలు, సంఘాలు, నిరుద్యోగులు తన వెనుక ఉన్నారని, త్వరలోనే 10 లక్షల మందితో నిరుద్యోగ మార్చ్‌ నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంత్రి సీతక్క ఫోన్‌ చేసి మాట్లాడింది వాస్తవమేనన్నారు. నగరంలోని అశోక్‌నగర్‌ సిటీ సెంట్రల్‌ లైబ్రరీ నుంచి తన కార్యాచరణ ప్రారంభమవుతుందని చెప్పారు. న్యాయమైన డిమాండ్లు సాధించేవరకు తన పోరాటం ఆగదన్నారు.

నగర కేంద్ర గ్రంథాలయానికి మోతీలాల్‌నాయక్‌

మోతీలాల్‌ నాయక్‌ దీక్ష విరమించిన అనంతరం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రకటించారు. లక్షలాది మందితో మరో 10 రోజుల్లో టీజీపీఎస్సీని ముట్టడి లాంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. సిటీ లైబ్రరీ నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ నిరుద్యోగులకు హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు.

నీట్‌ పరీక్షను బేషరతుగా రద్దు చేయాలి: జాజుల

నీట్‌ పరీక్షలో జవాబుదారీతనం లేదు: బల్మూరి


మాట్లాడుతున్న జాజుల. చిత్రంలో ఎమ్మెల్సీ బల్మూరి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్‌): దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్‌ పరీక్షను బేషరతుగా రద్దు చేయాలని, నీట్‌ పరీక్ష పత్రం లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నీట్‌ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ అఖిల పక్ష విద్యార్థి సంఘాలతో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాజుల మాట్లాడుతూ నీట్‌ పరీక్ష లీకేజీపై సిట్టింగ్‌ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. మోదీ ప్రభుత్వం నిర్వహించేది మన్‌కీబాత్‌ కాదని బాతకానీబాత్‌ అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ మాట్లాడుతూ జవాబుదారీతనం లేకుండా నీట్‌ పరీక్షను నిర్వహించారన్నారు. జూన్‌ 14న విడుదల కావాల్సిన ఫలితాలు జూన్‌ 4న విడుదల చేయడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ పాలిత మూడు రాష్ట్రాల్లోనే ఈ లీకేజీ జరిగిందని ఆరోపించారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మహేశ్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విక్రమ్‌గౌడ్, శ్యామ్‌కురుమ, విజయ్‌భాస్కర్, నర్సింహనాయక్, అరుణ్‌కుమార్, ఆజాద్, లింగంగౌడ్, లక్ష్మణ్, లింగం పాల్గొన్నారు.



సాధారణమైన నిత్యకృత్యాల్లో కూడా ఏకాగ్రత ఎప్పుడూ అవసరమే. మనం ఏ పని చేస్తున్నా, దాన్ని విజయవంతం చెయ్యాలంటే మనసు కేంద్రీకరించకుండా అది సాధ్యపడదు. అందుకే బుద్ధుడు ఏకాగ్రతను ఉత్తములకుండే లక్షణాల్లో ఒకటిగా పేర్కొన్నాడు.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 3 జూలై 2024

అంతా సిద్ధమేనా?

భారత న్యాయశాస్త్ర చరిత్రలో మొన్న జూలై 1న ఒక కొత్త అధ్యాయం మొదలైంది. బ్రిటీషు కాలం నాటి నేర చట్టాల స్థానంలో మూడు కొత్త చట్టాలను మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. భారత శిక్షాస్మృతి– 1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్– 1973, భారతీయ సాక్ష్యాల చట్టం – 1872... ఈ మూడింటి బదులు 'భారతీయ న్యాయ సంహిత', 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', 'భారతీయ సాక్ష్య అధినియమ్'లు సోమవారం నుంచి ఆచరణలోకి వచ్చాయి. అయితే, న్యాయకోవిదుల మొదలు సాధారణ కక్షిదారుల వరకు ఈ కొత్త చట్టాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నారు. నేరన్యాయవ్యవస్థను ఆధునికీకరించడంలో ఈ కొత్త చట్టాలు గణనీయమైన ముందడుగు అని కొందరు ప్రశంసిస్తుంటే, మరికొందరు పాతవాటికి పైపై మెరుగులు దిద్ది, అమానుషంగా మార్చారని విమర్శిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల నుంచి కోర్టుల దాకా అన్నిటా పనితీరును మార్చేసి, సామాన్యులపై పెను ప్రభావం చూపే ఈ శాసనాలపైనే ఇప్పుడు దేశమంతటా చర్చ సాగుతోంది.

కొత్త నేర చట్టాల వ్యవహారం సహజంగానే అధికార బీజేపీకీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌కూ మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. వలసవాద పాలన తాలూకు అవశేషాలను వదిలించుకొనే ఈ ప్రయత్నం దేశపురోగతికీ, స్థితిస్థాపకతకూ ప్రతీక అన్నది బీజేపీ మాట. కాంగ్రెస్ మాత్రం గడచిన ప్రభుత్వ హయాంలో పార్లమెంట్‌లో ఏకంగా 146 మంది ప్రతిపక్ష సభ్యులు సస్పెండైన వేళ, కేవలం మూజువాణి ఓటుతో బలవంతాన ఈ చట్టాలకు ఆమోదముద్ర వేశారనీ, పార్లమెంటరీ వ్యవస్థలో ఈ రకమైన 'బుల్‌డోజర్ న్యాయాన్ని' తమ ప్రతిపక్ష కూటమి సహించబోదనీ పేర్కొంది. శతాబ్ద కాలానికి ముందెప్పుడో బ్రిటీషు హయాంలో చేసిన చట్టాలు శిక్షల మీద ప్రధానంగా దృష్టి పెడుతుంటే, ఈ కొత్త చట్టాలు మటుకు అందరికీ న్యాయం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తాయనేది అధికార పక్షం కథనం. కానీ, ఆ మాటలతో ప్రతిపక్షాలే కాదు... చివరకు పలువురు న్యాయశాస్త్ర నిపుణులు సైతం విభేదిస్తుండడం గమనార్హం. ఇంకా చెప్పాలంటే, సరికొత్త శాసనాలు దుర్వినియోగమయ్యే ప్రమాదం ఎంతైనా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిజానికి, మారుతున్న సమాజ పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా పాతకాలపు చట్టాలను మార్చాలన్న ఆలోచన మంచిదే. ప్రస్తుతం విచారణలోని ఖైదీలు లెక్కకు మిక్కిలిగా జైళ్ళలో మగ్గిపోతున్నారు. అసంఖ్యాకంగా బాధితులు న్యాయం కోసం ఏళ్ళ తరబడి నిరీక్షిస్తున్నారు. లక్షల కొద్దీ కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేర న్యాయవ్యవస్థలో సంస్కరణలు అత్యవసరం. అయితే, అందుకు గడచిన మోదీ సర్కార్ హడావిడిగా అనుసరించిన పద్ధతి, తగిన చర్చకు తావివ్వకుండా పార్లమెంట్‌లో చూపిన ఆధిపత్యం, చేసిన మంచి సూచనల్నీ – చెప్పిన అభ్యంతరాలను సైతం పట్టించుకోని తెంపరితనంతోనే అసలు చిక్కంతా! అసలు 2020 జూలైలోనే కేంద్ర హోమ్ శాఖ ఏర్పాటు చేసిన నిపుణుల సంఘం వైవాహిక అత్యాచారం మొదలు కారుణ్య మరణాన్ని చట్టబద్ధం చేయడం, రాజద్రోహ నేరంపై పునస్సమీక్ష లాంటి అనేక అంశాలపై పౌరులకు వివరమైన ప్రశ్నావళిని జారీ చేసింది. అయితే, కరోనా కాలంలోనే సంప్రతింపుల ప్రక్రియలో అధిక భాగం జరిగింది. అడిగిన, ఆశించిన భారీ మార్పులేమీ లేకుండానే కొత్త చట్టాలు వచ్చేశాయి.

ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ఏకంగా 14 రోజుల పాటు పోలీసు అధికారి ప్రాథమిక దర్యాప్తు చేయవచ్చనడం, పోలీసు కస్టడీ కాలవ్యవధిని 15 రోజుల నుంచి అనేక వారాలు పెంచేయడం, చేతులకు బేడీలు సహా కొన్ని అంశాల్లో పోలీసులకు అపరిమిత అధికారాలు కట్టబెట్టడం లాంటివి ఇప్పటికే వివాదాస్పదమయ్యాయి. అలాగని కొత్త చట్టాల్లో ఏ మంచీ లేదనలేం. కొన్ని ముందడుగులు పడ్డాయి. కొన్ని రకాల నేరాల్లో శిక్షకు ప్రత్యామ్నాయంగా సామాజిక సేవ చేయడాన్ని ప్రవేశపెట్టారు. అలాగే, వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణలకూ వీలు కల్పించారు. త్వరితగతిన విచారణలు పూర్తయ్యేలా నిర్ణీత కాలవ్యవధులను నిర్ణయించడం మరో మంచి ప్రయత్నం. అయితే, చట్టాలకు అన్ని ప్రాంతాలకు అర్థమయ్యే ఇంగ్లీష్ పేర్లు పెట్టనే లేదు. ప్రాంతీయ భాషల్లో అనువాదం పూర్తి కానేలేదు. రాష్ట్రాలు స్థానికంగా అవసరమైన మార్పులు చేసుకోవచ్చంటున్నా, చిక్కులున్నాయి.

ఏమైనా, కొత్త చట్టాల అమలు సైతం సవాలే. దశాబ్దాలుగా అలవాటైపోయిన సెక్షన్లు, చట్టాలను ఒక్కసారిగా మార్చేయడం ఇతర సమస్యలు తెచ్చింది. ఏ నేరానికి ఏ సెక్షన్ ఎంతమేరకు వర్తిస్తుందో ఇప్పటికిప్పుడు చటుక్కున అర్థం కాని పరిస్థితి. పోలీసు, న్యాయ వ్యవస్థలు కొత్త పద్ధతులకు ఏ మేరకు సుశిక్షితమైనదీ చెప్పలేం. అన్నీ అర్థమై, అలవాటయ్యే వరకు చట్టాల అమలు సంస్థలు, జడ్జీలు, లాయర్ల నుంచి కక్షిదారుల వరకు అందరికీ గందరగోళమే. అలాగే జూలై 1కి ముందు కేసులను పాత చట్టాలతో, ఆ తరువాతి కేసులను కొత్త చట్టాలతో విచారించాల్సి ఉంటుంది. ఇప్పటికీ లక్షల కొద్దీ పాత కేసులు పెండింగ్‌లో ఉన్నందున చాలాకాలం రెండు రకాల చట్టాలనూ అనుసరించాల్సి వస్తుంది. ఇది మరో పెద్ద చిక్కు. అలాగే, ఏ చట్టాలైనా వ్యక్తిగత స్వేచ్ఛ, పౌరహక్కులకు అండగా నిలిస్తేనే వాటికి విలువ. కొత్త చట్టాలపై ఆ విషయంలోనూ అనేక అనుమానాలున్నాయి. కాబట్టి వీటిపై పార్లమెంట్‌లోనే కాదు... పౌర సమాజంలోనూ విస్తృత చర్చ జరగనివ్వాలి. ఆ స్వరాలకు పాలకులు చెవి ఒగ్గాలి. లోపాలను సరిచేయాలి. వ్యవస్థలో సంస్కరణ ఒక్కరోజులో, ఒక్కసారిగా జరిగేది కాదని గుర్తించి, మార్పులు చేర్పులతో సాగాలి. అందుకిది మొదటి అడుగు అవ్వాలి.

పరిశోధనల్లో చైనాతో పోటీ పడగలమా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మక జర్నల్స్ అయిన 'నేచర్', 'ఎకనమిస్ట్'లు శాస్త్రరంగంలో చైనా అత్యంత శక్తిమంతంగా ఎదుగుతోందని ప్రకటించాయి. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో మూడో అతిపెద్ద శక్తిగా భారత్ కొనసాగిన విషయం తెలిసిందే. అణు, అంతరిక్ష, వ్యాక్సిన్ అభివృద్ధి రంగాల్లో భారత్ రాణించిందన్నదీ వాస్తవమే. కానీ చైనా పలు కీలక రంగాల్లో భారత్‌తోపాటు అమెరికా, యూరప్‌లను సైతం అధిగమించింది. అంతరిక్ష రంగంలో చైనా మన కన్నా కనీసం పదేళ్లు ముందుంది. 2003లో తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర జరపడమే కాదు, సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తోంది. ప్రపంచ టాప్–10 జాబితాలో భారతీయ పరిశోధన సంస్థలు లేవన్నది గమనార్హం. నిద్రాణంగా ఉన్న భారత్‌కు చైనా పురోగతి ఓ మేలుకొలుపు కావాలి.

ఉన్నత విద్యా రంగంలో భారత్ గతంలో ఎన్నడూ లేని స్థాయి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వైద్యం, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న పరీక్షల పద్ధతి, ప్రామాణికత రెండూ లీకేజీల పుణ్యమా అని ప్రశ్నార్థకంగా మారాయి. నీట్‌తోపాటు భారతీయ విశ్వవిద్యాలయాల్లో, జాతీయ పరిశోధన సంస్థల్లో రీసెర్చ్ ఫెలోషిప్ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రం కూడా లీక్ అయ్యింది. పరిశోధన రంగంలో ప్రాథమిక స్థాయిలో చేరే విద్యార్థుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, ఐఐటీల వంటి సంస్థలు కూడా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌పై ఆధారపడుతూంటాయి. పీహెచ్‌డీల్లో ప్రవేశానికి ఈ పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి. బోధన వృత్తుల్లో స్థిరపడే వారికి కూడా. ఈ పరీక్షలను విశ్వసనీయతతో, సకాలంలో నిర్వహించడం భారతదేశ ఉన్నత విద్య, పరిశోధన రంగాలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒకపక్క ఈ అనూహ్య పరిస్థితిని ఎదుర్కొంటుండగా, ఇంకోపక్క అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన రంగంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పుల్లో చైనా కంటే భారత్ బాగా వెనుకబడిపోతూండటం గమనార్హం.



పరిశోధన పత్రాల్లో టాప్

ప్రపంచంలో ఒక దేశపు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల సత్తాను నిర్ధారించేది ఉన్నత విద్య, పరిశోధన రంగాల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాల విస్తృతి ఎంత? అన్నది. ఎంత ఉత్పత్తి అవుతోంది? నాణ్యత ఏమిటి? అన్నది నిర్ధారించేందుకు చాలా మార్గాలున్నాయి. పరిశోధన వ్యాసాల ప్రచురణ, సాధించిన పేటెంట్లు, నోబెల్ వంటి అంతర్జాతీయ అవార్డులు, పారిశ్రామిక రంగానికి బదిలీ అయిన టెక్నాలజీలు, పరిశోధనల ద్వారా సమాజానికి ఒనగూరిన లబ్ధి... ఇలా చాలా మార్గాలున్నాయి. పరిశోధన పత్రాల ప్రచురణే ప్రధాన అంశంగా ఏటా రీసెర్చ్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న వారి జాబితాను 'నేచర్' జర్నల్ ప్రచురిస్తుంటుంది. ఈ జాబితాలో అత్యున్నత స్థాయి పరిశోధన ఫలితాల ఆధారంగా 500 సంస్థలు ఉంటాయి. ఏటా జనవరి 1 నుంచి డిసెంబరు 31 మధ్య పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటారు. మొత్తం 145 అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమైన పరిశోధన పత్రాలను పరిశీలించి, ఒక స్వతంత్ర శాస్త్రవేత్తల బృందం ఈ జాబితాను సిద్ధం చేస్తుంది.

నేచర్ ప్రచురించిన తాజా జాబితాలో దేశాల పరిశోధన సామర్థ్యాల ఆధారంగా అమెరికా, జర్మనీ, యూకే, జపాన్, ఫ్రాన్స్, కెనడా, దక్షిణ కొరియాలను కూడా అధిగమించి చైనా అగ్రస్థానంలోకి చేరింది. భారత్ తొమ్మిదో స్థానంలో ఉంటూ... టాప్ 10 దేశాల్లో ఒకటిగా ఉన్నామన్న సంతృప్తి మాత్రమే మనకు మిగిల్చింది. భారత్ వంతు గత ఏడాది చైనా వంతు కంటే ఎక్కువ కావడం కూడా గమనార్హం. అయితే సంస్థల స్థాయిలో పరిశోధన పత్రాలను పరిశీలిస్తే నిరాశే మిగులుతుంది. అంతర్జాతీయంగా టాప్ పది పరిశోధన సంస్థల్లో ఏడు చైనావి కావడం... హార్వర్డ్ (రెండో స్థానం), మ్యాక్స్ ప్లాంక్ సొసైటీ (మూడో స్థానం), ఫ్రెంచ్ నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ రీసెర్చ్ (ఏడో స్థానం) మాత్రమే టాప్ 10లోని ఇతర సంస్థలు కావడం గమనార్హం. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలు సైతం 14, 15 స్థానాల్లో నిలిచాయి. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అగ్రస్థానంలో ఉంది.

టాప్–10లో లేము!

టాప్ సంస్థల్లో భారతీయ పరిశోధన సంస్థలు చాలా దిగువన ఉన్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ 174వ స్థానంలో ఉంటే, ఐఐటీ–బాంబే 247లో ఉంది. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ 275లో, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ 283వ స్థానంలోనూ ఉన్నాయి. హోమీ భాభా నేషనల్ ఇన్‌స్టిట్యూట్(296), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్–కోల్‌కతా (321), ఐఐటీ–గౌహతి (355), ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్(363), ఐసర్–భోపాల్(379), ఐఐటీ–కాన్పూర్(405), ఐఐటీ–మద్రాస్(407), ఐఐటీ–ఢిల్లీ (428), ఐసర్–పుణె (439), జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్(450), అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నొవేటివ్ రీసెర్చ్(487) ర్యాంకింగ్ కూడా దిగువలోనే ఉండటం గమనార్హం.

ర్యాంకింగ్‌ల మాట ఇలా ఉంటే, పరిశోధనలు చేస్తున్న రంగాల విషయం చూద్దాం. భౌతిక, రసాయన, భూ, పర్యావరణ రంగాల్లో చైనా అగ్రస్థానంలో ఉండగా... అమెరికా, యూరప్ రెండూ జీవ, వైద్య శాస్త్రాల్లో ముందంజలో ఉన్నాయి. అప్లైడ్ సైన్సెస్ రంగంలోనూ చైనా నుంచే అత్యధిక పరిశోధన పత్రాలు ప్రచురితమవుతుండటం విశేషం.

చైనా కొన్ని భారీ సైన్స్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు కూడా పెట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్డ్–అపెర్చర్ రేడియో టెలిస్కోపు అలాంటిదే. కృష్ణ పదార్థం ఉనికిని గుర్తించేందుకు చేపట్టిన భారీ భూగర్భ పరిశోధన ఇంకోటి. అలాగే క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలోనూ పలు చైనా సంస్థల్లో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. అంతరిక్ష రంగం విషయానికి వస్తే... చైనా మన దేశం కంటే కనీసం పదేళ్లు ముందుందని చెప్పాలి. 2003లో తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర జరపడమే కాదు, సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవలే జాబిల్లి నుంచి రాతి నమూనాలను విజయవంతంగా వెనక్కు తెచ్చిన రోబోటిక్ మిషన్ చేపట్టింది.

మన స్పందన ఎలా ఉండాలి?

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో చైనా పురోగతికి మనం ఎలా స్పందించాలి? పదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం చేస్తున్నట్లే వీటిని తిరస్కరించడం సులువైన పని అవుతుంది. జాబితా తయారీలో పలు లోటుపాట్లు ఉన్నాయని చెప్పవచ్చు. అయితే ఇది వాస్తవ పరిస్థితిని మార్చదు. ఇంకో పద్ధతి కూడా ఉంది. ఈ జాబితాను ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించడం. టాప్ దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది కాబట్టి, దాని ఆధారంగా మరింత ముందుకు వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. చైనా ఈ ఘనతలన్నీ సాధించేందుకు ఏం చేసింది? ఎక్కడ తప్పటడుగులు వేసిందన్నది నిజాయితీగా పరిశీలించి గుణపాఠాలు నేర్చుకోవాలి. 'నైన్ లీగ్' లేదా 'ప్రాజెక్ట్ 211'లో భాగంగా దేశవ్యాప్తంగా యూనివర్సిటీలు, ప్రపంచస్థాయి పరిశోధన శాలలను అభివృద్ధి చేసేందుకు చైనా భారీగా నిధులు ఖర్చు పెడుతోంది. ఐసర్ వంటి సంస్థల అభివృద్ధికి భారత్ చేసిన ప్రయత్నంతో ఎన్నో లాభాలు వచ్చినా ఈ విషయంలో చేయాల్సింది ఇంకా మిగిలే ఉంది. పరిశోధన పత్రాల ప్రచురణకు చైనా నగదు బహుమతులను ప్రకటించి తప్పు చేసిందని చెప్పాలి. దీనివల్ల అనైతిక పద్ధతులు పెరిగిపోయాయి. భారత్ ఇలాంటి పని చేయకుండా ఉండటం అవసరం.

భారత్‌లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో పురోగతిని అడ్డుకుంటున్న కొన్ని సాధారణ విషయాల్లో జీడీపీలో కొంత శాతాన్ని ఈ రంగాలకు కేటాయించకపోవడం కూడా ఉంది. నిధుల పంపిణీ పద్ధతులు, కొత్త పరిశోధన సంస్థల ఏర్పాటు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రోత్సాహం వంటివి స్తంభించిపోయి ఉన్నాయి. నేషనల్ సైన్స్ అకాడమీలు, ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, టెక్నాలజీ ఫోర్‌కాస్టింగ్ ఏజెన్సీ వంటివి కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సెల్ఫీ పాయింట్ల వద్ద విజయోత్సవాలను నిర్వహించడంలో బిజీగా ఉండిపోయాయి. నిద్రాణంగా ఉన్న ఇలాంటి వారందరికీ చైనా పురోగతి ఓ మేలుకొలుపు కావాలి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ద్వేషిస్తున్నారా?



హిందువు నా శత్రువు కాదు. హిందువుల్లోని ఛాందసులను ఎదుర్కొనే నైతిక అధికారం నాకు ఎప్పుడు వస్తుందంటే, ముందు నా సమాజంలోని ఛాందసులకు వ్యతిరేకంగా నేను నిలబడినప్పుడు. నిజంగా వంద కోట్ల మంది హిందువులు ఇరవై కోట్ల మంది ముస్లింలను అణిచివేస్తున్న దేశం ఇండియా అని మీరు గట్టిగా నమ్ముతున్నారంటే, మీరు హిందూ ద్వేషి.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

మాట్లాడినట్టు వినిపించండి!



ఎంపీల ఆంగ్ల ప్రసంగాల ఒరిజినల్ ఆడియోను మ్యూట్ చేస్తూ, వాటిని హిందీలోకి అనువదించి సంసద్ టీవీ ప్రసారం చేస్తోందని గమనించాను. ఈ కొత్త పద్ధతి సమస్యాత్మకం. అది ఎంపీల గొంతును అణిచివేస్తుంది. ఎన్నికైన సభ్యులు తాము ఎంచుకున్న భాషల్లో వినిపించే హక్కును నిరాకరిస్తుంది. ఇది నిరంకుశత్వం.

– సుప్రియా సూలే, ఎన్సీపీ ఎంపీ

అమెరికా రాజు



ఒకవేళ ట్రంప్ (మళ్లీ అమెరికా అధ్యక్షుడిగా) గెలిస్తే, ఆయన్ని మీరు 'కింగ్ ట్రంప్ 1' అని పిలవొచ్చు. ఆయనకు అది నచ్చుతుంది.

– స్టీఫెన్ కింగ్, రచయిత

అన్నది వేరు!



ఇది అసాధారణమే కావొచ్చు గానీ, నేను రాహుల్ గాంధీ వైపు నిలబడక తప్పడం లేదు. ఆయన హిందూయిజం మీద దాడి చేయలేదు. యావత్ హిందూయిజానికి కేవలం బీజేపీ, ఆరెస్సెస్, నరేంద్ర మోదీలే ప్రతినిధులు కారు... కాలేరు అన్నారు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్



మనవి కావు!

జీవిత పాఠాలు: ఇతరుల ఫైఫల్యాలు మీ విజయాలు కాదు... అలాగే ఇతరుల విజయాలు మీ ఫైఫల్యాలు కూడా కాదు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

నిర్వహణను పునస్సమీక్షించాలి

వైద్య విద్యను అభ్యసించాలని లక్షలాదిమంది విద్యార్థులు దేశవ్యాప్తంగా రాసిన 'నీట్' పరీక్ష నిర్వహణలో అనేక అవకతవకలు జరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర వేదనలో మునిగిపోయారు. అసలు దేశం మొత్తానికీ ఒకే ప్రవేశపరీక్ష పెట్టడమనే విధానమే తప్పని ఈ సందర్భంగా విమర్శలు వస్తున్నాయి.

మొదటిసారిగా 2010లో భారతీయ వైద్య మండలి 'నీట్' పరీక్షకు ప్రకటన విడుదల చేసింది. కానీ ఈ పరీక్ష నిర్వహణ సరికాదని న్యాయస్థానం అడ్డుకుంది. దీంతో భారతీయ వైద్య మండలి చట్టం– 1956లో మార్పులు చేసి, 'సెక్షన్ 10 ఈ' ద్వారా 'నీట్' పరీక్ష నిర్వహించటానికి వైద్య మండలికి సర్వ హక్కులు కల్పించింది నాటి ఎన్డీఏ ప్రభుత్వం. తత్ఫలితంగా 2016 నుండి పరీక్షను నిర్వహిస్తూ వస్తున్నారు. 2016లో ఈ మార్పును వ్యతిరేకిస్తూ వేసిన కేసును కొట్టి వేయటమే కాక, రాష్ట్ర ప్రభుత్వాలు నీట్‌కు ప్రత్యామ్నాయంగా తాము పరీక్షలు నిర్వహిస్తామంటే కుదరదు అన్నది న్యాయస్థానం. 2020లో మైనారిటీ సంస్థల గోడు కూడా వినకుండా కోర్టు నీట్ నిర్వహణను గట్టిగా సమర్థించింది.

నీట్ పరీక్ష నిర్వహణ వల్ల లాభాలు లేకపోలేదు. అప్పటి దాకా రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు విశ్వ విద్యాలయాలు తమ సొంత ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థులకు వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తూ వచ్చాయి. అనేక పరీక్షలు రాయలేక విదార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు కూడా పాల్పడిన సందర్భాలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ఒకే పరీక్ష వల్ల ఈ ఒత్తిడి తగ్గింది. కాని పొరపాటున ఈ పరీక్ష రాయలేక పోతే విద్యార్థి ఒక విద్యా సంవత్సరం అంతా నష్ట పోవలసిందే. అదే విధంగా విద్యార్థికి ఇష్టమైన కాలేజీలలో ప్రవేశం పొందలేక పోవచ్చు. రెండు మూడు పరీక్షలుంటే, తనకిష్టమైన కాలేజీలో చేరే అవకాశం ఉండేది. అందుకే ఇటువంటి దేశ వ్యాప్త ఏక పరీక్షలపై విస్తృత స్థాయిలో మేధామథనం జరగాలని అంటున్నారు. ఒకే ఒక్క పరీక్ష ద్వారా విద్యార్థి యోగ్యుడా కాదా అనేది నిర్ణయించటం సరైనదేనా? వందల కోట్ల జనాభా ఉన్న భారత దేశం లాంటి దేశంలో ఇంతకన్నా మార్గం లేదని వాదించే వారున్నారు. కోర్టులు, ప్రభుత్వాలు సైతం అర్హత కలవారిని ఎంపిక చెయ్యటానికి 'నీట్' పరీక్ష ఉత్తమ పద్ధతి అని అనుకుంటున్నాయి.

నిజానికి నీట్ పరీక్ష నిర్వహణ వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా నష్ట పోతున్నారు. ఇంగ్లీషు మీడియంలో చదివిన విద్యార్థులదే నీట్‌లో పైచేయిగా ఉంటోంది. సీట్లు పొందడంలో వీరి శాతం 85.12 శాతం నుండి 95.01 శాతానికి పెరగగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి సంఖ్య 1.2 శాతం నుండి 0.6 శాతానికి పడిపోయింది. పేద, దిగువ మధ్యతరగతి వర్గాలవారు 47.42 శాతం నుండి 41.05 శాతానికి పడిపోగా, గ్రామీణ ప్రాంత విద్యార్థులు 61.4 శాతం నుండి 50.8 శాతానికి పడిపోయారు.

ఇన్ని లోపాలు, నష్టాలను దృష్టిలో పెట్టుకొని... మరొక్క సారి నీట్ పరీక్ష నిర్వహణ సబబేనా అన్న అంశంపై విస్తృత స్థాయిలో చర్చించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

– ఈదర శ్రీనివాసరెడ్డి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

తస్సాదియ్యా... మన రోశయ్య!



రేపు రోశయ్య జయంతి

విషయ పరిజ్ఞానం, లెక్కలు, తేదీలు, చమత్కారం, సమయ స్ఫూర్తి, ముక్కుసూటిగా ప్రవాహ వేగంతో మాట్లాడే లక్షణం, స్పష్టమైన ఉచ్చారణ, గంభీరమైన కంఠస్వరం వంటి లక్షణాలు మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ కొణిజేటి రోశయ్యకు ఓ ప్రత్యేకతను సంతరించిపెట్టాయి. శాసన సభలోనూ, బయటా ఆయన మాట్లాడిన ప్రతిమాటా ఒక చెణుకే.

ఓసారి రోశయ్య అల్లుడు ఒక విందులో తన మిత్రులతో ఎంజాయ్ చేస్తూ టీవీ ఛానెళ్లకు చిక్కారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో టీడీపీ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. సభలో ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ మూకుమ్మడిగా ఉత్సాహంతో రెచ్చిపోయారు. చివరగా రోశయ్య తాపీగా నిలబడ్డారు. 'అధ్యక్షా... ఎన్టీ రామారావు గారికీ, నాకూ దేవుడు మంచి అల్లుళ్ళనివ్వలేదు. ఏంచేస్తాం అధ్యక్షా' అనేసి ఠక్కున కూర్చున్నారు. పాపం... తెలుగు తమ్ముళ్లు నవ్వలేరు, నవ్వకుండా ఉండలేరు. ఇక చంద్రబాబు పరిస్థితి సరే సరి! మిగతా సభ్యుల నవ్వులతో ఆనాటి సభ వెల్లివిరిసింది.

మరోసారి సభలో చంద్రబాబు ఆరోపణలపై ప్రతిస్పందిస్తూ ... 'అధ్యక్షా... స్వర్గీయ ఎన్టీ రామారావు గారిని నేను డ్రామా కంపెనీవాడు అనలేదు. ముందు ఆయన డ్రామాలు వేశాడు. తరవాత సినిమాల్లోకి వెళ్లి ప్రముఖ నటుడయ్యాడు అన్నానంతే. మీరు (చంద్రబాబును ఉద్దేశించి) ఒకప్పుడు ఆయన్ను గౌరవించారు. మధ్యలో పోయింది. తర్వాత మళ్ళీ వచ్చింది... సరే, నన్ను తెలివితేటలు గలవాణ్ణని అన్నారు. నేను తెలివితేటలు గలవాణ్ణయితే ఇలా ఉంటానా? ఒంటరిగా ఉన్నప్పుడెప్పుడో అదను చూసి రాజశేఖర రెడ్డిని ఒక్కపోటు పొడిచి ఆ సీట్లో కూర్చునేవాడిని...' అన్నారు. అంతే... చంద్రబాబు, ఆ పార్టీ సభ్యులు కిక్కురుమంటే ఒట్టు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఇష్టమైన ఓ చెణుకు గురించి ఉండవల్లి అరుణ్ కుమార్ ఇలా చెప్పారు: ''రోశయ్య ఓసారి రాజమండ్రిలో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టినప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఓవర్ డ్రాఫ్టులకు వెళ్లడంపై మాట్లాడుతూ, ఇది రాష్ట్రానికి మంచిది కాదు–అప్పుల ఊబిలోకి పోతాం అన్నారు... సరే విలేకర్లు తర్వాత ఆయన మాటల్ని మరో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఫైనాన్స్ మినిస్టర్ (యనమల రామకృష్ణుడు)తో అని, దీనికేమంటారు? అని అడిగారు. అందుకాయన మేమేమైనా తప్పు చేస్తున్నామా, ఫెసిలిటీ ఉంది, వాడుకుంటున్నాం. దాని కెందుకింత గొడవ? అన్నారు. ఈ సంగతి ఇంకో ప్రెస్ కాన్ఫరెన్సులో రోశయ్యతో చెప్పి, దీనిపై మీరేమంటారు? అని అడిగారు. దీనికి రోశయ్య 'చూడు నాయనా... ప్రతి ఊరికీ శ్మశానం ఫెసిలిటీ ఉంటుంది. ఉంది కదాని వాడుకోం కదా, జీవుడు పోయిన తర్వాతే అక్కడికి పట్టుకెళ్ళేది' అని జవాబిచ్చారు.


చెణుకులు విసరడమే కాదు అణకువలోనూ, అందరితో కలివిడిగా ఉండడంలోనూ ఆయన పెట్టింది పేరు. ముఖ్యమంత్రి పదవినుంచి వైదొలగుతూ తన పేషీలో సెక్రెటరీ, పీ.ఏ, ఇతర ఉద్యోగులందరి సీట్ల దగ్గరకూ వెళ్లి 'నా టెర్మ్ అయిపోయింది. కృతజ్ఞతలు. నా వల్ల ఏమైనా ఇబ్బందిపడి ఉంటే ఏమీ అనుకోకండి' అని వినమ్రంగా చెప్పారు రోశయ్య.

శాసన మండలి సభ్యునిగా ఎన్టీఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి, మండలి రద్దు చెయ్యాలని నిర్ణయం తీసుకునేలా చేశాడని నాటి విశ్లేషకులు అంటుంటారు. రోశయ్య ఏ పదవి చేపట్టినా ఉద్యోగంలా భావించారు. అసంతృప్తిగా పని చేయడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. అవినీతి మచ్చ లేని నిలువెత్తు నిజాయితీ ఆయన. ప్రత్యర్థులు సైతం ఒప్పుకునే సత్యమిది. రాజకీయాల్లో ఆయన స్థానం ఎప్పటికీ భర్తీ చేయలేనిది.

– తిరుమలగిరి సురేందర్,
ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్

నిరుపమాన దీక్షాశక్తి

భారతీయ సంస్కృతిని, దేశభక్తిని, జాతీయ భావాన్ని ప్రతి ఎదలో ప్రతిధ్వనించేట్లు, ప్రతి నిత్యం స్మరించేట్లు ప్రచారం చేసి యావత్ జాతినంతా మేల్కొలిపిన మహనీయుడు స్వామి వివేకానందుడు. ఆయన గొప్ప ఉపన్యాసకుడు. ఆయన్ని ఆ రోజులలో 'లైట్నింగ్ ఆరేటర్' అని పిలిచేవారు. 1893 సెప్టెంబర్‌లో అమెరికాలోని చికాగోలో జరిగిన మహాసభల్లో ఆయన చేసిన ప్రసంగం ఈ రోజుకూ ప్రపంచ దేశాలంతటా ప్రతిధ్వనిస్తూనే ఉంది. నాలుగు సంవత్సరాల పాటు అమెరికా, ఐరోపా ఖండాలలో పర్యటించి, అద్భుతంగా ఉపన్యాసాలు ఇచ్చి, వేదాంత కేంద్రాలు నెలకొల్పి, అనేకులను శిష్యులుగా స్వీకరించి 1897లో స్వదేశానికి తిరిగి వచ్చి 'రామకృష్ణ మిషన్' స్థాపించారు.



వివేకానందుని ప్రసంగాలు యుగయుగాలకు స్ఫూర్తిదాయకం. ఆయన ఓ ప్రచార కర్త కాదు, ఓ మతం. ప్రతి మనిషి ఆత్మలో దైవత్వాన్ని చూడడం ఆ మత సూత్రం. పేదవాడి సేవే భగవంతుని సేవ అని చాటి చెప్పిన యుగకర్త. భారతదేశం మళ్లీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యుడాయన. 1863 జనవరి 12న కలకత్తాలో జన్మించిన వివేకానందుని తొలినామం నరేంద్రుడు. ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలను కలిగిన ఆయన చివరికి అత్యున్నతమైన అద్వైత స్థితి కూడా పొందారు. దక్షిణేశ్వరంలోని రామకృష్ణ పరమహంసతో పరిచయమేర్పడిన అనతి కాలంలోనే నరేంద్రుడు ఆయనకు ముఖ్య శిష్యులయ్యారు. ఆయన మనోహర గాన మాధుర్యం రామకృష్ణుని ఆనందసాగరంలో ముంచెత్తేది. 1886లో పరమహంస నిర్యాణం అనంతరం నరేంద్రుడు పరివ్రాజకునిగా యావత్ భారత పర్యటన చేశారు. వివేకానందనామం స్వీకరించారు. దేశ సముద్ధరణకు, భారతజాతి పునరుజ్జీవనానికి అహర్నిశలు తపించారు.

'బలమే జీవనం బలహీనతే మరణం' అనే వివేకానంద ప్రవచనం జగద్విఖ్యాతం. 'దేశంలో పస్తున్న ప్రతి ప్రాణికీ ఆహారం పెట్టి రక్షించటమే పరమధర్మం. ఇదే నా మతం. తద్భిన్నమంతా ఆదర్శమే, కృత్రిమ ధర్మమే. నిరుపేదయైన సోదర భారతీయునీ, నా ఇష్టదేవతలనూ అర్చించటానికి ఎన్ని జన్మలైనా ఎత్తగలను, ఎన్ని బాధలైనా ఓరుస్తాను' అని ప్రకటించారాయన.

1902 జూలై 4న తన 39వ ఏట బేలూరు మఠంలో ఆయన తనువు చాలించారు. అన్నదాన, విద్యాదాన, జ్ఞానదానాల రూపంలో ప్రజాసేవ చేస్తూ యావద్భారతంలోనే కాకుండా ప్రపంచమంతటా ప్రఖ్యాతి వహించిన శ్రీ రామకృష్ణ మఠసేవా సంఘాలను స్థాపించిన ఘనత వివేకానందుడికే దక్కుతుంది. గొప్ప దేశభక్తుడు. ఆయన యువతరాన్ని ప్రేరేపించిన మహాశక్తి. మానవునిలో లోపాలు వివరిస్తూ 'మనం పని చేయం, చేసే వారిని చేయనీయం, వారిని విమర్శించి తప్పులెంచి అవహేళన చేస్తాం. మానవ జాతి పతనానికి ముఖ్యమైనదీ లక్షణమే' అన్నారు. దైవ విశ్వాసం కంటె మానవ విశ్వాసం ముఖ్యమనీ... దేశ ప్రజలందరికీ ఆత్మవిశ్వాసం, క్రియా శూరత్వం అవసరం తనకు స్పష్టంగా కనిపిస్తున్నదనీ చెప్పారు.

– నందిరాజు రాధాకృష్ణ; సీనియర్ జర్నలిస్ట్ | 98481 28215

(రేపు స్వామి వివేకానంద వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం; **తిథి:** బ.ద్వాదశి ఉ.7.07 వరకు, తదుపరి త్రయోదశి; **నక్షత్రం:** రోహిణి తె.4.28 వరకు (తెల్లవారితే గురువారం); తదుపరి మృగశిర; **వర్జ్యం:** రా.8.51 నుండి 9.24 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.11.38 నుండి 12.31 వరకు; **అమృత ఘడియలు:** రా.1.32 నుండి 3.36 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు; **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **సూర్యోదయం:** 5.33; **సూర్యాస్తమయం:** 6.34

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ ఐదుగురు మావోయిస్టుల మృతి

ఇంకా కొనసాగుతున్న ఎదురుకాల్పులు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. నారాయణపూర్ జిల్లాలోని కోకామేట పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో జూన్ 30 నుంచి భద్రతా దళాలు కూంబింగ్ చేపట్టాయి. మంగళవారం మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో పరస్పరం తారసపడటంతో ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. మృతుల సంఖ్య ఎక్కువగా ఉండవచ్చని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. మంగళవారం రాత్రి వరకు కూడా రెండు వైపుల నుంచి కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. పోలీసులు, భద్రతా దళాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని తెలుస్తోంది. తాజా ఘటనతో ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది భద్రతా దళాలతో ఎన్‌కౌంటర్లలో మరణించిన మావోయిస్టుల సంఖ్య 138కి చేరింది.

ఈడీ ఎదుట హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

స్టేట్‌మెంట్ రికార్డు చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: మైనింగ్ కుంభకోణంపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల ఎదుట హాజరయ్యారు. రూ.300 కోట్ల అక్రమ మైనింగ్ ఆపరేషన్‌కు సంబంధించి మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లలో ఇటీవల ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈడీ అధికారుల సూచనల మేరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఈడీ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. అధికారులు అడిగిన పలు పత్రాలను ఆయన సమర్పించారు. అనంతరం బయటికి వచ్చిన ఆయన, ఈడీ అధికారులు తన స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్టు వెల్లడించారు. మీడియా ప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు నిరాకరించారు. కాగా, ఈ ఏడాది జూన్ 20న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేసిన విషయం తెలిసిందే. అక్రమ మైనింగ్ ద్వారా రూ. 300 కోట్లు కూడబెట్టారని, రాయల్టీ రూపంలో చెల్లించాల్సిన మరో రూ. 39.08 కోట్లను ప్రభుత్వానికి ఎగవేసినట్లు ఈడీ అధికారులు సోదాల అనంతరం వెల్లడించారు. ఎమ్మెల్యే ఆయన సోదరుడు యజమానులుగా ఉన్న సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థ అక్రమ మైనింగ్ వ్యవహారంపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది.

ఆ రెండు గంటల్లో ఏం జరిగింది?

- రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడా.. ఎవరైనా ప్రేరేపించారా ?
- అసలేం జరిగిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరా
- ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులకు ఆదేశం
- రెవెన్యూ, పోలీస్ అధికారుల నుంచి సమాచార సేకరణ



చింతకాని మండలం ప్రొద్దుటూరులో ప్రభాకర్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/చింతకాని/హైదరాబాద్ : ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్(45) సోమవారం భూవివాదంలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకోగా, ఈ ఘటనపై పలు అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన స్వతహాగా నిర్ణయం తీసుకున్నారా.. ఎవరైనా ఆత్మహత్యకు ప్రేరేపించిరా అనే దానిపై స్పష్టత రావడం లేదు. ఆయన చెబుతున్న మాటలను గుర్తు తెలియని వ్యక్తులు వీడియో తీయడంతో పురుగుల మందు తాగిన సమయాన వారు అక్కడే ఉన్నారని భావిస్తున్నారు. ప్రభాకర్ ఆత్మహత్య ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. మరోవైపు మంత్రి తుమ్మల కూడా తీవ్రంగా స్పందించారు. ఆత్మహత్య ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విచారణ జరిపి తక్షణమే ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. దీంతో అధికారులు నివేదిక సమర్పించినట్టు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే, ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి కూడా చింతకాని తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వివరాలు ఆరా తీయడమే కాక ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే వరకు స్థానిక అధికారులు ఏం చేశారని ప్రశ్నించినట్టు సమాచారం.

వీడియో తీసి... వాట్సాప్ గ్రూపులో పెట్టి

కలెక్టరేట్ వద్ద ప్రభాకర్ తన తండ్రిని వెళ్లిపోవాలని సూచించారు. ఆ తర్వాత గ్రామానికి చెందిన ఇద్దరు ప్రభాకర్‌ను బయటకు తీసుకెళ్లి పురుగుల మందు డబ్బా పట్టుకొని ఎలా మాట్లాడాలో రిహార్సల్ చేయించాక, ఆయన వివరిస్తుండగా వీడియో తీసినట్టు తెలిసింది. సోమవారం మధ్యాహ్నం సుమారు 3.39 గంటలకు తీసిన వీడియోను సాయంత్రం 5.40 గంటలకు వాట్సాప్ గ్రూప్‌లో పెట్టారు. దీంతో మధ్య రెండు గంటల సమయంలో ఏం జరిగిందో తేలాల్సి ఉంది. అయితే, రైతు ప్రభాకర్ ఆత్మహత్యలో రాజకీయకుట్ర దాగుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభాకర్ తొలుత సమస్యను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులకు విన్నవించాడు. కాంగ్రెస్ నాయకులు అనుకూలంగా మాట్లాడకపోవటంతో బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను అవమాన పరచాలనే ఉద్దేశంతోనే ప్రభాకర్ ఆత్మహత్య చేసుకునేలా కొందరు ప్రేరేపించారని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు వీడియో తీసినట్టు భావిస్తున్న గ్రామానికి చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

విచారణ చేయిస్తున్నాం..

ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను ఈ విషయమై ఆరా తీయగా రైతు బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్యపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తున్నామని తెలిపారు. ఆయన తండ్రి ఫిర్యాదుతో ఇప్పటికే పది మందిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి ఎవరు బాధ్యులుగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం న్యాయం చేయాలనడంతో..

బోజడ్ల ప్రభాకర్ తన తండ్రి పెదవీరయ్యతో కలిసి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చాడు. కలెక్టర్ లేకపోవడం, అంతకు ముందే సమయం అయిపోవడంతో అధికారులు వెళ్లిపోగా సిబ్బందికి ఫిర్యాదు ఇచ్చారు. ఆ తర్వాత ప్రభాకర్ ఓ మామిడితోటలో వీడియోలో పురుగుల మందు డబ్బా చూపిస్తూ మాట్లాడాక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఈ వీడియోలో తనకు న్యాయం చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్లు పేర్కొనడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అంతేకాకుండా వీడియోలో ప్రభాకర్ కన్నీటిపర్యంతమవుతూ తనకు అన్యాయం జరిగిందని చెప్పడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ప్రభాకర్ కలెక్టరేట్‌కు ఎప్పుడు వచ్చాడు, ఆయనతో ఎవరెవరు ఉన్నారు, మండల స్థాయిలో అధికారులను కలిసినా ఎందుకు పరిష్కారం చూపలేదనే అంశంపై ప్రభుత్వం ఆరా తీస్తోంది.

కల్వర్ట్‌ను ఢీకొన్న కారు.. ఐదుగురు దుర్మరణం

అజ్మీర్ దర్గా దర్శించుకొని వస్తుండగా ఘటన



పుణె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రమాదానికి ముందు కారులో మిత్రులు..

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పుణె సమీపంలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు యువకులు మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఆరుగురు యువకులు ఆదివారం అజ్మీర్ దర్గా సందర్శనకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముంబై మీదుగా వస్తున్న క్రమంలో మంగళవారం సాయంత్రం పుణె సమీపంలో వారి కారు కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహబూబ్ ఖురేషి, రఫిక్ ఖురేషి, కంగ్టికి చెందిన ఫిరోజ్ ఖురేషి, సిర్గాపూర్‌కు చెందిన మజీద్ పటేల్, హైదరాబాద్‌కు చెందిన ఫిరోజ్ ఖురేషి అక్కడికక్కడే మరణించారు. మరో యువకుడైన నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌కు చెందిన సయ్యద్ అమర్ తీవ్ర గాయాలపాలై పుణె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ఉన్నారు. వీరందరూ 25 ఏళ్ల లోపువారే.

తండ్రి కోసం వచ్చి..

నారాయణఖేడ్‌కు చెందిన మహబూబ్ ఖురేషి సౌదీ అరేబియాలోని ఓ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. కాగా తండ్రి యాదుల్ ఖురేషి అనారోగ్యంతో ఉండటంతో నెల రోజుల క్రితం తండ్రిని చూసేందుకు ఇక్కడికి వచ్చారు. మిత్రులతో కలిసి విహారయాత్రకు వెళ్లి కారు ప్రమాదానికి గురై అనంత లోకాలకు వెళ్లాడు. కాగా ఖేడ్‌కు చెందిన రఫిక్ ఖురేషికి సిర్గాపూర్‌లో, కంగ్టికి చెందిన ఫిరోజ్‌కు కంగ్టిలో, హైదరాబాద్‌కు చెందిన ఫిరోజ్ ఖురేషి అక్కడే చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తీవ్ర గాయాలపాలైన సయ్యద్ అమర్ డ్రైవింగ్ చేయడంతోపాటు పట్టణంలోని మటన్ దుకాణంలో పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

నా వన్ ప్లస్ ఫోన్ చూడండి

- బంధువులకు ఎస్సై శ్రీనివాస్ మెసేజ్
- వెలుగులోకి సంచలన విషయాలు
- విచారణ చేపట్టిన ఇంటెలిజెన్స్ పోలీసులు

అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ గత ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. మంగళవారం పలు విషయాలు సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. 'నా వన్ ప్లస్ ఫోన్ చూడండి.. అందులో అన్ని వివరాలు ఉన్నాయి' అంటూ ఎస్సై మెసేజ్ పెట్టారనే వార్త చక్కర్లు కొట్టింది. ఉన్నతాధికారుల వేధింపులు, సహచర సిబ్బంది అవమానాలు తాళలేకే తాను పురుగుల మందు తాగానని, ఆ తర్వాత భార్యాబిడ్డలు గుర్తు రావడంతో బతకాలనిపించి 108కు ఫోన్ చేశానని మెజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చినట్టు వీడియోలో వైరల్ అయింది. సీఐ జితేందర్‌రెడ్డి, స్టేషన్ సిబ్బంది అవమానాలకు గురి చేశారని, తనను అవినీతిపరుడిగా ముద్ర వేశారని, ఈ విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా ఆయన స్పందించలేదని వెల్లడించారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి ముందే సర్వీస్ రివాల్వర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్టు తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్సై ఆరోగ్యం విషమంగానే ఉందని, ప్రధాన అవయవాలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపినట్లు సమాచారం.

ఆ ఫోన్ ఎక్కడ ఉంది?

ఎస్సై శ్రీనివాస్ చెబుతున్న వన్ ప్లస్ ఫోన్ ఇప్పుడు ఎక్కడ ఉంది.. ఆత్మహత్యాయత్నం సమయంలో ఫోన్ తన వద్దే ఉంటే దాంట్లో నుంచే అందరికీ ఆధారాలు షేర్ చేయొచ్చు కదా.. అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఫోన్ కుటుంబ సభ్యులకు ఇచ్చారా, ఆత్మహత్యాయత్నం చేసిన ప్రదేశంలో మహబూబాబాద్ పోలీసులకు లేదా 108 సిబ్బందికి లభిస్తే పోలీసులకు అప్పగించారా అనేది ప్రశ్నగానే మిగిలింది. ఏదేమైనా ఆ ఫోన్‌లోని వివరాలు పరిశీలిస్తేనే అసలు వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాగా, ఎస్సై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఇంటెలిజెన్స్ పోలీసులు మంగళవారం అశ్వారావుపేటకు వచ్చి పలు కోణాల్లో విచారణ చేపట్టారు.

చెట్ల పరిరక్షణకు యంత్రాంగం ఉందా?

అలా లేకుంటే మేమే ఏర్పాటు చేస్తాం
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చెట్ల పరిరక్షణకు ఓ యంత్రాంగం ఉందా.. అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు.. అలా లేకుంటే మేమే ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసింది. కర్నాటకలో ప్రత్యేక అధికారులున్నారని, ఆ విధానాన్ని అధ్యయనం చేయాలని సూచించింది. ఈ నెల 4 వరకు సమయం ఇస్తున్నామని, వివరాలు తెలియజేయాలని ఆదేశించింది. 'చెట్లను కూడా అభివృద్ధి చేయాలి. ఆ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ హిమాయత్ సాగర్‌కు చెందిన కె.ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో 2016లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. గతంలో విచారణ చేపట్టిన ధర్మాసనం.. ప్రజల నుంచి సలహాలు, సూచనలు పొందాలని పిటిషనర్ న్యాయవాదికి సూచించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా.. రాష్ట్రంలో చెట్ల పరిరక్షణకు ఓ ప్రత్యేక చట్టం, అధికారులున్నారా అని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌ను ప్రశ్నించింది.

శ్రీరామచంద్ర మిషన్‌కు సాగర్‌లో 5 ఎకరాలు

నీటిపారుదల శాఖకు నల్లగొండ సీఈ సిఫారసు

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకి సంబంధించిన 5 ఎకరాల ఖాళీ స్థలాన్ని ఎకరాకు రూ.10 వేల నామ మాత్రపు వార్షిక రెంట్‌తో శ్రీరామచంద్ర మిషన్‌కు పదేళ్ల లీజుకు కేటాయించాలని నీటిపారుదలశాఖకు ఆ శాఖ నల్లగొండ చీఫ్ ఇంజనీర్ మరోసారి సిఫారసు చేశారు. హార్ట్‌ఫుల్‌నెస్ రిట్రీట్ సెంటర్ యోగా ట్రైనింగ్ అండ్ స్పిరిచువల్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటుకి 5 ఎకరాల స్థలం కోరుతూ శ్రీరామచంద్ర మిషన్ 2023లో దరఖాస్తు చేసుకోగా, ఈ మేరకు సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఈనెల 1న లేఖ రాశారు. గతంలో ఈఎన్‌సీ (జనరల్) నుంచి వచ్చిన సూచనతో ఎకరాకు రూ.10 వేల అద్దె సిఫారసు చేశానన్నారు.

రూ. 8 వేల కోట్లు ఖర్చు చేసినా గత ప్రభుత్వం నీరివ్వలేదు

- మేం వచ్చాక మొదటి లిఫ్ట్ ట్రయల్‌రన్ పూర్తి
- ఆగస్టు 15న ఫస్ట్ ఫేజ్ సీఎంతో ప్రారంభిస్తాం: పొంగులేటి



తిరుమలాయపాలెం మండలం బీరోలు వద్ద సొరంగ మార్గం పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, తదితరులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా తలపెట్టిన రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టు పనులు 50 శాతం పూర్తయితే, ఈ ప్రాజెక్టులను గత ప్రభుత్వం పక్కన పెట్టి సీతారామ ప్రాజెక్టుగా రీడిజైన్ చేసి రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని.. అయినా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో మంగళవారం పర్యటించిన ఆయన తిప్పారెడ్డిగూడెం, దమ్మాయిగూడెం, బీరోలు, పోచారంలో సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అలాగే దమ్మాయిగూడెం నుంచి పోచారం వరకు నిర్మాణం జరుగుతున్న కాలువ, సొరంగం పనులపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. అనంతరం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో పొంగులేటి మీడియాతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టుపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండగా, ఇప్పటికే మొదటి లిఫ్ట్ ట్రయల్‌రన్ పూర్తిచేసి రెండో లిఫ్ట్ ట్రయల్ రన్‌కు సిద్ధమవుతున్నామని తెలిపారు.

మొదటి విడత ఆగస్టు 15న..

సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని మొదటి విడతగా ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయిస్తామని పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుపై ఎక్కడా నీటి నిల్వకు రిజర్వాయర్లు కట్టలేదని, దీంతో 10 టీఎంసీల నుంచి 12 టీఎంసీలు నిల్వ చేసేలా రిజర్వాయర్ నిర్మించాలని తమ ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. కాగా, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. మంత్రి వెంట డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్, నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్లకుండా నామినేషన్ల ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోవడంపై న్యాయ విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో నెల రోజులు పొడిగించింది. కమిషన్ గడువు జూన్ 30తో ముగియగా, జూలై 31 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఇంకా జీవో ప్రతి బయటకు రాలేదు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఇప్పటికే ఆధారాలను సేకరించి ప్రాథమిక విచారణను పూర్తి చేసింది. సాక్షులు సమర్పించిన సాక్ష్యాధారాలపై వివరణ కోరుతూ మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ రాయగా, ఆయన హైకోర్టులో కమిషన్ ఏర్పాటును సవాలు చేస్తూ కేసు వేశారు. కేసీఆర్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసిన నేపథ్యంలో ఆయన కమిషన్ రాసిన లేఖకు సమాధానం ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. అయితే కేసీఆర్ కమిషన్‌కు ఇంకా సమాధానం ఇవ్వలేదని తెలిసింది.

సత్సంగ్‌లో మృత్యుకేళి





ఘటనకు ముందు ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైన భక్తులు ● తొక్కిసలాట అనంతరం బస్సులో బాధితుల మృతదేహాలు ● ఆప్తులను కోల్పోయి రోదిస్తున్న మహిళ

తొక్కిసలాటలో 116 మంది భక్తుల దుర్మరణం

హత్రాస్: అప్పటిదాకా భోలే బాబా ప్రవచనాలు, భక్తుల కీర్తనలు, ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన సత్సంగ్ నిమిషాల వ్యవధిలోనే శోక సముద్రంగా మారిపోయింది. ప్రవచనాలు వినేందుకు వచ్చిన బాబా భక్తులు విగతజీవులయ్యారు. సత్సంగ్ ముగిసిన తర్వాత ఇళ్లకు వెళ్లే తొందరలో జనమంతా టెంట్ నుంచి ఒక్కసారిగా బయటకు రావడంతో తొక్కిసలాట జరిగింది. ఒకరిపై ఒకరు పడిపోయారు. ఊపిరాడక 116 మంది కన్నుమూశారు. మృతుల్లో 108 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్ జిల్లా ఫుల్‌రాయ్ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దేశంలో ఇటీవలి కాలంలో జరిగిన ఘోరమైన సంఘటన ఇదే కావడం గమనార్హం. పలువురు క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 89 మంది ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. మరికొందరు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగింది?

ఉత్తరప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో భక్తులున్న సాకార్ విశ్వ హరి భోలే బాబా ఫుల్‌రాయ్ గ్రామంలో సత్సంగ్ నిర్వహించేందుకు స్థానిక సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి అనుమతి తీసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం భక్తులకు గంటన్నరకు పైగా ఆధ్యాత్మిక బోధ చేశారు. టెంట్ లోపల నిర్వాహకులే ఏర్పాట్లు చేసుకున్నారు. టెంట్ బయట స్థానిక పోలీసులు భద్రత కల్పించారు. సత్సంగ్ పూర్తయిన తర్వాత వీరంతా ఒకేసారి బయటకు వచ్చేందుకు ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగింది. అయితే కార్యక్రమం పూర్తయ్యాక తన వాహనం వద్దకు తిరిగి వెళ్తున్న బాబా ఆశీస్సులు తీసుకొనేందుకు, ఆయన అడుగులు వేసిన చోట పవిత్రమైన మట్టిని సేకరించేందుకు భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట జరిగిందని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ రవీంద్ర కుమార్ వెల్లడించారు. సత్సంగ్ జరిగిన ప్రాంతం బురదమయంగా ఉండడంతో భక్తులు జారిపడ్డారని, దాంతో తొక్కిసలాట జరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. సరైన ఏర్పాట్లు చేయలేదని, అందుకే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని భక్తులు ఆరోపించారు.

దర్యాప్తు బృందం ఏర్పాటు

తొక్కిసలాట సమాచారం అందుకున్న వెంటనే అధికారులు రంగంలోకి దిగారు. క్షతగాత్రులను, మృతదేహాలను వాహనాల్లో హత్రాస్ మెడికల్ సెంటర్‌తో పాటు సమీపంలోని ఎటాహ్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో విసిరేసినట్లుగా పడి ఉన్న శవాలు, వాటి చుట్టూ కూర్చొని రోదిస్తున్న కుటుంబ సభ్యుల హృదయ విదారక దృశ్యాలు కలచివేశాయి. పెద్ద సంఖ్యలో క్షతగాత్రులు ఉన్నారని, వారికి చికిత్స అందించడం లేదని స్థానికులు మండిపడ్డారు. ఆసుపత్రిలో ఒకే ఒక్క డాక్టర్ ఉన్నారని, ఆక్సిజన్ సదుపాయం లేదని ఆరోపించారు. ఫుల్‌రాయ్ తొక్కిసలాటపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. సత్సంగ్ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సత్సంగ్‌కు 80 వేల మంది హాజరవుతారన్న అంచనాతో నిర్వాహకులు అనుమతి తీసుకున్నారని యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చెప్పారు. కానీ, అంతకంటే ఎక్కువ మంది హాజరయ్యారని తెలిపారు. భోలే బాబా పరారీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

సంతాపం తెలిపిన ప్రధాని మోదీ

హత్రాస్ తొక్కిసలాటపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రధానమంత్రి కార్యాలయం పరిహారం ప్రకటించింది. యూపీ సర్కారు కూడా అంతే మొత్తం పరిహారం ఇస్తుందని సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు.

కాల్వలో ఒకరిపై ఒకరు పడిపోయారు

ప్రత్యక్ష సాక్షుల కథనం

హత్రాస్: తొక్కిసలాట ఘటన వివరాలను కొందరు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. '' సత్సంగ్ అయిపోగానే అందరూ ఒక్కసారిగా ప్రాంగణం నుంచి బయటికి బయల్దేరారు. ప్రాంగణం బయట రోడ్డు ఎత్తులో నిర్మించారు. దాని కింద మురికి కాల్వ ఉంది. దూసుకొచ్చిన జనం అందులో పడ్డారు. ఒకరిపై మరొకరు పడుతూనే ఉన్నారు. కింద ఉన్న వాళ్లు కూరుకుపోయి కన్నుమూశారు'' అని శకుంతల అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. '' సత్సంగ్‌ను రోడ్డు చివర నిలబడి ఉన్న వాళ్లను ప్రాంగణంలో కిక్కిరిసిన జనం తోసేశారు. దీంతో కొనకు ఉన్న వాళ్లు కాల్వలో పడిపోయారు. అలా అప్పటికప్పుడు ఒక పాతిక మంది ప్రాణాలుకోల్పోయారు' అని మరో ప్రత్యక్ష సాక్షి ఆ భయానక ఘటనను గుర్తుచేసుకున్నారు. సత్సంగ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు మహేశ్ చంద్ర సైతం కార్యక్రమం నిర్వహణ విధానాన్ని తప్పుబట్టారు. '' సరైన నిర్వహణ లేకే ఈ దారుణం జరిగింది. బురదలో పడ్డ వాళ్లను జనం పరుగెడుతూ తొక్కుకుంటూ వెళ్లారు. వాళ్లను ఎవరూ అదుపుచేయలేకపోయారు. దీంతో పడిపోయిన వాళ్ల ప్రాణాలు కోల్పోయారు'' అని ఆయన అన్నారు.

ఎవరీ భోలే బాబా?

వందకుపైగా అమాయకుల ఉసురు తీసిన ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమం నిర్వహించిన భోలే బాబా అసలు పేరు సౌరభ్ కుమార్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఎటాహ్ జిల్లాలోని బహదూర్ గ్రామంలో జన్మించారు. వయసు 50 ఏళ్ల పైమాటే. ఉత్తరప్రదేశ్ పోలీసు శాఖలో ఇంటెలిజెన్స్ బ్యూరోలో 18 ఏళ్లపాటు పని చేసిన సౌరభ్ కుమార్ మనసు మార్చుకొని స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. ఖాకీ దుస్తులు వదిలేసి శ్వేతవస్త్రాలు ధరించారు. ఆధ్యాత్మిక మార్గంలో అడుగుపెట్టారు. సకర్ విశ్వ హరి భోలే బాబాగా అవతరించారు. తెల్లరంగు సూటు, టై ధరించి ప్రవచనాలు చెబుతుంటారు. ప్రజలకు శాంతిమార్గం, నీతిమార్గం బోధిస్తుంటారు. ఆయన నిర్వహించే 'నారాయణ్ సకర్ హరి సత్సంగ్'లు మంగళవారమే జరుగుతుంటాయి. బాబా పక్కన ఆయన భార్య కూడా తరచుగా దర్శనమిస్తుంటారు. బాబాకు యూపీతోపాటు ఇతర రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో భక్తులున్నారు. వీరిలో ఎక్కువమంది వెనుకబడిన తరగతులకు చెందినవారే. పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా బాబా భక్తులే. ఉత్తరప్రదేశ్‌పాటు ఢిల్లీ, హరియాణా, ఉత్తరాఖండ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ దాకా బాబా పేరు ప్రఖ్యాతులు విస్తరించాయి. బాబా కరోనా వైరస్ ఉధృతి సమయంలో వివాదంలో చిక్కుకున్నారు. 2022 మే నెలలో సత్సంగ్ నిర్వహించేందుకు స్థానిక అధికారుల నుంచి అనుమతి కోరారు. కేవలం 50 మంది వస్తారని చెప్పారు. కానీ, 50 వేల మందికిపైగా హాజరయ్యారు. ఈ సంఘటన అప్పట్లో సంచలనాత్మకంగా మారింది. అందరి దృష్టి బాబాపై పడింది. మీడియాకు, ప్రచారానికి దూరంగా ఉండడం బాబా ప్రత్యేకత. తన వ్యక్తిగత సమాచారం బయటకు వెల్లడించడానికి ఇష్టపడరు. సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉంటారు. సోషల్ మీడియాలో ఆయనకు అధికారికంగా ఖాతాలు లేవు. భక్తులే బాబా పేరిట సొంతంగా ఖాతాలు తెరిచి నిర్వహిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో ఆయన పేరిట ఉన్న ఖాతాలకు 3 లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఉదంతం తన హృదయాన్ని కలచివేసిందని పేర్కొంది. పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు మృతిచెందడం పట్ల ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, తదితరులు సంతాపం ప్రకటించారు.

గతంలోనూ...

- 2005 జనవరి 25న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మంధరాదేవి ఆలయ వేడుకల్లో తొక్కిసలాట జరిగింది. **340** మందికిపైగా భక్తులు విగతజీవులయ్యారు.
- 2008 సెప్టెంబర్ 30న రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ సిటీలో చాముండాదేవి ఆలయ ఉత్సవాలకు జనం భారీగా తరలివచ్చారు. తొక్కిసలాట జరగడంతో **250** మంది మరణించారు. 60 మందికిపైగా గాయపడ్డారు.
- 2008 ఆగస్టు 3న హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో నైనాదేవి ఆలయంలో మత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకుంది. **162** మంది భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.
- 2013 అక్టోబర్ 13న మధ్యప్రదేశ్‌లోని రతన్‌గఢ్ ఆలయంలో నవరాత్రి వేడుకల సందర్భంగా తొక్కిసలాట జరిగింది. **115** మంది మృతిచెందారు.
- 2011 జనవరి 14న కేరళలోని ఇడుక్కి జిల్లాలో శబరిమల ఆలయం సమీపంలో తొక్కిసలాటలో **104** మంది అయ్యప్ప భక్తులు కన్నుమూశారు.
- 2010 మార్చి 4న ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలో రామ్‌జానకి ఆలయంలో తొక్కిసలాటలో **63** మంది మృతిచెందారు.
- 2003 ఆగస్టు 27న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో కుంభమేళాలో తొక్కిసలాటలో **39** మంది మరణించారు. 140 మంది గాయపడ్డారు.

అన్ని సీట్లు గెల్చినా ఈవీఎంలను అనుమానిస్తాం

లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఈవీఎంలపై తనకు విశ్వాసం లేదని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పునరుద్ఘాటించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా మంగళవారం లోక్‌సభలో అఖిలేశ్ మాట్లాడారు. '' గతంలోనూ ఈవీఎంలను నమ్మలేదు. ఇప్పుడూ నమ్మను. ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం 80 పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ ఎస్పీ గెలిచినాసరే ఈవీఎంలను నమ్మబోను. ఈవీఎంలపై విశ్వసనీయత అంశం ఎల్లప్పుడూ వివాదాస్పదమే. ఈవీఎంల విషయంలో ఎస్పీ వైఖరి మారదు' అని వ్యాఖ్యానించారు. ''తాజా లోక్‌సభ ఎన్నికలు దేశంలో మతతత్వ రాజకీయాలకు చరమగీతం పాడాయి. ఈ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి నైతిక విజయం సాధించింది. బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందో ఎవరికీ లేదు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే ఈవీఎంల విధానానికి స్వస్తి పలుకుతుంది'' అని అఖిలేశ్ అన్నారు.

ధన్‌ఖడ్ వర్సెస్ ఖర్గే

న్యూఢిల్లీ: రాజ్యసభ మరోసారి చైర్మన్ ధన్‌ఖడ్, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే సంవాదానికి వేదికైంది. మంగళవారం కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీ మాట్లాడుతుండగా నిరాధార ఆరోపణలు చేయొద్దంటూ ధన్‌ఖడ్ వారించగా వాటన్నింటికీ రుజువులున్నాయంటూ మరో సభ్యుడు జైరాం రమేశ్ జోక్యం చేసుకున్నారు. దాంతో, ''మీ సీనియర్ నాయకుడు (ఖర్గే) సభలోనే ఉన్నా మీరు కల్పించుకుంటున్నారు. ఖర్గే స్థానంలో మీరు విపక్ష నేత అయితే మేలేమో. ఎందుకంటే మీరెంతో తెలివైన వారు. మహా ప్రతిభావంతులు. పైగా ఇప్పటికే అనధికారికంగా సభలో ఖర్గే బాధ్యతలను మీరే నిర్వహిస్తూ వస్తున్నారు'' అంటూ చురకలు వేశారు. దాంతో జైరాంకు మద్దతుగా ఖర్గే కల్పించుకున్నారు. ''మీరు వర్ణ వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. జైరాంను అత్యంత తెలివైనవాడని, నేనంత తెలివైన వాడిని కానని అనడంలో మీ ఉద్దేశం అదే కదా!'' అంటూ చైర్మన్ వ్యాఖ్యలపై అభ్యంతరం వెలిబుచ్చారు. దాంతో ధన్‌ఖడ్ తీవ్ర అసహనానికి లోనయ్యారు. తన వ్యాఖ్యలను ఖర్గే పూర్తిగా వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు.

లోక్‌సభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ముగిశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన రెండు రోజుల చర్చకు మంగళవారం ప్రధాని బదులిచ్చాక సభ నిరవధికంగా వాయిదా పడింది. స్పీకర్ ఓం బిర్లా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశాల్లో ఏడు రోజులు 34 గంటల పాటు చర్చలు జరిగాయి. 103 శాతం ఉత్పాదకత నమోదైందని ఆయన తెలిపారు. జూన్ 24న మొదలైన పార్లమెంటు సమావేశాలు షెడ్యూల్ ప్రకారం బుధవారం దాకా జరగాల్సి ఉంది.

ప్రచండ ఉద్వాసనే లక్ష్యంగా.. కొత్త కూటమి

కఠ్మాండు: నేపాల్‌లో అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ 'ప్రచండ 'ప్రభుత్వాన్ని గద్దె దించి 'జాతీయ ఏకాభిప్రాయ ప్రభుత్వం 'ఏర్పాటే లక్ష్యంగా బద్ధ విరోధులైన రెండు పెద్ద పార్టీలు చేతులు కలిపాయి. నేపాలీ కాంగ్రెస్(ఎన్‌సీ) అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్-యూనిఫైడ్ లెనినిస్ట్(సీపీఎన్-యూఎంఎల్) చైర్మన్, మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి కొత్త కూటమి ఏర్పాటుపై సోమవారం రాత్రి సంతకాలు చేశారు. మొత్తం 275 మంది సభ్యుల నేపాల్ పార్లమెంట్‌లో ఎన్‌సీకి అత్యధికంగా 89 సీట్లు, సీపీఎన్-యూఎంఎల్‌కు 78 సీట్లు ఉన్నాయి. రెండు పార్టీలు ఏకమైతే వీటి బలం 167కు చేరుకుంటుంది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ 138 సీట్లే.



ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీని పూలదండతో సత్కరిస్తున్న కుమార స్వామి. చిత్రంలో రాజ్‌నాథ్, శివరాజ్ సింగ్ తదితరులు

రాహుల్‌లా ప్రవర్తించొద్దు!

- ఎన్డీయే సమావేశంలో ప్రధాని మోదీ సూచన
- చాయ్‌వాలా ప్రధాని కావడం విపక్షాలకు ఇష్టం లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం సభలో అనుచితంగా మాట్లాడారని, ఆయనలాగా ఎవరూ ప్రవర్తించకూడదని, మాట్లాడకూడదని బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. మంగళవారం ఎన్డీయే పక్షాల ఎంపీల సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంటరీ నిబంధనలు, విధివిధానాలను ప్రతి ఒక్కరూ తూ.చా. తప్పకుండా పాటించాలని, సభలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. సభలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాల గురించి సీనియర్ ఎంపీల నుంచి నేర్చుకోవాలని కొత్తగా ఎన్నికైన ఎంపీలకు సూచించారు. కాంగ్రెస్సేతర నాయకుడు, అందులోనూ ఒక సాధారణ చాయ్‌వాలా మూడోసారి ప్రధానమంత్రి కావడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేయాలని, సభకు తప్పనిసరిగా హాజరు కావాలని, నియోజకవర్గాలకు సంబంధించిన అంశాలను ప్రభావవంతంగా ప్రస్తావించాలని పేర్కొన్నారు. ఏదైనా అంశంపై మీడియాతో మాట్లాడాలనుకుంటే తొలుత దానిపై అధ్యయనం చేయాలని చెప్పారు. నియోజకవర్గాలతో ఎప్పటికప్పుడు అనుసంధానమై ఉండాలని, మనకు మద్దతు ఇచ్చిన ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పడం మన బాధ్యత అని వివరించారు. పార్లమెంట్ సభ్యులుగా దేశ సేవకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి మ్యూజియాన్ని ఎంపీలందరూ సందర్శించాలని, భారత ప్రధానమంత్రుల జీవిత ప్రస్థానం గురించి అక్కడ తెలుసుకోవాలని సూచించారు.

రాజ్యసభలోనూ నీట్ రగడ

న్యూఢిల్లీ: నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతం రాజ్యసభను కుదిపేసింది. పేపర్ లీక్‌తో లక్షలాది యువత భవిష్యత్తును నాశనం చేసిందని, రేయింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీసిందని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. '' దేశంలో రెండు ఐపీఎల్‌లు జరుగుతున్నాయి. ఒకటి ఇండియన్ ప్రీమియర్ లీగ్, మరొకటి ఇండియన్ పేపర్ లీక్. ఒక ఐపీఎల్ బాల్, బ్యాట్‌తో ఆడితే ఇంకో ఐపీఎల్ యువత భవిష్యత్తుతో ఆడుకుంటోంది. నీట్-యూజీ పరీక్ష చేపట్టిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అంటే ఇకపై నో ట్రస్ట్ ఎనీమోర్(ఎన్‌టీఏ)గా పలకాలి' అని ఆప్ సభ్యుడు రాఘవ్ చద్దా అన్నారు. ప్రతిష్టాత్మక పరీక్షల పేపర్ లీకేజీల అంశాన్ని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని ఇంకొందరు సభ్యులు డిమాండ్‌చేశారు. '' తీవ్ర వివాదాస్పదమైన నీట్ పరీక్షను కేంద్రం ఇకనైనా రద్దుచేస్తుందా లేదా? '' అని కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్ సూటిగా ప్రశ్నించారు. ఎన్‌టీఏ చైర్మన్‌కు గతంలో మధ్యప్రదేశ్‌లో వ్యాపమ్ స్కామ్‌తో సంబంధం ఉందని దిగ్విజయ్ ఆరోపించారు. '' నీట్, నెట్ లీకేజీల్లో కోచింగ్ సెంటర్లదే ప్రధాన పాత్ర. అయినా వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు'' అని ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్ ఆవేదన వ్యక్తంచేశారు. '' ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌ను తక్షణం డిస్మిస్ చేయకుండా రెండునెలల శాఖాపర దర్యాప్తు తర్వాత చర్యలు తీసుకుంటామని కేంద్రం చెప్పడంలో ఆంతర్యమేంటి?' అని ఎస్పీ నేత రాంజీలాల్ సుమన్ అనుమానం వ్యక్తంచేశారు.



లోక్‌సభలో విపక్ష సభ్యునికి మంచినీళ్లు అందిస్తున్న మోదీ

విపక్ష సభ్యులకు 'నీళ్లు తాగించిన' మోదీ!

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు బదులిస్తూ మంగళవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో పలు పదనిసలు చోటుచేసుకున్నాయి. ఆయన ప్రసంగించినంతసేపూ విపక్ష సభ్యులంతా నిరసన తెలుపుతూనే ఉన్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిలబడి మోదీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలకు దిగారు. వారిలో ఒకరికి ప్రధాని మంచినీళ్లు తెప్పించి మరీ స్వయంగా అందించారు. సదరు సభ్యుడు కాసేపు తటపటాయించి చివరికి వద్దంటూ నిరాకరించారు. అంతలో పక్కనే నినాదాలు చేస్తున్న మరో సభ్యుడు ఆ గ్లాస్ అందుకుని తాగారు! అనంతరం మోదీ మాట్లాడుతూ ''ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు విపక్షంలో కూచొమ్మని, వాదించేందుకు ఏమీ లేకపోతే పార్లమెంటులో అరుపులు కేకలకు దిగండని తీర్పు ఇచ్చారు!'' అంటూ చురకలు వేశారు.

విపక్షాల తీరు గర్హనీయం

లోక్‌సభ తీర్మానం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తుండగా విపక్షాలు పదేపదే అడ్డుకోవడాన్ని లోక్‌సభ తీవ్రంగా తప్పుబట్టింది. పార్లమెంటరీ సంప్రదాయాలన్నింటినీ అవి పూర్తిగా తుంగలో తొక్కాయని నిరసిస్తూ తీర్మానం చేసింది. ప్రధాని ప్రసంగం అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టారు. ''ప్రధాని మాట్లాడుతుండగా విపక్షాల ప్రవర్తించిన తీరు అత్యంత గర్హనీయం. దాన్ని సభ తీవ్రంగా ఖండించాలని ప్రతిపాదిస్తున్నా'' అని పేర్కొన్నారు. విపక్ష సభ్యుల ప్రవర్తనను స్పీకర్ ఓం బిర్లా కూడా తీవ్రంగా దుయ్యబట్టారు. వారి తీరు పార్లమెంటరీ సంప్రదాయాలకు అనుగుణంగా లేదన్నారు. ''సభ్యులందరికీ కావాల్సిన సమయమిచ్చా. విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రసంగానికి గంటన్నరకు పైగా కేటాయించాను. అయినా విపక్షాల నుంచి ఇలాంటి దారుణ ప్రవర్తనా?'' అంటూ తీవ్రంగా తప్పుబట్టారు. తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బలపరిచారు. అనంతరం సభ మూజువాణీ ఓటుతో తీర్మానాన్ని ఆమోదించింది. ప్రధాని మాట్లాడేందుకు నుంచోగానే మణిపూర్ అంశంపై మాట్లాడే అవకాశమివ్వాలంటూ విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వారిలో ఒకరికి ఇప్పటికే ఆ అంశంపై మాట్లాడే అవకాశమిచ్చానని స్పీకర్ గుర్తు చేశారు. దాంతో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్, ఇద్దరు మణిపూర్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలకు దిగారు. పలువురు కాంగ్రెస్ ఎంపీలు వారికి జత కలిశారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు నుంచుని వారికి మద్దతు తెలిపారు. సభ్యులను వెల్‌లోకి పంపుతున్నారంటూ రాహుల్‌ను స్పీకర్ తీవ్రంగా మందలించారు.

నీట్‌పై చర్చకు అవకాశమివ్వండి

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: నీట్ అంశంపై బుధవారం లోక్‌సభలో చర్చకు అవకాశం కల్పించాలని ప్రధాని మోదీని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. జూన్ 28న, జూలై ఒకటో తేదీన నీట్‌పై చర్చను చేపట్టాలంటూ ప్రతిపక్షం చేసిన వినతిని స్పీకర్ తిరస్కరించారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని లోక్‌సభ స్పీకర్ ప్రతిపక్షానికి హామీ ఇచ్చారని కూడా రాహుల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మోదీకి రాహుల్ లేఖ రాశారు. అయితే లోక్‌సభ మంగళవారమే నిరవధికంగా వాయిదా పడటం తెలిసిందే.

ఇంజనీర్ రషీద్‌కు 2 గంటల పెరోల్

న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి నిధుల సమీకరణ కేసులో అరెస్టయి 2019 నుంచి తిహార్ జైలులో గడుపుతున్న బారాముల్లా స్వతంత్ర్య ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్‌కు ఎట్టకేలకు ఢిల్లీ కోర్టు పెరోల్ మంజూరుచేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు జూలై ఐదో తేదీన ఆయన జైలు నుంచి విడుదలై రెండు గంటల్లోపు ఎంపీగా ప్రమాణంచేసి మళ్లీ తిహార్ జైల్లోకి వెళ్లనున్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో కశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లాను రషీద్ భారీ మెజారిటీతో ఓడించిన విషయం తెల్సిందే.

నీట్-పీజీ పరీక్షకు కొద్ది గంటల ముందే పేపరు ఖరారు

న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్- పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ) పరీక్ష పత్రాన్ని ఇకపై భద్రతా కారణాల రీత్యా పరీక్షకు కొద్ది గంటల ముందు ఖరారు చేయనున్నారు. జూన్ 23వ తేదీన జరగాల్సిన ఈ పరీక్షను నీట్-యూజీ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో వాయిదా వేయడం తెల్సిందే. తాజా తేదీలను వచ్చే వారంలో ప్రకటించాలని, ఆగస్ట్‌లో పరీక్ష ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

వార్‌హెడ్‌తో క్షిపణి పరీక్ష: ఉ.కొరియా

సియోల్: అతిపెద్ద వార్‌హెడ్‌ను మోసుకెళ్ల గలిగిన వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు ఉత్తర కొరియా ప్రకటించుకుంది. సోమవారం పరీక్షించిన హువాసంగ్‌ఫో-11 డీఏ-4.5 రకం క్షిపణికి నాలుగున్నర టన్నుల బరువున్న వార్‌హెడ్‌ను అమర్చినట్లు ఆ దేశ వార్తా సంస్థ మంగళవారం తెలిపింది. ఈ క్షిపణి గరిష్టంగా 500 కిలోమీటర్లు, కనిష్టంగా 90 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగలదని కూడా వెల్లడించింది. అయితే, ఉత్తర కొరియా సోమవారం ప్రయోగించిన రెండు క్షిపణుల్లో ఒకటి ఆ దేశ రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని నిర్జన ప్రాంతంలో కుప్పకూలినట్లు దక్షిణ కొరియా సైన్యం మంగళవారం తెలిపింది.

నా వ్యాఖ్యలను మళ్లీ రికార్డుల్లో చేర్చండి

స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభలో సోమవారం తాను చేసిన ప్రసంగంలో కొన్ని వ్యాఖ్యలను స్పీకర్ ఓం బిర్లా సంబంధిత రికార్డుల నుంచి తొలగించడం పట్ల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ చర్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను మళ్లీ రికార్డుల్లో చేర్చాలని కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ లేఖ రాశారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన ప్రసంగాన్ని లేఖలో ప్రస్తావించారు. అనురాగ్ ఠాకూర్ అనుచితమైన ఆరోపణలు చేశారని, అయినప్పటికీ ఆ ప్రసంగంలో కేవలం ఒక్క పదాన్నే తొలగించారని ఆక్షేపించారు. దీని వెనుక మర్మం ఏమిటని ప్రశ్నించారు. ఎంపిక చేసిన వ్యక్తులు చేసే వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా విస్మరించడం తగదని పేర్కొన్నారు. లోక్‌సభ వ్యవహారాల ప్రక్రియ, నిర్వహణ నిబంధనల్లోని 380 నిబంధన ప్రకారం కొన్ని రకాల పదాలను మాత్రమే రికార్డుల నుంచి తొలగించాల్సి ఉంటుందని రాహుల్ గుర్తుచేశారు. సభలో సోమవారం తాను చేసిన వ్యాఖ్యలు ఈ నిబంధన కిందకు రావని తేల్చి చెప్పారు.



ఇక ఇళ్లు రెడీమేడ్..
అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రెడీమేడ్ ఇళ్లు, భవనాలు అందుబాటులోకి వచ్చాయి. కంటైనర్లు, ఫ్యాబ్రిక్, ఐరన్ మేడ్ భవనాలు..కావాలకున్న సైజులో అందంగా తయారు చేసి ఇస్తున్నారు. -8లో



చేయని నేరానికి...
చేయని నేరాన్ని ఒప్పుకోవాలని ఓ మహిళను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. ఆమె చేతులు, కాళ్ల మీద లాఠీలతో చితకబాదారు. ఈ ఘటన బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0/25.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో సుస్థిర ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది.అక్కడక్కడా చిరు జల్లులు కురిసే చాన్స్ కూడా ఉంది.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



బన్సీలాల్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ ఆయా రంగాల సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని ఎస్వీ కాలేజీలో నూతన ఆడిటోరియం, కామర్స్ బ్లాక్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మారుమూల ప్రాంత ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాభివృద్ధి ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం..వైద్యంతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఎగ్జిబిషన్ సొసైటీ విద్యా సంస్థల ద్వారా ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నదని వివరించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా ఇక్కడి సిబ్బంది చేస్తున్న సేవలు అమోఘమైనవని మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు. ఎస్వీ కాలేజీలో సుమారు 2,700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. మంచి ఆలోచన, దృక్పథంతో అధ్యాపకులు, సిబ్బంది ముందుకు సాగుతూ విద్యార్థుల ఉన్నతికి పాటు పడుతున్నారన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్. రాజేందర్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, కోశాధికారి సూరజ్ సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఖేలో భారత్ యూత్ గేమ్స్‌లో సత్తా చాటిన సాయి హన్సిక


మెడల్స్ అందుకుంటున్న సాయి హన్సిక

కాచిగూడ: ఇండో నేపాల్ ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్-2024 పోటీల్లో నగరానికి చెందిన చక్రత్ సాయి హన్సిక అండర్-17 ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగతంగా గోల్డ్‌మెడల్, డ్యూ టీమ్‌లో సిల్వర్ మెడల్‌ను సాధించారు. జూన్ 26 నంచి 30వ తేదీ వరకు నేపాల్ రంగశాల స్టేడియం (పోఖారా)లో ఈ పోటీలు జరిగాయి. అథ్లెటిక్స్, కరాటే, కబడ్డీ, యోగా, ఫుట్‌బాల్, ఖోఖో, ఎయిర్ రైఫిల్ షూటింగ్, ఆర్చరీ, హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, తైక్వాండో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిర్ రైఫిల్ షూటింగ్ ప్లేయర్లు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ టార్గెట్-పీప్-సైట్ పాల్గొని వ్యక్తిగత, ద్వంద్వ జట్టు విభాగాల్లో 6 బంగారు, 2 సిల్వర్ మెడల్స్ గెల్చుకున్నారు. నేపాల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ దుర్గా థాయ్ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా సాయి హన్సికను పలువురు క్రీడాకారులు, బంధు మిత్రులు అభినందించారు.

డెంగీ నివారణపై అవగాహన అవసరం: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దోమల కారణంగా సంక్రమించే వ్యాధుల నియంత్రణపై నిర్వహించిన డీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, విష జ్వరాల నివారణపై జీహెచ్‌ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య కేంద్రాలలో వైద్య సౌకర్యాలు, టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గత ఐదేళ్లలో ఏఏ ప్రాంతాలలో కేసులు నమోదయ్యాయో సర్కిల్ వారిగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయాలని, దీనివల్ల దోమల లార్వా అరికట్టవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎం ఓహెచ్), రాంబాబు, చీఫ్ ఎంటమాలజిస్ట్, జిల్లా సర్వైలెన్స్ ఆఫీసర్ డాక్టర్ హర్ష, ఇన్‌చార్జి డీఎంఓ నిరంజన్, జిల్లా అధికారులు యాదయ్య, కోటాజి, ఇలియాజ్ అహ్మద్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు

జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్

నగరంలో డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌తో పాటు 'ప్రతి ఆదివారం పది నిమిషాలు' పేరిట దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. కమిషనర్ ఆదేశాల మేరకు అడిషనల్ కమిషనర్ (ఆరోగ్యం), సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ మంగళవారం ఎంటమాలజీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దోమల తీవ్రత ఎక్కువగా ఉన్న హాట్‌స్పాట్స్, డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో పదిరోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎంటమాలజీ కార్మికులు విధులకు డుమ్మా కొట్టకుండా, బోగస్ లేకుండా ఉండేందుకు ప్రతిరోజూ ఫేస్ రికగ్నిషన్ హాజరు తీసుకోవాలన్నారు. పిన్‌పాయింట్ ప్రోగ్రామ్‌గా యాంటీ లార్వా ఆపరేషన్లు, ఆరు రోజులకోమారు ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. గుర్తించిన 4846 కాలనీల్లో ప్రతిరోజూ దోమల నివారణకు మందుల స్ప్రే తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దోమల నివారణకు సంబంధించి ప్రతి శుక్రవారం స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

సాగర జలాల్లో 'సెయిలింగ్' విన్యాసాలు





హుస్సేన్ సాగర్‌కు సెయిలింగ్ పోటీలు కొత్త సొబగులు అద్దుతున్నాయి. సాగర జలాల్లో అందమైన తెరచాపలపై అద్భుతమైన విన్యాసాలతో సెయిలర్లు ఆకట్టుకుంటున్నారు. భారత సెయిలింగ్ కేలెండర్‌లో ప్రతిష్టాత్మక పోటీలైన 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ మంగళవారం ఇక్కడ ఘనంగా ప్రారంభమైంది. ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సెయిలింగ్ వీక్‌ను లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిదానా ప్రారంభించారు. ఈ ఏడాది వైఏఐ ర్యాంకింగ్ పోటీలుగా ప్రారంభమైన ఈ సెయిలింగ్ వీక్‌లో ఐఎల్‌సీఏ 7, ఐఎల్‌సీఏ 6, ఐఎల్‌సీఏ 4 విభాగాల్లో బాలురు, బాలికలు 470 క్లాస్‌తో పోటీ పడనున్నారు. లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో పాటు కమోడోర్ ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ నేతృత్వంలో ఈ పోటీలు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

- సాక్షి, సిటీబ్యూరో


బంజారాహిల్స్‌లో..

దంచికొట్టిన వాన



నగరంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎండ దంచి కొట్టగా.. రాత్రి తొమ్మిది గంటలకు వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు ప్రాంతాల్లో గంట పాటు ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ స్తంభించింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, లక్డీకాపూల్, మెహిదీపట్నం, అబిడ్స్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. - సాక్షి, సిటీబ్యూరో

చలో అమెరికా!



తెలుగు విద్యార్థుల డెస్టినేషన్‌గా యూఎస్

- 2016తో పోల్చితే నాలుగు రెట్లు పెరిగిన విద్యార్థులు
- తెలుగు మాట్లాడే వారు అత్యధికంగా కాలిఫోర్నియాలోనే..
- యూఎస్‌లో మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుకు 11వ స్థానం
- ఐటీ, ఫైనాన్స్ సెక్టార్లపై ఆసక్తి

సాక్షి సిటీ బ్యూరో: ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులు తమ డెస్టినేషన్‌గా అమెరికాను ఎంపిక చేసుకుంటున్నారు. ఏటా 60 వేల నుంచి 70 వేల మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు యూఎస్ చదువుల కోసం బ్యాగ్‌లు సర్దిపెట్టుకుంటున్నారు. యునైటెడ్ స్టేట్స్ సెన్సస్ బ్యూరో లెక్కల ఆధారంగా 2016తో పోల్చితే 2024 నాటికి అమెరికాలో తెలుగు వారి సంఖ్య నాలుగింతలు పెరిగిందని స్పష్టమవుతోంది. ప్రధానంగా కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూ జెర్సీ, డల్లాస్, నార్త్ కరోలినా, ఇల్లినాయిస్, వర్జీనియా, అట్లాంటా, ఫ్లోరిడా, జార్జియా, నాష్‌విల్లే తదితర సిటీల్లో తెలుగు వారి ప్రాబల్యం వేగంగా పెరుగుతోందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఎంతలా ఉందంటే యూఎస్‌లో అత్యధికంగా మాట్లాడే విదేశీ భాషలు 350 ఉండగా అందులో తెలుగు 11వ స్థానంలో నిలిచింది.

ఐటీ, ఫైనాన్స్ రంగాలపై ఆసక్తి..

అమెరికా వెళుతున్న వారిలో దాదాపు 75 శాతం పైగా ఇక్కడ ఇక్కడే స్థిరపడుతున్నారు. ప్రధానంగా డల్లాస్, బే ఏరియా, నార్త్ కరోలినా, న్యూజెర్సీ, అట్లాంటా, ఫ్లోరిడా, నాష్‌విల్లే తదితర ప్రాంతాల్లో తెలుగు వారి ప్రభావం కనిపిస్తోంది. గతంలో స్థిరపడిన తెలుగు ప్రజలు పెట్టుబడులతో ముందుకొస్తున్నారు. మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అయితే 80 శాతం కంటే ఎక్కువ మంది యువకులు ఐటీ, ఫైనాన్స్ రంగాలపైనే ఆసక్తి చూపిస్తున్నారని స్థానిక సర్వేల్లో వెల్లడైంది.

హిందీ, గుజరాతీ, తరువాతి స్థానంలో తెలుగు..

అమెరికాలో మాట్లాడే భారతీయ భాషల్లో అత్యధికంగా హిందీ మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో గుజరాతీ, మూడో స్థానంలో తెలుగు ప్రజలు ఉన్నారు. అమెరికాలో సుమారు 350 విదేశీ భాషలు వాడుకలో ఉండగా అందులో తెలుగు భాష 11 స్థానంలో నిలిచింది. దీన్ని బట్టి అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్యా ప్రభావం ఎంత వేగంగా పెరుగుతోందో స్పష్టం చేస్తోంది. ఏటా 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు అమెరికా వస్తున్నారని ఉత్తర అమెరికా తెలుగు భాషా సంఘం మాజీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. వీరితో పాటు దాదాపు 10 వేల మంది హెచ్1బి వీసా హోల్డర్లు ఉంటున్నారు. ఇందులో 80 శాతం మంది తెలుగు సంఘంలో సభ్యత్వం నమోదు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు.

3.2 లక్షల నుంచి 12.3 లక్షల వరకు..

యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా ప్రకారం 2016 నాటికి అమెరికాలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య 3.2 లక్షల మంది ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 12.3 లక్షలకు చేరింది. గతంలో వెళ్లి స్థిరపడిన నాలుగు తరాలకు చెందిన తెలుగు వారు, ఇటీవల కొత్తగా వెళ్లిన వారు సైతం అంతా అమెరికాను తమ సొంత ప్రాంతంలో ఉన్నట్లు భావిస్తున్నారు. తెలుగు మాట్లాడే వారు అత్యధికంగా కాలిఫోర్నియాలో 2 లక్షల మంది ఉండగా, టెక్సాస్ 1.5 లక్షలు, న్యూజెర్సీ 1.1 లక్షలు, ఇల్లినాయిస్ 83 వేలు, వర్జీనియా 78 వేలు, జార్జియా 52 వేల మంది ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి.

మూసీ వంతెనలు ఎంత భద్రం?

సామర్థ్య పరీక్షలకు అధికారుల నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: ఓ వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనులతో పాటు మరో వైపు మూసీపై ఎప్పటినుంచో ఉన్న పాత వంతెనల సామర్థ్య పరీక్షలకు సంబంధిత అధికారులు సిద్ధమయ్యారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనులతో నగర ముఖచిత్రం మారిపోవడంతో పాటు అది ఆర్థికంగానూ వెన్నుదన్నుగా ఉండాలనే తలంపులో సీఎం ఉన్నారు. ఆ అంశానికి ప్రాధాన్యతనిస్తూ కొత్తగా చేపట్టబోయే పనులతో పాటు మూసీపై దశాబ్దాల క్రితమే నిర్మించిన బ్రిడ్జిల సామర్థ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వాటికి అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించి, తగిన మరమ్మతులతో బలోపేతం చేయనున్నారు.

17 బ్రిడ్జిలకు పరీక్షలు

నగరంలో మూసీపై 17 బ్రిడ్జిలున్నాయి. ఇప్పుడు వాటికి సామర్థ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు దెబ్బతిన్న వాటికి ఎలాంటి మరమ్మతులు చేయాలి తదితరమైన వాటి కోసం ఆర్‌ఎఫ్‌పీ టెండర్లు పిలవగా నాలుగు ఏజెన్సీలు ముందుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. తొలుత టెక్నికల్ బిడ్స్ పరిశీలించి అందులో అర్హతపొందిన ఏజెన్సీల ఫైనాన్షియల్ బిడ్స్ పరిశీలించి ఏజెన్సీని ఎంపిక చేయనున్నారు. సామర్థ్య పరీక్షలు జరపనున్న 17 బ్రిడ్జిల్లో టిప్పుఖాన్ బ్రిడ్జి, బాపూఘాట్, అత్తాపూర్, పురానాపూల్, ముస్లింజంగ్, నయాపూల్, సాలార్జంగ్, చాదర్‌ఘాట్, గోల్నాక, నాగోల్, ఇమ్లిబన్ ప్రాంతాల్లోని బ్రిడ్జిలున్నాయి. వీటిల్లో కొన్ని ప్రాంతాల్లో రెండేసి బ్రిడ్జిలున్నాయి. బిడ్లు దాఖలు చేసిన ఏజెన్సీల్లో ఆర్వీ అసోసియేట్స్, స్టార్డంట్ టెక్నో క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్, కేబీపీ సివిల్ ఇంజినీర్స్ సర్వీస్, స్ట్రక్‌వెల్ డిజైనర్స్ కంట్రాక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయని అధికారులు తెలిపారు.



'హై లెవెల్' పక్కన పెట్టి..

కాంగ్రెస్‌కు ముందు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ మూసీపై 15 హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలనుకుంది. వాటిల్లో కొన్నింటి పనులు కూడా ప్రారంభమయ్యాయి. అలాంటి వాటిల్లో మూసారంబాగ్ వద్ద మాత్రమే పనులు జరుగుతుండగా, మిగతా ప్రాంతాల్లో ఆగిపోయాయి.

ఎత్తు.. చిత్తు!

ఆకాశ హర్మ్యాల నేల చూపులు

6 నెలలుగా నిలిచిపోయిన హెచ్‌ఎండీఏ అనుమతులు
- కొత్త ప్రభుత్వంలో ఒక్క ఫైల్ కదలడం లేదు..
- ఎక్కడికక్కడ ఆగిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న బిల్డర్లు, రియల్టర్లు
- అన్ని రంగాలపైనా ప్రభావం

సాక్షి, సిటీబ్యూరో:

ఆకాశహర్మ్యాలతో అంతర్జాతీయ హంగులను అద్దుకున్న గ్రేటర్ హైదరాబాద్ కొంతకాలంగా నేలచూపులు చూస్తోంది. గతంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల కోసం హెచ్‌ఎండీఏ పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. దీంతో నగరానికి పడమటి వైపున ఆకాశన్నంటే హైరైజ్ భవనాలు వెలిశాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు ఒక్క బహుళ అంతస్తుల భవనానికి కూడా అనుమతినివ్వకపోవడంతో నిర్మాణ రంగంలో స్తబ్ధత నెలకొంది. రియల్‌ఎస్టేట్ రంగం కుదేలైంది. హెచ్‌ఎండీఏలో ఒక్క ఫైలు కూడా ముందుకు కదలడం లేదని, ఆరు నెలలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిందని నిర్మాణరంగానికి చెందిన నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇటు రియల్‌ఎస్టేట్, అటు భవన నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఆ రంగాలపైన ఇతర వ్యాపారాలు కూడా మందగించాయి. గతంలో 53 అంతస్తుల భవనాలకు సైతం ప్రభుత్వం అనుమతినిచ్చింది. కానీ ఇప్పుడు 5 అంతస్తుల నుంచి 10 అంతస్తుల భవనాలకు కూడా సకాలంలో అనుమతులు లభించకపోవడంతో బిల్డర్లు పడిగాపులు కాస్తున్నారు. హెచ్‌ఎండీఏతో పాటు డీటీసీపీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కూడా నిర్మాణరంగం ఒక్కసారిగా కుదేలైనట్లు పేర్కొంటున్నారు.

గత 6 నెలలుగా స్తబ్ధత..

తుర్కయంజాల్ ప్రాంతంలో ఓ భవన నిర్మాణం కోసం 6 నెలల క్రితం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు అధికారులు ఎటూ తేల్చడం లేదని, రెవెన్యూ, నీటిపారుదల శాఖల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) సమర్పించినప్పటికీ ఎక్కడి ఫైల్ అక్కడే ఉందని ఒక దరఖాస్తుదారుడు పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏలోని శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ జోన్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒకవైపు గత ఆరు నెలలుగా వందల కొద్దీ ఫైళ్లు పరిష్కారమయ్యాయని, సుమారు రూ.300 కోట్లకు పైగా ఆదాయం లభించిందని అధికారులు చెబుతుండగా నెలల తరబడి ప్రణాళికా విభాగం అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పనులు కావడం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా 15 రోజుల్లోపే ఎలాంటి ఫైల్ అయినా పరిష్కరించవలసి ఉండగా 3 నుంచి 6 నెలలైనా పరిష్కారం కావడం లేదని పేర్కొంటున్నారు. మరోవైపు బహుళ అంతస్తుల భవనాల కోసం గత ఏడాది అక్టోబర్‌లో నమోదైన ఫైళ్లు కూడా ఇప్పటి వరకు ఒక్క అంగుళం కూడా ముందుకు కదకలపోవడం గమనార్హం. హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా దానకిషోర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఒక స్థాయి వరకు లే అవుట్‌లు, భవనాలకు అనుమతులు ఇచ్చారు. కానీ ఇంకా వందల కొద్దీ పెండింగ్‌లోనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

నో సిట్టింగ్..



బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులను ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశమై సంబంధిత ఫైళ్లు నిబంధనల మేరకు ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తుంది. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌తో పాటు, జీహెచ్‌ఎంసీ, డీటీసీపీ సీసీపీలు, ఒక ఆర్కిటెక్టర్‌లతో కూడిన ఈ కమిటీ సమావేశమై భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తుంది. అన్ని విధాలుగా సంతృప్తి చెందిన తరువాత మాత్రమే అనుమతి లభిస్తుంది. కానీ ఈ ఆరు నెలల్లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా కమిటీ సమావేశమై అనుమతులను ఇచ్చిన దాఖలాలు లేవు. నిర్మాణరంగ నిపుణుల అంచనాల మేరకు హెచ్‌ఎండీఏ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గత ఆరు నెలలుగా సుమారు 200 ఫైళ్లు బహుళ అంతస్తుల భవన అనుమతుల కోసం ఎదురు చూస్తున్నట్లు అంచనా. మరోవైపు పైనుంచి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే తప్ప ఫైళ్లు కదలడం కష్టమేనని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

భారీ నష్టం..



నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ పూర్తిగా స్తంభించాయి. ఇప్పటికే బుకింగ్ చేసుకొన్న కొనుగోలుదారులు ఎదురు చూస్తున్నారు. కొత్త బుకింగ్‌లకు అవకాశం లేకుండాపోయింది. కేవలం నిర్మాణ రంగానికే కాకుండా దానిపైన ఆధారపడిన అన్ని రకాల వ్యాపారాలు గత 6 నెలలుగా భారీ నష్టాన్ని చవి చూస్తున్నాయి. కూలీలు మొదలుకొని రవాణా రంగానికి చెందిన కార్మికులు, చిరు వ్యాపారుల నుంచి బడా వ్యాపార సంస్థల వరకు వివిధ రకాలుగా ఈ నష్టాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తే మంచిది.

- సత్యనారాయణ చిట్టి, డైరెక్టర్ ఆస్పిరియాలిటీ

ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది



హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితి ఇలాగే కొనసాగితే..ఈ రంగానికి చెందిన వ్యాపారులకే కాదు..ప్రభుత్వానికి కూడా కష్టమే. ఆర్థిక వ్యవస్థలు దారుణంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ నగరాల సరసన హైదరాబాద్‌ను చేర్చాలంటే నిర్మాణ రంగం కుంటుపడకుండా చూడాలి. ఇలా 6 నెలలుగా స్తబ్ధత నెలకొనడం మంచిది కాదు.

- సురేష్ నామాల, రియల్‌రంగ నిపుణులు

ఇక ఇళ్లు రెడీమేడ్..

కంటైనర్, ఫ్యాబ్రిక్, ఐరన్ మేడ్ భవనాలకు డిమాండ్

- టీ దుకాణం మొదలు ఫాంహౌస్ వరకు ఇదే ట్రెండ్
- తక్కువ ఖర్చు, త్వరితగతిన అందుబాటులోకి..
- దాదాపు 30 ఏళ్ల మన్నిక ఉంటుందని అంచనా
- నగర శివార్లలో జోరుగా విక్రయాలు



సాక్షి, సిటీబ్యూరో: ఇల్లు, దుకాణం, ఆఫీస్, ఫాం హౌస్.. ఇలా దేనికైనా ఓ భవనం నిర్మించాలంటే.. ఎన్నో వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారం కదా! అయితే ఇప్పుడు అదేమంతా కష్టతరమైనది కాదు. మారుతున్న కాలంతోపాటు ఆధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రెడీమేడ్ ఇళ్లు, భవనాలు అందుబాటులోకి వచ్చాయి. కంటైనర్లు, ఫ్యాబ్రిక్, ఐరన్ మేడ్ భవనాలు.. కావాలకున్న విస్తీర్ణంలో, అనుకున్న సైజులో వారంరోజుల్లో తయారు చేసి మీ ముంగిటకు తీసుకువస్తున్నాయి నిర్మాణసంస్థలు. ధరలు కూడా నామమాత్రమే. తాత్కాలిక నిర్మాణాలు అవసరం అనుకునేవారు ఇటువైపుగా ఆకర్షితులవుతున్నారు.

రెండేళ్లపాటు నిర్వహణ..

కంటైనర్, ఐరన్ మేడ్ క్యాబిన్లు, ఇళ్లు సుమారుగా 30 ఏళ్ల మన్నిక ఉంటుందని నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి. రెండేళ్లపాటు నిర్వహణ మొత్తం తామే చూసుకుంటామని పేర్కొంటున్నాయి. 1.2 మీ.మీ. మందంతో ఉన్న ఇనుపరేకులను నిర్మాణంలో వినియోగిస్తున్నారు. గది లోపటి భాగంలో కనీసం 8 మీ.మీ. మందంతో ఉన్న ప్లైవుడ్ వాడుతునున్నారు. ఇంటీరియర్‌ను వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. బాత్‌రూం, కిచెన్, బెడ్రూంలను పార్టిషన్ చేస్తున్నారు. ఈ భవనాలను నేలపై కనీసం ఒకటిన్నర అడుగుల నుంచి రెండు అడుగుల ఎత్తు వరకు సిమెంటు దిమ్మలు ఏర్పాటు చేసి, దానిపై అమర్చుతున్నారు. ఆయా నిర్మాణసంస్థలు ప్రతి చదరపు అడుగుకు రూ.800 నుంచి 1,300 వరకు వసూలు చేస్తున్నారు.

వారాంతంలో సేదతీరడానికి..

హైదరాబాద్ జనాభా రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. దీంతోపాటే నివాస, వాణిజ్య భవనాలకు డిమాండ్ ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్మాణ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. రూ.కోట్ల విలువైన విల్లాల నుంచి రూ.వేలల్లో అందుబాటులోకి వచ్చే కంటైనర్ క్యాబిన్ల వరకు గిరాకీ పెరుగుతోంది. వారంపాటు ఉద్యోగం, వ్యాపార కార్యకలాపాల్లో బిజీగా ఉంటున్న నగరవాసులు వారాంతంలో సేదతీరడానికి వ్యవసాయక్షేత్రాలకు తరలి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సిమెంట్ నిర్మాణాల కంటే కంటైనర్,, ఫ్యాబ్రిక్, ఐరన్‌తో తయారు చేసే క్యాబిన్లు, నిర్మాణాలను ప్రత్యామ్నాయంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఈ ట్రెండ్ కాస్త వ్యాపార దుకాణాల వైపు విస్తరించింది. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో సైతం రూపాంతరం చెందిన కంటైనర్ క్యాబిన్లు విరివిగా దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ నగర శివార్లలోనే 25 నుంచి 30 సంస్థలు కంటైనర్ క్యాబిన్లు తయారు చేస్తున్నాయి. ఇక ఫ్యాబ్రిక్ నిర్మాణాలు అచ్చం సిమెంటుతో నిర్మించినట్లే కనిపిస్తాయి. వ్యవసాయ క్షేత్రాలు, విలాసవంతమైన నివాస గృహసముదాయాల్లో సైతం గదుల పార్టిషన్ కోసం ఈ తరహా ఫ్యాబ్రిక్ గోడలను నిర్మిస్తున్నారు.

అక్రమ వాహనాలపై ఆర్టీఏ కొరడా

స్కూల్ బస్సులు, ఆటోలు, వ్యాన్‌లపై కేసులు ● పలు వాహనాల జప్తు



సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆర్టీఏ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మోటారు వాహన నిబంధనలను ఉల్లంఘించి నడుపుతున్న వాహనాలను జప్తు చేసినట్లు హైదరాబాద్ సంయుక్త రవాణా కమిషనర్ సి.రమేష్ వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లో ఆరు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేసి మూడింటిని జప్తు చేశారు. వాటిలో కొన్ని ఫిట్‌నెస్, మరికొన్ని పర్మిషన్, ఇన్సూరెన్స్ లేకుండా తిరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఐదు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా ఆరుగురిని మాత్రమే ఆటోల్లో తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. కానీ, ఏకంగా 10 నుంచి 12 మంది విద్యార్థులను తీసుకెళ్తున్నారు. పిల్లల భద్రతకు ఇది ప్రమాదమని, ఇలాంటి ఆటోలపై దాడులను మరింత ఉధృతం చేస్తామని జేటీసీ తెలిపారు. మరోవైపు నగరంలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాలకు చెందిన రెండు వాహనాలపైనా కేసులు నమోదు చేశారు. మ్యాక్సీ క్యాబ్‌గా నడుపుతున్న ఒక ఓమ్ని వ్యాన్‌ను అధికారులు సీజ్ చేశారు.

నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత



ఖాళీ ట్రేల చాటున తరలిస్తున్న నిషేధిత పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఖాళీ ట్రేల చాటున 8 క్వింటాళ్ల విత్తనాలు

శామీర్‌పేట్: ఖాళీ ట్రేల చాటున నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్న ఓ వ్యక్తిని శామీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. సూర్యాపేట నుంచి మంచిర్యాలకు నిషేధిత విత్తనాలను తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు మేడ్చల్ ఎస్‌వోటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ – కరీంనగర్ రాజీవ్ రహదారిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఖాళీ ట్రేల మధ్యలో నిషేధిత పత్తి విత్తనాలు ఉన్నాయి. దీంతో డ్రైవర్ మల్లేష్ (32)ను అదుపులోకి తీసుకొని విచారించగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గుండా రాజు ఆదేశాలతో ఈ విత్తనాలను తరలిస్తున్నట్లు తెలిపాడు. దీంతో 8 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, సెల్‌ఫోన్, డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు రాజును త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీసీపీ తెలిపారు. సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, శామీర్‌పేట సీఐ శ్రీనాథ్, ఎస్సైలు హారిక, మునీందర్, అనిత పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతూ పట్టుబడిన జూనియర్ ఆర్టిస్టు

బంజారాహిల్స్: వెండితెరపై వెలిగిపోవాలని వచ్చిన ఓ యువకుడు గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళితే... విశాఖపట్టణానికి చెందిన లాండ అశోక్‌కుమార్(33) పదో తరగతి చదువుకున్నాడు. సినిమాల్లో నటించాలనే కోరికతో చదువును మధ్యలోనే ఆపేసి కృష్ణానగర్ బాటపట్టాడు. జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తున్నాడు. మంచి నటుడిగా కావాలనుకున్న కలలు నెరవేరకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. అడ్డదారులు తొక్కాడు. వైజాగ్ నుంచి గంజాయి తీసుకువచ్చి మైత్రీవనం, కృష్ణానగర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–5 మెట్రోస్టేషన్ కింద గంజాయి విక్రయిస్తుండగా జూబ్లీహిల్స్ పోలీసులు పట్టుకొని అశోక్‌కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

'వాక్ వే'లో గంజాయి సేవిస్తూ..

కేబీఆర్ పార్క్‌లో పోలీసులకు పట్టుబడ్డ యువకులు



గంజాయి బ్యాచ్‌ను పట్టుకున్న పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ 'వాక్ వే'లో ఓ గంజాయి బ్యాచ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... 'వాక్ వే'లో ఇంటర్‌సెప్టెర్ ఫుట్ పెట్రోలింగ్ పోలీసులు మంగళవారం గస్తీ తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఓ చెట్టు కింద ముగ్గురు యువకులు కూర్చొని గంజాయి తాగుతుండడాన్ని గమనించారు. వెంటనే వారిని పట్టుకొని గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిని వరంగల్‌కు చెందిన వినయ్, నిజామాబాద్‌వాసి సాయి, ఢిల్లీకి చెందిన శివగా గుర్తించారు. బంజారాహిల్స్ పోలీసులు వీరిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇటీవల త్రిపురకు చెందిన ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఇదే వాక్ వేలో గంజాయి తాగుతూ పట్టుబడ్డారు. గంజాయి ఘటనలతో వాకర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

లిఫ్ట్ కేస్‌లో పడి పూజారి దుర్మరణం

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు లిఫ్ట్ కేస్‌లో పడి ఓ పూజారి మృతి చెందాడు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... బోడుప్పల్ ప్రాంతానికి చెందిన నర్సింహమూర్తి(55) పూజారి. ఈస్ట్ మారేడుపల్లి ఫాస్ట్ హైస్కూల్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రీతం అనే వ్యక్తి ఇంట్లో సంవత్సరీకం పూజ చేయడానికి మంగళవారం ఉదయం వచ్చాడు. ఈ క్రమంలో పైఅంతస్తుకు వెళ్లేందుకు గ్రౌండ్ ఫ్లోర్‌లో లిఫ్ట్ కోసం వేచిచూస్తున్నాడు. లిఫ్ట్ కిందకు రాకముందే లిఫ్ట్ డోర్ తెరిచిన నర్సింహమూర్తి ప్రమాదవశాత్తు లిఫ్ట్ కేస్‌లో పడిపోయాడు. వెంటనే లిఫ్ట్ అతనిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

స్విమ్మింగ్ పూల్‌లో దిగి వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: ఈత కొట్టేందుకు స్విమ్మింగ్ పూల్‌లో దిగి ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. పేట్‌బషీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం ... వెంగళరావునగర్‌కు చెందిన సందీప్ చార్లర్(41) ఫ్రీ ఓపెనింగ్ ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య పుష్ప కర్మాకర్, కుమారుడు విహాన్ ఉన్నారు. గత నెల 29న సందీప్ భార్య, కుమారుడితో కలిసి కొంపల్లిలోని ధోలారిధనికి వచ్చాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత కుమారుడితో కలిసి స్విమ్మింగ్ పూల్‌లోకి దిగాడు. ఒక్కసారిగా సందీప్ వణుకుతూ నీటిలో మునిగిపోయాడు. సిబ్బంది అతన్ని బయటకు తీసి సుచిత్రలోని రష్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

స్నేహం నటించి.. అర్ధనగ్న చిత్రాలు తీసి..

వెంగళరావునగర్: స్నేహం నటించి అర్ధనగ్న చిత్రాలు తీసి ఆపై యువతిని ఓ యువకుడు బెదిరించాడు. ఈ ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌లో నివసించే యువతికి ఇన్‌స్టాగ్రాంలో జోష్ హనుమంత్ అనే యువకుడు పరిచయమయ్యాడు. స్నేహంగా ఉండటంతో ఒకరికొకరు ఫోన్ నంబర్లు తీసుకున్నారు. గత నెల 25న అత్యవసరంగా ఉండటంతో ఆమె హనుమంత్‌ను రూ.5 వేలు అడిగింది. అతను ఇవ్వడమే కాకుండా అసభ్యకరమైన కామెంట్స్ పంపాడు. రాత్రికి వీడియోకాల్ చేశాడు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయగానే అర్ధనగ్నంగా కనిపించాలని బలవంతం చేసి ఒప్పించాడు. ఈ క్రమంలో ఆమె ఈ నెల 1వ తేదీన అతనికి తిరిగి నగదు ఇచ్చినా తరచూ ఫోన్ చేస్తూ డబ్బులు ఇవ్వాలని వేధించసాగాడు. అతడి ఫోన్ కాల్స్‌ను ఆమె తిరస్కరించడంతో గతంలో తీసిన ఫొటోలను ఆమెకు పంపాడు. వాటిని ఇన్‌స్టాగ్రాంలో పెడతానని, బంధువులు, స్నేహితులకు పంపుతానని బెదిరిస్తున్నాడు. దాంతో ఆమె విసుగు చెంది అతనిపై చర్యలు తీసుకోవాలంటూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

లైంగిక దాడి కేసులో ముగ్గురి అరెస్టు

ఫిలింనగర్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బస్తీలో నివసిస్తున్న బాలికను అదే ప్రాంతానికి చెందిన కార్తీక్‌బాబు(21), హరీశ్(28), మహమ్మద్ మయూబ్ (23) కొంతకాలంగా వేధిస్తూ గత నెల 30న లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేశారు.

రూ.20 కోట్ల భూమికి ఎసరు!

● కబ్జా చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు ● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాలాపూర్ దళితులు



ఆర్‌సీఐ రోడ్డులోని కబ్జాకు గురవుతున్న స్థలం ఇదే

బడంగ్‌పేట్: రూ.20 ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. రెవెన్యూ అధికారులు, బడంగ్‌పేట పాలకవర్గంలోని కొందరు బడానేతలు కుమ్మక్కై ఈ కబ్జాకు యత్నించారు. అడ్డుకోవాల్సిన అధికారులు సైతం మిన్నకుండటం అనుమానాలకు తావిస్తోంది. బాలాపూర్ మండల పరిధిలోని ఏఆర్‌సీఐ గోడలకు ఆనుకుని సర్వే నంబర్ 74లో సుమారు 2.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కబ్జాకు ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించారు. కార్పొరేషన్ పాలకవర్గంలోని కొందరితో చేతులు కలిపి రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ప్రహరీ నిర్మించి ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారు. అయితే 2010–12లో కొందరు కబ్జాకు యత్నించగా.. సరూర్‌నగర్ రెవెన్యూ అధికారులు అడ్డుకుని ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఏఆర్‌సీఐ ఏర్పాటులో భాగంగా 96 కుటుంబాల నుంచి 96 ఎకరాల భూమిని ఇచ్చామని బాలాపూర్ దళితులు చెబుతున్నారు. ప్రహరీ నిర్మించే సమయంలో వదిలేసిన మూలలు 2.5 ఎకరాలుండగా వాటిని కొందరు అక్రమార్కులు కబ్జాకు పాల్పడుతున్నారని, ఈ భూమిని కాపాడి ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాలకు సూత్రధారుడిగా వ్యవహరిస్తున్న సింగిరెడ్డి జైహింద్‌రెడ్డి, అతని సోదరులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

> **రిపోర్టు ఆధారంగా చర్యలు**
>
> బాలాపూర్ ఆర్‌సీఐ రోడ్డులోని భూమి కబ్జా అయిందని మా దృష్టికి వచ్చింది. అది ప్రభుత్వానిదా? ప్రైవేటుదా అని తేల్చాల్సి ఉంది. సర్వేయర్‌ను పంపాం. వారి రిపోర్టు ప్రకారం రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుని చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిగా తేలితే నిర్మాణాలను కూల్చివేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.
>
> – మాధవీరెడ్డి, తహసీల్దార్, బాలాపూర్

భాగస్వాముల మధ్య పంచాయితీ

కత్తితో ఇద్దరిపై దాడి

ఇబ్రహీంపట్నం రూరల్: వ్యాపార భాగస్వాముల మధ్య పంచాయితీ కత్తిపోట్లకు దారి తీసింది. ఆదిబట్ల ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్ చౌరస్తాలో కృతుంగ హోటల్‌ను ఇద్దరు స్నేహితులు నిమ్మల దీపక్‌రెడ్డి, ఆవుల శరణ్‌రెడ్డి సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. వ్యాపారం సరిగా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో శరణ్‌రెడ్డికి దీపక్‌రెడ్డి రూ.3 లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా దాటవేస్తున్నాడు. ఈ విషయమై హోటల్‌లో ఇద్దరు, మరికొందరు కూర్చుని మాట్లాడుకుంటుండగా అది ఘర్షణ జరిగింది. కత్తితో శరణ్‌పై, అతని అల్లుడు పునీత్‌పై దీపక్ దాడి చేయగా తీవ్ర గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఫ్లాట్ అమ్మారు.. రిజిస్ట్రేషన్ చేయలేదు

- సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీపై బాధితుడు ఫిర్యాదు
- డబ్బు చెల్లించాలన్న వినియోగదారుల కమిషన్

సిటీ, కోర్టులు: ఫ్లాట్ కొనుగోలులో డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఓ రియల్ ఎస్టేట్ సంస్థపై హైదరాబాద్ వినియోగదారుల కమిషన్–3 ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్ నుంచి తీసుకున్న మొత్తం రూ.41.99 లక్షలను తిరిగి 12 శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశించింది. రూ.50 వేలు పరిహారం, ఫిర్యాదుదారుడి ఖర్చులకు రూ.వెయ్యిని ఈ మొత్తం డబ్బును 45 రోజుల్లోపు చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు ఎం.రాంగోపాల్ రెడ్డి, సభ్యులు నారాయణరెడ్డి తీర్పులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హైదరాబాద్, పరిసార ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్, కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడుతోంది. ఈ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా బూదాటి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లుగా బూదాటి పార్వతి, బూదాటి సాత్వికి వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో నిర్మిస్తున్న సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్‌లో టవర్ నెం.10, మూడో అంతస్తులో ఫ్లాట్ నెం.308ను చెన్నై నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన బాలాజీ ప్రీ లాంచింగ్‌లో భాగంగా ఓ ఫ్లాట్ కొనుగోలు చేశారు. ఆ సమయంలో ఒప్పంద పత్రం కూడా రాసుకున్నారు.

మూడేళ్లు గడిచినా...

ఫ్లాట్‌ను సేల్‌డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయల్సి ఉండగా మూడేళ్లు గడిచినా కనీసం నిర్మాణం కూడా మొదలు పెట్టలేదు. కొంతకాలం తర్వాత ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుంటే డబ్బులు వాపసు ఇవ్వాలని కోరినా స్పందించలేదు. తర్వాత లీగల్ నోటీస్ జారీ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన వినియోగదారుల కమిషన్ పిటిషనర్ సాహితీ ఇన్‌ఫ్రాకు డబ్బు చెల్లించిన రూ. 41.99 లక్షలను 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించింది.

చేయని నేరానికి మహిళపై థర్డ్ డిగ్రీ!

- గొలుసు చోరీ కేసులో బాచుపల్లి పోలీసుల చిత్రహింసలు
- కొడతారని భయపడిన ఆమె బాబాయి ఆత్మహత్యాయత్నం



చిత్తారపు లక్ష్మీ



చికిత్స పొందుతున్న రాజేష్

సాక్షి, సిటీబ్యూరో: చేయని నేరాన్ని ఒప్పుకోవాలని ఓ మహిళను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. ఆమె చేతులు, కాళ్ల మీద లాఠీలతో చితకబాదారు. ఈ ఘటనలో ఆమె బాబాయిని విచారణ నిమిత్తం రావాలని పోలీసులు పిలవడంతో భయపడి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చిత్తారపు లక్ష్మీ, తాతారావు భార్యభర్తలు. తాతారావు బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లోని జయదీప్ ఎస్టేట్‌లోని ఎన్‌డీ–5 అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మేన్‌గా, లక్ష్మీ ఇళ్లల్లో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే గత నెల 16న ఎన్‌డీ–4 అపార్ట్‌మెంట్‌లో జీ–1 ఇంటి యజమాని కోరడంతో వారి ఇంట్లో లక్ష్మీ పనికి వెళ్లింది. 18న ఆ యజమాని తన ఇంటిలో బంగారుగొలుసు చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీపై యజమాని అనుమానం వ్యక్తం చేయడంతో 19న పోలీసులు ఆమెను రోజూ స్టేషన్‌కు తీసుకొచ్చి చిత్రహింసలకు గురిచేశారు. కాళ్లు, చేతుల మీద చితకబాదారు. ఏదో ఒకటి తెచ్చి ఇస్తే వదిలేస్తామని పోలీసులు చెప్పడంతో దెబ్బలకు తట్టుకోలేకపోయిన లక్ష్మీ తన బాబాయ్ రాజేష్ మెడలోని గొలుసును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించింది. అయితే అది తన చెయిన్ కాదని యజమాని చెప్పడంతో తిరిగి దానిని లక్ష్మీకి అప్పగించారు.

భయపడి.. పురుగులమందు తాగి..

లక్ష్మీ, ఆమె బాబాయ్ రాజేష్‌ను పోలీసు స్టేషన్‌కు రావాలని మంగళవారం పోలీసులు పిలిచారు. కొడతారేమోనని భయపడిపోయిన రాజేష్ ఠాణా గేటు బయట పురుగులమందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన రాజేశ్‌ను ఆయన భార్య సుధా, బంధువులు వెంటనే బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆసుపత్రికి తరలించారు. వైద్యానికి రోజుకు రూ.45 వేలు ఖర్చు అవుతుందని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిపోతామని బాధితులు బదులిచ్చారు. బయటికి వెళితే అసలు విషయం బట్టబయలవుతుందని భావించిన పోలీసులు.. వైద్య ఖర్చులు తామే భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఐసీయూలో రాజేష్ చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా.. పోలీసులపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళితే ఎవరూ స్వీకరించకపోవడం గమనార్హం. చేయని నేరానికి మమ్మల్ని మానసికంగా, శారీరకంగా హింసించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని లక్ష్మీ, రాజేష్ కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

రెండు వారాల తర్వాత..

బాచుపల్లికి చెందిన పఠాన్ మహబూబ్ జానీ గత నెల 19న తన ఇంట్లో 5 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారని తెలిపారు. లక్ష్మీపై అనుమానం ఉందని తెలపగా ఈ నెల 1న ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి మహిళా పోలీసుల సమక్షంలో విచారించామని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి ఇంట్లో పనిచేసేందుకు వెళ్లి బంగారు చెయిన్‌ను దొంగిలించి, దాన్ని తన ఆడపడుచు భర్త రాజేష్‌కు ఇచ్చినట్లు తెలిపిందని, అయితే ఇప్పటివరకు రాజేష్‌ను ఒక్కసారి కూడా స్టేషన్‌కు పిలవలేదని పోలీసులు తెలిపారు.

> **ఆమె చెయిన్‌ను తిరిగి ఇచ్చేశాం**
>
> విచారణ నిమిత్తం లక్ష్మీని స్టేషన్‌కు తీసుకొచ్చాం. ఎవరూ కొట్టలేదు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే పోలీసులు తమ జోలికి రారని ఓ న్యాయవాది సలహా మేరకు రాజేష్ అలా చేసినట్టు తెలిసింది. ఇంటి యజమాని తన గొలుసు కాదని చెప్పడంతో దానిని ఆమెకే తిరిగి ఇచ్చేశాం. అసలు నిందితుల పట్టుకునేందుకు కేసు దర్యాప్తు చేస్తున్నాం.
>
> – ఉపేందర్, ఇన్‌స్పెక్టర్, బాచుపల్లి

వీధి దీపాల సమస్యను పరిష్కరించండి


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. మంగళవారం ఆమె మధురానగర్‌కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ స్ట్రీట్‌లైట్స్ విభాగం అధికారులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధురానగర్, వెంగళరావునగర్, సిద్ధార్థనగర్, కళ్యాణ్‌నగర్‌కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ గత కొంతకాలంగా తమ కాలనీల్లోని వీధి దీపాలు వెలగడం లేదన్నారు. పలు ప్రాంతాల్లో ఉన్న ఫలంగా వీధి దీపాలు ఆఫ్ అవుతూ మళ్లీ వెలగడం లేదన్నారు. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడటంతో దెబ్బ తిన్నట్లు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ ద్వారా అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ దేదీప్య మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా అన్ని కాలనీల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఈఈ మల్లిఖార్జున్, ఈఈఎస్ఎల్ సంస్థ కాంట్రాక్టర్ శంకర్, అధికారులు రాజేష్, బాలరాజు, చంటి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, సమద్, మధురానగర్ కాలనీ అసోసియేషన్ నేతలు కోడె సాంబశివరావు, సత్యనారాయణ రాజు, వెంగళరావునగర్ కాలనీ నేతలు చిలకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి



వెంకటేశ్వరకాలనీ: మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో సీవరేజీ, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయో వాటి వివరాలను అందజేశారు. కొత్త పనుల జాబితాను కూడా ఆయనకు అందజేసి ఆ ప్రకారం ప్రతిపాదనలు రూపొందించేలా మేనేజర్లను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు

శ్రీనగర్‌కాలనీ: అర్హులైన ప్రతిఒక్కరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అందిస్తామని ఖైరతాబాద్ ఎంఆర్‌ఓ నయీముద్దీన్ అన్నారు. మంగళవారం రహమత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్‌లోని కమలానగర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లపై బస్తీ సభ నిర్వహించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అర్హులకు త్వరలోనే ఇళ్లను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, ఆర్ఐ కిరణ్, బస్తీ నేతలు సాయిలు, నాగరాజు, ఎస్కే హైదర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, ఎంఆర్ఓ నయీముద్దీన్

పని చేయని అధికారులపై వేటు తప్పదు

బోనాల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే దానం

- శాఖల మధ్య సమన్వయం ఉండటం లేదు
- నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: విధుల్లో అలసత్వం వహించే అధికారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, వారు పనితీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేయిస్తానంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్‌ఎంసీ, జలమండలి, వీధి దీపాలు, ఎండోమెంట్, పోలీసు, ఎంటమాలజీ, బయోడైవర్సిటీ అధికారులతో బోనాల పండుగ సందర్భంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల పనితీరు ఏ మాత్రం సరిగా లేదని, ప్రజాప్రతినిధులుగా తాము బస్తీల్లో తిరుగుతుంటే స్థానికులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు హేమలత, జలమండలి సీజీఎం ప్రభు, జీఎం హరి శంకర్, ఖైరతాబాద్ డీఎంసీ జగన్, జూబ్లీహిల్స్ డీఎంసీ ప్రశాంతి, ఈఈలు ఇందిర, విజయ్‌కుమార్, ఏఎంహెచ్‌వోలు రవి, ప్రవీణ, వీధి దీపాల విభాగం డిప్యూటీ ఈఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోవాలి..

పలువురు అధికారులపై వరుసగా ఫిర్యాదులు వస్తున్నా తాను ఎప్పుడూ ఏ అధికారిని ఏమీ అనలేదని ఇకపై ఉపేక్షించేది లేదన్నారు. పదే పదే ఫిర్యాదులు వస్తున్నా తీరుమార్చుకోని అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. పని చేయడం ఇష్టం లేని అధికారులు నేరుగా వచ్చి తనకు చెప్పవచ్చునని ఉన్నతాధికారులతో మాట్లాడి సమర్థులైన వారిని తన నియోజకవర్గంలో నియమించుకుంటానన్నారు. ప్రజాప్రతినిధులు బస్తీల్లో, కాలనీల్లో తిరగాలంటే ఇబ్బందిగా ఉందని అధికారులు సూచించారు. చాలా చోట్ల జలమండలి అధికారులు వాటర్ లైన్లు, డ్రైనేజీ లైన్లు వేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్ల మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. ఫిలింనగర్ బాల్‌రెడ్డి నగర్‌లో డ్రైనేజీ లైన్ వేసి రెండు నెలలు గడుస్తున్నా సీసీ రోడ్డు పనులు ఎందుకు మొదలు కాలేదని ఆయన ప్రశ్నించారు. బంజారాహిల్స్ డివిజన్ ఉదయ్‌నగర్‌లో నాలా కూలి 45 రోజులు దాటుతున్నా ఇంకా నత్తనడకన పనులు కొనసాగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలి

వచ్చే వారం నుంచి బోనాల వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్ల పరిధిలోని 246 దేవాలయాల వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పలు ఆలయాల వద్ద వీధి దీపాలు వెలగడం లేదని వెంటనే వీధి దీపాల విభాగం అధికారులు ఆయా ఆలయాల వద్ద, బస్తీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనవసర సాకులు చెప్పి అధికారులు తప్పించుకోవద్దని హెచ్చరించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై జలమండలి అధికారి మహేందర్‌రెడ్డికి పలు మార్లు ఫిర్యాదు చేసినా వైఖరి మార్చుకోవడం లేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వీధి దీపాల విభాగంలో లైట్లు ఉన్నా కొందరు క్లాంపులు లేవని అధికారులు చెబుతున్నారని మీ స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే తన దృష్టికి తెస్తే ఉన్నతాధికారులతో మాట్లాడితే సమస్య పరిష్కరిస్తానని అన్నారు. ఖైరతాబాద్ డివిజన్‌లో మారుతీ నగర్‌లో మురుగు సమస్యపై బస్తీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

శ్రీనగర్‌కాలనీ: ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం ఆయన ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లోని షంషీర్ ఫంక్షన్‌హాల్‌లో ప్రజా సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్, విద్యుత్, మహిళలకు నగదు పంపిణీ, షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు అమలు జరగడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని, ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, షరీఫ్ ఖురేషి, జావీద్, అజీమ్, జీహెచ్‌ఎంసీ సర్కిల్ డీఎంసీ ఎస్లావత్ నాయక్, వాటర్‌వర్క్స్ డీజీఎం వాహబ్, ఈఈ రాజ్‌కుమార్, బాలానగర్ ఎంఆర్ఓ శ్రీనివాస్, ఆర్ఐ బాలరాజ్, ఆర్ఐ గిరిధర్‌రావు, సివిల్ సప్లై అధికారిణి సరస్వతి, ఎలక్ట్రికల్ ఏడీఈ ప్రేమ్‌కుమార్, సాయితేజ, దినేష్, వేణు, టైన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ మంజుల పాల్గొన్నారు.

దూర విద్యా పితామహుడు ప్రొఫెసర్ జీ రామ్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ యూనివర్సిటీ ఉద్యోగులు..

బంజారాహిల్స్: దేశంలోనే మొట్టమొదటిసారి దూర విద్యను ప్రవేశపెట్టిన వ్యక్తి ప్రొఫెసర్ జీ రామ్‌రెడ్డి అని పలువురు వక్తలు అన్నారు. రామ్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ వ్యవస్థాపక వీసీ ప్రొఫెసర్ జీ రామ్‌రెడ్డి చిత్రపటానికి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సుధారాణి, సీఎస్‌టీడీ డైరెక్టర్ ఆనంద్ పవార్, బానోత్ లాల్, శ్రీనివాస్, మేరీ సునంద, రమాదేవి, ఉద్యోగ సంఘం నాయకులు మహేష్, పలు విభాగాల అధిపతులు, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ పరీక్ష రద్దు చేయాలి

లిబర్టీ: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు డిమాండ్‌చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను, రాష్ట్రాలను సంప్రదించకుండా తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకే అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లేఖ రాయాలన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేశంలో నీట్, నెట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా 24 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మే 5న జరిగిన పరీక్ష నిర్వహణకు ఒక రోజు ముందే హరియాణా, బీహార్‌లో పేపర్ లీకేజీలు జరిగి జిరాక్స్ సెంటర్లలో పేపర్‌లో దొరికాయని, బీహార్‌లో ఒకే సెంటర్‌లో ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు సాధించారన్నారు. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకేజీలు, అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు ఇవ్వాలని, మళ్లీ పరీక్ష జరిగే వరకు విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

లిబర్టీ: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూశారన్నారు. మంగళవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రెండు లక్షల పోస్టులు ఖాళీలను భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

యాకుత్‌పురా: పాతబస్తీ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హరిబౌలీలోని రిఫ్–ఏ–ఆయమ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల కార్యదర్శి పుల్లారెడ్డి,రఘునాథ్ రెడ్డి, మధుసూదన్, విజయ్‌కుమార్, సుశీల్‌కుమార్, భాస్కర్, కార్తీక్, నిషాంత్, సాయినాథ్, శ్రావణ్ పాల్గొన్నారు.

8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలి


శంకర్‌రావును సత్కరిస్తున్న మజ్దూర్ యూనియన్ నేతలు

నాంపల్లి: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ హైదరాబాద్ జనరల్ బ్రాంచ్ కార్యాలయ ప్రారంభోత్సవం మంగళవారం నాంపల్లిలో జరిగింది. ఈ కార్యాలయాన్ని జోనల్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, జోనల్ అధ్యక్షుడు శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు మాట్లాడుతూ..రైల్వే కార్మికుల హక్కుల సాధన కోసం మజ్దూర్ యూనియన రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. ఎనిమిదవ పే కమిషన్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మజ్దూన్ యూనియన్‌లో చేరారు. మజ్దూర్ యూనియన్‌లో చేరిన కార్మికులకు కండువా కప్పి ఆహ్వానించారు. మజ్దూర్ యూనియన్ జోనల్ కోశాధికారి సరోజినీ రెడ్డి, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ ఉదయ్ భాస్కర్, భారాటీ, సిసియాస్ ప్రెసిడెంట్ స్వామి, ఏడీ ఎస్‌లు నాగలక్ష్మి, చైర్మన్ గోపాల్, సెక్రెటరీలు వర ప్రసాద్, ఢిల్లీరావు, శ్రీనివాస్, సమయ్య, వేద ప్రకాష్, రాజేందర్, అంజయ్య, హైదరాబాద్ జనరల్ బ్రాంచ్ కోశాధికారి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీటీఎస్ ఆలయ హుండీ ఆదాయం రూ.1,81,933


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్ కాలనీలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్ టెంపుల్) హుండీ ఆదాయం రూ.1,81,933 వచ్చింది. గత మూడు నెలల కాలంలో భక్తులు దేవుడికి సమర్పించిన కానుకల హుండీని మంగళవారం అధికారులు, కమిటీ నేతలు, పూజారులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ మాట్లాడుతూ హుండీ ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆలయ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు ఆలయ ఈ.ఓ. జయరామయ్య, పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, కమిటీ నేతలు సిహెచ్.శ్రీనివాస్, ఈ.కె.సత్యనారాయణ, కిలారి నరసింహారావు, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కరెంటు వైర్లపై పడ్డ చెట్టు..


ఫిలింనగర్ రోడ్డునెంబర్–2లో కరెంటు వైర్లపై ఒరిగిన చెట్టు..

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్డునెంబర్–2లో ఓ చెట్టు నేలకొరిగి కరెంటు వైర్లపై పడింది. ప్రమాదం పొంచి ఉందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఈ చెట్టును కొట్టేయాలని, లేకపోతే వైర్లు తెగి పడి ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వేణుగోపాల్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు అర్కార వేణుగోపాల్‌రావు అన్నారు. శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లోని తెలుగు భాషా నిలయంలో పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థుల వ్యాసరచన పోటీల్లో విజేతలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీవీ నరసింహారావును నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ రమణాచారి కె.చంద్రప్రకాష్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి డాక్టర్ కె.సరస్వతి, డాక్టర్ విజయ సామరాజు, పీవీ ప్రభాకర్ రావు ఉడయవర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయండి


మిథిలానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్: డివిజన్ పరిధిలో అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె శానిటేషన్ సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో బంజారాహిల్స్ రోడ్డునెంబరర్–10లోని మిథిలానగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా చెత్తా చెదారం, వ్యర్థాలు రోడ్డుపక్కన పారవేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పగుతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ ప్రతిరోజూ చెత్తను తొలగించాలని అక్కడే ఉన్న ఎస్ఎఫ్ఏలకు సూచించారు. రోడ్డుకు రెండువైపులా నెలల తరబడి వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేయడం ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో వెంటనే వాటిని తొలగించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. నల్లాల్లో మంచినీటి ప్రెషర్ తక్కువగా వస్తుందని ఫిర్యాదు చేయగా, జలమండలి మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో మోసం

క్రైం కార్నర్..

రూ.16లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఫేస్ బుక్‌లో ట్రేడింగ్ ప్రకటన చూసి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేశాడు. సైబర్ నేరగాళ్లు తాము సృష్టించిన లింక్‌ను బాధితుడికి పంపించి వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకుని యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అనంతరం అతడిని తమ కంపెనీ గ్రూప్‌లో యాడ్ చేస్తున్నామని చెప్పి, ట్రేడింగ్ పెట్టుబడులు పెట్టాలని సూచించారు. పెట్టుబడులు, లాభాలకు సంబంధించిన గ్రూప్ సభ్యుల సందేశాలు చూసి బాధితుడు విడతల వారీగా బ్లాక్ ట్రేడింగ్, ఐపీఓలలో మొత్తం రూ.16,43,557 పెట్టుబడిగా పెట్టాడు. అయితే నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వీలు కాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట టోకరా

వెంగళరావునగర్: ఆన్‌లైన్ జాబ్ పేరుతో యువకుడి నుంచి నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్‌కు చెందిన ముద్దాల సతీష్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. గత నెల 10న అతడికి ఆన్‌లైన్ జాబ్ పేరుతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. వారు సూచించిన ఉత్పత్తులకు రేటింగ్ ఇవ్వాలని సూచించారు. అందుకు అంగీకరించిన సతీష్ వాట్సప్‌లో వారు సూచించిన ఉత్పత్తులకు రేటింగ్ ఇచ్చాడు. అనంతరం పలు దఫాలుగా రూ.49,500 పంపగా అవి తిరిగి రాలేదు. దాంతో తాను మోసపోయానని గ్రహించి మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

ఖైరతాబాద్: డ్యూటీకి వెళ్తున్నానని వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఖైరతాబాద్‌లో నివాసముండే ప్రేమ్‌కుమార్ రాం (29) భార్య మీనాశెట్టితో కలిసి నివాసముంటున్నాడు. అతను విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. గత నెల 11న ఇంటికి వచ్చిన ప్రేమ్‌కుమార్ రాం 14న విశాఖపట్నం బయలుదేరి వెళ్లాడు. ఆ మర్నాటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అతడి భార్య మీనా శెట్టి బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

నెంబర్ ప్లేట్ లేని బైక్ సీజ్..

బంజారాహిల్స్: నెంబర్ ప్లేట్ లేకుండా బైక్ నడుపుతున్న యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ అవినాష్‌బాబు బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని అగ్రసేన్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మేడ్చల్‌కు చెందిన నీరజ్ నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వెళుతూ పట్టుబడ్డాడు. ఆరా తీయగా ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడానికి టెంపరరీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేసుకోలేదని అతను పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అద్దెకు కెమెరాలు తీసుకుని మోసం

వెంగళరావునగర్: కెమెరాలు అద్దెకు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇంజినీర్స్ కాలనీలో నివాసం ఉండే ఎస్.క్రాంతికుమార్ గత కొంతకాలంగా కెమెరాలు అద్దెకు తిప్పుతుంటాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 10న రితిక్ కుమార్ జైన్ అనే వ్యక్తి అతడి వద్ద కెమెరాలు అద్దెకు తీసుకున్నాడు. జులై 1న వాటిని తిరిగి ఇస్తానని నమ్మబలికాడు. దీంతో క్రాంతికుమార్ అతడికి రూ.59 లక్షల విలువైన 9 కెమెరాలు, 15 లెన్స్, రెండు గింబల్స్‌ను చ్చాడు. మొత్తం అద్దె రూ.19.90 లక్షలు అవుతుందని చెప్పాడు. అయితే గడువు తీరినా అతను కెమెరాలు తిరిగి ఇవ్వకపోగా ఫోన్లు చేసినా స్పందించలేదు. దీంతో అతడి వివరాలు ఆరా తీయగా కెమెరాలను వేరే వారికి అద్దెకు ఇచ్చాడని, వారు అతని లావాదేవీల కారణంగా తిరిగి ఇవ్వలేదని తెలిసింది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన క్రాంతికుమార్ మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణతో పనిచేసే వారికి సమాజంలో గుర్తింపు

ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ముషీరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందంజలో ఉన్నారని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ భవనంలో ఐవీఎఫ్ ఇంటర్నేషనల్ అడ్వైజరీ కమిటీ బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా వైశ్యులందరినీ ఏకతాటిపైకి తేవడంతో పాటు ఐవీఎఫ్ అభ్యున్నతికి విశేష సేవలు అందిస్తున్నందుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. గంజి రాజమౌళి గుప్తా క్రమశిక్షణ, సేవకు మారుపేరు అని ప్రశంసించారు. పేద వైశ్యుల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో అత్యంత శక్తివంతమైన సేవా సంస్థగా ఐవీఎఫ్ కొనసాగుతుందన్నారు. గంజి రాజమౌళి గుప్తా మాట్లాడుతూ..నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసే వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. నిస్వార్థంగా పని చేసే వారికి మంచి పేరు, ప్రఖ్యాతి, ఉన్నత పదవులు వరిస్తాయన్నారు. ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వైశ్య విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ మహిళా విభాగం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజశేఖర్‌గుప్తా, సుధాకర్‌గుప్తా, ఉప్పల స్వప్న, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రాజమౌళి గుప్తాను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా

పీసీసీ అధ్యక్ష పదవి బీసీకి ఇవ్వాలి

కాచిగూడ: ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే టీపీసీసీ అధ్యక్ష పదవి కాంగ్రెస్ పార్టీలో అర్హులైన బీసీ వ్యక్తికి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. మంగళవారం కాచిగూడలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం పదవులకు అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవుల్లో బీసీలు లేరని, టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలని ఆయన కోరారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో కూడా బీసీలకు పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, నందగోపాల్, పండరినాథ్, బీసీ కోర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెట్ల కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించండి

ఉస్మానియాయూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సెట్ల కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్(టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ యాదవ్ మంగళవారం డిమాండ్ చేశారు. టీఎస్ ఐసెట్–2024తో పాటు ఎడ్‌సెట్, లాసెట్, పీజీఈ సెట్, పీసెట్ తదితర సెట్ల పరీక్షలు ముగిసి ఫలితాలు ప్రకటించి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియకు తేదీలను ప్రకటించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. కరోనా నుంచి ప్రతి సంవత్సరం ప్రవేశాల జాప్యం వలన స్వదేశీ విద్యార్థులతో పాటు విదేశీ విద్యార్థులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రవేశాలు, పాఠాల బోధన, పరీక్షల నిర్వహణ, ఫలితాల ఆలస్యం కారణంగా విదేశీ విద్యార్థులు తెలంగాణ వర్సిటీల్లో చేరడం లేదన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు వెంటనే స్పందించి వివిధ సెట్ల ప్రవేశాలకు కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

రెండు రోజుల్లో దేవాలయాల కమిటీలకు చెక్కులు

సాక్షి, సిటీబ్యూరో: బోనాల పండగ సందర్భంగా దేవాలయాల కమిటీలకు రెండు రోజుల్లో చెక్కులు పంపిణీ చేస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే ఆషాఢ జాతర బోనాల ఉత్సవాలకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లు పూర్తవుతాయని వెల్లడించారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

గ్రూప్–2 అభ్యర్థులకు ఉచిత గ్రాండ్ టెస్టులు

సాక్షి, సిటీబ్యూరో: టీజీపీఎస్సీ గ్రూప్–2 పరీక్ష రాసే అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులను ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఉచితంగా నిర్వహించనుంది. మొత్తం 8 గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తోంది. జూలై 4 వరకు ఈ టెస్టులు జరుగుతాయి. ఆఫ్‌లైన్ ద్వారా హిమాయత్‌నగర్, దోమలగూడ బ్రాంచ్‌ల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. వివరాల కోసం ఫోన్: 040–23228513, 93468 82593.

హెచ్‌సీయూకు శ్రీలంక జర్నలిస్టుల బృందం

రాయదుర్గం: శ్రీలంక జర్నలిస్టుల బృందం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని మంగళవారం సందర్శించింది. భారత ప్రభుత్వంలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సహకారంతో రాష్ట్రానికి చెందిన డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో 'మీడియా మేనేజ్‌మెంట్ ఫర్ జర్నలిస్ట్స్ అండ్ మీడియా ప్రొఫెషనల్స్' అనే అంశంపై రెండు వారాల శిక్షణ కార్యక్రమంలో శ్రీలంక నుంచి దాదాపు 30 మంది జర్నలిస్టుల బృందం పాల్గొంటోంది. ఈ సందర్భంగా ప్రతినిధులు హెచ్‌సీయూను సందర్శించారు. శ్రీలంక ప్రధానమంత్రికి సలహాదారు(మీడియా అండ్ అంతర్జాతీయ వ్యవహారాలు) సుగీశ్వర పి సేనాధిర ఈ బృందంలో భాగస్వామిగా పాల్గొంటున్నారు. ఈ బృందం సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌ను సందర్శించారు. హెచ్‌సీయూలోని అధ్యాపకులతో సమావేశమయ్యారు. అత్యాధునిక కమ్యూనికేషన్, మీడియా సౌకర్యాలను సందర్శించారు. అనంతరం వారిని సత్కరించారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

- ప్రజావాణికి 601 దరఖాస్తులు..

లక్డీకాపూల్: ప్రజావాణి చుట్టూ తిరగడమే తప్ప పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో భూబాధితులు, ఉద్యోగులు, ఇళ్ల కోసం పెద్ద సంఖ్యలో అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని పారిశుద్ధ్య కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ, మున్సిపాల్టీలోని కార్మికులను పర్మినెంట్ చేసేవరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డితో కలిసి ప్రజావాణి నోడల్ అధికారి దివ్య సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజావాణిలో మొత్తం 601 దరఖాస్తులు అందగా వాటిలో 142 అర్జీలు రెవెన్యూ పరమైన సమస్యలవే ఉన్నాయి. 87 అర్జీలు పౌరసరఫరాల శాఖకు, మున్సిపల్ శాఖకు 53, హోంశాఖకు 47 దరఖాస్తులు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 52, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై 220 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

గూడుపై ఆశలు..

మళ్లీ పేదల ఉరుకులు పరుగులు

- కలెక్టరేట్లకు దరఖాస్తుదారుల తాకిడి
- బీఆర్‌ఎస్ హయాంలో 65వేల ఇళ్ల పంపిణీ
- మిగిలిన 32 వేల పెండింగ్ ఇళ్లతో పాటు ఇందిరమ్మ గృహాలు

మహానగరంలో నీడ లేని నిరుపేదలకు గూడుపై ఆశలు చిగురిస్తున్నాయి. పెండింగ్‌లో డబుల్ బెడ్ రూమ్‌తో పాటు కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రకటనతో మళ్లీ పేదల ఉరుకులు పరుగులు ప్రారంభమయ్యాయి. కలెక్టరేట్లలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి క్యూ కడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిర్వహిస్తున్న ప్రజావాణి, ప్రజాదర్బార్‌కు ఇళ్ల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చి చేరుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా పీఎం ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద ఇళ్ల నిర్మాణానికి చేయూత అందిస్తామని ప్రకటించడంతో పెండింగ్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి మోక్షం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో రెండు పడక గదుల ఇళ్లు దక్కని దరఖాస్తుదారులతో పాటు కొత్త వారు సైతం తిరిగి అర్జీలు చేసుకుంటున్నారు. – సాక్షి, సిటీబ్యూరో



పది లక్షలకు పైనే..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో సుమారు 10 లక్షల కుటుంబాలు గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అందులో మీ–సేవ ఆన్‌లైన్ ద్వారా సుమారు 7.09 లక్షల కుటుంబాలు, ఆఫ్‌లైన్(నేరుగా) 3 లక్షల వరకు కుటుంబాలు కలెక్టరేట్ ఆఫీసుల్లో దరఖాస్తులు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే అప్పట్లో అధికారులు కేవలం ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకొని ప్రాథమిక పరిశీలనతో సుమారు 3.60 లక్షల దరఖాస్తులను గుర్తించారు. అందులో దాదాపు 1.60 లక్షల దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ పూర్తిచేసి 1,31,214 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. డబుల్ బెడ్‌రూమ్‌లు తక్కువ, అర్హులు ఎక్కువగా ఉండటంతో ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి డ్రా పద్ధతిలో నాలుగు విడతలుగా 61,807 లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణ పరిస్థితి ఇదీ..

గత ప్రభుత్వం గ్రేటర్ పరిధిలో సుమారు 111 ప్రాంతాల్లో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి 68,176 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసింది. 29 లొకేషన్(ఇన్ సీటు) పేదల పాత గృహాలను తొలగించి నిర్మించిన కొత్త గృహాల్లో సుమారు 5,660 గృహాలు లబ్ధిదారులకు పంపిణీ చేసింది. వాస్తవంగా మొత్తం పాత గృహాలు తొలగించిన(ఇన్ సీటు) 40 ప్రాంతాల్లో 8,898 గృహాలు, 71 ఖాళీ స్థలాల్లో 91,102 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించి పనులు చేపట్టింది. 42 ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసింది. మిగతా 38 ప్రాంతాల్లో పనులు కొనసాగగా, రెండు ప్రాంతాల్లో 2,026 గృహాల నిర్మాణాలు వివిధ కారణాలతో నిలిచిపోయాయి. ఎన్నికల గడువు సమీపించడం, గతేడాది సెప్టెంబర్ మాసంలో హడావుడిగా నిర్మాణం పూర్తయిన ఇళ్లను పంపిణీ చేసి చేతులు దులుపుకుంది. మిగతా 32,533 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి.

అప్పట్లో ఇళ్ల నిర్మాణాలు ఇలా..

జిల్లా	డబుల్ బెడ్‌రూమ్స్
హైదరాబాద్ జిల్లా	9,453
మేడ్చల్ జిల్లా	38,419
రంగారెడ్డి జిల్లా	23,908
సంగారెడ్డి జిల్లా	28,220

గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ ఇలా..

ఇన్‌సీటు (పాత గృహాలు కోల్పోయిన లబ్ధిదారులు)	5,660
మొదటి విడత	11,700
రెండో విడత	13,200
మూడు, నాల్గవ విడత	36,907

రైతులు భూసార పరీక్షలు చేసుకోవాలి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమీకృత ప్రయోగశాలల భవన సముదాయం ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

ఏజీవర్సిటీ: రైతులు పంట పొలాల్లో పంటలు వేసుకొనే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని అందుకే రైతుల కోసమే నూతనంగా సుమారు రూ.8 కోట్లతో సమీకృత ప్రయోగశాలల నిర్మాణం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాజేంద్రనగర్‌లో నూతనంగా నిర్మించిన సమీకృత ప్రయోగశాలల భవన సముదాయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూముల్లో ఏదో ఒక పంట వేసి చాలామంది రైతులు దిగుబడి రాకపోవడంతో నష్టపోతున్నారని, అందుకే పంటలు వేసే ముందు భూసార పరీక్షలు, విత్తనాలు వేసే ముందు విత్తన పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సమీకృత భవనాల్లో ఎరువుల నియంత్రణ ప్రయోగశాల, విత్తన పరీక్ష కేంద్రం, ప్రాంతీయ భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లాస్థాయితో పాటు రాష్ట్ర స్థాయిలో ఉన్న అన్ని ప్రయోగశాలలను ఒక్కొక్కటిగా ఆధునీకరిస్తామని, వాటి సేవలను వినియోగించుకునేలా చేస్తామని ఆయన తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఎరువుల నియంత్రణ ప్రయోగశాలలో ఏడాదికి 6 వేల నమూనాలు చేయవచ్చని, అలాగే విత్తన పరీక్ష కేంద్రంలో 8 వేల విత్తన నమూనా పరీక్షలు నిర్వహిస్తారని, ప్రతి సంవత్సరం 20 వేల భూసార పరీక్షలు నిర్వహించేందుకు వీలుందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానవన డైరెక్టర్ యాస్మిన్, కో ఆపరేటివ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కే.శశాంక్, వ్యవసాయ పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



మన్సూరాబాద్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పనామా చౌరస్తా నుంచి ఆటోనగర్ వరకు, హయత్‌నగర్‌లో ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తెలిపారు. ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, క్లాం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి సామ రంగారెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జాతీయ రహదారి రోడ్డు డిజైన్లను సమగ్రంగా పరిశీలించకుండా ఆమోదం తెలిపి స్థానికులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. 8 నెలల క్రితం జాతీయ రహదారి పనుల డిజైనింగ్‌లను పరిశీలించి పనామా నుంచి ఆటోనగర్ వరకు, హయత్‌నగర్ వద్ద మట్టితో కూడిన ఫ్లైఓవర్ల నిర్మాణం ఉందని, దీంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతాయని గమనించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్‌గడ్కారీతో మాట్లాడటంతో రీడిజైనింగ్ చేసి ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టాలని రాష్ట్ర చీఫ్ ఇంజినీర్‌కు ఆదేశాలిచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. నాయకులు నాంపల్లి రామేశ్వర్, మంగరెడ్డి, శ్రీనివాస్ కవితారెడ్డి పాల్గొన్నారు.

విమానాశ్రయంలో 'అవాన్' అదనపు బ్యాగేజీ సేవలు



అదనపు బ్యాగేజీ సేవలు ప్రారంభిస్తున్న కంపెనీ సీఈఓ, వ్యవస్థాపకురాలు మీరా సింగ్

హఫీజ్‌పేట్: హైదరాబాద్ విమానాశ్రయంలో 'అవాన్' అదనపు బ్యాగేజీ సేవలను ప్రారంభిస్తున్నట్లు అవాన్ ఇండియా ఫౌండర్, సీఈఓ మీరాసింగ్ పేర్కొన్నారు. కొండాపూర్ హైటెక్ సిటీ సమీపంలోని లెజెండ్ ప్లాటినమ్ భవనంలోని అదనపు బ్యాగేజ్ కియోస్క్‌ను ఆమె మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019వ సంవత్సరంలో అవాన్ అదనపు బ్యాగేజ్ సేవలు ప్రారంభం అయ్యాయన్నారు. కానీ కోవిడ్ వల్ల కొంతమేర సేవలు నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడు దేశమంతా పిన్‌కోడ్ ఉన్న ప్రదేశాలకు ఇంటింటికీ పికప్, డెలివరీ సేవలను అందిస్తున్నామన్నారు. దేశంలో ప్రముఖ సంస్థగా అవాన్ ఇండియా ఎదిగిందన్నారు. లాజిస్టిక్స్, ఎక్స్‌ప్రెస్ కార్గో బ్రాండ్‌లకు మర్గదర్శకత్వం వహిస్తున్న హైదరాబాద్ తమ నివాసంగా మారిందన్నారు. దేశంలోని ప్రతి ప్రాంతానికి, ప్రపంచంలో కూడా తమ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే దేశంలో ఢిల్లీ, జైపూర్, లక్నో, అహ్మదాబాద్, గుహాటీ, హైదరాబాద్‌తో పాటు వివిధ దేశాలైన సింగపూర్, ఆస్ట్రేలియాల్లో కార్గో సేవలు నడుస్తున్నాయన్నారు. ప్రతి విమానాశ్రయంలో అదనపు బ్యాగేజీకి రూ.500 కిలో చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. ఈ నెల నుంచి కిలోకు రూ.650 తీసుకోవడం జరిగిందన్నారు. కానీ తమ అవాన్ వినియోగదారులకు అదనపు బ్యాగేజీ సేవలు అతి తక్కువ ధరకే కేవలం రూ.89లు కేజీకి చొప్పున వసూలు చేస్తోందన్నారు. డిసెంబర్ వరకు 50 కియోస్క్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజావాణిలో అన్నపూర్ణ

లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జలమండలి అధికారులు ఉచిత తాగునీటి సౌకర్యాన్ని కల్పించగా బల్దియా అధికారులు అన్నపూర్ణ భోజన సదుపాయాన్ని కల్పించారు. మంగళవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజావాణికి వివిధ సమస్యలపై వస్తున్న వారికి మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా భోజన వసతి ఏర్పాటు చేశామని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఈ సదుపాయం ఉంటుందన్నారు.

ఈ–బైక్.. ఓకే..


పర్యావరణహితమైన ప్రయాణానికే మొగ్గు

- మెట్రో ప్రయాణికులపై బిట్స్‌పిలానీ అధ్యయనంలో వెల్లడి
- ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీకి అనుకూలం
- 60 శాతం మంది ఈ బైక్‌ల పట్ల ఆసక్తి

ఎలక్ట్రిక్ బైక్.. ఇప్పుడు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి సాయంత్రం తిరిగి ఇల్లు చేరే వరకు పర్యావరణ ప్రియమైన ప్రయాణానికే మొగ్గుచూపుతున్నారు. తారెత్తిస్తున్న వాహన కాలుష్యం నుంచి కాపాడుకునేందుకు ఎలక్ట్రిక్ బైక్ ఎంతో బెటర్ అని సిటీజనులు తేల్చేశారు. వాహనాల ఖరీదు, చార్జింగ్ సదుపాయం లేకపోవడం వంటి కారణాల వల్ల కొందరు గోలుకు వెనుకంజ వేస్తున్నప్పటికీ నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణం చేసే 60 శాతం మెట్రో ప్రయాణికులు మాత్రం ఈ–బైక్‌లకే మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్ బిట్స్‌పిలానీ, ఆస్ట్రేలియాకు చెందిన లాట్రుబ్ వర్సిటీల పరిశోధన విద్యార్థులు జరిపిన అధ్యయనంలో ఈ మేరకు వెల్లడైంది. ప్రస్తుతం నగరంలోని నాగోల్–రాయదుర్గం, ఎల్‌బీనగర్–మియాపూర్, జేబీఎస్– ఎంజీబీఎస్‌ల మధ్య మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. ప్రతిరోజూ సుమారు 4.80 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. కానీ వివిధ మార్గాల్లో ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం లేకపోవడంతో చాలా మంది వ్యక్తిగత వాహనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. కనెక్టివిటీ సదుపాయాలు పెరిగితే మరింత ఎక్కువ మంది మెట్రోల్లో ప్రయాణం చేసే అవకాశం ఉంది. –సాక్షి, సిటీబ్యూరో

ఈ–బైక్ ఉంటే చాలు..

నగరంలోని బేగంపేట్, హైటెక్‌సిటీ, రాయదుర్గం, నాగోల్, ఉప్పల్ మెట్రోస్టేషన్‌లతో పాటు కొండాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో సుమారు 482 మంది ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. వారిలో 60 శాతం మంది ఇంటి నుంచి మెట్రోస్టేషన్ల వరకు చేరుకొనేందుకు, అక్కడి నుంచి ఆఫీసులకు వెళ్లేందుకు ఈ–బైక్‌లు అందుబాటులో ఉంటే చాలని తెలిపారు. ఈ–బైక్‌లను ఎంపిక చేసుకుంటున్న వారిలో మహిళలే ఎక్కువ శాతం ఉండటం గమనార్హం. మెట్రో స్టేషన్లకు కనీసం 10 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేసేవిధంగా ఈ–బైక్‌లు ఉంటే మంచిదని పేర్కొన్నారు. మరోవైపు ఈ బైక్‌ల కోసం ప్రత్యేకమైన ఫీడింగ్ చానళ్లను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. ఇంధనభారం, ట్రాఫిక్ రద్దీ, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాల దృష్ట్యా ఈ బైక్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ అధ్యయనంలో కొందరు భిన్నాభిప్రాయాలను కూడా వ్యక్తం చేసినట్లు పరిశోధక విద్యార్థులు తెలిపారు. ధరలు, చార్జింగ్ సదుపాయం లేకపోవడం వంటి అంశాలను వారు ప్రస్తావించినట్లు పేర్కొన్నారు.



సిటీలో అరకొర కనెక్టివిటీ..

ప్రస్తుతం హైటెక్‌సిటీ, రాయదుర్గం తదితర స్టేషన్ల నుంచి ఐటీ కారిడార్‌లు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, అమెరికన్ కాన్సులేట్‌లకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. బైక్‌ట్యాక్సీలు, ఆటోలు, క్యాబ్‌లు తిరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు ఈ–బైక్‌లు మాత్రం అందుబాటులో లేవు. గతంలో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కోసం హెచ్‌ఎంఆర్ హోండాయాక్టీవా వంటి వాహనాలను ఏర్పాటు చేసింది. కానీ అవి ఎక్కువ రోజులు కొనసాగలేదు.

పుడమి తల్లికి కానుక!

- ట్రిపుల్ ఆర్‌తో ప్లాస్టిక్ వాడకానికి చెక్
- ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకంతో పెనుముప్పు
- జీహెచ్‌ఎంసీలో అమలుకు నోచుకోని వైనం
- నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే

సాక్షి, సిటీబ్యూరో: గతంలో పలు పర్యాయాలు ప్లాస్టిక్ బ్యాగ్‌లను నిషేధించే ప్రయత్నాలను జీహెచ్‌ఎంసీ చేసింది. కొంతకాలం ఆ కార్యక్రమాలు కొనసాగించి, అర్ధంతరంగా ప్లాస్టిక్ బ్యాగుల నిషేధాన్ని పూర్తిగా మరిచిపోయినట్లుంది. రెండేళ్ల క్రితం ప్లాస్టిక్ బ్యాగులపై నిషేధం అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపింది. తొలుత ప్రజలకు అవగాహన కల్పించి, దశలవారీగా ఉల్లంఘనులకు పెనాల్టీలు విధిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆ ఏడాది స్వచ్ఛ ర్యాంకింగ్స్‌లో ప్లాస్టిక్ నిషేధం ప్రధానాంశంగా ఉండటంతో ర్యాంకు కోసం ఆ కార్యక్రమం చేపట్టారు. అంతే తప్ప కనీసం ఆ ఏడాది కూడా ఆ కార్యక్రమం అమలు చేసిన పాపాన పోలేదు.



- బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా దీన్ని ప్రస్తావించాల్సి వస్తోంది. వాస్తవానికి 2021 సెప్టెంబర్ నుంచి కేంద్రం ప్లాస్టిక్‌పై నిషేధం విధించింది. కానీ వివిధ నగరాల్లో మాదిరే హైదరాబాద్, జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలైన పాపాన పోలేదు.

ఊగిసలాటలో ప్లాస్టిక్ నిషేధం..

- గ్రేటర్‌లో ప్లాస్టిక్ నిషేధంపై దాదాపు దశాబ్దానికి పైగా ఊగిసలాడింది. జీహెచ్‌ఎంసీ మేయర్‌గా బండ కార్తీకరెడ్డి, కమిషనర్‌గా ఎంటీ కృష్ణబాబు ఉన్న సమయంలో 40 మైక్రాన్లలోపు ప్లాస్టిక్‌పై నిషేధాన్ని కొద్ది రోజులపాటు అమలు చేశారు. అనంతరం వివిధ కారణాలతో దానికి గుడ్‌బై చెప్పారు.
- బొంతు రామ్మోహన్ మేయర్‌గా, బి.జనార్దన్‌రెడ్డి కమిషనర్‌గా ఉన్న సమయంలోనూ కొద్దిరోజుల పాటు 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేశారు. అనంతరం మరిచిపోయారు.
- దానకిశోర్ కమిషనర్‌గా ఉన్న సమయంలో సింగిల్ యూజ్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో సింగిల్‌యూజ్ వాడలేదని ప్రతినెలా రాతపూర్వకంగా తెలిపితేనే వివిధ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని నిర్ణయించారు. కానీ అదీ అమలుకు నోచుకోలేదు.
- రామ్మోహన్ హయాంలోనే 2018లో మైక్రాన్లతో సంబంధం లేకుండా గ్రేటర్‌లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని పాలకమండలిలో ప్రతిపాదించి ప్రభుత్వ ఆమోదానికి కూడా పంపారు. అనంతరం 2022 నాటికి నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీగా మారుస్తామని అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ సమక్షంలో ప్రతిజ్ఞ కూడా చేశారు. కానీ 2024 నాటికి ఆ మాటే మరిచారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలు

- ప్లాస్టిక్ బ్యాగ్స్ భూమిలో సులువుగా కరిగిపోవు. కొన్ని వందల సంవత్సరాల సమయం పడుతుంది.
- భూమిలో విషపూరితమైన పదార్థాలను విడుదల చేసి, నేల సారం తగ్గిపోయేలా చేస్తుంది.
- ప్లాస్టిక్ బ్యాగ్స్‌ను కాలిస్తే గాలిలోకి విష వాయువులను విడుదల చేస్తాయి. దీంతో వాయు కాలుష్యం ఏర్పడుతుంది.
- ప్లాస్టిక్ బ్యాగుల్లో ఆహారం నిల్వ చేస్తే కాలుష్య కారకాలు చేరి విషతుల్యమవుతుంది.
- ప్లాస్టిక్ తయారు చేసే సమయంలో తీవ్రమైన విషపూరితమైన రసాయనాలు వాతావరణంలోకి విడుదల అవుతాయి.
- ప్లాస్టిక్ బ్యాగులు డ్రైనేజీ వ్యవస్థకు ఆటంకం కలిగిస్తాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో డ్రైనేజీ కాల్వలకు అడ్డుపడి వరదలకు కారణం అవుతాయి.

నేడు ప్లాస్టిక్ రహిత దినోత్సవం

- అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ దినోత్సవాన్ని బుధవారం జరుపుకుంటున్నారు. ప్లాస్టిక్ కారణంగా పర్యావరణానికి జరిగే కీడు గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చేయడం ఈ దినోత్సవం లక్ష్యం. ఇందుకోసం కింది సూచనలు పాటించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.
- సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి.
- ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్, బాటిల్స్ వాడొద్దు.
- బయోడిగ్రేడబుల్ ప్యాకేజింగ్‌తో ఉత్పత్తుల్ని ఎంచుకోవాలి.
- క్లీన్ అప్ కార్యక్రమాల్లో పాల్గొనండి.
- ప్లాస్టిక్ కాలుష్యం గురించి అవగాహన కల్పించండి.

జలమండలి ఎండీని కలిసిన యూనియన్ ప్రతినిధుల బృందం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఎండీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌రెడ్డిని వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కే.రాజిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ జహంగీర్, జనరల్ సెక్రటరీ శేఖర్, కార్యవర్గ సభ్యులు నర్సింగ్‌రావు అజయ్‌నాథ్, నరసింహారెడ్డి, మోతిరామ్, పాండు, సాయికిరణ్ గౌడ్, విశ్వనాథ్, సయ్యద్ గౌస్ పాషా, సాయిమల్లిక్, రవి, శేఖర్‌రెడ్డి, గోపాలకృష్ణ, అశోక్, ట్రెజరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అన్ని ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలి



మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఈవీఎం వల్ల ట్యాంపరింగ్ జరుగుతోందని, ఫలితాలు పూర్తిగా తారుమారు అవుతున్నాయన్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం)లతో లాభం లేదని, భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తే ఫలితాలు సానుకూలంగా వస్తాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పంచాయతీరాజ్ నుంచి పార్లమెంట్ వరకు బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహించేలా ఇప్పటి నుంచే కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని అనేక అనుమానాలు వ్యక్తం అవుతుండటంతో పాటు మేధావులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, సైంటిస్టులు విశ్లేషకులు తమ అభిప్రాయాలను చెప్పారని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ట్యాంపరింగ్ జరగడం వల్లే బీజేపీ, టీడీపీ, జనసేనకు అత్యధిక సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. తమ అభ్యర్థులకు కనీసం 50 వేల ఓట్లు వస్తాయని అనుకుంటే కేవలం 5 నుంచి 10 వేలకి మించి రాలేదని, ముమ్మాటికీ ట్యాంపరింగ్ జరిగిందని ఆయన అన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 3, జూలై, 2024

స్టైల్‌గా కనపడడం కోసం సిటిజన్లు దేనికైనా సై అంటున్నారు. కేశాలకు దట్టించే కలర్స్ నుంచి కాళ్లకు వేసుకునే ఫుట్‌వేర్ వరకూ తమదైన స్టైల్‌ని ప్రదర్శించాలని, అందు కోసం దేనికైనా రెడీ అంటున్నారు..ఈ ట్రెండ్ అనేక రకాల ఆరోగ్య సమస్యల్ని కొనితెస్తోంది. ఫ్యాషన్ ప్రియుల్ని సిటీలో స్కిన్ స్పెషలిస్టులు, ఫిజియో థెరపిస్ట్‌లు... తదితర వైద్యులు, నిపుణుల చుట్టూ ప్రదక్షిణ చేయిస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో

ఎంగేజ్ విత్ సిటీ...

భారత్ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పంజగుట్ట ద్వారకాపురి కాలనీ మోడల్ హౌస్ పక్క వీధిలోని రాజేశ్వరి టవర్స్‌లో జాబ్ మేళా జరుగుతుంది. ఈ మేళాలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హత కలిగిన అభ్యర్థులు హాజరుకావచ్చు.

జంటనగరాల సాంస్కృతిక సంస్థల సమన్వయంతో సాంస్కృతికబంధు సారిపల్లి కొండలరావు సహస్ర పూర్ణ చంద్రదర్శన మహోత్సవం సాయంత్రం 5.30 గంటలకు రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో జరుగుతుంది. యువకళావాహిణి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే.


ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ (ఫెడ్) సమన్వయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర శిక్ష, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ అండ్ సాధికారత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బోధనా వ్యూహాలపై 'సెమినార్' జరుగుతుంది. సోమాజిగూడ రాజ్‌భవన్ క్వార్టర్స్‌లోని సంస్కృతి హాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుంది.

లైవ్‌లో హారికా నారాయణ్ స్వరాలు..

ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ హారికా నారాయణ్ తన స్వరాలతో సంగీత ప్రియులను హోరెత్తించనున్నారు. నగరంలోని ఓడియం ప్రిజమ్ వేదికగా ఈ నెల 6న నిర్వహించనున్న లైవ్ మ్యూజిక్ కన్సర్ట్‌లో హారికా విభిన్న పాటలతో అలరించనుంది. హారిక ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో సింగర్‌గా మరింత క్రేజ్ సంపాదించుకున్న విషయం విధితమే. నగరంలో మొదటిసారి లైవ్ ఈవెంట్‌లో పాడనుండడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ లైవ్ కన్సర్ట్‌లో సంగీత ప్రియులకు ఆశ్చర్యాన్ని కలిగించే అంశాలు ఉన్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటల నుంచి ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన టిక్కెట్లు బుక్ మై షోలో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



6న ఓడియం ప్రిజమ్ వేదికగా లైవ్ కన్సర్ట్..



దీపాళి... చిత్రావళి 5 నుంచి...

కోల్‌కతాకు చెందిన చిత్రకారిణి దీపాళి భట్టాచార్య...గతానికీ, వర్తమానానికీ మధ్య కళా వారధి నిర్మిస్తారు. సమకాలీన భావాలతో మహిళాశక్తిని పునర్నిర్వచిస్తారు. మహిళా చిత్రకారుల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కలిగిన ఈ బెంగాలీ చిత్రకారిణి నగరంలోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో తన చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఆధునిక మహిళల్లోని అంతర్గత శక్తుల్ని ఆలోచింపజేసే రీతిలో కాన్వాస్‌పై రంగరించిన ఈ ప్యారలల్ లైవ్స్ చిత్ర ప్రదర్శన కళాకృతిలో ఈ నెల 5న (శుక్రవారం) రాత్రి 6.30గంటలకు ప్రారంభమవుతుంది. కళాభిమానుల కోసం ఆగస్టు 2 వరకూ ప్రదర్శన కొనసాగుతుంది.

ఎవిల్‌నెవర్ విన్స్ బై తంగెళ్ల కేతన్‌రాజు..

సనత్‌నగర్: పిట్ట కొంచెం..కూత ఘనం అన్నట్లు.. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి తంగెళ్ల కేతన్‌రాజు రచన మీద ఆసక్తితో 'ఎవిల్ నెవర్ విన్స్' అనే పుస్తకాన్ని రాసి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. సుధామూర్తి రచనలను స్ఫూర్తిగా తీసుకున్న కేతన్‌రాజు తన మదిలో భావాలను పుస్తక రూపంలో ఆవిష్కరించారు. తల్లిదండ్రులు మల్లీశ్వరి, వెంకట నరసింహరాజుల ప్రోత్సాహంతోనే తాను ఈ పుస్తకం రాశానని కేతన్‌రాజు చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం తాను నాగార్జున ఐఐటీ ఒలంపియాడ్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నానని, తాను రాసిన పుస్తకం 'బ్రి బుక్స్' అనే పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరెన్నో రచనలు చేస్తానన్నారు.



ప్రియా సిస్టర్స్‌కు జీవన సాఫల్య పురస్కారం...



ప్రముఖ సంగీత విద్వాంసులు, ప్రియా సిస్టర్స్‌గా పేరొందిన అక్కాచెల్లెళ్లు హరిప్రియా, షణ్ముఖప్రియలకు జీవన సాఫల్య పురస్కార ప్రదానం చేస్తున్నారు. శ్రీ వాసవీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి, కె.రోశయ్య 91వ జయంతి సందర్భంగా నగరంలోని రవీంద్రభారతిలో సాయంత్రం 5.45గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.



రంగుల టాటూ... రోగాల కాటు..

తప్పనిసరిగా స్పెషలిస్ట్ దగ్గరకు మాత్రమే టాటూస్ కోసం వెళ్లాలి. సరైన ఆర్టిస్ట్ కాకపోతే అతను రిపీటెడ్ నాన్‌స్టెరిలైజ్డ్ నీడిల్స్ వాడితే... హెపటైటిస్ నుంచి ఎయిడ్స్ వరకూ అన్నిరకాల వ్యాధులు అంటుకునే ప్రమాదం ఉంది. టాటూ వేయించుకునే ముందు మన చర్మ ఆరోగ్యం గురించి డాక్టర్ సలహా తప్పనిసరిగా తీసుకోవాలి. టాటూస్ వేసుకున్నాక కనీసం రెండు వారాల పాటు పర్యవేక్షణ అవసరం.



రంగు పడుద్దా? లేదా?

హెయిర్ డై/కలర్స్, షాంపూలు, కండిషనర్లు... వంటివి ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నారు. వీటిలో దాదాపు అన్నీ కెమికల్స్ మేళవించినవే. వీటి విచ్చలవిడి వినియోగం వల్ల తల ఉపరితల భాగంపై చర్మంతో పాటు విభిన్న రకాల కేన్సర్లకూ ఆస్కారం ఉందని డాక్టర్లు అంటున్నారు. ఈ కలర్స్‌లో అత్యధిక శాతం హానికారకాలేనని స్పష్టం చేస్తున్నారు. వీటిని వినియోగించే సమయంలో వైద్యుల సూచనలు తీసుకోవాలి... అలాగే లక్షల్లో ఖర్చుపెట్టి చేయించుకుంటున్న హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్... వంటివి విజయవంతం కావాలంటే తప్పనిసరిగా పూర్తి స్థాయి నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే జరగాలి. లేదంటే కొత్త సమస్యలు తప్పవు.

బ్యాండ్ బాజా... మెమొరీ లేజా...

ఇప్పుడు హెడ్ బ్యాండ్స్ వాడకం భారీగానే పెరిగింది. తల వెంట్రుకలను బాగా టైట్‌గా కట్టేయడం హెయిర్‌ఫాల్‌కి దారి తీస్తుంది. అంతేకాదు మెమొరీ ప్రాబ్లెమ్స్ కూడా రావచ్చని పలువురు నిపుణులు చెబుతున్న మాట.

బొట్టు.. జాగ్రత్తగా పెట్టు...

నుదుటన బొట్టు.. స్టిక్కర్లలోకి మారిపోయి చాలా కాలమైంది. అయితే వీటిని జాగ్రత్తగా ఎంచుకోవాలి. కొన్ని రకాల స్టిక్కర్స్‌తో పాటు సింధూర్స్ కూడా అలర్జీలను కలిగిస్తాయి. వీలైనంత వరకూ న్యాచురల్, ఆర్గానిక్‌వి వాడడం మంచిది.

ఫ్యాషన్.. With కాషన్



- పెరుగుతున్న పియర్సింగ్ పిచ్చి
- అడ్డదిడ్డంగా టాటూల వినియోగం
- రంగుల్లో హానికారక రసాయనాలు
- చర్మానికి ఇబ్బందికరంగా ఫ్యాషన్
- అలెర్ట్‌గా ఉండాలంటున్న వైద్య నిపుణులు

అతి హొయలతో అనారోగ్యమే

ఏం చేస్తావో నాకు తెలీదు...నా లుక్ చూసి మా కంపెనీలో కొలీగ్స్‌కి మెంటలెక్కాలి....తన హెయిర్ స్టయిలిస్ట్ దగ్గర ఓ ఉద్యోగి ఆర్డర్ లాంటి అభ్యర్థన... వెళ్లేది పేజ్ త్రీ పార్టీకి.. అక్కడ ఫ్యాషన్ షోని మించిన అవుట్‌ఫిట్స్‌తో వస్తారు.. అలాంటి చోట సమ్‌థింగ్ స్పెషల్‌గా కనపడాలి. దానికి నువ్వేం చెప్పినా నేను రెడీ...పర్సనల్ మేకప్ ఆర్టిస్ట్‌తో ఓ పేజ్ త్రీ సోషలైట్ అగ్రిమెంట్ లాంటి కమిట్ మెంట్...

తలపై మండుతున్న సెన్సేషన్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న షీలా అనే గృహిణిని పరీక్షించిన వైద్యులు ఆమె గతంలో చేయించుకున్న హెయిర్ స్ట్రెయిట్నింగ్ ప్రక్రియే దీనికి కారణమని నిర్ధారించారు. ఆ ప్రక్రియలో భాగంగా ఉపయోగించిన క్రీమ్‌లో గ్లైక్సిలిక్ యాసిడ్ ఆమె చర్మంలో చేరుకుని అక్కడ నుంచి మూత్రాశయాన్ని సైతం దెబ్బతీసిందని తేల్చారు.

అధికంగా హెయిర్ డై వాడితే అందులో ఉండే హైడ్రోజన్ పెరాక్సైడ్, పీపీడీ తదితర హానికారకాల వల్ల జుట్టు ఊడిపోవడంతో మొదలుపెట్టి అస్తమా, బ్రెస్ట్ కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సైతం రావచ్చని డెర్మటాలజిస్ట్ డా.గీతా ఒబెరాయ్ చెబుతున్నారు.

బిగుతుగా ఉండే దుస్తులు ధరించడం వల్ల మహిళల్లో పునరుత్పత్తి అవయవాలపైనా, పురుషుల్లో వీర్యోత్పత్తిపైనా దుష్ప్రభావం పడవచ్చని, అలాగే ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుంచి బ్రీతింగ్ సమస్యల వరకూ ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు.


ఈ తరహా వస్త్రధారణ వల్ల మెరాల్జియా పెరాస్తటికా అనే నరాల వ్యాధి వస్తుందని కెనడియన్ మెడికల్ అసోసియేషన్ జర్నల్ నిర్ధారించింది. అదే విధంగా జర్నల్ ఆఫ్ న్యూరాలజీ, న్యూరోసర్జరీ అండ్ సైకియాట్రీలో ప్రచురితమైన అధ్యయనంలో టైట్ జీన్స్ వల్ల కంపార్ట్‌మెంట్ సిండ్రోమ్ అనే పరిస్థితి, దీనితో శరీర కదలికల సమస్యలు రావచ్చని స్పష్టం చేసింది.

లిప్‌స్టిక్ వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే డీహైడ్రేషన్ సహా అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. లిప్‌స్టిక్‌లో వినియోగించే సర్వసాధారణ రసాయనం ట్రిక్లోజన్ వల్ల హృద్రోగ సమస్యలు రావచ్చని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల అధ్యయనం నిర్ధారించింది.

హైహీల్స్ షూస్ వినియోగం.. మహిళల్లో బోన్ హెల్త్‌పై దుష్ప్రభావం చూపుతోందని, శాశ్వత బ్యాక్‌పెయిన్‌కి, ఆస్టియోపొరోసిస్‌కి కారణమవుతోంది. ముఖ్యంగా 20-45ఏళ్ల మధ్య వయస్కులపై నిర్వహించిన మ్యాక్స్ హెల్త్ కేర్ అధ్యయనం తేల్చింది.

యువి నెయిల్ పాలిష్ డ్రయ్యర్స్ వినియోగం వల్ల కేన్సర్ల ప్రమాదం పొంచి ఉందని నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది.

నెయిల్ పాలిష్‌తో పాటు షాంపూల్లోని కొన్ని రసాయనాలు 63 శాతం మహిళల్లో టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతాయని ఎండోక్రైన్ సొసైటీ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం నిర్ధారించింది. హెయిర్ స్ప్రే, ఆఫ్టర్ షేవ్ లోషన్స్‌లో ఉండే హానికారకాలు చర్మం ద్వారా ప్రయాణించి కాలేయాన్ని, కిడ్నీ, ఊపిరితిత్తులు, ఇతర అవయవాలకు చెడు చేస్తాయని స్పష్టం చేసింది.



పియర్సింగ్.. సమ్‌థింగ్ రాంగ్...

కాదేదీ కుట్టుకోవడానికి అనర్హం అన్నట్టు ఇటీవలో శరీరంలోని అనేక చోట్ల బాడీ పియర్సింగ్‌ను ఇష్టపడుతున్నారు. చెవిపోగుల నుంచి మొదలై ఇప్పుడు వంటి మీద ఎక్కడ పడితే అక్కడ రకరకాల పరికరాలను అతికించుకుంటున్నారు. ఆఖరికి నాలుక మీద కూడా రింగుల్ని గుచ్చుకుంటున్నారు. అయితే ఈ పిచ్చి ప్రమాదకరం అంటున్నారు వైద్యులు. ఒకటికి మించి చెవి చుట్టూ కుట్టించుకోవడం. ముఖ్యంగా నాలుక, పెదవి, నాభి వంటి ప్రాంతాల్లోనూ పియర్సింగ్ చేయించుకోవడం, అవేమో ఇమిటేషన్ జ్యుయలరీ కావడం వల్ల స్కిన్ అలెర్జీ సమస్యలు తలెత్తుతున్నాయి. శరీరంలోని సున్నితమైన భాగాలపై జ్యుయలరీ యాడ్ చేయడం వల్ల వాటి పనితీరు దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు ఇలాంటి తీవ్రమైన ఫ్యాషన్స్ అనుసరించడం అంటే ఒక సైకలాజికల్ సమస్యగా గుర్తించాలని చెబుతున్నారు. దీన్ని అదుపు చేయకపోతే ఇది ట్రాక్షన్ అలోపేసియాకి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు.



మితిమీరితే అనర్థాలే...

దాదాపు అన్ని హెయిర్ డైలలో ఉండే పీపీడీ చాలా హానికరం.. దీర్ఘకాలం పాటు వినియోగిస్తే జుట్టు రాలడంతో మొదలై కేన్సర్ల వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. కొంత మందికి దీని రియాక్షన్ వెంటనే తెలుస్తుంది. మరికొంత మందికి చాలా కాలం తర్వాతే బయటపడతాయి. దీనికి బదులు గోరింటాకు, హెన్నా వంటివాటితో ప్యూర్ బ్లాక్ కాకపోయినా, బ్రౌన్ కలర్ వచ్చేలా చేయవచ్చు. హెయిర్ స్ట్రయిటనింగ్ ఇప్పుడు బాగా చేయించుకుంటున్నారు. సాఫ్ట్‌నెస్ కోసం నప్పని రసాయనాలు ఉపయోగిస్తారు. కొన్ని క్రీమ్స్... వల్ల తెల్లగా అయ్యాం అనుకుంటారు గానీ... అవి చర్మం తాలూకు పొరల్ని దెబ్బ తీస్తాయి. హానికారక బాక్టీరియాను నిరోధించే సామర్థ్యాన్ని కోల్పోయేలా చేస్తాయి. మేకప్ వల్ల చర్మం పొడిబారిపోయే చాన్స్ ఉంది. క్లెన్సర్‌తో శుభ్రపరచకపోతే ఆయిల్ బయటకు పోక కురుపులు తయారవుతాయి. పియర్సింగ్ సున్నితమైన అవయవాలపైన చేయించుకోకూడదు. అలాగే టాటూ ఆర్టిస్ట్స్‌తో చేయించుకుంటే ఇన్ఫెక్షన్లకు అవకాశాలు ఉంటాయి.
-డా.డబ్ల్యు.జాన్, డెర్మటాలజిస్ట్



మేకప్... ఆరోగ్యానికి పేకప్...

నిమిషాల్లో వర్చస్సును మెరిపించేస్తామని ప్రకటించే మేకప్ ఉత్పత్తుల్లో పరిమితికి మించిన రసాయనాలు వాడుతున్నారంటూ ఇటీవల కొన్ని ప్రముఖ బ్రాండ్స్ ఉత్పత్తులను సీజ్ చేయడం దీనికి ఓ ఉదాహరణ.



ఫ్యాబ్రిక్... నప్పకపోతే.. తిప్పలే...

రకరకాల ఫ్యాబ్రిక్స్‌తో రూపొందిన డ్రెస్‌లు మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి. ఫ్యాషన్‌లో ముందుండాలని పోటీపడుతున్న యువత అదీ.. ఇదీ.. అని తేడా లేకుండా ఏది కొత్తగా వస్తే దాన్ని వాడేస్తోంది.





లిప్స్‌కి లాస్..

ఒకప్పుడు సినిమా వాళ్లకు మాత్రమే పరిమితమైన మేకప్ ఇప్పుడు దాదాపు ప్రతి ఒక్కరికీ ప్రీతిపాత్రమైంది. లిప్‌స్టిక్ పేరుతో అధరాలను మెరిపించేందుకు ప్రయత్నించే అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. కెమికల్స్ లేకుండా ఏ లిప్‌స్టిక్ తయారయ్యే ప్రసక్తే లేదు కాబట్టి వీటిని తప్పనిసరైతే తప్ప వాడకూడదంటున్నారు. దీని బదులు కొత్తిమీర ఆకులతో, బీట్‌రూట్ వంటివి ఉపయోగించి పెదాల్ని ఎర్రగా మార్చుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

డ్రెస్ టూ డ్రగ్స్.. మానసిక ఒత్తిడి తప్పదు...



ప్రత్యేక గుర్తింపు కోరుకోవడం అది కూడా ఫ్యాషన్‌ను ఫాలో అవడం ద్వారా అనేది తొలి దశలో బాగానే ఉన్నా రానురానూ తీవ్రమైన మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఇతరులతో పోల్చుకోవడం వల్ల ఆత్మన్యూనతా భావం పెరిగిపోతుంది. అలాగే అప్ టు డేట్‌గా కనపడాలనే ఆతృత చదువు, వృత్తి, ఉద్యోగాలు వంటి ఇతర ముఖ్యమైన విషయాల మీద దృష్టి కేంద్రీకరించనివ్వదు. అలాగే ఆరోగ్యకరమైన ఫ్యాషన్లను దాటిపోయి అనారోగ్యకరమైన అలవాట్లకు ఇది దారి తీస్తుంది. ఆర్థిక పరమైన సమస్యలు కూడా తోడవుతాయి.. కాబట్టి ఫ్యాషన్ ప్రియత్వం అనేది నియంత్రణలో ఉండేలా చూసుకోవడం అత్యవసరం. లేకపోతే ఇది డ్రెస్సులతో మొదలై డ్రగ్స్ దాకా చేర్చినా ఆశ్చర్యం లేదు. ఈ ఫ్యాషన్ల పిచ్చిలో ఉన్న యువతను ఇతర ఆరోగ్యకరమైన వ్యాపకాలకు అంటే ఆటల వంటి అభిరుచుల వైపు మళ్లించడం మంచిది. – డా.జి మయూర్‌నాథ్‌రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్, సైక్రియాట్రిస్ట్



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మంగళవారం దర్శించుకున్నారు.

రైతు భరోసా కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా భట్టి



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా విధివిధానాల రూపకల్పనకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. రైతు భరోసా పథకం అమలు కోసం అవసరమైన సిఫార్సులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తరులు జారీ చేశారు. ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనెల 15 నాటికి మార్గదర్శకాలకు సంబంధించిన నివేదిక సమర్పించాలని అప్పట్లో కోరారు. ఈ నేపథ్యంలో అధికారికంగా కేబినెట్ సబ్ కమిటీకి సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించిన ఏబీవీపీ



ధర్నా చేస్తున్న ఏబీవీపీ శ్రేణులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ మండిపడ్డారు. నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూప్–1, 2 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించాలన్నారు. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల సంఖ్య పెంచే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగ సమస్యలను పెంచాలని కోరుతూ ఏబీవీపీ చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. టీజీపీఎస్సీ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన ఏబీవీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థి నాయకులు రోడ్డుపైనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య కొంత తోపులాట జరిగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి నాయకులు నినాదాలతో హోరెత్తించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఒక్క రోజే రూ.5,000 కోట్ల అప్పు

చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి ఇలాగేనా?

ఏపీలో రాక్షస పాలన

ప్రత్యర్థులపై పెచ్చుమీరిన టీడీపీ కార్యకర్తల దాడులు



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బడులు తెరిచారు.. బరువు మోపారు..

వందనమేదీ!

- రాష్ట్రంలో ప్రతి బిడ్డకూ ఏటా రూ.15 వేలు ఇస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో వాగ్దానం
- 'సూపర్ సిక్స్'లో ప్రముఖంగా ప్రచారం చేసిన కూటమి పార్టీలు
- స్కూళ్లు తెరిచి నెల దాటినా ఇంతవరకూ మార్గదర్శకాలే లేవు
- ఫీజులు, చదువుల ఖర్చుల కోసం తల్లిదండ్రుల తిప్పలు
- ఈ ఏడాదికి ఇక ఇంతే.. లబ్ధిదారులను తగ్గించే మార్గాలపై కూటమి సర్కారు కన్ను



ఓ ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' అమలు చేస్తామని టీడీపీ - జనసేన హామీ

సాక్షి, అమరావతి: ''ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' అమలు చేస్తాం. ఒక్కరుంటే రూ.15 వేలు ఇస్తాం. ఇద్దరుంటే రూ.30 వేలు.. ముగ్గురుంటే రూ.45 వేలు నేరుగా ఖాతాల్లోనే జమ చేస్తాం. ఇంకా పిల్లలను కనండి.. పథకాలు అందుకోండి..!'' అంటూ ఎన్నికల ప్రచార సభల్లో ప్రతిచోటా చాటింపు వేసిన సీఎం చంద్రబాబు ఒక పక్క పాఠశాలలు పునఃప్రారంభమై నెల దాటుతున్నా ఆ ఊసే పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన రేగుతోంది. మంత్రి నారా లోకేష్‌తోపాటు ఎన్డీఏ కూటమిలోని ముఖ్య నాయకులంతా ప్రజలకు బహిరంగంగా ఈ ఇచ్చిన హామీపై నోరు మెదపడం లేదు. రాష్ట్రంలో బడికి వెళ్లే విద్యార్థులు, బడి ఈడు పిల్లలు దాదాపు కోటి మందికి పైగా ఉన్నట్లు అంచనా. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా వీరందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయాలంటే ఏటా సుమారు రూ.15 వేల కోట్లు అవసరం. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ కోటి మంది పిల్లలకు 'తల్లికి వందనం' ఇవ్వాలి. ఇప్పటివరకు ఈ పథకంపై ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోగా ఈ హామీని ఎగ్గొట్టేందుకు ఎత్తుగడలు వేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాదంతా కాలయాపన చేసి లబ్ధిదారులను తగ్గించేందుకు పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. ఏరుదాటాక తెప్ప తగలేయడంలో నిపుణుడైన చంద్రబాబు 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ హామీని నెరవేర్చకుండా కోటయ్య కమిటీ పేరుతో కోతలు విధించిన వైనాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

ఖర్చులు తడిసిమోపెడు..

పాఠశాలలు తెరవటమే ఆలస్యం.. పిల్లల ఫీజులు, ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా 'అమ్మ ఒడి' పథకం నాలుగేళ్ల పాటు తల్లిదండ్రులకు నిశ్చింత కల్పించింది. పిల్లలను ఏ పాఠశాలలో చదివిస్తున్నా సరే వంద శాతం పారదర్శకతతో గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి రప్పించడమే లక్ష్యంగా తల్లులు బాధ్యత తీసుకునేలా ప్రోత్సహించింది. ఏటా రూ.6,400 కోట్లు చొప్పున నాలుగేళ్లలో రూ.26 వేల కోట్లకుపైగా అమ్మ ఒడి ద్వారా అందించడం పిల్లల చదువుల పట్ల మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం. భావి పౌరుల భవితవ్యానికి భరోసా కల్పిస్తూ వెలుగులు పంచిన ఈ పథకంపై ఇప్పుడు చీకట్లు అలుముకుంటున్నాయి. ఈ పథకం పేరు మార్చేసి ''తల్లికి వందనం'' అంటూ ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్ హామీ కింద ప్రకటించిన కూటమి సర్కారు స్కూలుకి వెళ్లే విద్యార్థులతో పాటు ప్రతి బిడ్డకూ ఏటా రూ.15 వేలు చొప్పున అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ఒక్కో ఇంట్లో నలుగురు ఐదుగురు పిల్లలున్న కుటుంబాలు తమకు రూ.60 వేల నుంచి రూ.75 వేల వరకు లబ్ధి చేకూరుతుందని ఆశపడ్డారు. ఇప్పటికే పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో 'తల్లికి వందనం'పై ఇంతవరకూ కొత్త సర్కారు నోరు మెదపకపోవడంతో ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్న తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక, పుస్తకాల ఖర్చులు తడిసిమోపెడు కావడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

కాలయాపన.. కోతలు

2014 ఎన్నికల సమయంలో రైతులకు రుణమాఫీ అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక అనేక కొర్రీలు వేసి లబ్ధి పొందే రైతులను భారీగా తగ్గించేసి అరకొరగా విదిలించారు. ఇప్పుడు తల్లికి వందనంపైనా ఇలాగే ముందుకెళ్లాలని కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఒక్కో బిడ్డకు రూ.15 వేలు చొప్పున ఒక ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ పథకం వర్తింప చేస్తామని ఇచ్చిన హామీ ప్రభుత్వ పెద్దల్లో కూటమి సర్కారులో గుబులు రేపుతోంది. ఏటా రూ.15 వేల కోట్ల నిధులు అవసరం కావడం ఇందుకు కారణం. దీంతో వలంటీర్లను గౌరవ వేతనం రెట్టింపు చేసి మరీ కొనసాగిస్తామన్న హామీని గాలికి వదిలేసినట్లే... 'తల్లికి వందనం' కూడా లబ్ధిదారుల ఎంపిక పేరుతో ఈ ఏడాది కాలయాపన చేసి అనంతరం రకరకాల నిబంధనలతో కోతలు విధించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. టీడీపీ హయాంలో రైతుల రుణమాఫీపైనా ఇదే విధానం అనుసరించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అదే జరిగితే తమ పిల్లల చదువులు నాశనమవుతాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

జూన్‌లోనే జమకు గత సర్కారు ఏర్పాట్లు..

పిల్లలను బడికి పంపే తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో 2019 జూన్‌లో జగనన్న అమ్మఒడి పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. స్కూళ్లు తెరిచిన వెంటనే జూన్‌లోనే అంతకుముందు సంవత్సరం హాజరును బట్టి రూ.15 వేలు చొప్పున అందిస్తూ రూ.వెయ్యి టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కి, మరో రూ.వెయ్యి స్కూల్ నిర్వహణ నిధికి జమ చేసింది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి అందించి చదువులకు భరోసా కల్పించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్.. ఇలా ఎక్కడ చదువుతున్నా సరే పథకాన్ని నూరు శాతం పారదర్శకతతో అమలు చేసింది. 2022–23కి సంబంధించి గతేడాది జూన్ 28వ తేదీన 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లను వైఎస్ జగన్ ప్రభుత్వం జమ చేసింది. ఐదో విడత అమ్మఒడి కింద ఈ ఏడాది జూన్‌లో నిధులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేసినా కొత్త ప్రభుత్వం రావడంతో సాయం నిలిచిపోయింది. జూలై వచ్చినా తల్లికి వందనంపై కూటమి సర్కారు స్పందించకపోవడంతో తల్లిదండ్రులు ఆర్థిక భారాన్ని తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరిస్తా

మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తానని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీఇచ్చారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో వచ్చిన ప్రతినిధుల బృందం కలిసింది. రాష్ట్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను జారీ చేయాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధుల బృందం రాష్ట్రంలో ఉన్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 1273 ద్వారా రూ.4.32 కోట్ల నిధులతో వివిధ సెంటర్ల ద్వారా 12,900 మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు శిక్షణ పూర్తి చేసుకున్నా.. వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. వెంటనే పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను ప్రదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు రమేశ్, శంకర్ ముదిరాజ్, బాలబ్రహ్మచారి, వెంకట్‌రెడ్డి, హుస్సేన్, మోహన్ పాల్గొన్నారు. కాగా, మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్ లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాల యంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవ సర మందులు అందుబాటులో ఉండేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదే శించారు. వైద్య సదుపాయాల కల్పనలో భా గంగా భౌగోళికంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రు లు ఎంత దూరంలో ఉన్నాయో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు.

దానం నాగేందర్ ఎన్నికపై సుప్రీంకోర్టుకెళ్తాం

మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరి సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీచేసిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కొరియర్, మెయిల్, రిజిస్టర్ పోస్ట్ ద్వారా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు తెలిపారు. తాము సమర్పించిన పిటిషన్లపై స్పీకర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిపై పోటీచేసిన నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని డిమాండ్‌చేశారు. ఈ వేటు ద్వారా నాగేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఖైరతాబాద్ అసెంబ్లీకి ఉపఎన్నిక రావాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. కాగా, పార్లమెంటులో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని రామచంద్రరావు మండిపడ్డారు. హిందువులు హింసకు పాల్పడతారంటూ ఓ సమాజాన్ని కించపర్చిన రాహుల్‌గాంధీ ప్రపంచంలోని హిందువులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఎన్వీ సుభాష్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, అసలు రాహుల్ గాంధీ హిందువేనా? అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా సహేతుకమైన విమర్శలతో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాల్సింది పోయి రాహుల్ అందుకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు హైకోర్టులో ఊరట లభించింది. ప్రజాప్రతినిధుల కోర్టులో కేసు విచారణను ఆపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద డ్రోన్ కెమెరాలతో ఇంటర్వ్యూ నిర్వహించడంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేటీఆర్‌తోపాటు ఆయన్ను ఇంటర్వ్యూ చేసిన గోరటి వెంకన్నపై కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు ప్రజాప్రతినిధుల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ప్రభాకర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి ట్రయల్ కోర్టులో కేసు విచారణను ఆపేస్తూ ఉత్తర్వులిచ్చారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను ఈనెల 30కి వాయిదా వేశారు.

నిరుద్యోగుల పేరుతో బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలు

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల పేరుతో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, లింగం యాదవ్, కేవీఎస్ ఆచారి ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. హరీశ్‌రావు విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టి వాళ్ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని, బీఆర్‌ఎస్ హయాంలో 16 పేపర్లు లీక్ అయ్యాయని గుర్తుచేశారు.

కసరత్తు కొలిక్కి

▶ మొదటి పేజీ తరువాయి

అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం ఇవ్వాలని మంత్రి డి.శ్రీధర్‌బాబు, సీనియర్ నేత జీవన్‌రెడ్డి అధిష్టానాన్ని కోరినట్లు తెలుస్తోంది. అన్ని ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం వారిలో ఒకరిని ఈ నెల ఆరో తేదీలోగా పీసీసీ చీఫ్‌గా ప్రకటిస్తారని గాంధీ భవన్ వర్గాలు అంటున్నాయి. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో మరోమారు అధిష్టానం చర్చించనుంది. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. వారితో చర్చించాక టీపీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అధిష్టానం తుది నిర్ణయం తీసుకోనుంది. అయితే మహేశ్‌కుమార్ గౌడ్ వైపు అధిష్టానం మొగ్గుచూపే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు అంటున్నాయి.

మంత్రివర్గం రేసులో బాలూనాయక్, టి.రామ్మోహన్‌రెడ్డి

మంత్రివర్గ విస్తరణలో నల్లగొండ జిల్లాకు చెందిన లంబాడా సామాజికవర్గానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఎస్. బాలూనాయక్‌కు అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. గిరిజన వర్గాల నుంచి ఆదివాసీలకు ఇప్పటికే కేబినెట్‌లో స్థానం కల్పించినందున లంబాడా సామాజికవర్గానికి కూడా అనివార్యంగా మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటుందని, ఈ కోటాలో బాలూనాయక్ పేరు కూడా ఉందని తెలుస్తోంది. బాలూనాయక్‌కు మంత్రి పదవి లభిస్తే డిప్యూటీ స్పీకర్‌గా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే అదే జిల్లాకు చెందిన పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి కూడా మంత్రివర్గంలో స్థానం కోసం ఢిల్లీలోనే ఉండి ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో ఎవరిని ఏ పదవికి ఎంపిక చేయాలనే విషయంపైనా బుధవారం నాటి చర్చల్లో స్పష్టత రానుంది.

పీసీసీ చీఫ్‌గా నా పేరు పరిశీలించండి

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి కోరిన మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా తన పేరును పరిశీలించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో ఖర్గేను ఆయన కలిశారు. పీసీసీ చీఫ్ పదవి ఆశిస్తున్న నేతలు అధిష్టానం పెద్దలను కలుస్తూ తమ పేర్లను పరిశీలించాలని కోరుతున్నారు. అందులో భాగంగానే మహేశ్‌కుమార్‌గౌడ్ ఖర్గేను కలిసి తన పేరును పరిశీలించాలని కోరినట్లు తెలిసింది. ఆయన ఇటీవల కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతోపాటు జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కూడా కలవడం తెలిసిందే.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రోడ్డు మార్గంలో తాడేపల్లికి పయనం

సాక్షి,అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): బెంగళూరు పర్యటన ముగించుకుని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లికి చేరుకున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో సతీమణి వైఎస్ భారతీ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో జగన్‌కు ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రులు పేర్ని నాని, మేరుగు నాగార్జున, వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్, అంబటి మురళీకృష్ణ, ఏపీ ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలతో ఎయిర్‌పోర్ట్ ప్రాంతమంతా మార్మోగింది. వీరందరిని వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లి బయలుదేరి వెళ్లారు.

చంద్రబాబును సీబీఐ, ఈడీ ఎందుకు అరెస్టు చేయలేదు?

▶ మొదటి పేజీ తరువాయి

ఆరోపణలు చేశారని, మరి చంద్రబాబు, అజిత్ పవార్, ప్రఫుల్లపటేల్‌ల విషయంలో జరిగిందేమిటీ అని ప్రశ్నించారు. వీరిపై కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. సీబీఐ, ఈడీలు చంద్రబాబును అరెస్ట్ చేస్తాయా అని నిలదీశారు. టీడీపీ అధినేతను ఎందుకు సీబీఐ, ఈడీ అరెస్ట్ చేయలేదు అని ప్రశ్నించారు. బీజేపీ పంచన చేరగానే వాషింగ్ మెషీన్‌లో వేసిన మాదిరి వారంతా సుద్దపురుషులు అయ్యారంటూ ఎద్దేవా చేశారు. అవినీతిపరులైన నేతలను కలుపుకొని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అగత్యం మోదీ ప్రభుత్వానికి ఏర్పడిందని దుయ్యబట్టారు.

ఆ కంపెనీకి లాభాలు ఎలా వచ్చాయి..

ఎన్నికల సర్వేల అంశాలపై కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. బీజేపీ కూటమి 400 సీట్లు దాటుతుందంటూ ఎగ్జిట్ పోల్ సర్వేల ద్వారా ప్రచారం చేసి, స్టాక్‌మార్కెట్‌లో షేర్‌లు కొనాలని ప్రోత్సహించారని విమర్శించారు. ఫలితాల రోజున ఒకసారిగా స్టాక్‌మార్కెట్ పడిపోయి రూ. 31 లక్షల కోట్లు మదుపరుల సంపద ఆవిరైపోతే, టీడీపీ అగ్రనేత భార్యకు చెందిన కంపెనీ మాత్రం రూ. 521 కోట్లు ఆ ఒక్కరోజులోనే ఆర్జించిందని వెల్లడించారు. ఇదెలా సాధ్యమైందని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపే దమ్ము ప్రభుత్వానికి ఉందా? అని నిలదీశారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగదని ఆయన జోస్యం చెప్పారు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎన్డీఏ ప్రభుత్వం కూలిపోతుందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగలేదని, ఎన్నికల అధికారులు బీజేపీకి అనుకూలంగా పనిచేశారని విమర్శించారు. ఎమర్జెన్సీ తర్వాత ఏ ప్రధాని కూడా ఈడీ, సీబీఐని ఇంతలా దుర్వినియోగం చేయలేదన్నారు. రాష్ట్రాల్లో పాలన సాగిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై వివక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. బెనర్జీ తన ప్రసంగాన్ని ముగించిన తర్వాత, బీజేపీకి చెందిన భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్డీఏ మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూలపై చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ ఓంబిర్లాను కోరారు.

డిజిటల్ సమాచారం తొలగింపును అడ్డుకోండి

ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ తొలగించడం సరికాదు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్ర, ప్రాముఖ్యతకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్‌మీడియా హ్యాండిల్స్ నుంచి తొలగించడం సరికాదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వానికి సంబంధించిన డిజిటల్ సమాచారాన్ని ఉద్దేశపూర్వంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో జోక్యం చేసుకొని డిజిటల్ సమాచారాన్ని కాపాడాలని ప్రభుత్వ ప్రధా నకార్యదర్శి శాంతికుమారికి మంగళవారం కేటీఆర్ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించిన వైబ్ సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ వివరాలను ఆ లేఖలో కేటీఆర్ జత చేశారు. సీఎంగా కేసీఆర్ పనిచేసిన కాలానికి సంబంధించిన (జూన్ 2014 – డిసెంబర్ 2023) వేలాది ఫొటోలు, వీడియోలతోపాటు ఎంతో విలువైన సమాచారం తొలగించారన్నారని లేఖలో పేర్కొన్నారు. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్‌లు, మీడియా హ్యాండిల్స్‌లో ముఖ్యమైన కంటెంట్, సమాచారం కనబడకుండా పోతోందని, కొన్ని ముఖ్యమైన వెబ్‌సైట్లు కూడా తొలగించారని చెప్పారు. ఈ చర్యల వెనుక రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు ఉన్నారనే సందేహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలకు సంబంధించిన మొత్తం డిజిటల్ కంటెంట్‌ను భద్రపర్చాల్సిన అవసరముందన్నారు. పబ్లిక్ డొమైన్ నుంచి తొలగించిన కంటెంట్‌ను వెంటనే పునరుద్ధరించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీలో 3,035 పోస్టులు

▶ మొదటి పేజీ తరువాయి

అవుతున్నారు. పదవీ విరమణ పొందేవారి జీతం గరిష్టంగా ఉంటుంది. ఆ మొత్తంతో ముగ్గురు కొత్త ఉద్యోగులను తీసుకోవచ్చు. అంటే కొత్త నియామకాలతో ఆర్టీసీపై అదనంగా పడే భారం ఏమీ లేదని స్పష్టమవుతోంది.

ముందే అదనపు డ్యూటీల భారం

ఆర్టీసీలో 12 సంవత్సరాలుగా నియామకాలు లేకపోవటంతో, రిటైర్మెంట్ల రూపంలో సిబ్బంది సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే కొరత మొదలైంది. ముఖ్యంగా డ్రైవర్ల సంఖ్య సరిపోక, ఉన్నవారిపై అదనపు డ్యూటీల భారం మొదలైంది. వీక్లీ ఆఫ్‌లలో కూడా డ్రైవర్లు విధుల్లోకి రావాల్సి వస్తోంది. డ్రైవర్లు అలసి పోవడంతో బస్సు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రిక్రూట్‌మెంటుకు అవకాశం ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు గత ప్రభుత్వాన్ని కోరారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం, మహిళలకు ఉచిత ప్రయాణ వసతిని అందుబాటులోకి తేవటంతో సిబ్బందిపై భారం మరింత పెరిగింది. దీంతో అధికారులు రిక్రూట్‌మెంట్ చేపట్టాలంటూ ప్రతిపాదనలు పంపడమే కాకుండా తరచూ లిఖితపూర్వకంగా అభ్యర్థిస్తూ వచ్చారు. జనవరిలో ఆ ఫైలు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వద్దకు చేరింది. దాదాపు నెల విరామం తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరింది. అక్కడ కూడా కొంత కాలం పెండింగులో ఉన్న తర్వాత ఎట్టకేలకు అనుమతి లభించింది. తాజా భర్తీ ప్రక్రియలో కండక్టర్ పోస్టుల ఊసు లేదు. భవిష్యత్తులో డ్రైవర్లే కండక్టర్ విధులు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. డ్రైవర్ కమ్ కండక్టర్ పేరుతోనే డ్రైవర్ పోస్టుల భర్తీ జరగనుంది.

కేటగిరీల వారీగా భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు ఇలా:	
డ్రైవర్లు	2000
శ్రామిక్	743
డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్)	114
డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్)	84
డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్	25
అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్)	23
అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్	15
సెక్షన్ ఆఫీసర్ (సివిల్)	11
మెడికల్ ఆఫీసర్ (జనరల్)	7
మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్టు)	7
అకౌంట్స్ ఆఫీసర్లు	6

టీజీఎస్ ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తాం

- త్వరలో 3,035 పోస్టుల భర్తీ
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్: టీజీఎస్ ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలోని వివిధ కేటగిరీల్లో 3,035 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు మంగళవారం కరీంనగర్‌లో పొన్నం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకొచ్చిన ఏడు నెలల్లోనే వెయ్యి బస్సులు కొనుగోలు చేశామని, మరో 1,500 బస్సులు కొనుగోలు చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఆక్యుపెన్సీ వంద శాతం దాటిందని తెలిపారు. ఆర్టీసీ తార్నాక ఆసుపత్రిని సూపర్‌స్పెషాలిటీగా తీర్చిదిద్ది ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందేలా చూస్తామని అన్నారు.

చర్చ



హోమ్‌వర్క్ ఎవరికి కష్టం?

‘పిల్లలు హోమ్‌వర్క్ చేయరు... తల్లిదండ్రులే చేస్తారు... ఇది తెలిసీ టీచర్లు హోమ్‌వర్క్ ఇవ్వడంలో అర్థం లేదు’ అని ఒక భారతీయ తల్లి విడుదల చేసిన వీడియో చర్చ లేవదీసింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే జపాన్ తల్లిదండ్రులు వారంలో రెండున్నర గంటలే పిల్లల హోమ్‌వర్క్‌కు కేటాయిస్తుంటే భారతీయులు వారానికి 12 గంటలు కేటాయిస్తున్నారు. కొందరు ఇది భారం అంటున్నా పిల్లలకు హోమ్‌వర్క్ లేకపోతే కలత పడే తల్లిదండ్రులే మన దగ్గర ఎక్కువ. హోమ్‌వర్క్ మంచి-చెడు...

‘పిల్లలు హోమ్‌వర్క్ చేయరనీ తల్లిదండ్రులే దానిని పూర్తి చేస్తారని టీచర్లకు తెలుసు. అయినా సరే వారు హాలిడే హోమ్‌వర్క్ ఇస్తారు. పిల్లలు హాలిడే ఎంజాయ్ చేస్తుంటే తల్లిదండ్రులు మాత్రం గంపెడు హోమ్‌వర్క్‌ను ముందేసుకుని కూచోవాల్సి వస్తోంది. ఇక మీదటైనా పిల్లలు సొంతగా ఎంత హోమ్‌వర్క్ చేయగలరో అంతే ఇవ్వండి’ అని ఒక తల్లి చేసిన వీడియో ఇన్‌స్టాలో జూన్ 30న విడుదలైంది. ఈ వీడియోకు చాలామంది స్పందిస్తున్నారు.

‘ఎనిమిదవ తరగతి వచ్చే వరకు పిల్లలకు హోమ్‌వర్క్ ఇవ్వరాదు’ అని ఒకరంటే ‘అవును. టీచర్లు మరీ అన్యాయంగా ఉన్నారు. రెండో తరగతి చదువుతున్న మా అబ్బాయిని మానవ శరీరంలోని భాగాలను గీసుకు రమ్మని చెప్పారు’ అని మరొకరు వ్యాఖ్యానించారు. ‘నేను వేసవి సెలవుల్లో మా అమ్మాయి హోమ్‌వర్క్‌ను పూర్తి చేయడమే సరిపోయింది’ అని మరొక తల్లి అంది. ‘ఇది మరీ విడ్డూరం. తల్లిదండ్రులకు పిల్లలతో సమయం గడిపే వీలు ఉండటం లేదు. వారితో సమయం గడిపే వీలు హోమ్‌వర్క్ ఇస్తుంది. పిల్లలతో కూచుని సరదాగా ఎంజాయ్ చేస్తూ చదివించాలి. హోమ్‌వర్క్ చేయించాలి’ అని మరొక తల్లి అంది.

మన దేశంలోనే

హోమ్‌వర్క్ ఇవ్వడం, తల్లిదండ్రులు పిల్లలతో కూచుని సాయం పట్టడం ప్రతి దేశంలో ఉంది. అయితే మనంత మాత్రం లేదు. హోమ్‌వర్క్‌కు తల్లిదండ్రులు ఎంత సమయం వెచ్చిస్తున్నారని 29 దేశాల్లో అధ్యయనం చేస్తే చిట్టచివరి స్థానంలో జపాన్ రెండున్నర గంటలతో నిలిస్తే భారత్ మొదటిస్థానంలో 12 గంటలతో నిలిచింది. అమెరికాలో ఆరు గంటలు, చైనాలో ఏడు గంటలు, ఫ్రాన్స్‌లో నాలుగు గంటలు తల్లిదండ్రులు వెచ్చిస్తున్నారు. అయితే అన్నీ దేశాల్లోని తల్లిదండ్రులు ప్రభుత్వ/ఉచిత బడులలో అందే విద్య మీద విశ్వాసం కనపరచలేదు. అంటే డబ్బు కట్టి చదివించడం, మళ్లీ స్కూల్లో చెప్పే చదువు మీద నమ్మకం లేక తామే చదివించడం, అందుకు హోమ్‌వర్క్‌ను ఒక మార్గంగా ఎంచుకోవడం అన్నీ దేశాల్లో ఉన్నా మన దేశంలో అత్యధికంగా ఉంది.

బండెడు హోమ్‌వర్క్

పిల్లలకు ఎంత ఎక్కువ హోమ్‌వర్క్ ఇస్తే అది అంతమంచి స్కూల్ అనే అభిప్రాయం చాలామంది తల్లిదండ్రుల్లో ఉంది. పిల్లలు స్కూల్ నుంచి ఇంటికొచ్చాక ఆడుకుంటూ ఉంటే వారు సమయం వృథా చేస్తున్నారని, హోమ్‌వర్క్ చేస్తూ ఉంటే కనుక బుద్ధిమంతులని అనుకోవడం దాదాపు అందరు తల్లిదండ్రుల్లో ఉంది. ‘మన దేశంలో చదువు ద్వారా వచ్చే ఉద్యోగాల గురించే తల్లిదండ్రుల బెంగ. అందుకే స్కూల్లో, ఇంట్లో చదువు గురించి ఒత్తిడి తెస్తారు. దీనివల్ల పిల్లల్లో సహజంగా ఉంటే కళాభిరుచి, క్రీడా ప్రతిభ, ఇతర టాలెంట్లు నశించిపోతున్నాయి’ అని కొందరు నిపుణులు అంటున్నారు. ‘హోమ్‌వర్క్ అనేది క్వాలిటేటివ్‌గా ఉండాలి. ‘క్వాంటిటేటివ్‌గా కాదు. చదివిన పాఠాల గురించి మరింత లోతుగా అర్థం చేసుకోవడం గురించి హోమ్‌వర్క్ ఉండాలి కాని గుడ్డిగా సమయం వెచ్చించేలా ఉండకూడదు’ అని నిపుణులు అంటున్నారు.

‘మన దేశంలో చదువు ద్వారా వచ్చే ఉద్యోగాల గురించే తల్లిదండ్రుల బెంగ. అందుకే స్కూల్లో, ఇంట్లో చదువు గురించి ఒత్తిడి తెస్తారు. దీనివల్ల పిల్లల్లో సహజంగా ఉంటే కళాభిరుచి, క్రీడాప్రతిభ, ఇతర టాలెంట్లు నశించిపోతున్నాయి’ అని కొందరు నిపుణులు అంటున్నారు.

ఏది... ఎంత?

హోమ్‌వర్క్‌లు పిల్లలకు అధికమైనా దానివల్ల తల్లిదండ్రుల సమయం అవసరానికి మించి ఇవ్వాల్సి వచ్చినా ఆ తీరును నిరోధించాల్సిందే. హోమ్‌వర్క్‌లు బడిలో చదివింది మరింత బాగా అర్థం చేయించేలా ఉండాలి... అలాగే తల్లిదండ్రుల ధోరణి ఆ పాఠాలు పిల్లలకు ఏ మాత్రం అర్థమయ్యాయో చూసి అర్థం చేయించడంలో సాయం పట్టేలా ఉండాలి. ఇక ప్రాజెక్ట్ వర్క్ లాంటివి పిల్లలతో పాటు తల్లిదండ్రుకూ ఆటవిడుపుగా ఉండాలి. నిజానికి కుదురు లేని పిల్లలు తల్లిదండ్రుల పక్కన సమయం చేసుకుని కూచోడానికి ఒక మంచి సాధనం హోమ్‌వర్క్. ఆ వంకతో తల్లిదండ్రులు పిల్లలతో కూచోవాలి. వారు ఎలా చదువుతున్నారు, క్లాస్‌రూముల్లో ఏం జరుగుతోంది, ఏ విషయాలకు సంతృప్తిగా ఉన్నారు... ఏ విషయాలు ఆందోళన కలిగిస్తున్నాయి, ఏ సబ్జెక్ట్‌లు వారికి ఇష్టం, కష్టంగా ఉన్నాయి... ఇవన్నీ తెలుసుకోవడానికి హోమ్‌వర్క్ సమయం సాయం చేస్తుంది. హోమ్‌వర్క్ ఒక తప్పనిసరి భారం చేస్తే దాని నుంచి తప్పించుకోవడానికి ఇంటి నుంచి పారిపోవాలని చూసిన పిల్లలూ ఉన్నారు. అలాగే పిల్లలకు సాయం చేయడానికి సమయంలేక వారి మీద చికాకు పడి ఇంట్లో అశాంతి రేపే తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఈ విషయాలన్నీ పీటీఎమ్‌లలో టీచర్లతో చర్చిస్తూ హోమ్‌వర్క్ సమయాలను విజ్ఞాన, వినోద దాయకంగా పిల్లలతో గడిపే క్వాలిటీ సమయాలుగా మార్చుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

అమెరికా ఆటల పోటీలో... మన మహిళా పోలీస్





ఏఎస్ఐ శ్యామల

వేనపోగు శ్యామల... హైదరాబాద్, సైఫాబాద్ ట్రాఫిక్ ఏ.ఎస్.ఐ. ఇంటర్నేషనల్ మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ‘2024 పాన్ అమెరికన్ మాస్టర్స్ గేమ్స్’కి ఆహ్వానం అందుకున్నారామె. ఈ నెల 12 నుంచి 21 వరకు యూఎస్‌ఏలోని ఓహియో రాష్ట్రం, క్లీవ్‌ల్యాండ్‌లో జరగనున్న పోటీల్లో షాట్‌పుట్, డిస్కస్ త్రోలలో పాల్గొంటున్న సందర్భంగా ఆమె తన బాల్యం నుంచి నేటి వరకు తన ప్రస్థానాన్ని ‘సాక్షి’ ఫ్యామిలీతో పంచుకున్నారు.

‘‘నేను పుట్టింది ఆంధ్రప్రదేశ్, కర్నూలు పట్టణంలోని సిమెంట్ నగర్‌లో. నాన్న మిలటరీ ఆఫీసర్ అమ్మ స్టాఫ్‌నర్స్. ఏడుగురు అక్కలు, ఇద్దరు అన్నల గారాల చెల్లిని నేను. మా పేరెంట్స్ మమ్మల్నందరినీ బాగా చదివించారు. నాన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ ఒక అన్న మిలటరీలో ఉన్నారు. ఒక అక్క, నేను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చాం. నా ఫస్ట్ పోస్టింగ్ హైదరాబాద్ నగరంలోని గోపాల్‌పురం. విద్యార్థి దశ నుంచి మంచి క్రీడాకారిణిని. డిస్ట్రిక్ట్ లెవెల్‌లో ఖోఖో, కబడీ, త్రో బాల్, వాలీ బాల్, బ్యాడ్మింటన్‌లో లెక్కలేనన్ని పతకాలందుకున్నాను. షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో జాతీయస్థాయి పతకాలందుకున్నాను. కరాటేలో బ్లాక్ బెల్ట్ ఉంది. నేను ఇప్పుడు మీ ముందు ఇంత అడ్వెంచరస్‌గా కనిపిస్తున్నానంటే కారణం ఈ నేపథ్యమే.

ఈ ఉద్యోగం ఆడవాళ్లకెందుకు?

స్త్రీపురుష సమానత్వ సాధన కోసం ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయి. మాలాంటి ఎందరో పోలీసింగ్, దేశరక్షణ వంటి క్లిష్టమైన విధులను భుజాలకెత్తుకున్నాం. కానీ సమాజం మాత్రం అంత ముందు చూపుతో లేదన్న వాస్తవాన్ని మా డిపార్ట్‌మెంట్‌లోనే చూశాను. ‘ఆఫ్టరాల్ ఉమన్, జస్ట్ కానిస్టేబుల్, యూనిఫామ్ వేసుకుని డ్యూటీకి వస్తారు, వెళ్తారు. జీతం దండగ’ అనే మాటలు మేము వినాలనే అనేవాళ్లు. నాలో కసి ఎంతగా పెరిగిపోయిందంటే... వాహనం కొనేటప్పుడు చిన్నవి వద్దని 350 సీసీ బుల్లెట్ తీసుకున్నాను. ‘ఏ అసైన్‌మెంట్ అయినా ఇవ్వండి’ అన్నాను చాలెంజింగ్‌గా. నైట్ పెట్రోలింగ్ చేయమన్నారు. అది కూడా సింగిల్‌గా. ఒక్కరోజు కూడా విరామం తీసుకోకుండా వరుసగా 60రోజులు రాత్రి పది నుంచి రెండు గంటల వరకు బైక్ మీద హైదరాబాద్ సిటీ పెట్రోలింగ్ చేశాను. ఆ డ్యూటీతో వార్తాపత్రికలు, టీవీలు నన్ను స్టార్‌ని చేశాయి. ‘ఎంటైర్ ఆల్ ఇండియా చాలెంజింగ్ ఉమన్ ఆఫీసర్’ అని అప్పటి సీపీ అంజనీకుమార్ సత్కరించారు. బేగంపేట మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేసిన మహిళా కానిస్టేబుల్‌గా ఏసీపీ రంగారావు చేతుల మీదుగా సత్కారం అందుకున్నాను.



బుల్లెట్ పై వస్తా... ఆకతాయిల భరతం పడతా!

పోలీసులంటే శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో ఉన్న సమస్యలన్నింటినీ అడ్రస్ చేయాలి. ఆ ప్రయత్నంలో భాగంగా ట్రాఫిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్, భరోసా, షీ టీమ్స్, తెలంగాణ స్టేట్ పోలీస్ కౌన్సెలింగ్ అండ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్, కరోనా సమయంలో అనారోగ్యంతో ప్రయాణించవద్దు– వ్యాప్తికి కారణం కావద్దనే ప్రచారం, ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం, ఆత్మహత్యల నివారణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తూ... ‘మీ జీవితం మీ చేతుల్లోనే ఉంది. నిలబెట్టుకోవడం, కాలరాసుకోవడం రెండూ మన నిర్ణయాల మీదనే ఉంటాయ’ని చెప్పేదాన్ని. గణేశ్ ఉత్సవాల సమయంలో మహిళలను తాకుతూ విసిగించడం, మెడల్లో దండలు అపహరించే పోకిరీల మీద ప్రత్యేక దృష్టి పెట్టింది మా డిపార్ట్‌మెంట్. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిల భరతం పట్టడం చాలా సంతోషాన్నిచ్చింది.

సరదాకొద్దీ సోలో రైడ్‌లు

చిన్నప్పటి నుంచి టామ్‌బాయ్‌లా పెరిగాను. బైక్ అంటే నా దృష్టిలో డ్యూటీ చేయడానికి ఉపకరించే వాహనం కాదు. బైక్ కిక్ కొట్టానంటే ప్రపంచాన్ని చుట్టేసి రావాలన్నంత ఉత్సాహం వస్తుంది. లధాక్‌లోని లేహ్ జిల్లాలో మాగ్నెటిక్ హిల్స్‌కి రైడ్ చేశాను. ఇప్పుడు నేను వాడుతున్న బైక్ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650. ఈ వాహనం కొనుగోలు చేసిన తొలి మహిళా పోలీస్‌గా నా పేరు రికార్డయింది. ‘వరల్డ్ మోటార్‌సైకిల్ డే’ సందర్భంగా బైక్ రైడ్ చేశాను. బైకర్‌లీగ్ విజేతను కూడా. ‘ఉమన్ సేఫ్ రైడర్ ఇన్ తెలంగాణ’ పురస్కారం కూడా అందుకున్నాను. అడ్వెంచరస్ స్పోర్ట్స్ అంటే ఇష్టం. గుర్‌గావ్‌లో పారాషూట్ డైవింగ్, పారాగ్లైడింగ్ చేశాను. నా సాహసాలకు గాను సావిత్రిబాయి పూలే పురస్కారం, సోషల్ సర్వీస్‌కు గాను హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందుకోవడం అత్యంత సంతృప్తినిచ్చిన సందర్భాలు. మొత్తం నాలుగు మెడల్స్, మూడు అవార్డులు అందుకున్నాను. పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన ఆటల పోటీల్లో షాట్‌పుట్, డిస్కస్ త్రోలో పతకాలందుకున్నాను. దానికి కొనసాగింపుగానే ప్రస్తుతం యూఎస్‌లో జరిగే క్రీడలకు ఆహ్వానం అందింది. వీసా కూడా వచ్చింది. నా దగ్గరున్న డబ్బు ఖర్చయి పోయింది. యూఎస్ వెళ్లిరావడానికి స్పాన్సర్‌షిప్ కోసం ఎదురు చూస్తున్నాను. ప్రపంచంలోని 50 దేశాల క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలకు వెళ్లగలిగితే మాత్రం భారత్‌కు విజేతగా పతకాలతో తిరిగి వస్తాను’’ అన్నారు శ్యామల మెండైన ఆత్మవిశ్వాసంతో.

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు : మోర్ల అనిల్ కుమార్

యూత్ పల్స్



ఆటల రాజ్యంలో గెలుపు పాట

గేమ్ ప్లేలోకి వెళితే... యాక్షన్ రోల్–ప్లేయింగ్ గేమ్ ‘ఫైనల్ ఫాంటసీ’లో క్లైవ్ రాస్ఫెల్ అవుతారు. సాహస దారుల్లో ప్రయాణం చేస్తారు. జియోలొకేషన్–బేస్ట్ రోల్‌ప్లేయింగ్ గేమ్ ‘డ్రాగన్ క్వెస్ట్ వాక్’లోకి వెళ్లి మాన్‌స్టర్‌లతో తలపడతారు. హిట్ పాయింట్స్ కొడతారు. గేమింగ్ జోన్‌లోకి అడుగు పెడితే యూత్‌కు ఉత్సాహమే ఉత్సాహం. నిన్నటి వరకు అయితే ‘గేమింగ్’ అనేది యూత్‌కు ప్యాషన్ మాత్రమే. ఇప్పుడు మాత్రం ఫ్యాన్సీ కెరీర్ కూడా. గేమ్ డెవలపర్ నుంచి నెరేటివ్ డిజైనర్ వరకు ఎన్నో అవకాశాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయి. ఆన్‌లైన్ కోర్సులు చేయడం నుంచి పుస్తకాలు చదవడం వరకు ఎన్నో విధానాల ద్వారా గేమింగ్‌కు సంబంధించిన సాంకేతిక విషయాలపై పట్టు సాధిస్తున్నారు...

వీడియో గేమ్స్ అనేవి యూత్‌కు ఇక ‘జస్ట్ ఫర్ ఫన్’ ఎంత మాత్రం కాదు. తమకు నచ్చిన రంగంలోనే యువత ఉపాధి అవకాశాలు చూసుకుంటోంది. వీడియో గేమ్‌లపై అంతకంతకూ పెరుగుతున్న ఆసక్తి నేపథ్యంలో డెవలపర్‌లు, డిజైనర్‌లు, టెస్టర్స్... మొదలైన నైపుణ్యవంతులకు డిమాండ్ పెరిగింది.

‘గేమింగ్ అనేది ఇప్పుడు కేవలం రీక్రియేషన్ కాదు. సీరియస్ కెరీర్ ఆప్షన్’ అంటుంది భోపాల్‌కు చెందిన అనీష. ఆమె గేమింగ్ లోకంలోకి వెళితే మరో లోకం తెలియదు. అలాంటి అనీష ఇప్పుడు గేమింగ్ ఇండస్ట్రీలోనే కెరీర్‌ను వెదుక్కునే ప్రయత్నం చేస్తోంది.

‘గేమింగ్’ అనే మహాప్రపంచంలోకి అడుగు పెట్టే ముందు... ఇన్–డిమాండ్ రోల్స్, స్కిల్స్, కోర్సులు....మొదలైన వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటుంది యువతరం.

‘గేమింగ్ ఇండస్ట్రీకి సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్‌కు వ్యయప్రయాసలు అక్కర్లేదు. ఆడుతూ పాడుతూ నేర్చుకోవచ్చు’ అంటుంది ముంబైకి చెందిన కైరా. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఆన్‌లైన్ కోర్సు చేయడంతో పాటు బుక్స్ చదువుతోంది. గేమ్ డిజైన్‌కు సంబంధించి స్పెషలైజ్‌డ్ ప్రోగ్రామ్స్ చేసింది.

గేమ్ మెకానిక్స్ క్రియేట్ చేసే గేమ్ డెవలపర్‌లు, వోవరాల్ కాన్సెప్ట్, స్టోరీలైన్, క్యారెక్టర్లు, గేమ్‌ప్లేపై దృష్టి పెట్టే గేమ్ డిజైనర్‌లు, బగ్స్ బాధ లేకుండా చూసే అసూరెన్స్ టెస్టర్‌లు, విజువల్ ఎలిమెంట్స్‌ను క్రియేట్ చేసే గ్రాఫిక్ ఆర్టిస్‌లు, యానిమేటర్‌లు, మ్యూజిక్, సౌండ్ ఎఫెక్ట్స్, వాయిస్ వోవర్‌లాంటి ఆడియో యాస్పెక్ట్స్‌కు సంబంధించిన సౌండ్ డిజైనర్‌లు...గేమింగ్ ఇండస్ట్రీకి సంబంధించి ఎన్నో అవకాశాలు ఉన్నాయి.

‘ఆసక్తి, ప్రతిభ ఉండాలేగానీ యువతరం తమను తాము నిరూపించుకోవడానికి గేమింగ్ ఇండస్ట్రీలో బోలెడు అవకాశాలు ఉన్నాయి’ అంటున్నాడు వీఆర్ సొల్యూషన్స్ కంపెనీ ‘ఆటోవీఆర్’ సీయివో, కో–ఫౌండర్ అశ్విన్ జైశంకర్.

‘ఎలాంటి అవకాశాలు ఉన్నాయి’ ‘ఏ కోర్సు చేస్తే మంచిది’ లాంటి వాటి గురించి అశ్విన్ జైశంకర్‌లాంటి నిపుణులు చెబుతున్న విషయాలను యువతరం జాగ్రత్తగా వింటోంది.

‘అన్‌రియల్ ఇంజిన్ డెవలపర్ కోర్సు, యూనిటీ సర్టిఫైడ్ డెవలప్ కోర్సు, గేమ్ డిజైన్ అండ్ క్రియేషన్ స్పెషలైజేషన్... మొదలైనవి గేమ్ క్రియేషన్‌కు సంబంధించిన సరియైన దారులు’ అంటున్నాడు అశ్విన్ జైశంకర్.

గేమింగ్ కంటెంట్‌కు పెరుగుతున్న డిమాండ్, గేమింగ్ కంపెనీల విస్తరణ కారణంగా గేమింగ్ పరిశ్రమలో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల కోసం క్యాంపస్ నియామకాలు గణనీయంగా పెరిగాయి. ఎన్నో కంపెనీలు తమ ప్రాజెక్ట్‌లను దృష్టిలో పెట్టుకొని యూనివర్శిటీల నుంచి ప్రతిభావంతులైన వారిని నియమించుకుంటున్నాయి.

మరోవైపు గేమింగ్ సెక్టార్‌లో ‘ఫ్రీలాన్సింగ్ ట్రెండ్’ పెరుగుతోంది.

గేమ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి కీలక దశలో ఫ్రీలాన్సర్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు. గేమ్ డెవలపర్‌ల నుంచి నెరేటివ్ డిజైనర్‌ల వరకు ఫ్రీలాన్సింగ్ చేయడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి.



మార్పు వచ్చింది

గేమింగ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టే విషయంలో పిల్లల ఆసక్తి సరే, తల్లిదండ్రుల స్పందన ఏమిటి? అనే విషయానికి వస్తే... కొన్ని సంవత్సరాల క్రితం వరకు ‘గేమింగ్ అనేది కెరీర్ ఆప్షన్ కాదు’ అనే భావన వారికి బలంగా ఉండేది. ఈ పరిస్థితిలో ఇప్పుడు చాలా వరకు మార్పు వచ్చింది.

‘ఒకప్పుడు గేమింగ్ ఇండస్ట్రీకి సంబంధించి ఎన్నో సందేహాలు ఉండేవి. ఇప్పుడు మాత్రం తమ పిల్లలను గేమ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కోర్సులలో చేర్పించడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ పరిణామం ఇండస్ట్రీకి ఎంతో బలాన్ని ఇస్తుంది’ అంటున్నాడు గేమింగ్ కంపెనీ ‘బ్యాక్‌స్టేజ్ పాస్’ ఫౌండర్ సూర్య.


కిచెన్ టిప్స్

ఇక కల్తీ కథ కంచికే!

కల్తీ... కల్తీ... కల్తీ. కల్తీ లేని వస్తువు కోసం దుర్భిణీ వేసి వెతకాల్సి వస్తోంది. బతకాలంటే రోజుకు మూడుసార్లు తినాలి. హోటల్‌లో తిందామంటే పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించడం కోసం వంటల్లో రంగులేస్తారు. ఇంట్లో శుభ్రంగా వండుకుని తిందామంటే... వంట దినుసులు కల్తీ. మిరప్పొడి కొందామంటే అందమైన ప్యాకింగ్ మీద నోరూరించే ఎర్రటిరంగు ఫొటో ఉంటుంది. లోపల మిరప్పొడి ఏ రంగులో ఉందో కనిపించదు. ఇంటికి తెచ్చి ప్యాకెట్ తెరిచి చూస్తే ఒక్కోసారి రంపం పొట్టులా, ఇటుక పొడిలా నిర్జీవంగా కనిపిస్తుంది. మరికొన్నిసార్లు ఎర్రటి ఎరుపుతో ఇది కారంపొడేనా లేక గోడలకేసే రంగా అన్నంత చిక్కగా ఉంటుంది. మనం దాదాపుగా వంటల్లో రోజూ వాడే ఐదు దినుసులను ఎలా పరీక్షించుకోవచ్చో చూద్దాం.




- **మిరప్పొడి:** ఒక కప్పు నీటిని తీసుకుని అందులో టీ స్పూన్ మిరప్పొడి వేయాలి. మిరప్పొడి నీటిమీద తేలుతూ ఉండి రేణువులు నీటిని పీల్చుకుంటూ మెల్లగా మిరప్పొడి మొత్తం కప్పు అడుగుకు చేరుతుంది. కల్తీ మిరప్పొడి అయితే నీటిలో వేయగానే అడుగుకు చేరుతుంది. అంతేకాదు, కప్పు అడుగుకు చేరేలోపు రంగు వదులుతూ నీటిని ఎర్రగా మారుస్తుంది.
- **ఇంగువ:** ఇంగువకు మండే గుణం ఎక్కువ. ఇంగువ కల్తీని తెలుసుకోవడానికి అదే మంచి గీటురాయి కూడా. ఇంగువను చిన్న ముక్క తీసుకుని మంట మీద పెడితే వెంటనే మంట అంటుకుని ఇంగువ ముక్క మండిపోతుంది. కల్తీ ఇంగువ అయితే వెంటనే మండదు. మంట మీద పెట్టి వెలిగించే ప్రయత్నం చేసినా సరే వెలగకుండా మాడిపోతుంది. ఇంగువ పొడి కొనేవాళ్లకు కూడా ఇదే చిట్కా. చిన్న పేపర్ మీద పావు టీ స్పూన్ ఇంగువ వేసి కాగితాన్ని వెలిగించాలి. కాగితంతోపాటే ఇంగువ కూడా మంటను ఆకర్షిస్తే అది అసలైన ఇంగువ. కాగితం మండిపోయి ఇంగువ పొడి నల్లబారి సరిగా మండకపోతే అది కల్తీ ఇంగువ అని అర్థం.



- **మిరియాలు:** మిరియాలలో కల్తీ ఎలా జరుగుతుందంటే... బొప్పాయి గింజలను కలుపుతారు. ఒక కప్పు నీటిలో టీ స్పూన్ మిరియాలు వేయాలి. మిరియాలు బరువుగా ఉంటాయి నేరుగా నీటి అడుగుకు చేరతాయి. బొప్పాయి గింజలు తేలిక. కాబట్టి అవి నీటిలో తేలుతాయి.



- **జీలకర్ర:** జీలకర్రలో ఏ గింజలు కలుపుతారనేది కచ్చితంగా చెప్పడం కష్టం. కానీ అసలు జీలకర్ర, అందులో కలిపిన గింజలు ఒకేరకంగా కనిపించడానికి కొద్దిగా నల్ల రంగు కలుపుతారు. జీలకర్రను పావు టీ స్పూన్ తీసుకుని అరచేతిలో వేసి బాగా రుద్దాలి. చేతులకు నలుపు అంటితే కల్తీ జీలకర్ర అని అర్థం.



- **పసుపు:** పసుపుకు కూడా రంగులద్దుతారు. అర టీ స్పూన్ పసుపును కప్పునీటిలో వేయాలి. మిరప్పొడి వలెనే ఇది కూడా నీటిని పీల్చుకుంటూ మెల్లగా నానుతూ అడుగుకు చేరుతుంది. రంగు కలిపిన పసుపు అయితే నీటి అడుగుకు చేరేలోపే రంగు వదులుతుంది. వేసిన వెంటనే నీరు చిక్కటి పసుపురంగులోకి మారుతాయి.





‘ఈ వేదన తీరనిది’

టి20 వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ చేతిలో పరాజయాన్ని దక్షిణాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాడు. ఓటమి అనంతరం ఆవేదన ఇంకా తీరనిదని అతను వ్యాఖ్యానించాడు. ఫైనల్లో సఫారీ టీమ్ ఒక దశలో గెలిచే స్థితినుంచి ఓటమి వైపు మళ్లింది. చివరి ఓవర్లో 6 బంతుల్లో 16 పరుగులు చేయాల్సిన సమయంలో తొలి బంతికే మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌ను సూర్యకుమార్ బౌండరీ వద్ద అద్భుతంగా అందుకోవడంతోనే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. ‘చాలా నిరాశ చెందాను. రెండు రోజుల క్రితం జరిగిన విషయాన్ని ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాను. నా బాధను వర్ణించేందుకు మాటలు రావడం లేదు. అయితే మా జట్టు పడిన శ్రమ, పోరాడిన తీరు పట్ల మాత్రం గర్వంగా ఉన్నాను. ఫైనల్‌కు ముందు వరకు ప్రయాణం బాగా సాగింది. ఈ బాధనుంచి తేరుకొని మా టీమ్ మున్ముందు పైకి లేస్తుందనే నమ్మకం ఉంది’ అని మిల్లర్ సోషల్ మీడియా ద్వారా తన బాధను ప్రదర్శించాడు. అయితే టి20 క్రికెట్‌నుంచి తాను రిటైర్ అవుతున్నానంటూ వస్తున్న వార్తలను అతను కొట్టిపడేశాడు. తాను దక్షిణాఫ్రికా తరఫున ఇంకా కొనసాగుతానని అతను స్పష్టం చేశాడు.

రోహిత్ ఫోన్ కాల్‌తో...

- మళ్లీ బాధ్యతలు తీసుకున్నానన్న ద్రవిడ్
- కెప్టెన్‌కు థ్యాంక్స్ చెప్పిన కోచ్



బ్రిడ్జ్‌టౌన్: నవంబర్ 19, 2023...వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమిపాలైన రోజు. ఈ నిరాశాజనక ఫలితంతోనే కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం కూడా ముగిసింది. ఆ స్థితిలో భవిష్యత్తు గురించి ద్రవిడ్‌కూ ఎలాంటి ఆలోచన లేదు. అయితే కొద్ది రోజులకే అతను మళ్లీ కోచ్‌గా పని చేసేందుకు సిద్ధమయ్యాడు. అది ఇప్పుడు టి20ల్లో వరల్డ్ కప్ గెలిచే వరకు సాగింది. అందుకు కారణం రోహిత్ శర్మ. ఓటమి నైరాశ్యంలో ఉన్నప్పుడు రోహిత్ స్వయంగా ఫోన్ చేసి కోచ్‌గా కొనసాగాలని ద్రవిడ్‌ను కోరాడు. అందుకే తాను అంగీకరించినట్లు ద్రవిడ్ వెల్లడించాడు. వరల్డ్ కప్ విజయంతో కోచ్‌గా తన పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో డ్రెస్సింగ్ రూమ్‌లో జట్టు సహచరులతో ద్రవిడ్ పలు అంశాలు మాట్లాడాడు. ఇన్ని రోజుల తన అనుభవాలను గుర్తు చేసుకున్నాడు. ‘థ్యాంక్యూ రోహిత్...నాకు ఫోన్ చేసి మళ్లీ కోచ్‌గా కొనసాగమని కోరినందుకు. జట్టులోని సభ్యులందరితో కలిసి పని చేయడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. అదో గౌరవంగా భావిస్తున్నా. అయితే రోహిత్‌తో నా బంధం మరింత ప్రత్యేకం. ఎన్నో అంశాలపై మనం చర్చించుకున్నాం. వాదోపవాదాలు జరిగాయి. అంగీకరించడం, తిరస్కరించడం కూడా జరిగాయి. నీతో పని చేసే అవకాశం ఇచ్చిందుకు కృతజ్ఞతలు’ అని ద్రవిడ్ వ్యాఖ్యానించాడు. ఈ గెలుపు చిరస్మరణీయంగా ఉండిపోతుందని అతను అన్నాడు. ‘ఏం చెప్పాలో మాటలు రావడం లేదు కానీ నాకూ మరచిపోలేని జ్ఞాపకాన్ని అందించిన మీకందరికీ థ్యాంక్స్. కెరీర్‌లో మీరు సాధించిన పరుగులు, తీసిన వికెట్లు గుర్తుండకపోవచ్చు. కానీ ఇలాంటి క్షణాలు మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోతాయి. గతంలో ఎంతో చేరువగా వచ్చి కూడా నిరాశపడాల్సి వచ్చింది. అలాంటి వాటినుంచి కోలుకొని మీరు పోరాడిన తీరుతో గర్వంగా ఉన్నాం. మీ కష్టానికి తగిన ఫలితమిది’ అని ద్రవిడ్ ప్రశంసించాడు. ఆటగాళ్ల ప్రదర్శన వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు కూడా ఉంటాయని... తల్లిదండ్రులు, భార్యాపిల్లలకు కూడా ఈ విజయంలో భాగం ఉంటుందని ద్రవిడ్ చెప్పాడు.

‘ఈ నిజమంతా నిజమేనా’

వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత ఆటగాళ్ల సంబరాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాతావరణం అనుకూలంగా లేక రెండు రోజులు అదనంగా బ్రిడ్జ్‌టౌన్‌లో ఉండాల్సి రావడంతో ఆ సమయాన్ని వారు పూర్తిగా ఎంజాయ్ చేస్తున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇంకా ఆ ఆనందం నుంచి బయటకు రావడం లేదు. ‘ఇప్పటికీ అంతా ఒక కలలా ఉంది. కప్ గెలవడం నిజమే అయినా అసలు అది జరిగిందా లేదా అన్నట్లుగా కూడా అనిపిస్తోంది. రాత్రి నుంచి ఉదయం వరకు కూడా మేమందరం బాగా సంబరాలు చేసుకున్నాం. సరిగా నిద్రపోవడం లేదు కానీ అది సమస్య కాదు. తిరిగి వెళ్లాక దాని కోసం చాలా సమయం ఉంది. ఇక్కడ ప్రతీ సెకన్‌ను, ప్రతీ నిమిషాన్ని ఆస్వాదించేందుకు ప్రయత్నిస్తున్నా. ఫైనల్ గెలిచిన క్షణం నుంచి ఇప్పటి వరకు ప్రతీది మాకు భావోద్వేగభరితమే. ఇలాంటి విజయం కోసం చాలా కాలంగా ఎంతో శ్రమించాం. ఎంతో కష్టపడిన తర్వాత వచ్చే ఫలితం మరింత ఆనందాన్నిస్తుంది. కెన్సింగ్టన్ ఓవల్ పిచ్‌పై గడ్డిని చప్పరించడం ముందే అనుకున్నది కాదు. అక్కడికి వెళ్లాక నేను అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయమది. మా కలలు నెరవేర్చిన చోటు ఎప్పటికీ మర్చిపోకుండా అలా చేయాలని అనిపించింది’ అని రోహిత్ పేర్కొన్నాడు.

నేడు స్వదేశానికి...

వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత జట్టు నేటి సాయంత్రం సొంత గడ్డపై అడుగు పెట్టే అవకాశం ఉంది. బార్బడోస్ దేశంలో తుఫాన్ కారణంగా జట్టు టీమిండియా సభ్యులు రెండు రోజుల పాటు అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. అయితే మంగళవారం నుంచి ఎయిర్‌పోర్ట్ రాకపోకలకు సిద్ధమైంది. క్రికెటర్లు, వారి కుటుంబ సభ్యులు, సహాయక సిబ్బంది కోసం బీసీసీఐ ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసింది. ఈ చార్టర్డ్ ఫ్లయిట్‌లో వీరంతా నేరుగా ఢిల్లీకి చేరుకుంటారు. అనంతరం ప్రధానమంత్రి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఉంటుంది.

హర్షిత్ రాణాకు తొలి అవకాశం

- సుదర్శన్, జితేశ్‌లకూ చోటు
- జింబాబ్వేతో సిరీస్‌కు కోచ్‌గా లక్ష్మణ్



ముంబై: జింబాబ్వేతో జరిగే ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత జట్టు బయల్దేరింది. 15 మంది సభ్యుల ఈ టీమ్‌లో తొలి రెండు టి20ల కోసం మూడు మార్పులు జరిగాయి. వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో భాగంగా ఉన్న దూబే, జైస్వాల్, సామ్సన్ జింబాబ్వే సిరీస్ కోసం ముందుగా ప్రకటించిన జట్టులో ఉన్నారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో భారత జట్టు అక్కడినుంచి బయల్దేరడం ఆలస్యం అయింది. దాంతో ఈ ముగ్గురి స్థానాల్లో సాయి సుదర్శన్, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాలను ఎంపిక చేసినట్లు బీసీసీఐ సెలక్టర్లు ప్రకటించారు. దూబే, జైస్వాల్, సామ్సన్ ఇతర సభ్యులతో పాటు ప్రత్యేక విమానంలో నేరుగా భారత్‌కే చేరుకుంటారు. ఇక్కడ జరిగే అధికారిక సన్మాన కార్యక్రమంలో పాల్గొని చివరి 3 టి20ల కోసం జింబాబ్వేకు వెళతారు. భారత్ తరఫున ఇప్పటికే 3 వన్డేలు ఆడిన సుదర్శన్ ప్రస్తుతం ఇంగ్లండ్ కౌంటీల్లో ఆడుతుండగా...ఈ సీజన్ ఐపీఎల్‌లో ఘోరంగా విఫలమైనా జితేశ్ శర్మకు అదృష్టవశాత్తూ మరో అవకాశం దక్కింది. జితేశ్ 9 టి20ల్లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. మరో వైపు ఐపీఎల్‌లో 19 వికెట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ హర్షిత్ రాణా టీమిండియాకు ఎంపిక కావడం ఇదే మొదటిసారి. జింబాబ్వేతో తలపడే ఈ యువ జట్టుకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. వరల్డ్ కప్‌లో రిజర్వ్‌లుగా ఉన్న రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్ అక్కడినుంచే జింబాబ్వేకు వెళ్లనుండగా...ప్రస్తుతం అమెరికాలో సెలవులు గడుపుతున్న కెప్టెన్ గిల్ నేరుగా వెళ్లి జట్టుతో కలుస్తాడు. ఈ టూర్‌లో భాగంగా జూలై 6, 7, 10, 13, 14 తేదీల్లో భారత్, జింబాబ్వే టి20ల్లో తలపడతాయి.



జింబాబ్వేకు బయల్దేరిన అభిషేక్, లక్ష్మణ్

తొలి రెండు టి20లకు జట్టు వివరాలు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రుతురాజ్, అభిషేక్, రింకూ సింగ్, జురేల్, పరాగ్, సుందర్, బిష్ణోయ్, అవేశ్, ఖలీల్, ముకేశ్, తుషార్, సుదర్శన్, జితేశ్, హర్షిత్ రాణా.

క్వార్టర్ ఫైనల్లో పోర్చుగల్

- షూటౌట్‌లో స్లొవేనియాపై విజయం
- యూరో కప్ ఫుట్‌బాల్



ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ పోర్చుగల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అయితే టాప్ టీమ్‌లలో ఒకటైన పోర్చుగల్‌కు విజయం అంత సులువుగా దక్కలేదు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 57వ స్థానంలో ఉన్న స్లొవేనియా గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో స్లొవేనియా దూకుడు చూస్తే విజయం సాధించేలా అనిపించింది. కానీ చివరకు పెనాల్టీ షూటౌట్‌లో విజయం పోర్చుగల్ సొంతమైంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్ లేకుండా 0–0తో సమంగా నిలవగా...షూటౌట్‌లో పోర్చుగల్ 3–0తో గెలుపొందింది. దిగ్గజ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డోకు నిర్ణీత సమయంలో మ్యాచ్ గెలిపించే అవకాశం వచ్చినా అది సాధ్యం కాలేదు. ఈ మ్యాచ్‌లో అతను పలు అవకాశాలు వృథా చేశాడు. ఎట్టకేలకు 105వ నిమిషంలో పోర్చుగల్‌కు పెనాల్టీ కిక్ లభించింది. అయితే రొనాల్డో కొట్టిన ఈ కిక్‌ను స్లొవేనియా గోల్ కీపర్ జాన్ ఆబ్లక్ సమర్థంగా అడ్డుకున్నాడు. దాంతో రొనాల్డో కన్నీళ్లపర్యంతం కావడంతో సహచరులు సముదాయించాల్సి వచ్చింది. అయితే ఎట్టకేలకు షూటౌట్‌లో గెలిచి పోర్చుగల్ ఊపిరి పీల్చుకుంది. పోర్చుగల్ తరఫున రొనాల్డో, బ్రూనో ఫెర్నాండెజ్, బెర్నార్డో సిల్వ గోల్స్ సాధించగా... స్లొవేనియా ఆటగాళ్లు ఎల్‌సిక్, బల్కోవెక్, వెర్బిక్ కొట్టిన షాట్‌లను పోర్చుగల్ కీపర్ డియాగో కోస్టా నిలువరించగలిగాడు. క్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్‌తో పోర్చుగల్ తలపడుతుంది. 2016లో ఈ రెండు జట్ల మధ్య జరిగిన ఫైనల్లో పోర్చుగల్ గెలిచి చాంపియన్‌గా నిలిచింది. మరో ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 3–0తో రొమేనియాను ఓడించి క్వార్టర్స్ చేరింది.

వొండ్రుసోవాకు షాక్

- తొలి రౌండ్‌లోనే బౌజస్ సంచలనం
- వింబుల్డన్ టోర్నీ



లండన్: జెస్సికా బౌజస్ మనెరో వింబుల్డన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో పెను సంచలనం సృష్టించింది. ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో బౌజస్ పేరు మార్మోగుతోంది. డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ ఆరో ర్యాంకర్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్)కు తొలి రౌండ్లోనే షాకిచ్చి సంచలన విజయంతో వింబుల్డన్‌ను ఆరంభించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో జెస్సికా బౌజస్ (స్పెయిన్) 6–4, 6–2తో ఆరో సీడ్ వొండ్రుసోవాను వరుస సెట్లలోనే ఇంటిదారి పట్టించింది. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనలిస్టుగా నిలిచిన ఈ చెక్ రిపబ్లిక్ స్టార్... ఈ పరాభవంతో మూడు దశాబ్దాల తర్వాత వింబుల్డన్ గడ్డపై ఓ డిఫెండింగ్ చాంపియన్ తొలి రౌండ్లోనే ఓడిన చెత్త రికార్డును మూటగట్టుకుంది. మహిళల్లో ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకరైన స్టెఫీగ్రాఫ్ (జర్మనీ) 1994లో డిఫెండింగ్ చాంపియన్ హోదాతో వింబుల్డన్ బరిలోకి దిగి అనామక ప్లేయర్ లోరీ మెక్‌నీల్ (అమెరికా) చేతిలో ఓడింది.



జొకోవిచ్ సులువుగా...

పురుషుల సింగిల్స్‌లో సెర్బియన్ సూపర్ స్టార్, రెండో సీడ్ నొవాక్ జొకోవిచ్ సులువుగా ముందంజ వేశాడు. జొకో 6-1, 6-2, 6-2తో విట్ కొప్రివా (చెక్ రిపబ్లిక్)పై అలవోక విజయం సాధించాడు. నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-2, 6-4, 6-2తో కార్బలెస్ బేన (స్పెయిన్)పై గెలుపొందగా, రష్యన్ స్టార్, ఆరో సీడ్ రుబ్లెవ్ ఆట తొలి రౌండ్లోనే ముగిసింది. కామెసన (అర్జెంటీనా) 6-4, 5-7, 6-2, 7-6 (7/5)తో రుబ్లెవ్‌ను కంగుతినిపించాడు. ప్రపంచ నంబర్‌వన్, జానిక్ సినెర్ (ఇటలీ) 6-3, 6-4, 3-6, 6-3తో యానిక్ హాఫ్‌మన్ (జర్మనీ)పై, ఏడో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) 5-7, 6-4, 6-3, 6-4తో అల్బాట్ (మాల్డోవా)పై గెలుపొందారు. తొమ్మిదో సీడ్ డి మినార్ (ఆస్ట్రేలియా) 7-6 (7/1), 7-6 (7/3), 7-6 (7/4)తో జేమ్స్ డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)పై ప్రతి సెట్ కోసం ఓ యుద్ధమే చేసి గెలిచాడు.

సూపర్ స్వియాటెక్

మహిళల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) 6–3, 6–4తో అమెరికా చెందిన సోఫియా కెనిన్‌పై వరుస సెట్లలో గెలిచి రెండో రౌండ్లోకి ప్రవేశించింది. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్) 6–3 6–1తో గాబ్రియెలా రూస్ (రుమేనియా)పై, ఐదో సీడ్ పెగులా (అమెరికా) 6–2, 6–0తో యాష్లిన్ క్రూగెర్ (అమెరికా)పై, 15వ సీడ్ సామ్సొనోవా (రష్యా) 6–3, 4–6, 6–2తో రెబెకా మసరోవా (స్పెయిన్)పై విజయం సాధించారు. మాజీ ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ జెలినా ఒస్టాపెంకో (లాత్వియా) 6–1, 6–2తో టామ్‌జనోవిక్ (ఆస్ట్రేలియా)పై సులువైన విజయంతో శుభారంభం చేసింది.

నగాల్ అవుట్

భారత నంబర్‌వన్ సింగిల్స్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆట వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలి రౌండ్లో ముగిసింది. 72వ ర్యాంక్ భారత ప్లేయర్ 2–6 6–3, 3–6, 4–6తో ప్రపంచ 53వ ర్యాంకర్ కెక్మనొవిచ్ (సెర్బియా) చేతిలో పరాజయం చవిచూశాడు. 26 ఏళ్ల నగాల్ వరుస తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. ఏకంగా 44 అనవసర తప్పిదాలు చేశాడు. ప్రత్యర్థి ఆరు ఏస్‌లు సంధించి కేవలం రెండుసార్లు మాత్రమే డబుల్ ఫాల్ట్‌లు చేశాడు.

సినిమా

కాంబినేషన్ కుదిరేనా?



నాని



శేఖర్ కమ్ముల

హీరో నాని, దర్శకుడు శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. దర్శకుడు శేఖర్ కమ్ముల ఓ కొత్త కథను సిద్ధం చేశారట. ఈ కథలోని హీరో పాత్రకు నాని అయితే సరిపోతారని ఆయన భావిస్తున్నారట. దీంతో ఈ దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయని, అన్నీ కుదిరితే వీరి కాంబినేషన్‌లో ఓ సినిమా ప్రకటన అధికారికంగా రావొచ్చనే టాక్ వినిపిస్తోంది. కాగా ప్రస్తుతం ‘సరిపోదా శనివారం’ సినిమాతో బిజీగా ఉన్నారు నాని. ఈ చిత్రం ఆగస్టు 29న విడుదల కానుంది. మరో వైపు నాగార్జున, ధనుష్ హీరోలుగా నటిస్తున్న ‘కుబేర’ సినిమాతో శేఖర్ కమ్ముల బిజీగా ఉన్నారు. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. ఇలా నాని, శేఖర్‌ల ప్రస్తుత కమిట్‌మెంట్స్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత వీరి కాంబినేషన్‌లోని సినిమా గురించి స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. మరి.. ఈ కాంబి నేషన్ కుదురుతుందా? అంటే వేచి చూడాల్సిందే.



అల్లు అర్జున్

డిష్యుం... డిష్యుం...

డిష్యుం... డిష్యుం అంటూ ఫైట్ చేయనున్నారు పుష్పరాజ్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ‘పుష్ప’. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. ‘పుష్ప’ నుంచి ఇప్పటికే ‘పుష్ప: ది రైజ్’ విడుదలై, ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం ‘పుష్ప’ మలి భాగం ‘పుష్ప: ది రూల్’తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్ అండ్ సుకుమార్. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ వారంలో హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రముఖ స్టూడియోలో ప్రారంభం కానుందని తెలిసింది. అల్లు అర్జున్ పాల్గొనగా ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారని, ఈ యాక్షన్ సీక్వెన్స్ క్లైమాక్స్‌లో రానుందని సమాచారం. మరి క్లైమాక్స్‌లో డిష్యుం... డిష్యుం అంటూ విలన్స్‌ను పుష్పరాజ్ ఏ విధంగా రఫ్ఫాడించాడో చూడాలంటే డిసెంబరు 6న థియేటర్స్‌కు వెళ్లాలి. ఆ రోజునే ‘పుష్ప: ది రూల్’ విడుదల కానుంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సునీల్, అనసూయ, జగపతిబాబు, ఫాహద్ ఫాజిల్ ఈ సినిమాలోని ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

కమల్-సల్మాన్-ఓ సినిమా



సల్మాన్ ఖాన్, కమల్‌హాసన్

హిందీలో షారుక్ ఖాన్‌తో ‘జవాన్’ తీసి, బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు తమిళ దర్శకుడు అట్లీ. ‘జవాన్’ సినిమా బాక్సాఫీస్ వసూళ్లు రూ. వెయ్యి కోట్లకు పైగా దాటాయి. ఈ క్రమంలో అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న తదుపరి చిత్రం ఏంటి? అనే చర్చల్లో భాగంగా అల్లు అర్జున్‌తో సినిమా చేయనున్నారనే ప్రచారం జరిగింది. కానీ ఈ సినిమా గురించి అధికారిక సమాచారం ఏదీ రాలేదు. కాగా అట్లీ ఓ మల్టీస్టారర్ మూవీ కథను రెడీ చేశారని, ఇందులో రజనీకాంత్, సల్మాన్ ఖాన్ హీరోలుగా నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. తాజాగా ఈ సినిమాలో రజనీకాంత్ ప్లేస్‌లో కమల్‌హాసన్ నటించనున్నారని మరో వార్త ప్రచారంలోకి వచ్చింది. సల్మాన్–కమల్ కాంబినేషన్‌లో అట్లీ దర్శకత్వంలోని సినిమా దాదాపు ఖరారైనట్లే అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాను దక్షిణాదిలోని అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సన్ పిక్చర్స్ నిర్మించనుందని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని టాక్.

ఫుల్ వినోదం సామీ



మాల్వీ మల్హోత్రా, రాజ్ తరుణ్

‘‘**తి**రగబడర సామీ’ సినిమాలో భావోద్వేగాలు, యాక్షన్‌తో పాటు వినోదం చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమాకి అందరం ప్రాణం పెట్టి పని చేశాం. మా అందరి కంటే ఎక్కువ కష్టపడింది కెమెరామేన్ జవహర్ రెడ్డి గారు. ఆయన లేకపోతే సినిమా ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది’’ అని హీరో రాజ్ తరుణ్ అన్నారు. ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వంలో రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం ‘తిరగబడర సామీ’. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ‘‘తిరగబడర సామీ’లో ఎక్కువ యాక్షన్ సీన్స్ చేశాను. ఇంత యాక్షన్ పార్ట్ చేయడం నాకు కొత్త. డైరెక్టర్ గారి ప్రోత్సాహంతో సులభంగా చేశాను’’ అన్నారు. ఏఎస్ రవికుమార్ చౌదరి మాట్లాడుతూ– ‘‘2004 జూలై 2న ‘యజ్ఞం’ విడుదలై నా జీవితాన్ని మలుపు తిప్పింది. సరిగ్గా ఇరవై ఏళ్ల తర్వాత జూలై 2న ‘తిరగబడర సామీ’ ట్రైలర్ రిలీజ్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా అందరికీ వినోదం పంచుతుంది’’ అన్నారు. ‘‘ఈ నెలలోనే మా సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు మల్కాపురం శివకుమార్. ‘‘ఈ సినిమాతో తెలుగులో పరిచయం కావడం హ్యాపీగా ఉంది’’ అన్నారు మాల్వీ మల్హోత్రా.

ఫస్ట్ లుక్ చూసి ఆశ్చర్యపోతారు

- వరుణ్ సందేశ్



‘‘నా 17 ఏళ్ల కెరీర్‌లో చేయని ఒక డిఫరెంట్ మూవీ ‘విరాజి’. ఈ చిత్రంలో ఓ క్రేజీ పాత్ర చేస్తున్నాను. ఈ నెల 10న విడుదల చేయనున్న ‘విరాజి’ ఫస్ట్ లుక్ చూడగానే అందరూ ఆశ్చర్యపోతారు. మీ అందరికీ తప్పకుండా నచ్చే సినిమా అవుతుంది. ఈ మూవీ రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను’’ అని హీరో వరుణ్ సందేశ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం ‘విరాజి’. ఈ చిత్రంతో ఆద్యంత్ హర్ష దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహా మూవీస్‌తో కలిసి ఎమ్ 3 మీడియా బ్యానర్‌పై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న రిలీజ్ కానుంది. మంగళవారం జరిగిన ‘విరాజి’ టైటిల్ ప్రకటన కార్యక్రమంలో ఆద్యంత్ హర్ష మాట్లాడుతూ– ‘‘విరాజి’కి చాన్స్ ఇచ్చిన మా మూవీ ప్రాజెక్ట్ హెడ్ సుకుమార్ కిన్నెర, నిర్మాత మహేంద్రగారు, వరుణ్ సందేశ్‌లకు కృతజ్ఞతలు’’ అన్నారు. ‘‘వరుణ్ సందేశ్‌ని కొత్త అవతారంలో చూపించే చిత్రమిది. మాలాంటి కొత్తవాళ్లు ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే ప్రేక్షకుల సపోర్ట్ కావాలి’’ అన్నారు మహేంద్రనాథ్ కూండ్ల. సంగీతదర్శకుడు ఏబీ నెజర్ పాల్ (ఏబీ), నటీనటులు ప్రమోదిని, రఘు కారుమంచి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

చలో స్కాట్లాండ్



అజయ్ దేవగన్



సంజయ్ దత్

సన్నాఫ్ సర్దార్‌గా అజయ్ దేవగన్ అతి త్వరలో స్కాట్లాండ్ వెళ్లనున్నారని బాలీవుడ్ సమాచారం. అజయ్ దేవగన్, సోనాక్షీ సిన్హా, సంజయ్ దత్ లీడ్ రోల్స్‌లో అశ్వినీ ధీర్ దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం ‘సన్నాఫ్ సర్దార్’ (2012). రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ‘మర్యాద రామన్న’కు హిందీ రీమేక్‌గా ఈ చిత్రం రూపొందింది. ఇప్పుడు పన్నెండేళ్ల తర్వాత ‘సన్నాఫ్ సర్దార్’కు సీక్వెల్‌గా ‘సన్నాఫ్ సర్దార్ 2’ చిత్రం రానుందని సమాచారం. తొలి భాగంలో లీడ్ రోల్స్‌లో నటించిన అజయ్ దేవగన్, సంజయ్ దత్ సీక్వెల్‌లోనూ నటించనున్నారని, హీరోయిన్‌గా మాత్రం సోనాక్షీ సిన్హా ప్లేస్‌లో మృణాల్ ఠాకూర్ కనిపించనున్నారని భోగట్టా. ఈ చిత్రానికి సంబంధించిన ఎక్కువ శాతం షూటింగ్‌ని స్కాట్లాండ్‌లో జరిపేలా ప్లాన్ చేశారట. ఈ షెడ్యూల్ దాదాపు యాభై రోజులకు పైగా ఉంటుందని, అజయ్ దేవగన్–మృణాల్ ఠాకూర్‌ల కాంబినేషన్ ట్రాక్ అంతా విదేశాల్లోనే చిత్రీకరిస్తారని టాక్. ఈ సినిమాకు అజయ్ దేవగనే దర్శకత్వం వహిస్తారనే వార్త కూడా ప్రచారంలో ఉంది. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



మృణాల్ ఠాకూర్

జనక అయితే...



సుహాస్

‘**క**లర్ ఫొటో’ ఫేమ్ సుహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘జనక అయితే గనక’. ‘బలగం, లవ్ మీ’ వంటి చిత్రాల తర్వాత శిరీష్ సమర్పణలో ‘దిల్’ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమా నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ‘‘కోర్టు డ్రామాతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ఇది. హీరోగా వరుస విజయాలను అందుకుంటున్న సుహాస్ ‘జనక అయితే గనక’ వంటి మరో వైవిధ్యమైన సినిమాతో ప్రేక్షకులను అలరిస్తారు’’ అని యూనిట్ పేర్కొంది.

రాహి రే డార్లింగ్



నభా నటేశ్

ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటించిన చిత్రం ‘డార్లింగ్’. ‘వై దిస్ కొలవెరి’ అన్నది ట్యాగ్‌లైన్. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బ్రహ్మానందం, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించారు. ‘హను–మాన్’ వంటి బ్లాక్ బస్టర్ మూవీ తీసిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ‘రాహి రే...’ అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు మేకర్స్. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను కపిల్ కపిలన్ ఆలపించారు. ‘‘యునిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘డార్లింగ్’. ‘రాహి రే...’ పాట మెలోడియస్‌గా సాగుతుంది. నభా నటేశ్ పై సాగే ఈ పాటను సినిమాటోగ్రాఫర్ నరేష్ రామదురై అందంగా చిత్రీకరించారు’’ అన్నారు మేకర్స్.

సాక్షి బిజినెస్
బుధవారం
3-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
38	18
79,441	24,123

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,976	△ 97
డోజోన్స్	39,170	△ 2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,121	▽ 46
డాక్స్	18,164	▽ 127
షాంఘై	2,995	△ 2
నికాయ్	40,075	△ 444

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,692 ▽	92
బంగారం (99.5 స్వచ్ఛత)	71,405 ▽	181
వెండి (కిలో)	88,015 △	213

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.11	84.13
£	బ్రిటన్ పౌండ్		104.42	106.97
€	యూరో		88.97	90.92
¥	జపాన్ ఎన్ (100)		51.29	52.41
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.55	56.48
S$	సింగపూర్ డాలర్		59.25	63.94
SAR	సౌదీ రియాల్		21.34	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.83	23.61
¥	చైనా యువాన్		10.37	12.44

ప్రమోటర్లు వాటాలు అమ్మేస్తున్నారు!



- షేర్ల ధరల్లో వృద్ధి ప్రభావం
- ఇటీవల భారీగా బ్లాక్ డీల్స్
- 2023 రికార్డ్‌కు 2024లో చెక్

ఇటీవల సెకండరీ మార్కెట్లు బుల్ వేవ్‌లో పరిగెడుతున్నాయి. తాజాగా సెన్సెక్స్ 79,000, నిఫ్టీ 24,000 పాయింట్ల మైలురాళ్లను అధిగమించాయి. తద్వారా ప్రామాణిక ఇండెక్సులు సరికొత్త గరిష్టాలను సాధించాయి. ఈ నేపథ్యంలో పలు లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు కొంతమేర సొంత వాటాలను విక్రయించేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఇందుకు పలు అంశాలు ప్రభావం చూపుతున్నాయి. వివరాలు చూద్దాం..

ముంబై: రోజుకో చరిత్రాత్మక గరిష్టాన్ని తాకుతూ దౌడు తీస్తున్న దేశీ స్టాక్ మార్కెట్లో పలు లిస్టెడ్ కంపెనీల షేర్లు సైతం కొత్త గరిష్టాలను తాకుతున్నాయి. దీంతో కొన్ని కంపెనీల ప్రమోటర్లు ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా తమ వాటాలో కొంత మేర విక్రయిస్తున్నారు. తద్వారా నిధులను సమకూర్చుకుంటున్నారు. వీటిని రుణ చెల్లింపులు, విస్తరణ ప్రణాళికలు, పబ్లిక్‌కు కనీస వాటా తదితరాలకు వినియోగిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ వివరాల ప్రకారం 2024 తొలి ఆరు నెలల్లోనే ఎన్ఎస్ఈ-500లోని కొన్ని కంపెనీల ప్రమోటర్లు 10.5 బిలియన్ డాలర్ల(రూ. 87,000 కోట్లకుపైగా) విలువైన ఈక్విటీలను విక్రయించారు. మరొక విశ్లేషణ ప్రకారం గత రెండు నెలల్లోనే సుమారు 200 లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు రూ. 33,000 కోట్లకుపైగా విలువైన షేర్లను విక్రయించడం తాజా ట్రెండ్‌కు అద్దం పడుతోంది. వెరసి దేశీ ఈక్విటీల విలువలు అత్యంత ప్రీమియంస్థాయికి చేరాయన్న సంకేతాలు వెలువడుతున్నట్లు స్టాక్ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇందువల్లనే కొన్ని లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు తమతమ బిజినెస్‌లలో లాభాల స్వీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నారని విశ్లేషించారు.

విక్రయ తీరు(రూ. కోట్లలో)

కంపెనీ పేరు	షేర్ల విలువ
ఇండస్ టవర్స్	15,300
ఎంఫసిస్	6,680
వేదాంతా	4,184
ఇంటర్‌గ్లోబ్	3,300
జెడ్ఎఫ్ సీవీ	2,194
గ్లాండ్ ఫార్మా	1,754

కరోనా ఎఫెక్ట్...

ప్రస్తుత మార్కెట్లలో పలు కంపెనీల షేర్లు గరిష్ట విలువలకు చేరడంతో బ్లాక్ డీల్స్ లేదా బల్క్ డీల్స్ ద్వారా ప్రమోటర్లు కొంతమేర వాటాలను అమ్మివేస్తున్నారు. వీరికితోడు ఇటీవల పీఈ దిగ్గజాలు, ఇతర సంస్థాగత ఇన్వెస్టర్లు సైతం తమ పెట్టుబడులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్న సంగతి తెలిసిందే. కాగా.. ప్రస్తుత ట్రెండ్ కారణంగా 2023 జనవరి-డిసెంబర్‌లో నమోదైన 12.5 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,04,000 కోట్లు) విక్రయ రికార్డ్ 2024 కేలండర్ ఏడాదిలో తుడిచిపెట్టుకుపోయే వీలున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2023లో అదానీ గ్రూప్ ప్రమోటర్లు వాటాలు విక్రయించిన విషయం విదితమే. 2024లో ఇప్పటివరకూ దేశ, విదేశీ ప్రమోటర్లు మొత్తంగా రూ. 87,000 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. కోవిడ్-19 నేపథ్యంలో 2020 జనవరి-డిసెంబర్‌లోనూ రికార్డు నెలకొల్పుతూ రూ. 78,500 కోట్ల విలువైన షేర్లను వివిధ కంపెనీల ప్రమోటర్లు అమ్మివేశారు.

రుణ చెల్లింపులకు...

జూన్‌లో పలువురు ప్రమోటర్లు బ్లాక్ డీల్స్ ద్వారా భారీగా వాటాలను విక్రయించారు. రుణ భారాన్ని తగ్గించుకునే ప్రణాళికలతో ఇండస్ టవర్స్‌లో యూకే దిగ్గజం వొడాఫోన్ గ్రూప్ 18 % వాటాను విక్రయించింది. ఇక ఎంఫసిస్‌లో 15% వాటాను పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ 80 కోట్ల డాలర్లకు అమ్మింది. దేశీ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్‌లో ప్రమోటర్ వేదాంతా రిసోర్సెస్ 2.63% వాటా విక్రయం ద్వారా రూ. 4,184 కోట్లు సమీకరించింది. ఇక జెడ్ఎఫ్ కమర్షియల్ వెహికల్‌లో వాబ్కో ఏషియా 30 కోట్ల డాలర్ల విలువైన వాటాను విక్రయించింది.

హిండెన్‌బర్గ్‌కు సెబీ షోకాజ్!

- అర్థం లేని చర్యగా కొట్టిపారేసిన హిండెన్‌బర్గ్
- అవినీతిని బైట పెట్టేవారిని భయపెట్టే యత్నమని వ్యాఖ్య



న్యూఢిల్లీ: అకౌంటింగ్‌లో అవకతవకల ఆరోపణలతో అదానీ గ్రూప్‌ను కుదిపేసిన అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌కి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ సంస్థల స్టాక్స్ విషయంలో అనుచిత వ్యాపార విధానాలను అమలు చేశారనే ఆరోపణల మీద జూన్ 27న తమకు 46 పేజీల నోటీసు వచ్చినట్లు హిండెన్‌బర్గ్ తమ వెబ్‌సైట్లో వెల్లడించింది. ఇది అర్థరహితమైన చర్యగా కొట్టిపారేసింది. కార్పొరేట్ అవినీతిని, మోసాలను బహిర్గతం చేసేవారిని భయపెట్టేందుకు భారత్‌లో అత్యంత శక్తిమంతులైన వారు చేస్తున్న ప్రయత్నమని వ్యాఖ్యానించింది. అదానీ గ్రూప్ స్టాక్స్‌లో తమకు షార్ట్ పొజిషన్లు ఉన్నాయనే విషయాన్ని అధ్యయన నివేదికను ప్రకటించినప్పుడే తాము వెల్లడించామని హిండెన్‌బర్గ్ పేర్కొంది. ఒక ఇన్వెస్టర్ తరపున తీసుకున్న పొజిషన్లకు సంబంధించి 4.1 మిలియన్ డాలర్లు లభించాయని, సొంతంగా అదానీ అమెరికా బాండ్లను షార్ట్ చేయడం ద్వారా 31,000 డాలర్లు వచ్చాయని తెలిపింది. లీగల్ ఖర్చులు, అధ్యయనంపై చేసిన వ్యయాలకు అవి బొటాబొటీగా సరిపోయాయని వివరించింది. ఆర్థికంగా గానీ వ్యక్తిగత భద్రతపరంగా గానీ అదానీ గ్రూప్‌పై అధ్యయనం తమకు ఏమాత్రం ప్రయోజనకరమైనది కాకపోయినా ఇప్పటివరకు తాము చేసిన వాటిల్లో అత్యంత గర్వకారణమైనదిగా ఇది నిలిచిపోతుందని హిండెన్‌బర్గ్ తెలిపింది.

కోటక్ గ్రూప్ పాత్ర ..

అదానీ స్టాక్స్‌ను షార్ట్ చేసేందుకు తమ భాగస్వామ్య ఇన్వెస్టరు ఒకరు .. కోటక్ మహీంద్రా గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ ఫండ్‌ను ఉపయోగించినట్లు హిండెన్‌బర్గ్ తెలిపింది. ఆ బ్యాంకు వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ పేరు బైటికి రాకుండా చూసేందుకే సెబీ తన నోటీసులో కోటక్‌ను ప్రస్తావించకుండా కే-ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్ (కేఐవోఎఫ్) అని మాత్రమే పేర్కొందని ఆరోపించింది. సెబీ నోటీసుల ప్రకారం హిండెన్‌బర్గ్ క్లయింట్ అయిన కింగ్‌డన్ క్యాపిటల్.. అధ్యయన నివేదిక విడుదలకు ముందు కోటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్‌కి (కేఎంఐఎల్) చెందిన కేఐవోఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లను షార్ట్ చేసిన కేఐవోఎఫ్ .. నివేదిక విడుదల తర్వాత పరిణామాలతో మొత్తం రూ. 183.24 కోట్ల లాభాలు ఆర్జించింది. మరోవైపు, కేఐవోఎఫ్, కేఎంఐఎల్‌కు హిండెన్‌బర్గ్ ఎన్నడూ క్లయింటుగా లేదని కోటక్ మహీంద్రా గ్రూప్ స్పష్టం చేసింది. తమ ఇతర ఇన్వెస్టర్లకు, హిండెన్‌బర్గ్‌కు మధ్య ఉన్న సంబంధాల గురించి తమకు తెలియదని పేర్కొంది.

అదానీ గ్రూప్‌లో షేర్లు, అకౌంట్లలో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ 2023 జనవరిలో విడుదల చేసిన నివేదికతో అదానీ గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్ల మేర తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే.

గ్రూప్‌ఎమ్ దక్షిణాసియా సీఓఓగా అశ్విన్ పద్మనాభన్



హైదరాబాద్: డబ్ల్యూపీపీకి చెందిన మీడియా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ గ్రూప్‌ఎమ్ దక్షిణాసియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా (సీఓఓ) అశ్విన్ పద్మనాభన్ నియమితులయ్యారు. ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్, కంటెంట్‌తో పాటు పెట్టుబడులు, వ్యాపారం, భాగస్వామ్య ఒప్పందాలు, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాలకు ఆయన బాధ్యతలు వహించనున్నారు. క్లయింట్ అవసరాలు, పరిశ్రమ పని తీరు అర్థం చేసుకోవడంతో అశ్విన్‌కు మంచి అనుభవం ఉందని గ్రూప్ ఎం దక్షిణాసియా సీఈఓ ప్రశాంత్ కుమార్ అన్నారు.

కొత్త రికార్డులు.. చివరికి స్వల్ప నష్టాలు

బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ

ముంబై: బ్యాంకులు, ఫైనాన్స్, టెలికం షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్టాక్ సూచీలు మంగళవారం ఆరంభ లాభాలను కోల్పోయి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 38 పాయింట్లు నష్టపోయి 79,441 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18 పాయింట్లు కోల్పోయి 24,123 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఐటీ, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు రాణించడంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 380 పాయింట్లు పెరిగి 79,856 వద్ద, నిఫ్టీ 94 పాయింట్లు బలపడి 24,236 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. రికార్డు స్థాయిల వద్ద ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసు



కోవడంతో సూచీలు వెనక్కి వచ్చాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.57%, 0.10% చొప్పున నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- ఆఫీసర్స్ ఛాయిస్ విస్కీ తయారీ సంస్థ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలర్స్ సంస్థ లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర (రూ.281)తో పోలిస్తే బీఎస్ఈలో 13% ప్రీమియంతో రూ.318 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 15.44% పెరిగి రూ.324.40 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 13% లాభంతో రూ.318 వద్ద ముగిసింది.
- అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంలో తాజాగా కోటక్ గ్రూప్ పేరు ప్రస్తావన రావడంతో కోటక్ మహీంద్రా బ్యాంకు షేరు షేరు 2% నష్టపోయి రూ.1770 వద్ద స్థిరపడింది.
- క్లియరింగ్ కార్పొరేషన్లు, డిపాజిటరీలు తమ సభ్యుల లావాదేవీల పరిమాణంతో సంబంధం లేకుండా అందరికీ చార్జీలు ఒకరకంగా ఉండాలంటూ సెబీ ఆదేశాలతో స్టాక్ బ్రోకింగ్ సంస్థల షేర్లు డీలా పడ్డాయి. ఏంజెల్ వన్ 9%, జియోజిత్ ఫైనాన్సియల్ 7%, మోతీలాల్ ఓస్వాల్ 4%, ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ 3%, డెలాయిట్ ఆల్గోటక్ 2% చొప్పున నష్టపోయాయి.



విదేశాలకెళ్లే విద్యార్థుల కోసం ఐసీఐసీఐ బ్యాంక్ సఫిరో కార్డు

న్యూఢిల్లీ: ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఐసీఐసీఐ బ్యాంకు కొత్తగా సఫిరో ఫారెక్స్ కార్డును ఆవిష్కరించింది. కోర్సు సంబంధ ఫీజులతో పాటు రోజువారీ ఖర్చులను కూడా నిర్వహించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని బ్యాంకు తెలిపింది. క్రాస్ కరెన్సీ మార్కప్ చార్జీల భారం లేకుండా 15 కరెన్సీలను ఇందులో లోడ్ చేసుకోవచ్చని, లావాదేవీలూ జరపవచ్చని వివరించింది. వెల్కమ్ కిట్‌లో ప్రైమరీ, రిప్లేస్‌మెంట్ కార్డులని రెండు ఉంటాయి. ప్రైమరీ కార్డు దెబ్బతిన్నా లేదా పోయినా రిప్లేస్‌మెంట్ కార్డును డిజిటల్‌గా యాక్టివేట్ చేసుకోవచ్చు. విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు ఎక్కడనుంచైనా ఎప్పుడైనా తక్షణమే ఇందులోకి కరెన్సీని లోడ్ చేయొచ్చు.

కంకార్‌లో 7% వాటా విక్రయం!



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కంటెయినర్ కార్పొరేషన్(కంకార్)ను ప్రైవేటైజ్ చేసే ప్రయత్నాలు ఫలించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా కొత్త వ్యూహాలకు తెరతీస్తోంది. దీనిలో భాగంగా తొలుత 5-7% వాటాను విక్రయించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలో ప్రభుత్వానికి గల 54.8% వాటాలో 30.8% వాటా అమ్మకానికి చేపట్టిన ప్రయత్నాలకు ఆశించిన స్పందన లభించకపోవడంతో ప్రైవేటైజ్ ఆలోచనను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అయితే ప్రభుత్వం ఇతర అవకాశాలవైపు దృష్టి పెట్టింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు ప్లేస్‌మెంట్ (క్విప్) ద్వారా వ్యూహాత్మకంగా 5-7% వాటాను కేటాయించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎస్ఎస్‌సీలో 8,326 ఎంటీఎస్, హవల్దార్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ శాఖలు/విభాగాలు /కార్యాలయాల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్, హవల్దార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టులు:** 8,326.
» **పోస్టుల వివరాలు:** మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్)స్టాఫ్(గ్రూప్-సి నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్)-4,887 పోస్టులు,హవల్దార్(గ్రూప్‌సి నాన్ గెజిటెడ్,నాన్ మినిస్టీరియల్)-3,439 పోస్టులు.
» **విభాగాలు:** జనరల్ సెంట్రల్ సర్వీస్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి/మెట్రిక్యులేషన్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి పోస్టులను అనుసరించి 18 నుంచి 25 ఏళ్లు, కొన్ని పోస్టులకు 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఎంటీఎస్ ఖాళీలకు సెషన్-1, 2 కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా, హవల్దార్ ఖాళీలకు కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. సెషన్-1: న్యూమరికల్ అండ్ మ్యాథమేటికల్ ఎబిలిటీ (20 ప్రశ్నలు-60 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ (20 ప్రశ్నలు-60 మార్కులు). సెషన్-2: జనరల్ అవేర్‌నెస్ (25 ప్రశ్నలు-75 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ (25 ప్రశ్నలు-75 మార్కులు). పరీక్ష కాల వ్యవధి: ప్రతి సెషన్‌కు 45 నిమిషాలు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 27.06.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.07.2024
» ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుకు చివరితేది:01.08.2024
» దరఖాస్తు సవరణ తేదీలు: 16.08.2024 నుంచి 17.08.2024 వరకు.
» కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ: అక్టోబర్/నవంబర్ 2024.
» వెబ్‌సైట్: https://ssc.gov.in

తెలంగాణ ఎంహెచ్ఎస్ఆర్‌బీలో 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బీ).. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 435 (జోన్‌ల వారీగా పోస్టులు: జోన్ 1-271, జోన్ 2-164).
» **అర్హత:** అభ్యర్థులు ఎంబీబీఎస్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి 46 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.58,850 నుంచి 1,37,050
» **ఎంపిక విధానం:** ఎంబీబీఎస్ మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 02.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.07.2024
» వెబ్‌సైట్: https://mhsrb.telangana.gov.in

ఆర్ఈసీపీడీసీఎల్‌లో 25 పోస్టులు

భారత ప్రభుత్వ విద్యుత్తు మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్ఈసీ పవర్ డెవలప్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్ (ఆర్ఈసీపీడీసీఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 25.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్-09, ఆఫీసర్-16. » **విభాగాలు:** ఇంజనీరింగ్, ఫైనాన్స్ అండ్ అకౌంట్, హ్యూమన్ రిసోర్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంపెనీ సెక్రటేరియట్, లా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేట్/బీఈ/బీటెక్, ఎంబీఏ,సీఏ/సీఎంఏ/ఎంసీఏ/ఎంటెక్/ఎంసీఎస్/ఎంఎస్సీ/ఐటీ/లా/పీజీడీఎం/పీజీడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:**డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 39ఏళ్లు, ఆఫీసర్ పోస్టులకు 33 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా
» **వేతనం:** ఏడాదికి డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.13.5 లక్షలు,ఆఫీసర్ పోస్టుకు రూ.9 లక్షలు

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 26.06.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.07.2024
» వెబ్‌సైట్: https://www.recpdcl.in

వంద రోజుల్లో మెయిన్స్

టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1-2024 ప్రిలిమ్స్ పరీక్ష గత నెలలో ముగిసింది. మొత్తం 563 పోస్టులకు ఎంపిక ప్రక్రియలో తొలిదశగా నిర్వహించిన ఈ పరీక్షకు మూడు లక్షల మందికిపైగా హాజరయ్యారు. ఈసారి ప్రిలిమ్స్‌లో ఎన్ని మార్కులు వస్తే.. మెయిన్స్‌కు అర్హత లభిస్తుందో చెప్పడం అంత తేలిక కాదంటున్నారు. కారణం.. పేపర్ క్లిష్టతతో పాటు పోటీ ఎక్కువగా ఉండటమే!! ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1(2024) ప్రిలిమ్స్ విశ్లేషణ.. కటాఫ్ మార్కుల అంచనా.. మెయిన్ పరీక్ష విధానం.. మెయిన్‌లో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 80-85 మార్కుల మధ్యలో కటాఫ్ అంచనా
» త్వరలో ఫలితాల వెల్లడికి అవకాశం
» అక్టోబర్ 21 నుంచి మెయిన్స్ పరీక్షలు
» ఇప్పటి నుంచి కృషి చేస్తే మెయిన్స్‌లో మెరిసే అవకాశం

74 శాతం హాజరు

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 (2024) ప్రిలిమ్స్‌కు తాజా అభ్యర్థులు, పాత అభ్యర్థులు మొత్తం కలిపి 4.03 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమ్స్‌కు 74 శాతం హాజరు నమోదైంది. దాదాపు 3.02 లక్షల మంది పరీక్ష రాసినట్లు టీఎస్‌పీఎస్‌సీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా 1:50 నిష్పత్తిలో రెండో దశలో మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. 1:50కి బదులుగా 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. 563 పోస్టులకు 1:50 నిష్పత్తిలో అయితే 28,150 మంది; 1:100 నిష్పత్తిలో అయితే 56,300 మంది మెయిన్‌కు ఎంపికయ్యే అవకాశం ఉంది.

క్లిష్టంగానే ప్రిలిమ్స్

- గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష క్లిష్టంగానే ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌లలో క్లిష్టమైన ప్రశ్నలు అడిగారని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఎకనామిక్స్‌లో సైతం సబ్జెక్ట్‌ను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన వారు మాత్రమే సమాధానం ఇచ్చేలా ప్రశ్నలు ఉన్నాయని చెబుతున్నారు. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు తికమక పెట్టేలా ఉన్నాయని పేర్కొంటున్నారు. అదే విధంగా అసెర్షన్ అండ్ రీజన్ టైప్ ప్రశ్నలు కూడా ఎక్కువగానే ఉండడంతో సమయాభావం ఎదురైనట్లు చెబుతున్నారు.
- కరెంట్ అఫైర్స్‌లో గత అయిదేళ్ల కాలంలో అమల్లోకి వచ్చిన పథకాలు, వాటి లక్ష్యాల గురించి అడిగారు. దీంతో సమకాలీన పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులు మాత్రమే సమాధానం ఇచ్చే అవకాశ ఉంది. చరిత్రలో తెలంగాణ సాహిత్యం, సాంస్కృతిక చరిత్రలకు ప్రాధాన్యం కనిపించింది. మెంటల్ ఎబిలిటీలో మాత్రం అభ్యర్థులకు కాసింత ఉపశమనం లభించింది.
- మొత్తంగా చూస్తే.. సిలబస్‌పై పూర్తి పట్టు సాధించిన వారే తదుపరి దశకు ఎంపికయ్యే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

కటాఫ్ అంచనా 80-85

ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపికయ్యేందుకు ఓపెన్ కేటగిరీలో 80నుంచి 85మార్కులు కటాఫ్‌గా ఉండొచ్చని అంచనా. ఇతర కేటగిరీలకు పది శాతం అటు, ఇటుగా కటాఫ్ ఉంటుందని అంటున్నారు. ప్రిలిమ్స్ కటాఫ్ అంచనాలను పరిశీలించి.. కటాఫ్ శ్రేణిలో ఉంటామని భావిస్తే.. వెంటనే మెయిన్స్‌కు ప్రిపరేషన్ ప్రారంభిచాలని నిపుణులు సూచిస్తున్నారు.

అక్టోబర్ 21 నుంచి మెయిన్స్

టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-1 ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తి చేసే విధంగా వ్యవహరిస్తోంది. ప్రిలిమ్స్ పూర్తయిన నాలుగు రోజుల్లోనే మెయిన్స్ పరీక్ష తేదీలను ప్రకటించింది. ఈ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి నిర్వహించనున్నారు.



ఆరు పేపర్లుగా మెయిన్స్

మెయిన్స్ జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్) తోపాటు మొత్తం ఆరు పేపర్లలో 900 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-ఏగా పేర్కొన్న జనరల్ ఇంగ్లిష్ కేవలం అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో పొందిన మార్కులను మెరిట్ లిస్ట్ రూపకల్పనలో పరిగణించరు. ఈ పేపర్‌లో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే మిగిలిన పేపర్ల మూల్యాంకన చేస్తారు. దీంతోపాటు పేపర్-1 జనరల్ ఎస్సే 150 మార్కులకు; పేపర్-2(హిస్టరీ, కల్చర్ అండ్ జాగ్రఫీ)-150 మార్కులకు; పేపర్-3(ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్) 150 మార్కులకు; పేపర్-4(ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) 150 మార్కులకు; పేపర్-5(ఎస్ అండ్ టీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్) 150 మార్కులకు; పేపర్-6 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం) 150 మార్కులకు మెయిన్స్ పరీక్ష జరుగుతుంది. మెయిన్ పరీక్షలు పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి పేపర్‌కు అందుబాటులో ఉండే సమయం మూడు గంటలు.

మెయిన్స్‌లో.. రాణించే మార్గం

టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష తేదీలు కూడా విడుదలయ్యాయి. అక్టోబర్ 21 నుంచి పరీక్షలు జరగనున్నాయి. అంటే..అభ్యర్థులకు దాదాపు నాలుగు నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే..ఆశించిన స్థాయిలో పరీక్ష రాసేందుకు అవకాశం ఉంటుంది.

సంపూర్ణ పరిజ్ఞానం

గ్రూప్-1 మెయిన్ పరీక్షలో అభ్యర్థులకు ఆయా అంశాలపై ఉన్న సంపూర్ణ పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు ప్రతి అంశాన్ని అన్ని కోణాల్లో ఆమూలాగ్ర అధ్యయనం చేసి.. అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పటికే మెయిన్ పరీక్ష కోణంలో ప్రిపరేషన్ సాగించి.. ప్రిలిమ్స్‌కు హాజరైన అభ్యర్థులకు కొంత సానుకూలత ఉంటుందని చెబుతున్నారు. ఇప్పుడే మెయిన్‌కు ప్రిపరేషన్ ప్రారంభించే వారు మాత్రం తీవ్రంగా కృషి చేయాల్సి ఉంటుంది.

ఇవెంతో కీలకం

- మెయిన్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తెలంగాణ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, తెలంగాణ ఉద్యమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా.. జనరల్ ఎస్సే పేపర్‌లో, హిస్టరీ పేపర్‌లో ఉండే తెలంగాణ రాష్ట్ర విధానాలు, తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు, సాహిత్యం, హక్కులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- జనరల్ ఎస్సే పేపర్‌గా పేర్కొనే పేపర్-1 కోసం సమకాలీన సామాజిక అంశాలు,సమస్యలు, ఆర్థిక వృద్ధి,భారత చారిత్రక,వారసత్వ సంపద,సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా పరిణామాలు తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- పేపర్-2లో ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, భారత చరిత్ర, సంస్కృతి అంశాలు, అదే విధంగా తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వారసత్వ అంశాలను చదవాలి. వీటితోపాటు భారత, రాష్ట్ర భౌగోళిక అంశాలపై పట్టు సాధించాలి.
- పేపర్-3 కోసం భారత రాజ్యాంగం, పాలనా వ్యవస్థ, భారత సమాజం, సమస్యలు, సాంఘిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి.
- ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ సబ్జెక్ట్‌గా పేర్కొనే పేపర్-4 కోసం భారత, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ-అభివృద్ధి, అభివృద్ధి, పర్యావరణ సమస్యల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీ(పేపర్-5)లో రాణించేందుకు సామాజిక అభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ దోహద పడుతున్న తీరు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆధునిక పద్ధతుల గురించి ప్రత్యేకంగా తెలుసుకోవాలి.

ఆరో పేపర్‌కు ప్రత్యేకంగా

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌లో ఆరో పేపర్‌గా పేర్కొన్న.. తెలంగాణ ఆలోచన (1948-1970), ఉద్యమ దశ(1971-1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం (1991-2014)) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం-1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు-వాటి సిఫార్సులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు, కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం

మెయిన్స్ ప్రిపరేషన్ క్రమంలో కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా.. తెలంగాణకు సంబంధించి ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి వంటి వాటిపై మరింత ప్రత్యేక దృష్టితో అభ్యసనం సాగించాలి. ఆర్థిక వనరుల అభివృద్ధి, రాష్ట్రంలో వ్యవసాయం,సాగు పరిస్థితులు, పారిశ్రామిక విధానాలు వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ప్రత్యేక అంశాలకు ఇలా

- తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీపై అభ్యర్థులు మరింత లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మార్కులు పెంచుకునే అవకాశం ఉంది.
- చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు-రచనలు;కళలు;ముఖ్య కట్టడాలు-వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి.
- జాగ్రఫీలో.. తెలంగాణలోని ముఖ్యమైన నదులు-పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతో పాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- ఎకానమీలో.. తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు,2011జనాభా గణాంకాలు;ముఖ్యమైన పరిశ్రమలు-ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై దృష్టిపెట్టాలి.

కొడుకులు బువ్వ పెడ్తలేరు
పోలీసులకు ఓ తల్లి ఫిర్యాదు



నెన్నెల: నవ మాసాలు మోసి ముగ్గురు కుమారులకు ఆ తల్లి జన్మనిచ్చింది. కంటికి రెప్పలా కాపాడి పెంచి పెద్ద చేసింది. అందరికీ పెళ్లిళ్లు చేసి ఓ ఇంటి వారిని చేసింది. కానీ వృద్ధాప్యంలో ఆ మాతృమూర్తి కన్న పేగులకే బరువైంది. 13 ఎకరాల భూమి పంచుకున్న కుమారులు తల్లికి తిండి కూడా పెట్టకుండా ఒంటరిని చేసి ఓ గుడిసెలో వదిలేశారు. దీంతో కొడుకులు బుక్కెడు బువ్వ పెట్టడం లేదని మంగళవారం పోలీసుస్టేషన్ మెట్లెక్కింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నందులపల్లి గ్రామానికి చెందిన చిన్నక్క, రాజయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజయ్య ఐదేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి ఆమెకు వేధింపులు మొదలయ్యాయి. చీటికి మాటికి కొడుకులు కొడుతూ ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని వేధిస్తుండడంతో విసిగి వేసారి ఆ తల్లి న్యాయం చేయాలని నెన్నెల ఎస్సై ప్రసాద్ ఎదుట కన్నీటి పర్యంతమైంది. పోలీసులు స్పందించి తనకు న్యాయం చేసి దారి చూపించాలని వేడుకుంది. ఎస్సై స్పందించి ఆమె ముగ్గురు కొడుకులతో ఫోన్‌లో మాట్లాడి బుధవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వృద్ధురాలికి న్యాయం జరిగేలా చూస్తానని ఎస్సై చెప్పారు. కాగా, కుమారుల్లో ఒకరు సింగరేణి రిటైర్డు ఉద్యోగి కాగా, మరో ఇద్దరు వ్యవసాయం చేస్తుంటారు.

డ్రగ్స్ సమాచారం ఇస్తే.. రూ.2 లక్షల రివార్డు
ప్రకటించిన టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గంజాయి, ఇతర డ్రగ్స్ రవాణాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. డ్రగ్స్ సమాచారం ఇస్తే.. నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ప్రకటించింది. 100 కిలోల కంటే ఎక్కువ గంజాయికి సంబంధించిన సమాచారం ఇస్తే రూ.2 లక్షలు ఇస్తామని టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. డ్రగ్స్, గంజాయి సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ ఏడాదిలో మే నెల వరకు ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు మొత్తం 788 కేసులు నమోదు చేయగా 1,580 మంది నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. మొత్తం రూ.74.73 కోట్ల విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులకు సంబంధించిన మొత్తం రూ.47.16 కోట్లు విలువైన ఆస్తులను స్తంభింపజేసినట్టు పేర్కొన్నారు.

భద్రాద్రిలో 'బ్రేక్ దర్శనం' ప్రారంభం
రూ.200 టికెట్‌తో ఒకరికి అనుమతి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి బ్రేక్ దర్శనం ప్రారంభమైంది. ఈవో ఎల్.రమాదేవి రూ.200 విలువైన తొలి టికెట్‌ను కొనుగోలు చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజూ ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 గంటల నుంచి 7.30 గంటల వరకు రూ.200 టికెట్‌తో బ్రేక్‌దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. ఒక టికెట్‌తో ఒకరికి మాత్రమే దర్శనం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ టికెట్‌తో దర్శనం మినహా అంతరాలయంలో పూజలు, అర్చనలు ఉండవని వివరించారు. ప్రత్యేక రోజుల్లో బ్రేక్ దర్శనం నిలిపివేస్తామని వెల్లడించారు. డ్రెస్‌కోడ్‌తో వచ్చేవారిని బంగారు వాకిలి వరకు, లేనివారిని వెండి వాకిలి వరకు అనుమతిస్తామని ఈవో తెలిపారు.

చిన్నారి తలనుంచి పెన్ను తొలగింపు
శస్త్రచికిత్స విజయవంతం





భద్రాచలం అర్బన్: భద్రాచలానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి రియాన్షిక తలలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు గుచ్చుకున్న పెన్నును ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఈ శస్త్రచికిత్సతో బాలికకు ప్రాణాపాయం తప్పినట్టేనని వైద్యులు స్పష్టం చేయడంతో ఆమె తల్లి, కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. చిన్నారిని తొలుత భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి, ఆ తర్వాత స్థానికంగానే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ రెండు చోట్లా న్యూరోసర్జన్ అందుబాటులో లేకపోవడంతో ఖమ్మం తరలించారు. ఖమ్మంలోని అభయ ఆస్పత్రి వైద్యులతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఫోన్‌లో మాట్లాడగా.. డాక్టర్ పరాజ్ ఆధ్వర్యాన ముగ్గురు వైద్యులు శ్రమించి బాలిక తలలో పెన్ను తొలగించారు.

అజ్ఞాత బాట.. కన్నీటి ఊట..



బండలింగంపల్లిలో శ్రీనివాస్ అలియాస్ విశ్వనాథ్ ఇల్లు (ఇన్‌సెట్‌లో) శ్రీనివాస్

కొడుకు శ్రీనివాస్ జాడ తెలియకుండానే కన్నుమూసిన తల్లిదండ్రులు

'వెనకచ్చే ఆవుల్లారా.. ఎర్ర ఆవుల్లారో.. శ్రీరామ రామచంద్రుడా..
మీరందరొస్తుండ్రు.. నా కొడుకు ఏడో.. శ్రీరామ రామచంద్రుడా..
ముందొచ్చే లేగల్లారా.. ముద్దు లేగల్లారో.. శ్రీరామ రామచంద్రుడా..
మీరందరొస్తుండ్రు.. నా కొడుకు ఏడో.. శ్రీరామ రామచంద్రుడా..'

అంటూ చదువు కోసం పట్నం వెళ్లిన కొడుకు కనిపించకుండా పోవడంతో కొడుకు తలపుల్లో తల్లి పడిన వేదనకు అద్దం పట్టే ఈ పాట 'ఎన్‌కౌంటర్' సినిమాలోనిది.



తుమ్మల నారాయణ(ఫైల్)



తుమ్మల భూదమ్మ (ఫైల్)

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్లజిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన తుమ్మల శ్రీనివాస్ అలియాస్ విశ్వనాథ్ సిద్దిపేటలో డిగ్రీ చదువుతూ 1998లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. సీపీఐ(ఎంఎల్) జనశక్తి నక్సలైట్ గ్రూపులో చేరి అడవిబాట పట్టాడు. 26 ఏళ్ల శ్రీనివాస్ జాడ తెలియక అతడి తల్లిదండ్రులు తుమ్మల(మ్యాదరి) నారాయణ, భూదమ్మలూ ఇదే తరహాలో తల్లడిల్లిపోయారు. చివరికి శ్రీనివాస్‌ను కడసారి చూడకుండానే కన్నుమూశారు.

పోలీస్ కౌన్సెలింగ్‌తో వెలుగులోకి..

చాలాకాలం పాటు శ్రీనివాస్ ఏమయ్యాడో తెలియక తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఎల్లారెడ్డిపేట పోలీసులు శ్రీనివాస్ అలియాస్ విశ్వనాథ్ పేరుతో నక్సలైట్ ఉద్యమంలో పని చేస్తున్నాడని గుర్తించారు. దీంతో బండలింగంపల్లిలోని మ్యాదరి నారాయణ ఇంటికి పోలీసులు వచ్చి 'మీ కొడుకు లొంగిపోయేలా చూడండి' అంటూ.. కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజాఉద్యమ నిర్మాణంలో భాగంగా శ్రీనివాస్ ఒడిశా ప్రాంతంలో పనిచేస్తున్నాడని కొద్ది కాలం కిందట తెలిసింది. కానీ, అతని ఆచూకీ లేక కుటుంబసభ్యులు మనోవేదనకు గురయ్యారు. రాత్రిళ్లు వాకిట్లో అలికిడి అయితే చాలు కొడుకు వచ్చాడేమోనని ఆశ పడ్డారు. ఏళ్లతరబడి అతను ఎలా ఉన్నాడో... ఎక్కడున్నాడో తెలియలేదు.

కొడుకు తలపుల్లో కన్నపేగుల వలపోత

శ్రీనివాస్ అజ్ఞాతవాసం ఆ కన్నవారికి తీరని వేదన మిగిల్చింది. ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా, ఆ మృతుల్లో 'మావోడు ఉన్నాడో'నని ఆందోళన చెందారు. చివరకు కొడుకును చూడకుండానే 2017లో తల్లి భూదమ్మ చనిపోయింది. కొడుకు జాడ లేక, భార్య కన్నుమూసిన వేదనలో ఆ తండ్రి కూడా జూన్ 23న బండలింగంపల్లిలో కన్నుమూశాడు. నారాయణ దశదినకర్మ బుధవారం జరగనుంది. అజ్ఞాతంలో ఉన్న శ్రీనివాస్ ఎక్కడ, ఎలా ఉన్నారో జనశక్తి అగ్రనేతలు కూడా చెప్పలేకపోతున్నారు.

కొత్త కొలువు రద్దయిపాయె!

గురుకుల కొలువుల్లో ఇదేం చోద్యం

మెడికల్ బోర్డు ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించకుండానే నియామక పత్రాలు

తీరా ధ్రువపత్రాలు సమర్పించాక.. మీ డిజేబిలిటీ శాతంలో వ్యత్యాసముందంటూ పోస్టు రద్దు



కరీంనగర్ జిల్లాకు చెందిన యు.భానుప్రియ పీజీటీ(గణితం)గా ఎంపికయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కొత్తగా ఉద్యోగాలు సాధించిన గురుకుల టీచర్లకు ఆయా సొసైటీలు ప్రస్తుతం పోస్టింగ్ ఇచ్చేందుకు చర్యలు మొదలుపెట్టాయి. ఇందులో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. భానుప్రియ సంబంధిత పరిశీలన కేంద్రానికి వెళ్లి ధ్రువపత్రాలు సమర్పించింది. ధ్రువపత్రాలు పరిశీలించిన అధికారులు జాబితాలో నీ పేరు లేదని చెప్పడంతో భానుప్రియ అవాక్కయ్యింది. దీంతో తిరిగి హైదరాబాద్‌లోని గురుకుల నియామకాల బోర్డులో సంప్రదించగా, ఉద్యోగాన్ని రద్దు చేసినట్టు అధికారులు చెప్పడంతో కంగుతిన్నది. భానుప్రియ సమర్పించిన వినికిడిలోపం ధ్రువీకరణకు సంబంధించి 39 శాతం మాత్రమే లోపం ఉన్నందున ఆ కోటాలో ఎంపికైన కొలువును రద్దు చేసినట్టు చెప్పారు. వాస్తవానికి భానుప్రియ వద్ద ఉన్న సదరం ధ్రువీకరణలో 68 శాతం వినికిడి లోపం ఉండడం గమనార్హం.

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) ద్వారా ఐదు గురుకుల సొసైటీల పరిధిలో దాదాపు 8,600 ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. ఈ మేరకు అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. ప్రస్తుతం వారికి ఆయా సొసైటీల పరిధిలో పోస్టింగ్ ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. కొత్తగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను మెరిట్, ర్యాంకు ఆధారంగా ప్రాధాన్యతక్రమంలో గురుకుల సొసైటీలకు టీఆర్ఈఐఆర్‌బీ కేటాయించగా, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా పోస్టింగులు ఇచ్చేందుకు గురుకుల సొసైటీలు ఏర్పాట్లు చేశాయి. ఈ క్రమంలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించిన అనంతరం వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఇవ్వనున్నాయి. ఈ క్రమంలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లిన కొందరికి భానుప్రియకు ఎదురైన పరిస్థితులే ఎదురవుతున్నాయి. దీంతో ఆయా అభ్యర్థులంతా గురుకుల నియామకాల బోర్డును ఆశ్రయించడం. వారికి ఇచ్చిన నియామకాలు రద్దయినట్టు అక్కడి అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు దాదాపు ఎనిమిది మంది ఉద్యోగాలు రద్దయినట్టు సమాచారం. ఇదే కేటగిరీలో కనిష్టంగా మరో 38 మంది కూడా ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఇందుకు సంబంధించిన సమాచారాన్ని గురుకులబోర్డు అధికారులు మాత్రం వెల్లడించడం లేదు.

ఇంతకీ ఏం జరిగింది...?

8,600 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వగా, ఇందులో కొందరు వికలాంగ అభ్యర్థులు ఉన్నారు. 1:2 నిష్పత్తిలో ఎంపికైన దాదాపు 600 మంది అభ్యర్థుల వైకల్య ధ్రువీకరణ పత్రాలను సంబంధిత మెడికల్ బోర్డులకు పంపారు. అయితే ఆయా అభ్యర్థులు సమర్పించిన సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల్లో ఉన్న డిజెబిలిటీ శాతం, మెడికల్ బోర్డు అధికారులు గుర్తించిన డిజెబిలిటీ శాతంలో తీవ్ర వత్యాసం ఉంది. దీంతో మెడికల్ బోర్డు నిర్దేశించిన డిజెబిలిటీ శాతాన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు, తక్కువ వైకల్యం ఉన్న అభ్యర్థుల ఉద్యోగ నియామకాలను రద్దు చేసినట్టు తెలిసింది.

ఏం చేయాలి.. ఏం చేశారు ?

గురుకుల ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అధికారులు చేసిన పొరపాట్లే ఇందులో ఎక్కువగా కనిపిస్తున్నాయి. సాధారణంగా రాత పరీక్ష, ఇతర అర్హతలను పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతే ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలి. కానీ టీఆర్ఈఐఆర్‌బీ అధికారులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శించారు. వికలాంగ కేటగిరీ అభ్యర్థులు సమర్పించిన వికలత్వ ధ్రువీకరణను సరిగ్గా పరిశీలించుకోకుండానే నియామక పత్రాలు ఇచ్చినట్టు కనిపిస్తోంది. ముందుగా అభ్యర్థులకు మెడికల్ బోర్డు ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించడం, వారు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను నిర్ధారించుకోవడం లాంటివి ముందుగా చేసి ఒకటికి రెండుసార్లు స్పష్టత వచ్చిన తర్వాతే తుది ఫలితాలు ప్రకటించాలి. కానీ అలా కాకుండా ముందుగా అర్హులుగా గుర్తించి వారికి నియామక పత్రాలు ఇచ్చిన నాలుగు నెలల తర్వాత ఉద్యోగాలు రద్దయ్యాయని చెప్పడం గమనార్హం. దీనిపై ఆయా అభ్యర్థులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

గాలికి కూలిన గడ్డర్లు



ప్రమాదకరంగా గర్మిళ్లపల్లి-ఓడేడ్ మానేరు అంతర్ జిల్లా వంతెన నిర్మాణ పనులు

టేకుమట్ల/ముత్తారం: జయశంకర్ భూపాల పల్లి–పెద్దపల్లి జిల్లాలను అనుసంధానం చేసేలా గర్మిళ్లపల్లి–ఓడేడ్ మానేరులో నిర్మిస్తున్న అంతర్‌జిల్లా వంతెన గడ్డర్లు మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు కూలిపోయాయి. 2016లో రూ.48 కోట్ల వ్యయంతో ఈ వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గత ఏప్రిల్‌లో గాలి ధాటికి రెండు గడ్డర్లు కూలిపోయిన విషయం తెలిసిందే. రెండు నెలల వ్యవధిలోనే ఐదు గడ్డర్లు కూలిపోయాయి. గడ్డర్ల మధ్య లింక్ కాంక్రీట్‌తో నిర్మించకపోవడంతో పట్టులేక గాలి ఉధృతికి కూలిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. మరో ఐదు గడ్డర్లు ఒక వైపునకు వంగి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

రైతులకు నేరుగా రాజన్న కోడెలు

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పంపిణీకి ఏర్పాట్లు

వేములవాడ అర్బన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలలోని కోడెల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లిస్తామని మొక్కుకున్న భక్తులు ఇంటి నుంచి కోడెను తీసుకువచ్చి ఆలయంలో అప్పగిస్తారు. ఆ కోడెల సంరక్షణకు రాజన్న ఆలయం ఆధ్వర్యంలో రెండు గోశాలలు ఏర్పాటు చేశారు. వేములవాడ గోశాలలో సుమారు 1,800 కోడెలు పరిమితికి మించి ఉండటంతో వాటి సంరక్షణ ఇబ్బందిగా మారింది. దీంతో ప్రస్తుతం కోడెలను రైతులకు అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ నిర్ణయం మేరకు కోడెలను అందించనున్నారు. బుధవారం స్థానిక రైతులకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోడెలను అందించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటికే రైతులు తమకు కోడెలు, ఆవులు కావాలని రాజన్న ఆలయంలో దరఖాస్తులు అందజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫాం డౌన్‌లోడ్ చేసి రైతు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ఫొటో, వ్యవసాయ విస్తరణ అధికారి సంతకంతో రాజన్న ఆలయంలో అందించారు. ఒక్క రైతుకు రెండు కోడెలు లేదా ఆవులను ట్యాగ్ అమర్చి అందించనున్నారు. కాగా గతంలో మాదిరిగా కాకుండా గోశాలలకు కోడెలు కావాల్సినవారు దరఖాస్తు చేసుకుంటే ముందుగా గోశాలను పరిశీలించి లెటర్ ప్యాడ్, రిజిస్ట్రేషన్ పేపర్, అగ్రిమెంట్ లెటర్ ద్వారా ఒక్కో గోశాలకు 20 కోడెలు అందించనున్నారు.



రవికాంత్ రెడ్డిని సన్మానిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి. చిత్రంలో అమర్, విరాహత్ అలీ, గంగాధర్, కె.ఎన్. హరి

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

హిమాయత్‌నగర్(హైదరాబాద్): రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మీడియాలో వస్తున్న మార్పులతో జర్నలిస్టుల సంఖ్య తగ్గిపోనున్నదన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్‌రెడ్డి, సాక్షి ఫొటో ఎడిటర్‌గా ఉద్యోగ విరమణ చేసిన కె.రవికాంత్‌రెడ్డి, జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ రాష్ట్ర కార్యదర్శి వరకల యాదగిరి, కోశాధికారి వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనిల్ కుమార్, రాజేష్, సయ్యద్ గౌస్ మొయినుద్దీన్‌లను తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఘనంగా సత్కరించింది. సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనుమళ్ల గంగాధర్, కేఎన్. హరి, సీనియర్ ఫొటోగ్రాఫర్ కేశవులు, ఇతర సభ్యులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ప్రధాన అసోసియేషన్‌లే కాకుండా కుల సంఘాల పేరిట కూడా అసోసియేషన్లు ఏర్పడడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. దీనివల్ల జర్నలిస్టుల మధ్య ఐక్యత కొరవడుతుందని చెప్పారు. అర్హులకు మాత్రమే అక్రిడేషన్లు అందాలన్నారు. రానున్న రోజుల్లో వీటిని స్ట్రీమ్‌లైన్ చేస్తామని చెప్పారు. జర్నలిస్టులకు ఒకే ప్రదేశంలో కాకుండా నగరానికి నాలుగు దిక్కులలో స్థలాలను గుర్తించి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, వై.నరేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, సంఘ సంస్కర్త కన్నాట్ సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణాల వడ్డీ కింద రూ.60 లక్షలు చెల్లింపు

పీఏసీఎస్ చైర్మన్ ఔదార్యం



రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ సహకార సొసైటీలో రైతులు తీసుకున్న అప్పుకు రెండు దఫాలుగా రూ.30 లక్షల చొప్పున రూ.60 లక్షల వడ్డీని ఆ సొసైటీ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి సొంత డబ్బుతో చెల్లించారు. ఈ మేరకు మంగళవారం నిడిగొండ రైతు వేదికలో రైతుభరోసా పథకంపై అభిప్రాయ సేకరణలో పాల్గొన్న జిల్లా సహకార సంఘాల ఆడిటర్ మురళి ఈ విషయం వెల్లడించి నర్సింహారెడ్డిని అభినందించారు. పదవుల్లో ఉన్న వారు స్వార్థ ప్రయోజనాల కోసం పాటుపడే ఈ రోజుల్లో.. ఇబ్బందుల్లో ఉన్న రైతుల కోసం సొంత డబ్బు ఖర్చు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సొసైటీ రైతులకు చైర్మన్ అపద్బాంధవుడిగా నిలిచాడని కొనియాడారు.

అధికారులు ఏం చేస్తున్నారు?

కుక్కల దాడిలో బాలుడి మృతి ఘటనపై హైకోర్టు ఫైర్

సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరులో కుక్కల దాడిలో ఎనిమిదేళ్ల బాలుడి మృతి చెందిన ఘటనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరంతరం ఇలాంటి దారుణాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. కుక్కలు దాడి చేయకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. బాధితులకు పరిహారం చెల్లించినంత మాత్రాన బాధ్యత ముగిసిపోదని స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఏం చర్యలు తీసుకోవాలో గతంలో సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. ఆ మేరకు ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 10కి వాయిదా వేసింది. జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. మనుషులపై వీధి కుక్కలు దాడి చేయకుండా ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక అందజేయాలని రాష్ట్ర అధికారులతోపాటు యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది.





పాత రికార్డులను తొక్కుకుంటూ వెళ్లిపోయింది..

ఇది ప్రపంచంలోనే అత్యంత పొడవైన సైకిల్. 180 అడుగులు 11 అంగుళాల పొడవున్న దీన్ని నెదర్లాండ్స్‌కు ఇవాన్ షాక్ అనే ఇంజనీర్ నేతృత్వంలోని బృందం రూపొందించింది. తద్వారా గత రికార్డు(155 అడుగుల 8 అంగుళాలు)ను బద్దలు కొట్టింది. అత్యంత పొడవైన సైకిల్ విభాగంలో ఉన్న గిన్నిస్ రికార్డును బద్దలుకొట్టాలని ఇవాన్ ఎప్పటి నుంచో అనుకుంటున్నారట. 1965లో 26 అడుగుల 3 అంగుళాల పొడవున్న సైకిల్‌ను తయారుచేయడం ద్వారా జర్మనీకి చెందిన వ్యక్తి ఈ విభాగంలో తొలిసారిగా రికార్డును నెలకొల్పారు. అప్పట్నుంచి ఈ రికార్డు బద్దలవుతూనే ఉంది.

టుడేస్ గ్రాఫిక్

ఏ ప్రెసిడెన్షియల్ డిబేట్‌ను అత్యధికంగా టీవీ వీక్షకులు చూశారు?



ఇటీవలి బైడెన్-ట్రంప్ డిబేట్‌ను గతంతో పోలిస్తే తక్కువగా 5.13 కోట్ల మందే టీవీల్లో వీక్షించినట్లు గణాంకాలు వెలువడిన నేపథ్యంలో 1976 నుంచి జరిగిన యూఎస్ ప్రెసిడెన్షియల్ డిబేట్లలో దేన్ని అత్యధికంగా టీవీ వీక్షకులు చూశారు అన్న వివరాలు ఇవిగో..

క్లింటన్/ట్రంప్	సెప్టెంబర్ 26, 2016	8.4 కోట్లు
కార్టర్/రీగన్	అక్టోబర్ 28, 1980	8.06 కోట్లు
ట్రంప్/బైడెన్	సెప్టెంబర్ 29, 2020	7.31 కోట్లు
క్లింటన్/ట్రంప్	అక్టోబర్ 20, 2016	7.16 కోట్లు
క్లింటన్/బుష్/పెరట్	అక్టోబర్ 15, 1992	6.99 కోట్లు
కార్టర్/ఫోర్డ్	సెప్టెంబర్ 23, 1976	6.97 కోట్లు
డుకాకిస్/బుష్	అక్టోబర్ 13, 1988	6.73 కోట్లు
మొండాలే/రీగన్	అక్టోబర్ 21, 1984	6.73 కోట్లు


రేయ్.. ఎవుర్రా మీరంతా?



దక్షిణాఫ్రికాలో ఒకాయన చనిపోయాడు.. అందరూ అంత్యక్రియలకు సన్నద్ధం అవుతున్నారు.. అయితే, సేమ్ టైంలో చిలీ పెరూ మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్.. దాంతో ఆ కుటుంబం అంత్యక్రియలకు బ్రేక్ ఇచ్చి.. ఫుట్‌బాల్ ఆటను చూడటంలో మునిగిపోయింది. ఈ వీడియోను 'ఎక్స్'(ట్విట్టర్) లో షేర్ చేశారు. దీనిపై మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. ఒకాయన అయితే.. 'ఓరి బాబోయ్.. నేను పోయినప్పుడు ఏ టీ20 మ్యాచ్‌గానీ ఉందనుకో.. అప్పుడు మావోళ్లు కూడా ఇలాగే చేస్తారా' అని డౌట్ వెలిబుచ్చితే.. మరొకాయన.. 'ఇంత మ్యాచ్ గోలలోనూ అతడు లేవలేదంటే.. నిజంగానే పోయాడని నిర్ధారించుకోవడానికే వారలా చేశారు' అని కామెంట్ చేశాడు. మరికొందరు. చనిపోయిన వ్యక్తి ఫుట్‌బాల్ ఫ్యాన్ అయి ఉంటాడని.. అందుకే శవపేటిక వద్ద ఫుట్‌బాల్ జెర్సీ ఉంచారని.. అతడితో కలిసి చివరి గేమ్ చూసినట్లు అవుతుందని అలా చేసి ఉంటారని వ్యాఖ్యానించారు. ఇంతకీ నిజమేంటి అన్నది ఇదిగో ఈ ఫొటోలోని బ్యాచ్ వాళ్లకే తెలియాలి.

టుడేస్ గ్రాఫిక్

ఇంటర్నెట్‌లో ఒక్క నిమిషంలో ఏం జరుగుతుంది?



- సాక్షి సెంట్రల్ డెస్క్



వెళ్లొద్దు సారు..

రాయపోలు(దుబ్బాక): బదిలీ అయిన ఉపాధ్యాయుడు తమను విడిచిపెట్టి వెళ్లొద్దని సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో ఆరేళ్లుగా విధులు నిర్వహించిన తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాస్.. అక్కన్నపేట మండలం మోత్కులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం రిలీవ్ అయ్యారు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయుడు తమను విడిచి వెళ్లొద్దంటూ రోదించారు. వారిని చూసిన ఉపాధ్యాయుడు సైతం కంటతడి పెట్టాడు. దీంతో అక్కడున్న ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులకు అనునయించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.